
రామాయణం

# రామాయణంలోని కొన్ని ఆదర్శ పాత్రలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org　Mobile App: Free Gurukul　email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul　Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

॥ శ్రీహరిః ॥

# రామాయణంలోని కొన్ని ఆదర్శపాత్రలు

హిందీ మూలము

శ్రీ జయదయాల్ గోయన్దకా

ఆంధ్రానువాదము

శ్రీ పురాణపండ రాధాకృష్ణ మూర్తి

ప్రచురణ

గీతా ప్రెస్ – గోరఖ్‌పూర్

[ 768 ] रा० आ० पा० ( तेलुगु ) १—

# పరిచయము

ఆదికావ్యమనే మహాగౌరవం మహర్షి వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణమునకే దక్కింది. ఇది కాంతాసమ్మితమైన ఉపదేశం. వేదములు వేనిని సత్యంవద, ధర్మంచర, ఆచారాన్మా ప్రమదః, ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః" మొదలగు విధివాక్యములద్వారా గురువువలె ఉపదేశము చేయునో వానిని కావ్యములు మధుర శబ్దములలో నుపదేశము జేయును. 'మాతృదేవోభవ, పితృదేవోభవ' వంటి వేదవాక్యములు మనపై మార్పును తీసుకొనిరాలేవు కాని శ్రీరామచంద్రభగవానుని మాతృభక్తి పితృభక్తి కావ్యములో వర్ణించినపుడు చదువరిపై వాని ప్రభావమమోఘము.

రచనాకౌశలము, కావ్యవస్తువు అను రెంటి దృష్టిలో శ్రీమద్రామాయణము జగత్తులోని సమస్త కావ్యములకు శీర్షస్థానమున నున్నది. మానవులేస్థితిలో ఎవరితో నెట్లు చరించవలయునో, సంఘమున ఇతరుల సుఖమునకై మనమేరీతి సుఖమును త్యజింపవలయునో, ఏ విధముగ సత్యము, న్యాయము, సదాచారము, ప్రతిజ్ఞాపాలనమాచరించి జీవనమును ఆదర్శప్రాయము గావించవలయునో అట్టి సామాజిక నైతిక ధార్మిక శిక్షణకు భాండాగారము వంటిదియే శ్రీమద్వాల్మీకి రామాయణము. ఇందు పూర్ణబ్రహ్మ పరమాత్మ శ్రీరామచంద్రుని పవిత్రగాథ, ఆతని మానవలీల సర్వాంగసుందరముగ చిత్రింపబడింది. దానితోపాటు జగజ్జనని సీతయొక్క ఆదర్శపాతివ్రత్యము, భరతుని అనుపమ భ్రాతృప్రేమ, త్యాగము, దశరథుని అపూర్వవాత్సల్యప్రేమ, కౌసల్యయొక్క సౌజన్యము, శ్రవణుని అనుకరణీయ పితృభక్తి, హనుమానుని అతులనీయ స్వామిభక్తి, విభీషణుని అసాధారణ న్యాయప్రియత్వము, అయోధ్యవాసులకు శ్రీరామునియందుగల స్వాభావిక స్నేహము, శ్రీరామునకు వీరందరియందు శ్రద్ధ, దయా, ప్రేమపూర్ణవర్తనము ఇత్యాది విషయములు సాంగోపాంగముగ ఇందు వర్ణింపబడినవి.

ఇందలి శ్లోకములు మధురములు, కావ్యోచితగుణములతో అలంకారములతో విభూషితములు, తాళయుక్తముగ పాడదగినవి, సంభవార్థయుక్తములు. అతిసుందరరసోపేతములు. అన్నివిధములా అత్యంత ఉపాదేయమైన గ్రంథము శ్రీమద్రామాయణము.

శ్రీమద్రామాయణము ఉచ్చకోటికి జెందిన మహాకావ్యమేగాక శ్రీరాముని అవతారలీలలను వర్ణించు నిజమగు ఇతిహాసము ఇది మరువరానిది. ఈ గ్రంథమును చదువుటకు వినుటకు మానవులకే అధికారమున్నది. ఆతడే జాతిసముదాయమునకు జెందిననూ ప్రతివాడు దానినధ్యయనము జేసి తమ మనుష్యజన్మమును ఆదర్శప్రాయముగ సఫలమొనర్చుకొనవలయును.

ఈ పుస్తకం శ్రీ జయదయాల్‌జీ గోయన్దకా గారు వ్రాసిన శ్రీరామ, సీతా, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల చరిత్రలు వాల్మీకి రామాయణాధారం మీదనే రచించబడ్డాయి. భక్త హనుమచ్చరిత్ర మాత్రం వాల్మీకి రామాయణ, రామచరితమానస, పద్మపురాణాది గ్రంథముల ఆధారంపై వ్రాయడం జరిగింది. రామాయణంలో ఈ ఆరు చరిత్రలూ మహోదాత్తమై సర్వులకూ పరమాదర్శనీయమైనవే కావున ఈ పావన చరిత్రలను పఠించి మననం చేసుకుని అనుకరించి మీ జీవనములను పరిశుద్ధమైనవిగా, సఫలమైనవిగా చేసుకొందురుగాక!

ప్రకాశకులు.

॥ శ్రీహరిః ॥

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. మర్యాదాపురుషోత్తముడు శ్రీరాముడు | . . . | 5 |
| 2. సీతాదేవి ఆదర్శ జీవనము | . . . | 29 |
| 3. రామసేవకుడు లక్ష్మణుడు | . . . | 54 |
| 4. భరతుని ఆదర్శ చరిత్ర | . . . | 76 |
| 5. రామదాసానుదాసుడు శత్రుఘ్నుడు | . . . | 99 |
| 6. రామ భక్తుడు హనుమంతుడు | . . . | 109 |
| 7. సంక్షిప్త రామాయణము (వాల్మీకి కృతమ్) | . . . | 152 |


———xxx———

[ 768 ]

ఓం శ్రీ పరమాత్మనే నమః

# మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు

## ఆదర్శగుణాలు

రఘుకుల భూషణుడైన శ్రీరామునితో సమానుడైన మర్యాదారక్షకుడు నేటివరకూ మరెవరూ ప్రభవించలేదనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. శ్రీరాముడు సాక్షాత్తూ పరబ్రహ్మ, పరమాత్మ. అతడు ధర్మసంరక్షణార్థం, లోకోద్ధరణకోసమే అవతరించాడు కానీ అతడు సదా సర్వుల సమక్షంలోనూ తనను ఓ సదాచారి అయిన ఆదర్శ పురుషునిగా సువ్యక్తం చేసికొనప్రయత్నించాడు. అతని ఆదర్శ లీలాదులను పఠించడంవల్లనూ, వినడంవల్లనూ అత్యంత పవిత్రభావతరంగాలు ఉదయిస్తాయి మనస్సు ముగ్ధమైపోతుంది. అతని ప్రతికార్యమూ అనుకరించదగినదే శ్రీరాముడు సద్గుణసాగరుడు. సత్య, సౌహార్ద్ర, దయ, క్షమ, మృదుత్వ, ధీరత్వ, వీరత్వ, గాంభీర్య, శస్త్రాస్త్రజ్ఞాన, పరాక్రమ, నిర్భయత్వ, వినయ, శాన్తి, తితిక్ష, ఉపరతి, సంయమ, నిస్పృహత్వ, నీతిజ్ఞత, తేజోప్రీతి, త్యాగ, మర్యాదరక్షణ, ఏకపత్నీవ్రత, ప్రజారంజకత్వ, బ్రాహ్మణ భక్తి, మాతృపితృ భక్తి, గురుభక్తి, భ్రాతృప్రేమ, మైత్రీభావము, శరణాగతవత్సలత్వం, సరళత్వం, వ్యవహారకుశలత్వం, ప్రతిజ్ఞా పాలనం, సాధురక్షణం, దుష్టదళనత్వం, నిర్వైరత్వం, లోకప్రియత్వం, పరదోషాన్వేషణరాహిత్యం, బహూజ్ఞత్వం, ధర్మజ్ఞత్వం, ధర్మపరాయణత్వం, పవిత్రత – ఆదిగాగల అనేకానేక సకల సద్గుణ సంపన్నత్వం శ్రీరామచంద్రునిలో పూర్ణంగా వికసించాయి. విశ్వమహేతిహాసంలో ఇన్ని సద్గుణాలు ఏ వ్యక్తిలోనూ వున్నట్లు కానరాదు. వాల్మీకి రామాయణంలోని బాల, అయోధ్యాది కాండలలో శ్రీరామచంద్రుని గుణవర్ణన విశేషసుందరంగా జరిగింది. ఆ ఘట్టాలను అవశ్యం పఠించాలి.

తల్లిదండ్రులూ, బంధుమిత్రులూ భార్యాబిడ్డలూ, సేవకులు ప్రజలూ – వీరితోటి అతని ప్రవర్తన అసాధారణమై, స్మరణ మాత్రంచే మన

మనస్సును ఆనందమయం చేస్తుంది. శ్రీరామునివంటి లోకప్రియత్వం మనకెక్కడా లభించదు. శ్రీరాముని ప్రేమపూర్ణ మధుర ప్రవర్తనకు అతని లీలాకాలంలో ముగ్ధంకాని ప్రాణియే లేదు

రాముని విషయంలో కైకేయియొక్క అప్రియ కఠోర ప్రవర్తన భగవదిచ్ఛానుసారం దేవతలప్రేరణతో లోకహితార్థమే జరిగింది. అంతమాత్రంచే శ్రీరాముడంటే కైకకు యిష్టంలేదని చెప్పలేము. మంథర కైకేయితో రామునికి విరుద్ధంగా భాషించదలచినప్పుడు కైకేయి మంథరతో అంటుంది –

ధర్మజ్ఞో గుణవాన్ దాన్తః కృతజ్ఞః సత్యవాఞ్ఛుచిః ।
రామో రాజసుతో జ్యేష్ఠో యౌవరాజ్యమతోఽర్హతి ॥
భ్రాతౄన్ భృత్యాంశ్చ దీర్ఘాయుః పితృవత్ పాలయిష్యతి ।
సంతప్యసే కథం కుబ్జే శ్రుత్వా రామాభిషేచనమ్ ॥
x x x x
యథా వై భరతో మాన్యస్తథా భూయోఽపి రాఘవః ।
కౌసల్యాతోఽతిరిక్తం చ మమ శుశ్రూషతే బహు ॥
రాజ్యం యది హి రామస్య భరతస్యాపి తత్తదా ।
మన్యతే హి యథాఽఽత్మానం తథా భ్రాతౄంస్తు రాఘవః ॥
(వా. రా. 2/8/14–15, 18–19)

"కుబ్జే! రాముడు ధర్మజ్ఞుడు, గుణవంతుడు, జితేంద్రియుడు, కృతజ్ఞుడు, సత్యవాది, పవిత్రుడూ కావడమే కాదు – ప్రభువుల జ్యేష్ఠపుత్రుడు కనుక యువరాజు అయ్యే అధికారం అతనికే వుంది. అతడు దీర్ఘజీవియై సోదరులనూ, భృత్యులనూ కూడ తండ్రివలె పాలిస్తాడు. భేష్! అతని అభిషేక వార్త విని నువ్వింతగా యేల అసూయ పడిపోతున్నావో తెలియడం లేదు! భరతుడు నాకు ఆదరపాత్రుడైనట్లే – అంతకన్నా రాముడు ఆదర పాత్రుడవుతూన్నాడు, కౌసల్యకన్న మిన్నగా రాముడు నాకే సేవలు చేస్తూంటాడు. రామునికి రాజ్యం లభిస్తూన్నదంటే భరతునికి లభించినట్లే గ్రహించాలి. కారణమేమంటావా? రామచంద్రుడు తన సోదరులను తనతో సమంగానే భావిస్తాడు. ఎట్టి సుందర వాత్సల్య ప్రేమ!

శ్రీరామునియందు కైకేయికి ఎంత ప్రేమ ఉంది? ఎంతటి దృఢవిశ్వాసముంది దీనినిబట్టి స్పష్టమయ్యే విషయం ఏమనగా కైకేయి కఠోరప్రవర్తన ఆమె స్వభావసిద్ధంగా జరిగింది కాదు, భగవదిచ్ఛవల్లనే జరిగింది.

## శ్రీరాముని మాతృభక్తి

శ్రీరాముని మాతృభక్తి మహా ఆదర్శవంతమైనది దానిని సంపూర్ణంగా వర్ణించడం కష్టమే కాదు, అసంభవం కూడ కనుక యిక్కడ సంకేత మాత్రంగానే వ్రాయబడుచున్నది. కౌసల్యా మాత, ఇతర మాతలూ అనుమాట ఏల. కైకేయీ మాత వ్యవహరించిన కఠోరాతికఠోర విషయాలకు కూడ రామచంద్రుడు ఆమెపట్ల సదా సర్వదా భక్తి సమ్మానాలతో ఉంటూ అంటాడు –

యస్యా మదభిషేకార్థే మానసం పరితప్యతే ।
మాతా నః సా యథా న స్యాత్ సవిశంకా తథా కురు ॥
తస్యాః శంకామయం దుఃఖం ముహూర్తమపి నోత్సహే ।
మనసి ప్రతిసంజాతం సౌమిత్రేకహముపేక్షితుమ్ ॥
న బుద్ధిపూర్వం నాబుద్ధం స్మరామీహ కదాచన ।
మాతౄణాం వా పితుర్వాహం కృతమల్పం చ విప్రియమ్ ॥

(వా. రా. 2/22/6–8)

లక్ష్మణా! నా రాజ్యాభిషేకం కారణంగా పరితపిస్తున్న కైకేయీ మాతకు నాపట్ల ఎట్టి సందేహం కలుగకుండా వుండేలా నువ్వు వ్యవహరించాలి. ఆమె మదిలో సందేహకారణంగా ఏర్పడిన దుఃఖాన్ని క్షణకాలం కూడా నేను ఉపేక్షించలేను. నావల్ల తెలిసికానీ తెలియకకానీ తల్లులకూ తండ్రికీ అప్రియ కార్యం జరిగినట్లు నాస్మృతిలో లేదు.

ఇదే కాకుండ శ్రీరాముని మాతృభక్తి సంబంధమైన ఉదాహరణలు అనేకంగా మనకు గోచరమవుతూంటాయి. చిత్రకూటం నుండి మరలే వేళలో భరతునితో కూడ రాముడంటాడు – "సోదరా! భరతా! కైకేయీ

మాత నీకోసం రాజ్యాభిలాషదృష్ట్యా, స్వార్థలోభాదులు కారణంగా చేసినదానిని నీవు మనస్సులో ఎంతమాత్రం వుంచుకోకు. పూజ్యురాలైన మాతృ విషయంలో ప్రవర్తించినట్లే సర్వదా ప్రవర్తించాలి? అంటూ శత్రుఘ్నునితో కూడ – "సోదరా! నేను నీ మీద, సీతమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నువ్వెప్పుడూ కైకేయీమాతపై కుపితుడవు కారాదు. సదా ఆమెను సేవిస్తూనే వుండాలి అంటాడు. అడవులలో వుండే కాలంలో లక్ష్మణుడు కైకేయిని నిందిస్తాడు. అప్పుడు శ్రీరాముడంటాడు, "సోదరా! నువ్వెన్నడూ కైకేయీ మాతను నిందించరాదు. దీనినిబట్టి శ్రీరామునికి తన అన్య మాతలయందు ఎట్టి శ్రద్ధాభక్తులున్నది తెలియవస్తుంది. దశరథ చక్రవర్తియొక్క ఇతర రాణులందరూ రామచంద్రుడు అరణ్యాలకు పోయే వేళ విలపిస్తూ అంటారు.

> కృత్యేష్వచోదితః పిత్రా సర్వస్యాన్తఃపురస్య చ ।
> గతిశ్చ శరణం చాసీత్ స రామోఽద్య ప్రవత్స్యతి ॥
>
> కౌసల్యాయాం యథా యుక్తో జనన్యాం వర్తతే సదా ।
> తథైవ వర్తతేఽస్మాసు జన్మప్రభృతి రాఘవః ॥
>
> (వా. రా. 2/20/2–3)

తండ్రి ఆదేశించకపోయినా అంతఃపుర సర్వస్వానికి గతీ ఆశ్రయమూ అయిన రాముడు నేడు అడవులకు పోవుచున్నాడు. జన్మ ప్రభృతి అతడు తన తల్లి అయిన కౌసల్యతో వ్యవహరించినట్లే మన విషయంలో కూడా ప్రవర్తించినాడు. దీనికి మించి రామభద్రుని మాతృభక్తికి అన్యప్రమాణం ఏమి కావాలి?

## పితృభక్తి

ఈ విధంగానే శ్రీరాముని పితృభక్తి కూడా అత్యంతాద్భుతంగా వుంది. తండ్రి ఆదేశాన్ని పాలించ రాముని మనస్సులో ఎంతటి ఉత్సాహ, సాహస, దృఢనిశ్చయాలున్నదీ రామాయణ పాఠకులకు తెలియని విషయం కాదు. కైకేయీ మాతతో భాషించే సందర్భంలో రాముడంటాడు.

అహం హి వచనాద్ రాజ్ఞః పతేయమపి పావకే ॥
భక్షయేయం విషం తీక్ష్ణం పతేయమపి చార్ణవే ।
(వా.రా. 2/18/28-29)

న హ్యతో ధర్మచరణం కిఞ్చిదస్తి మహత్తరమ్ ।
యథా పితరి శుశ్రూషా తస్య వా వచనక్రియా ॥
(వా. రా. 2/19/22)

ప్రభువులు ఆదేశిస్తే నేను అగ్నిలోనైనా దూకుతాను, కఠోర విషాన్నైనా పానం చేస్తాను. సముద్రంలోనైనా పడిపోతాను. పితృసేవ, పిత్రాజ్ఞాపాలన వీటికి మించిన ధర్మం ప్రపంచంలో మరిలేదు.

ఆ స్థానంలో ఇట్టి ఉదాహరణలు మరెన్నో గోచరమవుతాయి. ఆ తరువాత అతడు తల్లి కౌసల్యతో కూడ అంటాడు –

నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ ।
ప్రసాదయే త్వాం శిరసా గన్తుమిచ్ఛామ్యహం వనమ్ ॥
(వా. రా. 2/21/30)

"అమ్మా! నీ చరణాలపై శిరసునుంచి ప్రసన్నురాలవు కావలసినదిగా ప్రార్థిస్తున్నాను. పితృ వచనాలను తిరస్కరించే శక్తి నాకు లేదు. కనుక నేను వనాలకే వెళ్ళ గోరుతున్నాను.

ఇంతే కాకుండా లక్ష్మణ, భరత, ఋషి మున్యాదులతో భాషించే వేళలో కూడా రాముడు పితృభక్తి విషయంలో విశేషంగా చెప్పారు. రామచంద్రుని బాల్యగాథలు వర్ణించే వేళలో కూడా అతడు సర్వదా పితృసేవలో వుండే వాడనే ఉంది.

## ఏకపత్నీ వ్రతం

రామచంద్రుని ఏకపత్నీ వ్రతం అత్యంతాదర్శవంతమైనది. అతడు స్వప్నంలోకూడా జానకీ దేవిని వినా అన్య స్త్రీనెవరినీ వరించలేదు. సీతను అడవులకు పంపివేసిన తరువాత యాగం చేయవలసి వచ్చి భార్య

కావలసిరాగా అతడు సీతాదేవియొక్క స్వర్ణమూర్తితోటే కార్యాన్ని నెరవేర్చుకుంటాడు. కావాలనుకుంటే అతడు తత్సమయంలో ద్వితీయ వివాహం చేసికొనేవాడు. తద్వారా సమాజంలో అతనికి అపకీర్తి కలుగదు. కాని రామభద్రుడు మర్యాదా పురుషోత్తముడు కదా స్త్రీకి పాతివ్రత్య విధానమున్నట్లే పురుషునికి ఏకపత్నీ వ్రతపాలన పరమావశ్యకమైనదన్న విషయాన్ని చరితార్థం చేసి చూపాడు. స్త్రీపురుషసంబంధం భోగానుభవంకోసం కాదు – ధర్మాచరణ కోసమని తెలియజేశాడు.

శ్రీరామచంద్రునికి సీతపట్ల ఎంత ప్రేమ యుండినదో సీతాపహరణానంతరం గల ఘట్టాన్ని పఠిస్తే మనకు కొంత మేరకు తెలుస్తుంది. శ్రీరాముడు పరమవీరుడు, ధీరుడు, సహిష్ణుడయి కూడ ఓ సామాన్యునివలె విరహోన్మత్తుడై పిచ్చివానిలా పశు పక్షి వృక్ష లత పర్వతాలను కూడ సంబోధించి సీత జాడను గురించి ప్రశ్నిస్తూ అనేక విధాల విలపిస్తూ ఓ వనంనుండి మరోవనానికి పరిభ్రమిస్తూంటాడు. అప్పుడప్పుడు శోకవిహ్వలుడై మూర్ఛపోతాడు. 'హా సీతా! హా సీతా!' అని పిలుస్తూంటాడు. తత్సమయంలోని వర్ణన అత్యంత కరుణాపూర్ణమై, హృదయ విదారకంగా వుంటుంది.

## భ్రాతృప్రేమ

శ్రీరామచంద్రుని భ్రాతృప్రేమకూడ అతులనీయమైనదే. బాల్యం నుండీ అతడు తన సోదరులయందు విశేష ప్రేమ కలిగి వుండేవాడు. సదా వారిని రక్షిస్తూండేవాడు. వారిని ప్రసన్నంగా వుంచడానికి ప్రయత్నించేవాడు. సోదరులు నలుగురూ ఒక్కసారే గుఱ్ఱాలు ఎక్కి విహరించేవారు. రామచంద్రునికి లభించే ఉత్తమ వస్తు, ఆహార పదార్థాలలో ఏవి లభించినా అతడు వాటిని ముందు సోదరులకు యిచ్చేవాడు. తరువాతనే తాను వినియోగించుకునేవాడు. శ్రీరామచంద్రునికి సోదరులందరియందూ సమాన ప్రేమయే వున్నా ఎవరియందూ భేదభావం లేకపోయినా లక్ష్మణునికి మాత్రం రామునియందు విశేష స్నేహం వుండేది. అతడు కొన్ని క్షణాలైనా రామ వియోగాన్ని సహించలేకపోయేవాడు.

అందులకే యాగరక్షణార్థం విశ్వామిత్రునితో అన్నగారితోటే అడవులకు వెళ్ళాడు. అక్కడ రాక్షసులందరినీ అంతం చేసి సోదరులిద్దరూ జనకపురమును చేరుకున్నారు ధనుర్భంగమయింది. ఆ తరువాత వివాహాలకు ఏర్పాట్లు జరిగాయి. నలుగురి సోదరుల కళ్యాణాలూ కలిసియే జరిగాయి. అనంతరం నలుగురు సోదరులు అయోధ్య చేరి ప్రేమ పూర్వకంగా నివసించసాగారు

తరువాత భరత శత్రుఘ్నులు మేనమామతో కలిసి తాతగారి యింటికి వెళ్ళారు. రామలక్ష్మణులు తండ్రి ఆజ్ఞానుసారం ప్రజలకార్యాలను నిర్వహిస్తున్నారు. శ్రీరాముని ప్రేమపూర్ణ ప్రవర్తనవల్లనూ, అతని సద్గుణ, స్వభావాలవల్లనూ నగరములో మరియు నగరమువెలుపల నివసించే బ్రాహ్మణాది వర్ణాలవారందరూ ముగ్ధులైపోయేవారు. తదనంతరం దశరథ చక్రవర్తి వశిష్ఠమునీంద్రుల ఆజ్ఞ, ప్రజల సమ్మతుల ననుసరించి శ్రీరామరాజ్యాభిషేకానికి నిశ్చయం చేసుకున్నాడు. దశరథ మహారాజు ముఖతః తన రాజ్యాభిషేక విషయాన్ని ఆలకించి శ్రీరాముడు కౌసల్యా మాత మందిరానికి వెళ్ళాడు, అప్పుడు సుమిత్ర, లక్ష్మణులిద్దరూ కూడ అక్కడే వున్నారు. తత్సమయంలో రామచంద్రుడు సోదర లక్ష్మణునితో అంటాడు—

లక్ష్మణేమాం మయా సార్ధం ప్రశాధి త్వం వసుంధరామ్ ।
ద్వితీయం మేఽన్తరాత్మానం త్వామియం శ్రీరుపస్థితా ॥

సౌమిత్రే భుఙ్క్ష్వ భోగాంస్త్వమిష్టాన్ రాజ్యఫలాని చ ।
జీవితం చాపి రాజ్యం చ త్వదర్థమభికామయే ॥
(వా. రా. 2/4/43–44)

"లక్ష్మణా! నీవు నాతో కలిసి యీ పృథ్వివి శాసించు, నీవు నా ద్వితీయాంతరాత్మవు, ఈ రాజ్యలక్ష్మి నీకే లభించినది. సుమిత్రా నందనా! నీవు మనోభీష్ట భోగాలనూ రాజ్య ఫలాలనూ అనుభవించు. జీవన, రాజ్యాదులనన్నిటినీ నేను నీకోసమే కోరుతూన్నాను."

తరువాత ఆ లీలానాటకపటం (తెర) మారింది. కైకేయీ మాత ఇచ్ఛానుసారం రాజ్యాభిషేకం వనగమనరూపంలోకి మారిపోయింది. సుమంత్రుని ద్వారా పిలువబడిన తరువాత శ్రీరాముడు రాజభవనంలో ప్రవేశించి, కైకేయీ మాతతో భాషించిన తరువాత – ఆమెవలన తండ్రిగారిచ్చిన వరదాన విషయాలు తెలియడంతో అతడు అత్యంత ప్రసన్నుడయ్యాడు. తదనంతరం అతడు కౌసల్యామాత దగ్గర సెలవుతీసుకోవడానికి వెళ్ళిన వేళలో విశేష సంభాషణలు కొనసాగాయి. రామచంద్రుడు కైకను గురించి కాని భరతుని గురించి కాని విరుద్ధమైన ఒక్క మాటను కూడ పలుకలేదు, పైగా భరతుని మహత్త్వాన్ని ప్రశంసిస్తూ తల్లికి ధైర్యం చెప్పి – "అమ్మా! భరతుడు నావలెనే నిన్ను సేవిస్తాడు" అని పలికి అదే సమయంలో సీతను భవనంలోనే వుండమని నచ్చచెబుతూ అంటాడు –

భ్రాతృపుత్రసమౌ చాపి ద్రష్టవ్యౌ చ విశేషతః ।
త్వయా భరతశత్రుఘ్నౌ ప్రాణైః ప్రియతరౌ మమ ॥
(వా. రా. 2/26/33)

"సీతా! నా సోదరులైన భరత శత్రుఘ్నులు నాకు ప్రాణాలకన్న అత్యంత ప్రియులు. కనుక నీవు వారిని నీ సోదరులవలె పుత్ర సమంగానేగాక అంతకన్న ప్రియంగా చూసుకోవాలి."

వనగమన సమాచారం విన్న లక్ష్మణునికి తీవ్రమైన దుఃఖ, క్రోధాలు కలిగాయి. రామచంద్రుడు సోదరుని దుఃఖక్రోధాలను నీతి ధర్మపరిపూర్ణమైన, అత్యంత మధుర కోమల వచనాలతో శాంతింప జేశాడు. తరువాత తాను కూడ వనాలకు వస్తానని చెప్పినప్పుడు రాముడు లక్ష్మణునికి అచ్చటనే యుండమని నచ్చచెబుతూ –

స్నిగ్ధో ధర్మరతో ధీరః సతతం సత్పథే స్థితః ।
ప్రియః ప్రాణసమో వశ్యో విజేయశ్చ సఖా చ మే ॥
(వా. రా. 2/31/10)

"లక్ష్మణా! నీవు నా స్నేహితుడవు, ధర్మ పరాయణుడవు, ధీరుడవు,

సదాసన్మార్గంలో వుండేవాడవు నాకు ప్రాణ సమప్రియుడవు నా వశమందుండునట్టివాడవు. ఆజ్ఞా పాలకుడవు, సఖుడవు కూడా"

ఎంతగా నచ్చచెప్పినా లక్ష్మణుడు తన ప్రేమతోనిండిన పట్టుదలను విడనాడకపోయే సరికి రామచంద్రుడు సోదరుని తనతో తీసుకవెళ్ళడానికి అంగీకరించాడు వనవాసకాలంలో కూడ శ్రీరాముడు లక్ష్మణునికి, సీతకూ సుఖాన్ని చేకూర్చాలని ప్రయత్నించేవాడు

సేనాసహితంగా భరతుడు చిత్రకూటానికి వచ్చెను. రామప్రేమ కారణంగా లక్ష్మణుడు క్షుబ్ధుడై భరతుని గురించి అనరాని మాటలు అనగా అప్పుడు రాముడు సోదర భరతుని ప్రశంసిస్తూ –

ధర్మమర్థం చ కామం చ పృథివీం చాపి లక్ష్మణ ।
ఇచ్ఛామి భవతామర్థే ఏతత్ ప్రతిశృణోమి తే ॥
భ్రాతౄణాం సంగ్రహార్థం చ సుఖార్థం చాపి లక్ష్మణ ।
రాజ్యమప్యహమిచ్ఛామి సత్యేనాయుధమాలభే ॥
యద్ వినా భరతం త్వాం చ శత్రుఘ్నం వాపి మానద ।
భవేన్మమ సుఖం కిఞ్చిద్ భస్మ తత్ కురుతాం శిఖీ ॥
స్నేహేనాక్రాన్తహృదయః శోకేనాకులితేన్ద్రియః ।
ద్రష్టుమభ్యాగతో హ్యేష భరతో నాన్యథాఽఽగతః ॥

(వా. రా. 2/97/5–6,8,11)

"లక్ష్మణా! నేను యథార్థంగా నా ఆయుధంపై ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను ధర్మార్థకామాలనే కాదు యావత్ పృథ్విని కూడ మీకోసమే కోరుతూన్నాను. లక్ష్మణా! నేను రాజ్యాన్ని కూడ సోదరుల భోగ్య సామగ్రిగా వారి సుఖంకోసమే కోరుతున్నాను. వినయశీలుడవైన సోదరా! భరతునీ, నిన్నూ, శత్రుఘ్ననీ విడనాడి నాకు లభించే భోగాలలో అగ్ని పడును గాక!. నా వనాగమన వార్త విన్న వెంటనే భరతుని హృదయం స్నేహసంభరితమై పోయిందని నాకు తెలుసు. అతని ఇంద్రియాలు శోకవ్యాకులమై పోయాయి. కనుకనే అతడు నన్ను చూడాలని వస్తున్నాడే గాని అన్యకారణమేదీ లేదు."

ఆ ఘట్టంలో రాముడు ఇంకా ఇట్లన్నాడు – "లక్ష్మణా! భరతుడు మనసా కూడ నాకు వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యడు నీకే రాజ్యేచ్ఛ వుంటే భరతునితో చెప్పి నీకు యిప్పించవలెనా?

లక్ష్మణునకు భరతునిపైగల సందేహమంతా వెంటనే ఆ మాటలతో దూరమైపోయింది

ఆ తరువాత భరతుడు వచ్చి రామచరణాలపై వ్రాలిపోయినప్పుడు అతడు సోదరుని లేవదీసి కౌగిలించుకున్నాడు ఒడిలో కూర్చోబెట్టుకుని అతని శిరస్సు నాఘ్రాణించి ఆదరంగా కుశల సమాచారాలు ప్రశ్నించి – "సోదరా! వల్కలము, జటాజూటాలను ధరించి నువ్విక్కడకు ఎందుకువచ్చావు?" అని ప్రశ్నించాడు తరువాత భరతుడు రామచంద్రుని అయోధ్యకు తీసుకువెళ్ళాలని విశేష ప్రయత్నం చేశాడు భరతరాముల ప్రేమనూ, వ్యవహారాన్నీ తిలకించిన వారందరూ పులకించిపోయారు చిట్టచివరకు భరతుడు తన అన్నగారు తన శపథంనుండి, తప్పుకోరని తెలిసికొని పాదుకలను ప్రసాదించమని యాచిస్తాడు. భరతుని ప్రార్థనను మన్నించి రామచంద్రుడు పాదుకలనిచ్చి పంపుతాడు. భరతుడు పాదుకలను శిరస్సుపై పెట్టుకుని అయోధ్యకు వెళ్లిపోతాడు. ఆ పాదుకలకే రాజ్యాభిషేకం చేసి సర్వకార్యాలూ వాటికి నివేదిస్తూ రాజ్యపాలన చేశాడు తాను కూడ ముని వేషాన్ని ధరించి నందిగ్రామంలో వుండిపోయాడు

ఆ తరువాత సీతాపహరణం జరిగింది. అత్యంత దారుణ భయంకరంగా రామ రావణ యుద్ధం జరిగింది. అక్కడ ఓనాడు రావణుని శక్తి లక్ష్మణుని మూర్ఛితుని చేయగా రాముడు విలపించిన తీరు చూస్తే అతనికి లక్ష్మణునిపై ఎంత ప్రేమ వున్నదీ వ్యక్తమవుతుంది. అక్కడ రాముడంటాడు.

శ్లో. యథైవ మాం వనం యాన్తమనుయాతి మహాద్యుతిః ।
అహమప్యనుయాస్యామి తథైవైనం యమక్షయమ్ ॥

ఇష్టబన్ధుజనో నిత్యం మాం చ నిత్యమనువ్రతః ।
ఇమామవస్థాం గమితో రాక్షసైః కూటయోధిభిః ॥
(వా. రా. 6/101/13-14)

"మహాతేజస్వి అయిన లక్ష్మణుడు నేను అడవులకు వచ్చే వేళ నన్ను అనుసరించి వచ్చినట్లు నేనూ యితనితో యమలోకానికి వెడతాను. సదా సర్వదా ఇతడు ప్రియబంధువుగా, అనుయాయిగా వ్యవహరిస్తూవచ్చాడు. కపటయుద్ధాన్ని సాగించే రాక్షసులు నేడితణ్ణి యీ స్థితికి తీసుక వచ్చారు కదా!"

తన కోసం సర్వస్వాన్ని అర్పించి మరణానికి కూడ సిద్ధమై, రకరకాల కష్టాలు అనుభవించడానికి సిద్ధమైన సోదరుని కోసం చింతించడం, విలపించడం ఉచితమే, కానీ ఈ ప్రసంగంలో రామచంద్రుడు విలాప పరాకాష్ఠను చూపించి భ్రాతృప్రేమకు సంబంధించిన మహత్తర సుందరోపదేశాన్ని ప్రసాదించాడు.

హనుమంతుని ద్వారా సంజీవనీ మూలికను ఏర్పాటు చేసి సుషేణుడు లక్ష్మణుని స్వస్థచిత్తుని చేశాడు. యుద్ధంలో రావణుడు అంతమయ్యాడు. రాముడు లంకపై విజయం పొందాడు. శ్రీరామమూర్తి, అయోధ్యకు మరలుటకు సంసిద్ధుడయ్యాడు. ఆ సమయంలో విభీషణుడు రాముణ్ణి కొన్నాళ్ళు లంకలో ఉండమని వినయముతో కోరాడు. అప్పుడు రాముని వచనాలను తిలకించండి -

న ఖల్వేతన్న కుర్యాం తే వచనం రాక్షసేశ్వర ।
తం తు మే భ్రాతరం ద్రష్టుం భరతం త్వరతే మనః ॥

మాం నివర్తయితుం యోఽసౌ చిత్రకూటముపాగతః ।
శిరసా యాచతో యస్య వచనం న కృతం మయా ॥
(వా. రా. 6/121/18-19)

"రాక్షసేశ్వరా! నేను నీ అభ్యర్థనను అంగీకరించక పోవడమనేది లేదు, కాని సోదరుడైన భరతుని త్వరగా చూచుటకు నా మనస్సు

తహతహలాడుచున్నది అయోధ్యనుండి చిత్రకూటం వరకూ వచ్చి నన్ను తీసుకువెళ్ళాలన్న భరతుని ప్రార్థనను నేను ముందు స్వీకరించలేదు. (ప్రాణ ప్రియుడైన అట్టి సోదరుడగు భరతుని కలుసుకోవడంలో నేను విలంబం ఎలా చేస్తాను?") ఇత్యాది -

తరువాత పుష్పక విమానం పై కూర్చుని శ్రీ సీతా రామలక్ష్మణులు మిత్రులతోసహా అయోధ్య చేరారు అక్కడకూడ భరతుని కలిసే సమయంలో రామచంద్రుడు భ్రాతృ ప్రేమను అద్భుతంగా ప్రకటించాడు.

రాజ్యపాలన వేళలో కూడ శ్రీరాముడు ప్రతి కార్యంలోనూ తన సోదరులతో సంప్రదించేవాడు. ఏ విధంగానైనా వారికి సుఖాన్ని చేకూర్చాలనీ ప్రసన్నులనుగా వుంచాలనీ ప్రయత్నించేవాడు.

ఒకానొక సమయంలో లవణాసురుని అత్యాచారాలకు భీతి చెందిన ఋషులు అతనిని అంతం చెయ్యడానికి రామచంద్రుణ్ణి ప్రార్థించారు. సభలో శ్రీరాముడు ఎవరు లవణాసురుణ్ణి చంపుతారు? అని ప్రశ్నింపగా భరతుడు వాణ్ణి అంతం చేయ సంసిద్ధం కాగా శత్రుఘ్నుడంటాడు -"ప్రభూ! భరతుడు ఎన్నో కార్యాలు సాధించి వున్నాడు. మీ కోసం మహా కష్టాలు సహించాడు: పైగా అతడు నాకన్న పెద్దవాడు కూడ. సేవకుడనైన నేనుండగా అతనికి ఈ శ్రమను కలుగజేయకండి. ఇందుకు నాకే అనుమతి లభించాలి", అంటాడు. అంత రాముడు శత్రుఘ్నునికి అనుమతిని ప్రసాదిస్తూ - "అక్కడి రాజ్యాన్ని కూడ నీవే శాసించాలి. నా ఆదేశాన్ని తిరస్కరించరాదు" అనగా శత్రుఘ్నునికి రాజ్యాభిషేక విషయం నచ్చదు. అతడు చాల పశ్చాత్తాపం చెందాడు. కానీ దానిని రామాజ్ఞగా, భావించి దానిని స్వీకరించవలసి వచ్చెను. ఆ రీతిగా వచన బద్ధుని చేసి అతనికి యిష్టం లేకపోయినా కూడ తమ్మునికి రాజ్య సుఖాన్ని ప్రసాదించడము రాముని వంటి అన్నగారికి మాత్రమే అర్హ మైన కార్యం కదా!

తరువాత ప్రతిజ్ఞాబద్ధుడు కావడం వల్ల సోదర లక్ష్మణుని పరిత్యజించవలసి వచ్చినప్పుడు శ్రీరామునికి ఆ వియోగం

భరించరానిదైనది.* అక్కడ వాల్మీకి మహాకవి వచనాలను తిలకించండి –

విసృజ్య లక్ష్మణం రామో దుఃఖశోకసమన్వితః ।
పురోధసం మన్త్రిణశ్చ నైగమాంశ్చేదమబ్రవీత్ ॥
అద్య రాజ్యేఽభిషేక్ష్యామి భరతం ధర్మవత్సలమ్ ।
అయోధ్యాయాః పతిం వీరం తతో యాస్యామ్యహం వనమ్ ॥
ప్రవేశయత సంభారాన్ మా భూత్ కాలాత్యయో యథా ।
అద్యైవాహం గమిష్యామి లక్ష్మణేన గతాం గతిమ్ ॥
(వా. రా. 7/107/1–3)

"లక్ష్మణుని పరిత్యజించి రామచంద్రుడు దుఃఖశోకమగ్నుడయ్యాడు. పురోహిత మంత్రి సామంతులను పిలిచి – "నేను నేడే ధర్మ ప్రేమి అయిన వీర భరతునికి రాజ్యాభిషేకం చేస్తాను. తరువాత వనాలకు వెళ్ళిపోతాను. శీఘ్రంగా సామగ్రులనన్నింటినీ సమకూర్చండి. ఆలస్యం కారాదు. నేడే నేను లక్ష్మణుడు వెళ్ళిన స్థానానికి వెడతాను.

అప్పుడు భరతుడు రాజ్యాన్ని నిందిస్తూ – "అన్నగారూ! నాకు నీవు వినా పృథ్వీ రాజ్యమే కాదు మరేమీ వద్దు. కనుక నన్ను కూడ నీవెంట తీసుకువెళ్ళు" అంటాడు. ఆపై భరతుని వచనానుసారం మధురనుండి శత్రుఘ్నుడు కూడ పిలువబడతాడు. మానవలీలా నాటకాన్ని సమాప్తం చేసి నిజ సోదరసహితుడై శ్రీరాముడు పరమ ధామానికి వెళ్ళి పోతాడు.

శ్రీరాముని భ్రాతృప్రేమకు ఇది కేవలం దిగ్దర్శనం మాత్రమే. సోదరుల కోసమే రాజ్యాన్ని స్వీకరించడం భరతుని రాజ్యాభిషేక విషయాల నాలకించి పరమానందితుడై తన హక్కును విడిచి పెట్టడం, ఏ కైకేయి కారణంగా తన రాజ్యాభిషేకం ఆగిపోయిందో ఆదిలో వలెనే భక్తిభావంతో ఆమెను ఆదరించడం, ముక్తకంఠంతో భరతుని గుణాలను గానంచేయడం, భరతునిపై శంకాక్రోధాలు కలిగిన లక్ష్మణునికి నచ్చజెప్పడం, లక్ష్మణునికి శక్తి తగలగా ప్రాణత్యాగానికి సిద్ధం కావడం,

* ఇదే పుస్తకములో 73.వ పుటను చూడండి.

సమయసమయానికి సోదరులకు పవిత్రమైన ఉపదేశమునివ్వడం, స్వార్థాన్ని పరిత్యజించి సర్వులయందూ ప్రేమ కలిగి వుండడం, శత్రుఘ్నునికిష్టము లేకున్ననూ, అతనిచే రాజ్యాన్ని పాలింపజేయడం, లక్ష్మణ వియోగాన్ని సహించజాలక పరమధామం చేరడం శ్రీరామచంద్రుని ఆదర్శ భ్రాతృప్రేమ పూర్ణమైన కార్యాలన్నింటి నుండి మనం నీతిని గ్రహించాలి.

## సఖ్యప్రేమ

శ్రీరామునికి తన మిత్రులయందు కూడ అతులనీయమైన ప్రేమ వ్యవహారం ఉంది. ఆయన తన మిత్రులకోసం ఎంతగా సహకరించినా దానిని అసలు మనసులో ఉంచుకునే వాడేకాదు. కానీ తన విషయంలో మిత్రులు చేసిన అల్పకార్యాల విషయంలో కూడ వారిని అత్యధికంగా ప్రశంసించేవాడు. ఇక్కడ ఓ చిన్న ఉదాహరణను యిస్తున్నాము. అయోధ్యలో భగవానునికి రాజ్యాభిషేకమైన తరువాత వానరులకు సెలవు యిచ్చిన తదుపరి ప్రధాన వానరులను తన దగ్గరకు పిలిచి ప్రేమగా చూస్తూ రామచంద్రుడు అత్యంత సుందరమైన మధురవాణితో అన్నాడు –

సుహృదో మే భవన్తశ్చ శరీరం భ్రాతరస్తథా ॥

యుష్మాభిరుద్ధృతశ్చాహం వ్యసనాత్ కాననౌకసః ।
ధన్యో రాజా చ సుగ్రీవో భవద్భిః సుహృదాం వరైః ॥
(వా. రా. 7/39/23–24)

"వనవాసి వానరులారా! మీరు నా మిత్రులు, సోదరులే కాదు, నా శరీరాంగాలు కూడ. ఆపదలనుండి మీరు నన్ను ఉద్ధరించారు. కనుక మీ వంటి శ్రేష్ఠ మిత్రులుకల సుగ్రీవరాజు ధన్యుడు". ఇంతేగాక అనేక విషయాలలో శ్రీరామచంద్రుడు తన మిత్రులతో ప్రేమగా వ్యవహరించాడు. సుగ్రీవాది మిత్రులు కూడ రామ చంద్రుని సఖ్య ప్రేమను గురించి పదే పదే ప్రశంసించేవారు. శ్రీరామచంద్రుని ప్రియవ్యవహారాలకు వారంతా ముగ్ధులై ధన, జన భోగాదులనే విస్మరించేవారు. వారు సదా సర్వదా రామునికోసం

తమ ప్రాణాలను సయితం పరిత్యజించ సిద్ధమయ్యేవారు. రామభద్రుడూ అతని మిత్రులూ ధన్యులు కదా! మైత్రి అంటే అలానే వుండాలి

## శరణాగతవాత్సల్యం

రామచంద్రుని శరణాగతవాత్సల్యం వాల్మీకి రామాయణంలో అనేక ఘట్టాలలో వచ్చినా - రావణునిచేత అవమానింపబడిన విభీషణుడు రాముని శరణువేడవచ్చిన ప్రసంగం భక్తజనమానసాలలో ఆనంద తరంగాలను ప్రభవింపజేస్తుంది.

ధర్మయుక్తంగా న్యాయసంగతంగా విభీషణుడు రావణునికి సలహాయిచ్చినా రావణుడు విభీషణుని వచనాలను ఆలకించకపోగా నిండుసభలో అతణ్ణి అవమానించాడు. అప్పుడు విభీషణుడు అక్కడనుండి నిరాశతో దుఃఖితుడై శ్రీరాముని శరణువేడుతాడు. అతడు ఆకాశమార్గంద్వారా రావడం చూసి సుగ్రీవుడు వానరులందరినీ సావధానంగా వుండమంటాడు. ఇంతలోనే విభీషణుడు వచ్చి ఆకాశంలోనే నిలబడి, ఆర్తభావంతో, "నేను దురాత్ముడైన రావణుని తమ్ముడను. నా పేరు విభీషణుడు. రావణునిచేత అవమానింపబడ్డ నేను శ్రీ రామచంద్రుల శరణువేడ వచ్చాను. సర్వజీవకోటికీ శరణదాత అయిన రామభద్రులకు నా రాకను గురించి సూచించండి" అని అంటాడు.

అది విని సుగ్రీవుడు వెంటనే శ్రీరామభగవానుని చేరి రాక్షస స్వభావాదులను వర్ణించి రాముణ్ణి సావధానుని చేస్తూ రావణ సోదరుడైన విభీషణుని ఆగమన సమాచారాన్ని తెలియజేశాడు. అప్పుడే అన్నాడు కూడ, "ప్రభూ! జాగ్రత్తగా పరీక్షించి ముందు వెనుకలు యోచించి యథోచితరీతిని చేయండి". అదే విధంగా అక్కడ కూర్చున్న వానరులందరూ తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అందరికందరూ విభీషణుని శంకించారు. కాని హనుమంతుడు మాత్రం విభీషణుని నిర్దోషిగా, యథార్థమైన శరణాగతునిగా వర్ణిస్తూ అనేక యుక్తులతో వినయముతో సలహాయిచ్చాడు. ఈ విధంగా అందరి మాటలూ

విన్న తరువాత రామచంద్రుడన్నాడు –

> మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథఞ్చన ।
> దోషో యద్యపి తస్య స్యాత్ సతామేతదగర్హితమ్ ॥
> (వా. రా. 6/18/3)

మిత్రభావంతో వచ్చిన విభీషణుని నేను ఎన్నటికీ త్యజించ జాలను. అతనిలో ఏమైనా దోషమున్నా అతని కాశ్రయమీయడం సజ్జన నిందాపాత్రం కాదు. అప్పుడు కూడ సుగ్రీవుడు ఒప్పుకోలేదు. శంకా, భయాలు ఉత్పన్నమయే విషయాలు అతడెన్నో పలుకుతాడు. అప్పుడు శ్రీరాముడు సుగ్రీవునకు నచ్చచెప్పాడు.

> పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్ ।
> అఙ్గుల్యగ్రేణ తాన్ హన్యామిచ్ఛన్ హరిగణేశ్వర ॥
> x x x x
> బద్ధాఞ్జలిపుటం దీనం యాచన్తం శరణాగతమ్ ।
> న హన్యాదానృశంస్యార్థమపి శత్రుం పరంతప ॥
> x x x x
> సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
> అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ ॥
> ఆనయైనం హరిశ్రేష్ఠ దత్తమస్యాభయం మయా ।
> విభీషణో వా సుగ్రీవ యది వా రావణః స్వయమ్ ॥
> (వా.రా. 6/18/23,27,33–34)

"వానరగణాధీశా! నేనే కోరుకుంటే – యావద్భూమండలంలోని పిశాచ, దానవ, యక్ష, రాక్షసులను అంగుళ్యగ్రభాగంతో అంతం చేయగలను, కనుక భయపడవలసిన పనేలేదు. పరంతపా! శత్రువైనా సరే చేతులు జోడించి దీనముగా శరణుజొచ్చి అభయమును వేడగా దయాధర్మపాలనమునకై అతనిని అంతం చెయ్యరాదు. ఒక్కసారి "నేను నీవాడను! అని యాచిస్తూ నన్ను శరణు వేడు వారిని సర్వప్రాణులనుండీ నిర్భయంగా ఉంచుతానన్నది నా వ్రతం. వానర శ్రేష్ఠా! సుగ్రీవా! (ఉపర్యుక్త

నీతి ననుసరించి) నేనీతనికి అభయమిచ్చాను. కనుక నీవు విభీషణుణ్ణి తీసుకురా. ఇతడు విభీషణుడే కాదు స్వయంగా రావణుడైనా అగును గాక!

అంతే! ఇంకేముంది? రామవచనాలకు సర్వులూ ముగ్ధులైపోయారు భగవదాజ్ఞానుసారం వెంటనే విభీషణుని తీసుకువచ్చారు. విభీషణుడు తన మంత్రులతో సహా వచ్చి శ్రీరామచంద్రుని చరణాలపై వాలిపోయాడు, భగవన్! నేను నా సర్వస్వాన్నీ విడనాడి మీ శరణుకోరి వచ్చాను. ఇప్పుడు నా రాజ్య, సుఖ జీవనాలన్నీ మీ ఆధీనాలే. తరువాత రామచంద్రుడు ప్రేమ భరిత దృష్టి, వచనాలతో అతనికి ధైర్యాన్ని ప్రసాదించాడు. లక్ష్మణుని ద్వారా సాగర జలాలను తెప్పించి విభీషణుని అక్కడే లంకా రాజ్యాభిషేక్తుణ్ణి చేశాడు.

## కృతజ్ఞత్వం

యథార్థాన్ని గమనించగలిగితే శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ పరబ్రహ్మ పరమేశ్వరుడు. అతని శక్తి అపారమైనది. అతడు స్వయంగా ఏమైనా చేయగలడు. ఆయనకు ఎవరు ఏమి ఉపకారం చేయగలరు? అయినా తన ఆశ్రితుల ప్రేమ వృద్ధ్యర్థం వారి సాధారణ సేవలకు కూడ విశేష రూపాన్ని ఆపాదించి తన కృతజ్ఞతను ప్రకటించాడు.

సీతాన్వేషణలో రాముడు - రావణుని ద్వారా యుద్ధంలో దెబ్బతినిపడిన జటాయు దశను తిలకిస్తాడు. తత్సమయ వర్ణన చూడండి -

నికృత్తపక్షం రుధిరావసిక్తం తం గృధ్రరాజం పరిగృహ్య రాఘవః ।
క్వ మైథిలీ ప్రాణసమా గతేతి విముచ్య వాచం నిపపాత భూమౌ ॥
(వా.రా. 3/67/29)

రెక్కలు తెగిపడిపోగా శరీరమంతా రక్తసిక్తమై పడిపోయిన గృధ్రరాజగు జటాయువును తన హృదయానికి హత్తుకుని "ప్రాణ ప్రియ అయిన జానకి ఎక్కడకు పోయింది?" అంటూ రఘునాథుడు నేలమీద పడిపోయాడు.

ఆపై జటాయువు రావణుని గురించి చెప్పి వాడు సీతను అపహరించిన వృత్తాంతాన్ని వినిపిస్తూ ప్రాణాలను కోలుపోగా శ్రీరామచంద్రుడు స్వయంగా తన చేతులతో దాని దహనసంస్కారం పూర్తి చేశాడు. ఎట్టి అద్భుతమైన కృతజ్ఞత?

ఇట్టి ప్రసంగాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వానరులతో, రాజులతో, ఋషులతో, దేవతలతో ప్రసంగించే వేళల్లో రామచంద్రుడు అనేక ఘట్టాలలో – "మీ అనుగ్రహ, సహకారాలు కారణంగానే నేను రావణుని జయించగలిగాను" అని అనేవాడు.

హనుమంతుడు సీత జాడ తెలుసుకుని వచ్చిన తరువాత రాముని కలిసిన వేళలో పదే పదే రఘునాథుడు హనుమా! జానకి జాడ తెలియజేసి నీవు నన్నూ, రఘువంశాన్నీ, లక్ష్మణునీ కూడ రక్షించావు ఈ ప్రియకార్యానికి బదులుగా నీకీయదగిన వస్తువు నా దగ్గర ఏదీ లేదు. నా సర్వస్వమైన యీ ఆలింగనాన్ని యిస్తున్నాను! అంటూ హర్షపులకిత గాత్రుడైన రామభద్రుడు హనుమంతుని గాఢాలింగనం చేసుకుంటాడు. రాజ్యాభిషేకానంతరం హనుమంతునికి సెలవునిచ్చే వేళ అతడు చేసిన సేవాకార్యాదులను స్మరించుకుంటూ రామభద్రుడంటాడు –

ఏకైకస్యోపకారస్య ప్రాణాన్ దాస్యామి తే కపే ।
శేషస్యేహోపకారాణాం భవామ ఋణినో వయమ్ ॥

మదఙ్గే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే ।
నరః ప్రత్యుపకారాణామాపత్స్వాయాతి పాత్రతామ్ ॥

(వా. రా. 7/40/23–24)

"హనుమంతా! నీవు చేసిన ఒక్కొక్క ఉపకారానికి నేను నా ప్రాణాలను అర్పించినా శేషించిన ఉపకారాలకోసం నేను నీకు ఋణపడియే వుంటాను. నీ ద్వారా జరిగిన ఉపకారాలన్నీ నా దేహంలోనే లీనమైపోవాలి. వాటిని తీర్చే అవకాశం నాకు రాగూడదు. ఏమంటావా? ఆపదలు వచ్చినప్పుడే మానవుడు ప్రత్యుపకారాలకు పాత్రుడవుతాడు" అంటాడు

రాముడు. దీనినిబట్టి శ్రీరామునికృతజ్ఞత్వ భావం ఎంతటి ఆదర్శవంతమైనదో మనకు తెలుస్తుంది.

## ప్రజారంజకత్వం

రామచంద్రునిలో సర్వవిధాలా తన ప్రజలను ప్రసన్నులనుగా ఉంచాలన్న విశేషాదర్శం ఉన్నది. అతడు తన ప్రజలను కన్న సంతానంకన్న మిన్నగా వాత్సల్యంతో పాలించేవాడు. సదా సర్వదా వారి హితమందు రతుడై ఉండేవాడు. అయోధ్యావాసులందరికీ అతనిపట్ల విశేషాద్భుత ప్రేమ ఉండడానికి అదే కారణము.

శ్రీరాముని వనగమనము, చిత్రకూటంలో భరతునితో సహా ప్రజలు దర్శించ వచ్చుటను, పరంధామము వేంచేసే వేళలోని వర్ణనలు పఠిస్తూంటే ఆదినుండీ అంతం వరకూ చిన్నా పెద్దా, స్త్రీ పురుషులందరికీ రామచంద్రుని పట్ల అత్యద్భుతమైన ప్రేమ ఉన్నదని తెలుస్తుంది. వారందరూ సర్వవేళల్లోనూ శ్రీరామునికై ప్రాణాలు సయితం ఇవ్వడానికి సిద్ధంగా వుండేవారు. రామ వియోగం వారికి సహించరానిదై పోయింది.

రామభద్రుడు అడవులకు పోతూండగా ప్రజలలో అధిక సంఖ్యాకులు ప్రేమోన్మత్తులై అతణ్ణి అనుసరించారు. రామచంద్రుడు ఎంతగా నచ్చ చెప్పినా వారిని మరిపించలేకపోయాడు. చిట్టచివరకు వారు నిద్రపోతూండగా విడిచిపెట్టి అడవులకు వెళ్ళవలసి వచ్చింది. తత్సమయంలో అయోధ్యలోని పశుపక్ష్యాదులు కూడ రామ ప్రేమలో ముగ్ధమైపోయాయని వర్ణించబడింది. పరమధామగమన సమయంలోని వర్ణన కూడ అట్టి అద్భుతమైనదే.

అంతే కాకుండ ఏ సీతా విరహంలో రామచంద్రుడు సామా[illegible] మానవునివలె విలపించాడో? ఆ సీతనే – ఆమె నిర్దోషి పరమ పతివ్రతయే అయినా ప్రజల ప్రసన్నతకోసం త్యజించాడు. దీనినిబట్టి కూడ అతనికిగల ప్రజారంజకత్వ ఆదర్శభావాలు వ్యక్తమవుతాయి.

# శ్రీరాముని మహాత్త్వం

శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ పూర్ణబ్రహ్మ, పరమాత్మ అయిన విష్ణు దేవుని అవతారము – ఈ విషయం వాల్మీకిరామాయణంలో అనేక స్థానాలలో వర్ణింపబడింది. ప్రపంచంలో రావణుని ఉపద్రవాలు మితిమీరడంతో దేవతలూ, మహర్షులూ దుఃఖితులై బ్రహ్మదేవుని ప్రార్థించారు. బ్రహ్మదేవుడు దేవతలను ఓదారుస్తూండగా విష్ణు భగవానుడు సాక్షాత్కరించిన ఘట్టం ఇలా వర్ణించబడింది –

ఏతస్మిన్నన్తరే విష్ణురుపయాతో మహాద్యుతిః ।
శఙ్ఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః ॥

వైనతేయం సమారుహ్య భాస్కరస్తోయదం యథా ।
తప్తహాటకకేయూరో వన్ద్యమానః సురోత్తమైః ॥
(వా.రా. 1/15/16–17)

"అంతలోనే మహాతేజస్వీ, సురోత్తమవందనీయుడు, జగత్పతి అయిన విష్ణు భగవానుడు, మేఘాధిరూఢుడై విచ్చేసిన భాస్కరునివలె గరుడ వాహనారూఢుడై విచ్చేశాడు. అతని శరీరంపై పీతాంబరం, హస్తాలలో శంఖ, చక్ర, గదాద్యాయుధాలూ మిలమిల మెరిసే భుజకీర్తులూ శోభిల్లుతున్నాయి."

తరువాత దేవతల ప్రార్థనలను ఆలకించిన మీదట దశరథ మహారాజ గృహంలో మనుష్యరూపంలో అవతరించడానికి అంగీకరించాడు. మరల అక్కడే అంతర్ధానమైపోయాడు.

వివాహానంతరం రామచంద్రుడు అయోధ్యకు మరలి వచ్చే సమయంలో భార్గవరాముడు కలుస్తాడు. శ్రీరాముడు విష్ణువుయొక్క అవతారమవునో కాదో? అని పరీక్షించ రాముణ్ణి వైష్ణవధనుస్సుపై శరసంధానం చేయమంటాడు. అంత రామచంద్రుడు భార్గవరాముని చేతి నుండి దివ్యధనుస్సును గ్రహించి దానికి బాణాన్ని సంధించి–"పరశురామా!

ఇది దివ్య వైష్ణవ బాణము, దీనిని ఎక్కడ విడిచి పెట్టమంటావు?" అని ప్రశ్నించడంతో పరశురాముడు చకితుడైపోయాడు. అతని తేజస్సు రామునిలో లీనమైపోతుంది. తత్సమయంలో రాముణ్ణి స్తుతిస్తూ పరశురాముడంటాడు –

అక్షయ్యం మధుహన్తారం జానామి త్వాం సురేశ్వరమ్ ।
ధనుషోఽస్య పరామర్శాత్ స్వస్తి తేఽస్తు పరంతప ॥
(వా. రా. 1/76/17)

శత్రుతాపనా! రామా! నీకు శుభమగును గాక! ఈ విల్లు నెక్కు పెట్టడం వల్ల నీవు మధుదైత్యసంహారివీ, అమరాధీశ్వరుడవూ, అవినాశివీ అయిన సాక్షాద్విష్ణు భగవానుడవని నేను తెలుసుకున్నాను". అంటూ రామప్రభావాన్ని వర్ణించి అతనికి ప్రదక్షిణం చేసి పరశురాముడు వెళ్ళిపోయాడు.

రావణవధానంతరం బ్రహ్మ సమేతంగా దేవతలందరూ రామ సన్నిధి చేరి అతనితో భాషించగా తత్సమయంలో రాముడు వారితో నన్ను నేను దశరథ నందనుడైన రాముడను, మానవునిగానే భావిస్తున్నాను. నేనెవడినో? ఎక్కడనుండి వచ్చానో మీరే చెప్పాలి. అప్పుడు బ్రహ్మదేవుడు సర్వుల సమక్షంలో రహస్యాన్ని వెల్లడించాడు.

భవాన్నారాయణో దేవః శ్రీమాంశ్చక్రాయుధః ప్రభుః ।
ఏకశృఙ్గో వరాహస్త్వం భూతభవ్యసపత్నజిత్ ॥

అక్షరం బ్రహ్మ సత్యం చ మధ్యే చాన్తే చ రాఘవ ।
లోకానాం త్వం పరో ధర్మో విష్వక్సేనశ్చతుర్భుజః ॥

శార్ఙ్గధన్వా హృషీకేశః పురుషః పురుషోత్తమః ।
అజితః ఖడ్గధృగ్ విష్ణుః కృష్ణశ్చైవ బృహద్బలః ॥
(వా.రా. 6/117/13–15)

"నీవు సాక్షాత్తూ చక్రపాణివి, లక్ష్మీపతి అయిన శ్రీమన్నారాయణ

దేవుడవు, భూత భవిష్యశ్శత్రువులను అంతం చేయునట్టి వాడవు ఏకశృంగుడవైన వరాహ భగవానుడవు నీవే! రాఘవా! ఆదిమధ్యాంతాలలో సత్య స్వరూపుడవు అవినాశీ బ్రహ్మవు నీవే. సర్వలోకాలలో పరమధర్మానివీ, చతుర్భుజ విష్ణుడవూ నీవే అజితుడవు, పురుషుడవూ, పురుషోత్తముడవూ హృషీకేశుడవూ, శార్‌ఙ్గధనుర్ధారివీ, ఖడ్గధారివీ విష్ణుడవూ మహాబలశాలియైన కృష్ణుడవూ నీవే!.

ఇలాగే ఆయా ఘట్టాలలో అనేకంగా వర్ణించారు. అట్లాగే దశరథ మహారాజు కూడ – లక్ష్మణునితో భాషించే వేళలో శ్రీరాముని సేవా మహత్త్వాన్ని వర్ణిస్తూ అంటాడు–

ఏతత్తదుక్తమవ్యక్తమక్షరం బ్రహ్మసమ్మితమ్ ।
దేవానాం హృదయం సౌమ్య గుహ్యం రామః పరంతపః ॥

అవాప్తధర్మాచరణం యశశ్చ విపులం త్వయా ।
ఏనం శుశ్రూషతావ్యగ్రం వైదేహ్యా సహ సీతయా ॥
(వా.రా. 6/119/30–31)

"సౌమ్యా! పరంతపుడైన ఈ శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ వేదవర్ణితుడైన అవినాశీ, అవ్యక్త పరబ్రహ్మ. ఈతడు దేవతలకు హృదయుడై పరమ రహస్యమయుడై ఉన్నాడు. జనకనందిని అయిన సీతతో ఇతణ్ణి సావధానంగా సేవించి నీవు పవిత్ర ధర్మాన్ని ఆచరించి మహా యశస్సును పొందగలిగావు"

ఇంతే గాకుండ అనేక పర్యాయాలు బ్రహ్మదేవుడు, దేవతలూ, మహర్షులూ రామచంద్రుని అమిత ప్రభావాన్ని యథాసాధ్యంగా వర్ణించారు. మానవలీలను సమాప్తం చేసి పరమధామానికి వేంచేయనున్న ప్రసంగంలో కూడ శ్రీరాముడు సాక్షాత్తూ పూర్ణబ్రహ్మ పరమేశ్వరుడన్న విషయం స్పష్టం చేయబడింది. కనుక వాల్మీకిరామాయణాన్ని ప్రామాణిక గ్రంథంగా అంగీకరించునట్టి వారు కూడ శ్రీరాముడు భగవంతుడనడంలో శంకించరు.

## పరాక్రమం

శ్రీరామచంద్ర భగవానుని బలపరాక్రమ వీరత్వ, శస్త్రకౌశల విషయాలగురించి వర్ణించనేల? రామాయణమంతా ఈ విషయవర్ణనతోనే నిండినది. ఎక్కడైనా పరే యుద్ధ ప్రసంగాన్ని చూడండి. విశ్వామిత్రుని యాగరక్షణ సమయంలో శ్రీరాముడు మాటలాడుతూనే తాటక సుబాహువులను అంతం చేసి మారీచుని మానవాస్త్రం ద్వారా శతయోజన దూరం సముద్రంలోకి పడగొట్టాడు.

జనకపురిలో – మహామహావీరులూ, మహాబలశాలురైన రాజులూ తీవ్రతరంగా పరిశ్రమించి కూడ ఎత్తజాలని, కదపజాలని శివధనుస్సును శ్రీరాముడు అనాయాసంగానే ఎత్తి విరిచి వేశాడు. వైష్ణవ ధనుస్సుపై బాణాన్ని సంధించి పరశురాముని గర్వాన్ని హరించి వేశాడు. పంచవటిలో పద్నాలుగు వేలమంది రాక్షసులను కొన్నిక్షణాల కాలవ్యవధిలో ఏకమాత్ర వీరుడుగా నిలచి అంతం చేశాడు. వాలి వంటి మహాయోధుణ్ణి ఏకమాత్ర బాణంతో నేలకూల్చాడు. ధనుస్సుకు బాణాన్ని సంధించినంత మాత్రానికే సాగరంలో అల్లకల్లోలం బయలు దేరింది. సాగరుడు భయభీతుడై రాముణ్ణి శరణువేడాడు. లంకలో ప్రవేశించి భయంకర యుద్ధంలో రాక్షస సమేతంగా కుంభకర్ణుణ్ణి, రావణుణ్ణి వధించి యావద్విశ్వంలోనూ విజయ ఢంకాను మ్రోగించాడు.

## క్షమ

అంతటి మహాపరాక్రమశాలియే అయినా రఘునాథుడు తన విషయమై పరులొనర్చిన అపరాధాలను పట్టించుకునే వాడేకాదు. అతడెన్నడైనా ఎక్కడైనా క్రోధ, యుద్ధలీలలు ప్రకటించి వుంటే అవన్నీ తనను ఆశ్రయించుకున్నవారినీ, సాధుపురుషులనూ సంరక్షించడానికి, అపరాధులను దండించడానికీ, దుష్టులను నిర్దోషులనుగా చేయడానికీ చేసేవాడు. మంథరవంటి దాసీ అపరాధాన్ని గూడ అతడెన్నడూ లెక్క చేసేవాడు కాదు.

## ఉపసంహారము

శ్రీరాముని మహత్త్వపూర్ణమైన అసంఖ్యాకాదర్శాలను వర్ణించడం అసంభవమే. ఆదికవి వాల్మీకి ఆదిగా నేటి వరకూ వచ్చిన మహాకవులందరూ శ్రీరామ చరిత్రను వర్ణించి తమ వాణిని సఫలం చేసుకోవాలని ప్రయత్నించినారే కానీ, శ్రీరామచంద్రుని అనంత కళ్యాణ గుణాల పారాన్ని గ్రహించలేక పోయారు. నేను ఏమైనావ్రాస్తే అది వాల్మీకిరామాయణంలోని విషయానికి అతి సంక్షిప్త పరిచయమే. అదీ నా సాహసం కనుక విజ్ఞులగు పాఠకులు క్షమింతురు గాక! దీనిని చదివీ, వినీ భగవత్ప్రేమికులెవరైనా ఏ ఘట్టం వల్లనైనా లాభం పొందగలిగితే అది నా మహా అదృష్ట విషయమనే అనాలి. అంతే కాదు అట్టి వారికి నేను కృతజ్ఞుడను కూడ.

~~~~oOo~~~~
~~~~

# సీతాదేవి ఆదర్శ జీవనం

## ఉపక్రమణిక

విశ్వంలోని పతివ్రతలలో పతిపరాయణురాలైన సీత స్థానము మహోన్నతమైనది. రామాయణంలో వర్ణించబడిన స్త్రీ చరిత్రలన్నింటిలోనూ సీతా చరిత్ర సర్వోత్తమమై సర్వథా ఆదర్శమై అనుకరించదగినదై ఉంది. పథప్రదర్శకమైనదని అనడంలో గూడ అతిశయోక్తిలేదు. సీత వంటి అసాధారణ పాతివ్రత్యం, త్యాగం, శీలం, నిర్భయత్వం, శాంతి, క్షమ, సౌహార్ద, సహన శీలత్వ, ధర్మ పరాయణత్వ, నమ్రత్వ, సంయమ, సేవ, సదాచార, వ్యవహారపటుత్వ, సాహస, శౌర్యాది గుణాలన్నీ ఏకస్థానంలో విశ్వమహేతి హాసంలో, ఏ స్త్రీయందూ మనకు లభించకపోవచ్చునేమో? శ్రీ సీతాదేవి వంటి పవిత్రజీవనము, అనుపమ పతిభక్తికి ఉదాహరణము ప్రపంచంలో లభించుటకష్టము. ఆది నుండీ అంతంవరకూ సీతకు సంబంధించిన ఘట్టాలన్నీ పవిత్రమై, ఆదర్శవంతమైనవే. ఆమె జీవితంలో ఒక్కఘట్టం కూడ మన తల్లులకూ పుత్రికలకూ, పుత్రవధువులకూ, సోదరీమణులకూ ఉత్తమోపదేశాలను ప్రసాదించనిది లేదు. విశ్వంలో ఇంతవరకూ ప్రభవించిన స్త్రీలందరిలోనూ సర్వశిరోమణియైన పతివ్రత సీతాదేవియే అని అనడంలో అత్యుక్తి ఎంత మాత్రం లేదు.

మాయామృగాన్ని పట్టుకోవాలని శ్రీరాముడు వెళ్ళిపోయిన తరువాత రాముని స్వరం వంటి స్వరంతో హా సీతా! హా లక్ష్మణా! అంటూ మారీచుడు శోకయుక్తంగా పలికిన పలుకుల నాలకించి భీతిల్లిన సీత లక్ష్మణ పరంగా పలికిన కఠోరవచనాలలో అత్యధికమైన పతి ప్రేమయొక్క ఆదర్శం నిండి ఉంది. కానీ లక్ష్మణునకు సీతయెడల గల పవిత్ర మాతృభావాన్ని చూస్తే సీత వ్యవహారం అనుచితంగావే గోచరమవుతుంది. అందువల్లనే సీతయే స్వయముగా మున్ముందు దీనికి పశ్చాత్తాపపడినది. భర్త ఆపదలో ఉన్నప్పుడు ప్రాణమున్నంతవరకు ప్రయత్నం చేయడం మన తల్లుల, సోదరీమణుల కర్తవ్యమన్న విషయాన్ని గ్రహించాలి కాని తమ

కుటుంబంలోని ఎవరినీ గూడ నిందించడం కానీ, శంకించడంకానీ, కఠినంగా మాట్లాడడంకాని వేధించడం కానీ చేయరాదన్న విషయం గ్రహించాలి.

ముందు వెనుకల వర్ణనలను గమనించగా పుట్టింట కూడ సీతాదేవి సర్వులనూ అత్యంత ప్రేమ పూర్వకంగా చూసి ఆదరించేదన్న విషయం వ్యక్తమయ్యేది. చిన్న, పెద్ద అన్న భేదం లేకుండ సర్వులనూ మనసార ఆదరించేది. వాల్మీకి రామాయణంలో సీతాదేవి బాల్యచరిత్ర వర్ణింప బడలేదు. వనగమన సమయంలో ఆమె పలికిన పలుకులనుబట్టి ఆమెకు పుట్టినింట అత్యంతుపయుక్తమైన విద్య లభించినదనీ, అక్కడే తాను సదాచార సంయమనాలను అభ్యసించినట్లూ, సుఖదుఃఖాలను సమంగా గ్రహించి, సర్వవేళల్లోనూ ప్రసన్నంగా ఉండగలిగిన శక్తిని సంపాదించినట్లూ వ్యక్తమవుతుంది. లీలా దృష్ట్యా మాత్రమే ఈ విషయం చెప్పబడింది యథార్థానికి ఆమె జగదంబయే కదా!.

## సేవార్థం ప్రేమాగ్రహం

వన ప్రస్థాన సమయంలో రామచంద్రుడు సీతాదేవిని కలియాలని, భవనంలోకి వెళ్ళి ఆకస్మాత్తుగా తన వనగమన విషయం వివరించాడు. తత్సమయంలో సీతాదేవి స్వకర్తవ్యాన్ని నిశ్చయించుకుని పలికింది.

న పితా నాత్మజో వాత్మా న మాతా న సఖీజనః ।
ఇహ ప్రేత్య చ నారీణాం పతిరేకో గతిః సదా ॥
యది త్వం ప్రస్థితో దుర్గం వనమద్యైవ రాఘవ ।
అగ్రతస్తే గమిష్యామి మృద్నన్తీ కుశకంటకాన్ ॥
x x x x
ప్రాసాదాగ్రే విమానైర్వా వైహాయసగతేన వా ।
సర్వావస్థాగతా భర్తుః పాదచ్ఛాయా విశిష్యతే ॥
x x x x
సుఖం వనే నివత్స్యామి యథైవ భవనే పితుః ।
అచిన్తయన్తీ త్రీన్ లోకాంశ్చిన్తయన్తీ పతివ్రతమ్ ॥

శుశ్రూషమాణా తే నిత్యం నియతా బ్రహ్మచారిణీ ।
సహ రంస్యే త్వయా వీర వనేషు మధుగన్ధిషు ॥
x x x x
అనన్యభావామనురక్తచేతసం
త్వయా వియుక్తాం మరణాయ నిశ్చితామ్ ।
నయస్వ మాం సాధు కురుష్వ యాచనాం
నాతో మయా తే గురుతా భవిష్యతి ॥
(వా. రా. 2/27/6–7, 9, 12–13, 23)

ఇహంలోనూ, పరంలోనూ కూడ స్త్రీకి ఆశ్రయమిచ్చునట్టివాడు భర్తయే. తండ్రి, పుత్రుడు, తల్లి, సఖులు, చివరకు స్వశరీరం కూడ ఆమెకు యథార్థమైన సహకారాన్ని అందించజాలదు. నేడే మీరు దుర్గమారణ్యాలవైపు ప్రస్థానించుచో మీ దారిలోపడి అడ్డంగా బాధ కలిగించే కుశకంటకాదులను ఏరివేసి మీకు మున్ముందు పురోగమిస్తుంటాను. మహోన్నత భవనవాసంకానీ, విమానాలెక్కి తిరగడంకానీ అణిమాది సిద్ధులద్వారా అంబరవీధిలో సంచరించడం వంటి వాటన్నిటికంటే భార్యకు–భర్తతో కలిసి అతని చరణ సేవచేసుకుంటూ పతిఛాయలో ఉండడంలోనే మహత్త్వం ఉంది. కనుక నా తండ్రి ఇంట ఉన్నట్లే నేను మీతో వనంలో ఉంటాను. వీరశిరోమణీ! అక్కడ నాకు జగత్రయంలోని ఏ విషయమైన విచారమూ వుండదు. సదా పాతివ్రత్య ధర్మాన్ని స్మరించుకుంటూ మీ సేవలోనే దత్తచిత్తనై ఉంటాను. నియమబద్ధంగా ఉంటూ బ్రహ్మచర్యాన్ని పాలిస్తాను. మధురాతిమధుర సుగంధభరిత వనాలలో మీతో చరిస్తాను. నా హృదయ గత ప్రేమ సర్వస్వం మీకే అర్పితమయింది. మీయందు వినా నా మనస్సు మరిదేనియందూ లగ్నం కాదు. మీతో నాకు వియోగమే సంభవిస్తే నిశ్చయంగా నాకు మరణమే ఏర్పడుతుంది. కనుక మీరు నాప్రార్థనను మన్నించండి. మీ వెంట తీసుకువెళ్ళండి. నేను మీ వెంట రావడంవల్ల మీకెట్టి భారాన్నీ కలిగించను.

తత్సమయంలో ఇట్టి ప్రేమ, ధర్మపూర్ణమైన వచనాలు సీతాదేవి మరెన్నో పలికింది. రామచంద్రుని ముఖతః వనవాస సంబంధక్లేశాన్ని

గురించి విని కూడ ఆమె తన నిశ్చయంనుండి ఈషణ్మాత్రం విచలితం కాలేదు. పతిసేవాసమక్షంలో సంసార సంబంధమైన సుఖ వైభవాలను ఆమె ఎంత తుచ్ఛంగా భావించినదీ, భర్తయందు ఆమెకు ఎంత ప్రగాఢ ప్రేమ ఉన్నదీ, ఆమె మనసా, వాచా, కర్మణా భర్తసేవ ఎలా చేయాలనుకున్నదో? తెలుసుకోవాలంటే అక్కడి ప్రసంగం చదివితేనే తెలుస్తుంది. తనను రామచంద్రుడు అడవులకు తీసుకువెళ్ళడానికి అనుమతించడం కోసం పట్టుదలతో ఆమె విశేష ప్రయత్నం చేసింది. సామ, దాన, నీతి – ఆదిగాగల సర్వోపాయాలనూ అవలంబించింది.

చివరకు సీతాదేవికి ప్రేమకు విజయం లభించింది. రామచంద్రుడు ప్రేమ పూర్వకంగా సీతను తనతో వనాలకు తీసుకువెళ్ళడానికి అంగీకరించాడు. ఈ గాథనుబట్టి స్త్రీ స్వసుఖంకోసం కాకుండ భర్తృ సేవార్థం అతని ఆదేశాన్ని మార్చడానికి అధికారం ఆమెకుంది. సీతాదేవియొక్క ఈ ప్రేమాగ్రహాన్ని అందరూ ప్రశంసించారు. ఎవ్వరూ నిందించలేదు. ఏమంటే ఆమె కేవలం పతిప్రేమ, సేవలకోసమే సుఖాలన్నింటినీ త్యజించి వనాలకు వెళ్ళింది కానీ ఇంద్రియ సుఖరూపస్వార్థం కోసం మాత్రం కాదు. అందులకే ఆమె ఈ వ్యవహారం పాతివ్రత్య ధర్మదృష్ట్యా ఆదర్శంగా స్వీకరించబడింది. దీనినిబట్టి పురుషులు గ్రహించవలసిన విషయమేమంటే సహధర్మచారిణిని ఇచ్ఛారహితంగా విడనాడి ఎక్కడకూ పోరాదు. భర్త తన భార్య సుఖంకోసం ఆమెను తనతో ఉంచుకోకపోతే కూడ భర్తయొక్క కష్టసమయంలో అతనికి సుఖాన్ని చేకూర్చడం కోసం అతనికి సేవచేసే లక్ష్యంతో సదా అతనితోనే ఉండాలి. సర్వదా సర్వులకోసం ఏక మాత్రవ్యవస్థ సంభవం కాదు కనుక సమయ, పరిస్థితులను చూసియే కార్యాలను ఆచరించాలి.

## సహిష్ణుత్వం

జానకీదేవి వనాలలో ఉండి మహామహా కష్టాలను సహర్షంగా సహించింది. అది సరే. ఆమె సహిష్ణుత్వానికి మరొక ఉదాహరణ లభిస్తున్నది. వనగమన సమయంలో కైకేయి సీతను వనవాసయోగ్యమైన

వస్త్రాలను ధరించుటకై ఈయగా తత్సమయంలో రాణివాస స్త్రీలు, దశరథ మహారాజు కూడ ఎంతగానో దుఃఖించారు వశిష్ఠుని వంటి మహాతపోధనుని చిత్తం కూడ వికలమైపోయింది. ఆయన తీవ్రకఠోర శబ్దాలలో కైకను మందలిస్తూ వల్కల వస్త్రాలను సీత ధరించరాదని అంటాడు. కానీ అట్టి సన్నివేశంలో కూడ సీత మనస్సులో ఎట్టి వికారమూ ఉత్పన్నం కాలేదు. కైక విషయమై వశిష్ఠులవారి మందలింపులను ఆమె మౌనంగా వినింది. అంతే గాక ఆమె ఆదేశానుసారం సీత ఆ వల్కల వస్త్రాలను ధరించినది కూడ. వశిష్ఠులు ఆజ్ఞాపించినా ఆమె తన నిశ్చయాన్ని మార్చుకోలేదు. తత్ప్రసంగంలో ఆదికవి అంటాడు–

తస్మింస్తథా జల్పతి విప్రముఖ్యే
గురౌ నృపస్యాప్రతిమప్రభావే ।
నైవ స్మ సీతా వినివృత్తభావా
ప్రియస్య భర్తుః ప్రతికారకామా ॥

(వా. రా. 2/37/37)

అంటే రాజసభలో రాజగురువు, ఋషిశిరోమణీ అయిన వశిష్ఠులవారు అలాపలికిన తరువాతకూడ ప్రియ పతిని అనుకరించదలచిన అనుపమ ప్రభావశాలి అయిన సీతాదేవి తన నిశ్చయాన్ని మార్చుకో లేదు.

ఈ ప్రసంగాన్నిబట్టి గ్రహించవలసినదేమంటే అత్తకానీ, తత్సమానులైన వృద్ధ స్త్రీలు కానీ, తన విషయంలో కఠినంగా భాషించినా, ప్రతికూలంగా వ్యవహరించినా దానిని సంతోషంగా సహించాలి. విపత్సమయంలో భర్తతో పోవలసివచ్చినప్పుడు అతనితో సమంగా నిరాడంబరంగా వస్త్రాలను ధరించాలే కానీ శృంగారాదుల మోహంలో పడరాదు.

## వనాలలో సీత పతిసేవ

పతి సేవయందే సదా ప్రసన్నంగా ఉండునట్టి సీతాదేవి భౌతిక సుఖ సర్వస్వాన్నీ విస్మరించింది. ఆమెకు రాజభవనాలు కానీ ఉద్యానవనాదులు

కాని ధన సంపదలు కాని, దాసదాసీలు కాని ఏవీ స్మృతిలోలేవు. ఆమె నిరంతరం రామభగవత్సేవలోనే తత్పరమై ఉంటూ అతని ఆదేశానుసారం, అర్ఘ్యపాద్యాదులతో వనవాసీ ఋషులను యథాయోగ్యంగా సత్కరిస్తూండేది నిర్జనారణ్యాలలో కూడ ఆమె స్వగృహంలో ఉన్నట్లే నిర్భయంగా ఉండేది. ఆమె మనస్సు సర్వదా రామచంద్రునియందే సంలగ్నమై ఉండేది. వనములందుగూడ శ్రీరామునితోసహా బహు ప్రసన్నంగా ఉండేది. చిత్రకూటంనుండి పంచవటికి వెళ్ళే వేళలో ఆమె భర్తతో అత్రి ఆశ్రమంలో ఆగవలసివచ్చినప్పుడు అనసూయాదేవి సీతాదేవికి పాతివ్రత్య ధర్మాలను గురించి అత్యంత సుందరంగా ఉపదేశించింది. దానిని ఆలకించి తదుపదేశాన్ని సమర్థిస్తూ ఆమె అంటుంది–

యద్యప్యేష భవేద్భర్తా అనార్యో వృత్తివర్జితః ।
అద్వైధమత్ర వర్తవ్యం తథాప్యేష మయా భవేత్ ॥
కిం పునర్యో గుణశ్లాఘ్యః సానుక్రోశో జితేన్ద్రియః ।
స్థిరానురాగో ధర్మాత్మా మాతృవత్పితృవత్ప్రియః ॥
(వా. రా. 2/118/3–4)

"నా పతిదేవుడు అనార్యుడు, జీవికారహితుడు అయినా సరే ఆ దశలో కూడ నేను ఎట్టి సంశయం లేకుండ అతని సేవలో సంలగ్నమయేదానను. కాని వారు తమ స్వగుణాల కారణంగా సర్వుల ప్రశంసలకూ పాత్రులు కావటం, పైగా దయాళువు, జితేంద్రియులూ, ధర్మాత్ములూ, స్థిరమైన ప్రేమ కలవారూ, మాతా పితరులవలె హితైషి అయి ఉండగా వీరిని సేవించడంలో చెప్పేదేముంది?

అంతేకాకుండ అదే ప్రసంగంలో సీత శ్రీరాముని బల, గుణాలను వర్ణిస్తూ కూడ యిదే అంటుంది – "భర్తతో నేను వనాలకు వెళ్ళేటప్పుడు అత్తగారైన కౌసల్యాదేవి కర్తవ్యపాలన విషయంలో నాకు చేసిన ఉపదేశం నా హృదయంలో యథాతథంగా అంకితమై ఉంది. అంతకు ముందు నా వివాహకాలంలో అగ్ని సమీపంలో నా జనని నాకు బోధించిన నీతి కూడ నాకు చక్కగా జ్ఞప్తిలో ఉంది. భర్తయే స్త్రీకి గురువూ, సర్వస్వమూ అని నాకు తెలుసు. ఆమెకు భర్తృ సేవకంటే అన్యమైన తపస్సు ఏదీ లేదు."

ఇత్యాది. దీనిని బట్టి పతిసేవ విషయంలో సీతకు గల భావం ఎంత మహోన్నతమైనది తెలుస్తుంది? తల్లిదండ్రులు అత్తమామల ఉపదేశాలను ఆమె ఎంతగా ఆదరించేదీ స్పష్టమవుతుంది.

## నిర్భయత్వం

సీతాదేవియొక్క నిర్భయత్వం, తేజస్సులు ఎలాంటివో ఉదాహరణగా ఈ విషయాలను తిలకించండి. అసామాన్య పరాక్రమశాలిరైన రావణుని పరాక్రమాన్ని ఆలకించి దేవతలు సయితం భయపడిపోతూండగా వానితో సీత నిర్భయంగా పలికిన పలుకులను తిలకించండి. ఆమె రావణుని స్థానంలో బంధించబడి కూడ అత్యంత క్రోధంతో అతణ్ణి తిరస్కరిస్తూ పలుకుతుంది –

త్వం పునర్జమ్బుకః సింహీ మామిహేచ్ఛసి దుర్లభామ్ ।
నాహం శక్యా త్వయా స్ప్రష్టుమాదిత్యస్య ప్రభా యథా ॥
× × × ×
సూర్యాచన్ద్రమసౌ చోభౌ పాణిభ్యాం హర్తుమిచ్ఛసి ।
యో రామస్య ప్రియాం భార్యాం ప్రధర్షయితుమిచ్ఛసి ॥
అగ్నిం ప్రజ్వలితం దృష్ట్వా వస్త్రేణాహర్తుమిచ్ఛసి ॥
అయోముఖానాం శూలానామగ్రే చరితుమిచ్ఛసి ।
రామస్య సదృశీం భార్యాం యోऽధిగన్తుం త్వమిచ్ఛసి ॥
(వా.రా. 3/47/37. 42.44)

"నీవు నక్కవు, నేను ఆడ సింహాన్ని, సర్వథా నేను నీకు దుర్లభనే. అయినా నువ్వు నన్ను పొందాలనుకుంటూన్నావా? సూర్యప్రభను ఎవడూ స్పృశించజాలనట్లే నువ్వు నన్ను స్పృశింపజాలవు. శ్రీరాముని ప్రియపత్నిని నీవు అపహరించి దుస్సాహసం చేశావు. సూర్యచంద్రులను స్వహస్తాలతో పట్టుకోవాలనుకుంటున్నావు. శ్రీరాముని ప్రియపత్నిని నువ్వు బలాత్కరించదలిస్తే ప్రజ్వలితాగ్నిని చూస్తూ కూడ దానిని బట్టలో మూటగట్టుకుని వెంట తీసుకుపోవాలనుకుంటున్నావా?" నిశితమైన శూలముమొనపై నడవాలనుకుంటున్నావా?

అంతేకాక ఆమె ఇంకా యిలా అంటున్నది. సింహానికి నక్కకూ ఉన్నంత భేదం, సముద్రానికి, కాలువకూ ఉన్నంత భేదం, అమృతానికి కలికి (గంజి విశేషం) ఉన్నంత భేదం, పుత్తడికి ఇత్తడికి ఉన్నంత భేదం, చందనానికి బురదకి ఉన్నంత భేదం, గజానికీ మార్జాలానికీ ఉన్న భేదం, గరుడునికీ వాయసానికీ ఉన్నంత భేదం శ్రీరామచంద్రునికి నీకు మధ్య ఉంది.

దీనినిబట్టి తన పాతివ్రత్యధర్మ, పరమాత్మ బలాలపై విశ్వాసమున్న సాధ్వి ఎట్టి దశలోనూ ఎవరికీ భయపడనవసరం లేదు. నిర్భయంగా అన్యాయాన్ని ప్రతిఘటించవలెను. భగవంతునిపై యథార్థమైన భారం ఉంచగలిగితే పరమాత్మ అవశ్యం సహకరిస్తాడు.

## ధర్మ పాలనలో దృఢత్వం

ఏవిధమైన ప్రలోభానికీ, భయానికీ, విపత్తుకూ లొంగి మానవమాత్రుడు ధర్మాన్ని త్యజించరాదు. ఈ విషయానికి కూడ సీతాదేవి జీవనంనుండి మనకు ఉపదేశం లభిస్తున్నది. లంకలోని అశోకవనంలో సీతయొక్క ధర్మాన్ని నాశనం చెయ్యాలని దుష్టరావణుడు చేసిన ప్రయత్నం ఏమంత తక్కువైనదా? అయినా సీతాదేవి స్వధర్మంపై దృఢంగా నిలిచి నీతియుక్త వాక్యాలతో దుష్టరావణుని తిరస్కరిస్తూనే వచ్చింది. రావణుడు అనేక సార్లు శ్రీరాముని గురించి కఠోరంగా భాషించినా సీతకు అనేక ప్రలోభాలు చూపెట్టినా, శ్రీరాముని మాయా శిరస్సును చూపెట్టినా అన్నిటికీ ఆమె విశేషంగా దుఃఖించి, అంతమైపోవడానికైనా సిద్ధమయిందికానీ ధర్మంనుండి పతనమవ్వాలన్న భావాన్ని మనస్సులోకి రానీయలేదు. అహోరాత్రులు సీతకు భయ ప్రలోభాలు చూపెట్టి అనేక విధాల వేధించారు. కానీ ఆమె యథాతథంగానే ఉండిపోయింది. ధర్మత్యాగ విషయమటుంచగా విపత్తులనుండి బయటపడడానికి ఆమె కపటోపాయాన్ని కూడ తన బాహ్యాప్రవర్తనలో పయితం ఎట్టి దోషాన్నీ రానీయలేదు. నిర్మలమై, ధర్మపరిపూర్ణమైన ఆమె మనస్సులో దుష్టమైన ఎట్టి స్ఫురణనూ కలుగనీయలేదు. సుందరకాండలో ఈ విషయం

పరనీయమైనదేకాక మననీయమైగూడ ఉంది. అశోక వాటికలో ఉండి, సీత ఎట్టి జీవనం గడిపినదీ అన్నదానికి హృదయాన్ని స్పృశించునట్టి వర్ణన లభిస్తున్నది ఆమె విలపిస్తూ అంటూన్నది –

నహి మే జీవితేనార్థో నైవార్థైర్న చ భూషణైః ।
వసన్త్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథమ్ ॥
× × × ×
ధిఙ్మామనార్యామసతీం యాహం తేన వినా కృతా ।
ముహూర్తమపి జీవామి జీవితం పాపజీవికా ॥
చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్ ।
రావణం కిం పునరహం కామయేయం విగర్హితమ్ ॥
(వా. రా. 5/26/5,7–8)

"మహారథియగు శ్రీరామరహితనైన నాకు రాక్షసాంగనల మధ్య ఉన్నదానికి ఈ జీవన, ధన, భూషణాలవల్ల ఈషణ్మాత్ర ప్రయోజనం లేదు. నా ప్రాణనాథునికి దూరమై ఒక్క క్షణమైననూ ఈ పాపజీవనము గడుపుచున్న మహా అనార్యను, అపతిని – ధిక్కారము. ఈ రాక్షసరావణుని నేను నా రామపాదంతో కూడ స్పృశించజాలను – అట్టి దశలో అతణ్ణి కోరే విషయముంటుందా?

దీనినిబట్టి స్త్రీలు పతివియోగంలో భీషణ విపత్తులు ఎదురైన వేళ భర్తృచరణాలనే ధ్యానించాలి. మనస్సులో భగవంతుని మీద, ధర్మబలం మీద పూర్ణ విశ్వాసవీరత్వ, ధీరత్వ సాహసాలుంచాలి. స్వధర్మపాలన విషయంలో అవసరమైతే ప్రాణాలను సయితం త్యజించసిద్ధముగా నుండాలి.

## జాగరూకత

సీతాదేవియొక్క జాగరూకత కూడ అనుకరణీయమైనదే. హనుమంతుడు అశోకవనంలో ప్రవేశించినప్పుడు జానకీదేవి తన బుద్ధి కౌశలంతో సర్వవిధాలా అతణ్ణి పరీక్షిస్తుంది. హనుమంతుడు యథార్థంగా

రామదూతయే అన్న విశ్వాసం ఆమెకు కలిగేటంతవరకూ, తనను వెతకడానికి వచ్చినాడన్న భావం దృఢమయేటంతవరకూ, ఆమె అతనితో మనసారా మాట్లాడలేదు. హనుమంతునితో సీత విశేషంగా భాషించిన తరువాత కవి అంటాడు.

ఏవం విశ్వాసితా సీతా హేతుభిః శోకకర్శితా ।
ఉపపన్నైరభిజ్ఞానైర్దూతం తమధిగచ్ఛతి ॥
(వా. రా. 5/35/85)

అంటే ఈ విధమైన విశ్వసనీయ కారణాల ద్వారా శ్రీరామ, లక్ష్మణుల శారీరక చిహ్నాలను వర్ణించి హనుమంతుడు శోక దుర్బల అయిన సీతకు తనగురించిన పరిచయం చేసి విశ్వాసాన్ని చూపిన తరువాతనే ఆమె హనుమంతుని రామదూతగా గుర్తిస్తుంది.

ఆపై హనుమంతుడు రామనామాంకితమైన ముద్రికను ప్రదానం చేసి విశ్వాసాన్ని మరింత దృఢం చేసిన తరువాత తనతో భాషించడానికే హనుమంతునికి సీత అనుమతినిస్తుంది.

అర్హసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్ ।
యద్యపి ప్రేషితస్తేన రామేణ విదితాత్మనా ॥
(వా రా. 5/36/10)

"హనుమా! ఆత్మజ్ఞాని అయిన రాముడు నిన్ను పంపి ఉంటే నీవు నాతో భాషించవచ్చును."

## ప్రేమ

సీతకు శ్రీరామునియందు అలౌకికమైన ప్రేమ ఉంది. హనుమంతుని ద్వారా శ్రీరామచంద్రుని సందేశాన్ని పొందిన ఆమె ఆనందానికి హద్దులు లేకపోయాయి. సంభాషణారంభంలోనే ఆమె తన స్వామియొక్క మరియు మరిది అయిన లక్ష్మణునియొక్క

కుశలసమాచారమే అడుగుతుంది. స్వయంగా కూడ పదేపదే వారి గుణాలనే వర్ణిస్తుంది. భాషిస్తూ ప్రేమ విహ్వాలయై విలపించ సాగుతుంది.

ఆదిలో హనుమంతుడు ప్రత్యక్షం కాని స్థితిలో అతని ముఖతః శ్రీరామచంద్రుల చరిత్ర నాలకించిన ఆమె వివిధ కల్పనలు చేస్తూ స్వయంగా తన స్థితిని ఈ రీతిగా వర్ణించుకుంటుంది.

రామేతి రామేతి సదైవ బుద్ధ్యా విచిన్త్య వాచా బ్రువతీ తమేవ ।
తస్యానురూపం చ కథాం తదర్థామేవం ప్రపశ్యామి తథా శృణోమి ॥
అహం హి తస్యాద్య మనోభవేన సంపీడితా తద్గతసర్వభావా ।
విచిన్తయన్తీ సతతం తమేవ తథైవ పశ్యామి తథా శృణోమి ॥
(వా. రా. 5/32/11–12)

"నేను బుద్ధ్యా నిరంతరం శ్రీరాముణ్ణే చింతిస్తున్నాను. వాచా అతణ్ణే వర్ణిస్తూన్నాను, తదనుసారమే అతని విషయమైన పలుకులే నాకు వినిపిస్తున్నాయి. అట్టి ఘటనలనే నేను తిలకిస్తూన్నాను. నా భావాలన్నీ అతనియందే సమర్పితమై ఉన్నాయి. అతని అభిలాషతోనే నేను సంతప్తనై నిరంతరం అతనిని గురించియే చింతన చేస్తున్నాను. కనుక అట్టివే చూస్తూ వింటూన్నాను."

శ్రీరామ భగవానునియందు సీతకు ఎంత ప్రేమ ఉన్నదీ తన ప్రియతముణ్ణి కలుసుకోవాలని ఆమె ఎంతగా వ్యాకులపడుతున్నదీ – అన్నవిషయాలు – రావణుడు ఆమెను అపహరించినది మొదలు లంకా విజయ పర్యంతం ఆమె వివిధ వచనాలద్వారా మనకు గోచరమవుతుంది. ఆ ప్రసంగాన్ని పఠించే వేళ పాషాణహృదయాలు కూడ ద్రవించునపుడు భావుకహృదయుల విషయం వేరే వర్ణించాలా? శ్రీరామ భగవానుడు సీతా ప్రేమను అనేక పర్యాయాలు ప్రశంసించాడు. అతడు స్వయంగా అతిసామాన్య మానవునివలె విలపిస్తూ సీత ప్రేమను ప్రమాణీకరించాడు. సీతా వియోగంలో అతడు వ్యాకులుడవుతూ విలపిస్తూ విలపిస్తూ ఋషికుమారులను, సూర్య, పవన, పశు, పక్ష్యాదులనూ, వృక్ష లతలనూ కూడ సీత జాడను గురించి ప్రశ్నిస్తాడు.

అంత మాత్రంచే రామ భగవానుడు అత్యంత కామి అనుకోరాదు. విషయమేమంటే రామునియందు సీతకుగల గాఢ ప్రేమను వ్యక్తం చేయడమే, ఆమెకు రామునియందు అంతగాఢమైన ప్రేమ ఉన్నది కనుకనే సర్వదా నిస్పృహుడైన శ్రీరామచంద్రుడు కూడ అలా వ్యవహరించవలసి వచ్చినది.

"యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్ ।"

కనుక మహావిరహిగా, అతికాముకుడైన సామాన్యునిలా రామచంద్రుడు లీలలు చూపి ఉపర్యుక్త సిద్ధాంతాన్ని చరితార్థం చేశాడు. దీనినిబట్టి మనం గ్రహించవలసినదేమంటే – భగవంతుని పొందడానికి మనము అతని విరహంలో ఎంతగా మధనపడతామో మనలను కలియడానికి పరమాత్మకూడ అంతగానే వ్యాకులుడవుతాడు. కనుక మనమందరం అతనియందు అట్టి ప్రేమనే వర్ధిల్లజేసుకోవాలి.

## పరపురుషునికి దూరముగానుండుట

హనుమంతునితో భాషిస్తూ సీతాదేవి శ్రీరామ భగవానుని గుణప్రభావాలూ, పరాక్రమాదులను స్మరించుకుంటూ భర్తృవియోగ దుఃఖంలో వ్యాకులమైన వేళ ఆమె ముఖంపై అశ్రుధార ప్రవహించింది, అప్పుడు హనుమంతుడు ఆమెను ఓదారుస్తూ –

శ్రుత్వైవ చ వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః ।
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్ ॥
అథవా మోచయిష్యామి త్వామద్యైవ సరాక్షసాత్ ।
అస్మాద్ దుఃఖాదుపారోహ మమ పృష్ఠమనిన్దితే ॥
x x x x
ద్రక్ష్యస్యద్యైవ వైదేహి రాఘవం సహలక్ష్మణమ్ ।
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధే యథా ॥
(వా. రా. 5/37/20–21,24)

"అమ్మా! నా పలుకుల నాలకిస్తూనే రామచంద్రుడు వానర, భల్లూక విశాలసేనాసమేతంగా ఇక్కడకు వస్తాడు. లేదంటారా! మీరు నా వీపుపై కూర్చుంటే నేడే నేను రాక్షసుల బాధలనుండి ముక్తురాలను చేస్తాను. అలా నీవు చేస్తే దైత్యులను వధించ ప్రయత్నిస్తున్న విష్ణు భగవానునివలె రాక్షసవధోద్యోగంలో సంలగ్నుడైయున్న రామచంద్రుని లక్ష్మణ సహితంగా చూడగలుగుతావు.

"అమ్మా! నాలోరావణ సహితంగా లంకా నగరాన్ని ఎత్తుకుపోయే శక్తి ఉంది ఇక్కడనుండి నేను నిన్ను తీసుకువెళ్ళే వేళలో లంకావాసులందరూ కలిసినా నన్ను వెంబడించలేరు శీఘ్రంగా నేను నిన్ను రఘునాధుని సన్నిధికి చేర్చుతాను.

హనుమంతుని తద్వచనాలను ఆలకించి సీతాదేవి మనసా విశేష ప్రసన్నురాలై పలికింది –

భర్తుర్భక్తింపురస్కృత్య రామాదన్యస్య వానర ।
నాహం స్ప్రష్టుం స్వతో గాత్రమిచ్ఛేయం వానరోత్తమ ॥
యదహం గాత్రసంస్పర్శం రావణస్య గతా బలాత్ ।
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ ॥
యది రామో దశగ్రీవమిహ హత్వా సరాక్షసమ్ ।
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్ ॥

(వా. రా. 5/37/62–64)

ఓ వానర శ్రేష్ఠా! భగవానుడగు శ్రీరాముని వీడి, పతిభక్తిదృష్ట్యా, మరోపురుషుని శరీరాన్ని స్వతంత్రం వహించి స్పర్శింపకోరను –రావణుని శరీరంతో నాకు గలిగిన స్పర్శ రావణుని బలవంతముగా జరిగింది. ఆ తరుణంలో నేను అసమర్థురాలను, నిస్సహాయురాలను, చేతకానిదానినై యుంటిని. నేనేమిచేయగలను? ఇపుడు శ్రీరఘునాథుడు రాక్షసుల సహితంగా రావణుని సంహరించి, నన్ను ఇచ్చటినుండి తీసుకవెళ్ళడమే అతనికి తగిన పరాక్రమం అనిపించుకుంటుంది.

బాగా ఆలోచించండి! హనుమంతునివంటి సేవకుడు సీతయందు యథార్థమైన మాతృభావాన్ని గలిగినవాడు, సీతారాముల సేవయే తన జీవిత పరమలక్ష్యముగా పెట్టుకొన్నవాడు. అయినా పాతివ్రత్యధర్మరక్షణ దృష్ట్యా సీతాదేవి హనుమంతుని స్పర్శించ ఇష్టపడదు. ఘోరమగు ఆపదలో చిక్కుకొనియున్నా తన స్వామితో కలియుటకు అత్యంత ఆతురతను గలిగియున్ననూ, తనస్వామివద్దకు వెళ్ళుటకు ఇంతకుమించి సువర్ణావకాశం మరొకటంటూ లేకున్నను, హనుమంతుని శరీరాన్ని స్పర్శింప ఇచ్ఛగించలేదు. ఆమెకు ధర్మంపై ఎంత దృఢవిశ్వాసమో గమనించండి. అత్యంత ఘోరవిపత్తులో కూడ వీలైనంతమేరకు పరపురుషుని స్పర్శింపరాదని దీనినుండి మనం నేర్చుకోవాలి.

## క్షమ

రావణుని వధ, శ్రీరామునికి విజయం లభించిన తరువాత విజయ వార్తను తీసుకుని హనుమంతుడు సీతాదేవి దగ్గరకు వెళ్ళిన సమయంలో రామసందేశాన్ని ఆమెకు వినిపించి, "మాతా! నిన్ను గద్దించి భయపెట్టి కష్టపెట్టిన దుష్ట రాక్షస స్త్రీలను నేనిప్పుడు అంతం చేయాలనుకుంటున్నాను. నాకు అనుమతిని ప్రసాదించు తల్లీ! అంటాడు. తత్సమయంలో సీత కావాలనుకుంటే హనుమంతునిద్వారా రాక్షసాంగనల నందరినీ అంతం చేయించగలదు. కానీ సీత పరమదయా సాగరుడైన రామచంద్రుని అర్ధాంగి కదా! ఆమె అవ్యాజకరుణామూర్తి, అలా ఎందుకు చేస్తుంది? దీనులపై దయ చూపునట్టి తపస్విని సీత అంటుంది–

విధేయానాం చ దాసీనాం కః కుప్యేద్వానరోత్తమ ।
భాగ్యవైషమ్యదోషేణ పురస్తాద్దుష్కృతేన చ ॥

మయ్యైతత్ప్రాప్యతే సర్వం స్వకృతం హ్యుపభుజ్యతే ।
నైవం వద మహాబాహో దైవీ హ్యేషా పరా గతిః ॥

x x x x

పాపానాం వా శుభానాం వా వధార్హాణామథాపి వా ।
కార్యం కారుణ్యమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి ॥
(వా. రా. 6/113/39-40, 45)

వానరోత్తమా! అన్యుల ఆజ్ఞలను పాలించునట్టి దాసీలపై కోపగించునట్టి మూర్ఖుడెవడుంటాడు? ఏమంటావా? మానవమాత్రుడు స్వకర్మ ఫలాన్నే అనుభవిస్తాడు. భాగ్య వైషమ్య మరియు పూర్వకృత పాపాల కారణంగానే నాకీ దుఃఖమంతా సంభవించింది. ఇదంతా విధి లీలయే. ఇందులో పరుల దోషమెంతమాత్రం లేదు. కనుక నీవు రాక్షసాంగనలను అంతం చేసే ప్రసక్తి తీసుకురాకు. పాపి అయినా, ధర్మాత్ముడైనా, వధించతగిన అపరాధియే అగునుగాక! సాధుపురుషుడు సర్వులయందూ దయ చూపవలసినదే. ఏమంటావా? అపరాధాలు చేయనివాడంటూ ఉండడు.

## అగ్నిపరీక్ష

అశోకవాటికనుండి మరలి వచ్చిన తరువాత హనుమంతుడు రామునితో ప్రభూ! జానకీదేవి మీ దర్శనార్థియై ఆతురపడుచున్నది" అనగా రామచంద్రుని ఆదేశానుసారం విభీషణుడు అంతఃపుర స్త్రీలచే సీతను స్నానం చేయించి వస్త్ర, భూషణాలంకృతను చేసి రాముని దగ్గరకు తీసుకొనివస్తాడు. చిరకాలానంతరం ప్రియతమ పతి అయిన రామచంద్రుని పూర్ణచంద్ర సదృశమైన వదనాన్ని దర్శించిన జానకీ దేవి దుఃఖం సర్వస్వం దూరమవుతుంది. ఆమె వదనం నిర్మల చంద్ర సమంగా మిలమిల ప్రకాశిస్తుంది. కాని అదే సమయంలో ఆమెతో విశేష సంభాషణానంతరం రామచంద్రుడంటాడు –

**యత్కర్తవ్యం మనుష్యేణ ధర్షణాం ప్రతిమార్జతా ।**
**తత్కృతం రావణం హత్వా మయేదం మానకాంక్షిణా ॥**

x x x x

**కః పుమాంస్తు కులే జాతః స్త్రియం పరగృహోషితామ్ ।**
**తేజస్వీ పునరాదద్యాత్ సుహృల్లోభేన చేతసా ॥**

యదర్థం నిర్జితా మే త్వం సోకయమాసాదితో మయా ।
నాస్తి మే త్వయ్యభిష్వఙ్గో యథేష్టం గమ్యతామితి ॥
(వా. రా. 6/115/13,19, 21)

అనగా "మానవమాత్రుని కర్తవ్యమైన దానిని అవమాన మార్జనార్థం నిజమానసంరక్షణార్థం రావణుని అంతం చేశాను. రావణుని చెరనుండి నిన్ను విడిపించిన నా లక్ష్యం నెరవేరింది. ఇప్పుడు నాకు నీయందు ఆసక్తి లేదు. కులీనుడు, తేజస్వి అయిన పురుషుడెవడూ పర గృహంలో ఉన్న స్త్రీని ప్రేమలోభంలో పడి స్వీకరించజాలడు. కనుక మనసున్న చోటుకు నీవు వెళ్ళిపోవచ్చు" అంటాడు.

శ్రీరాముని అట్టి కఠోరవచనాలను ఆలకించిన సతీ సాధ్వియైన సీతాదేవి దశను వర్ణించడం అసాధ్యమే కాదు, అసంభవం కూడ. నాథుని వాగ్బాణాలకు సీతాదేవి హృదయం భీషణంగా గాయపడింది. ఆమె వెక్కివెక్కి ఏడ్వ సాగింది. అప్పుడు హృదయ స్పర్శ శబ్దాలలో ఆమె గద్గద స్వరంతో పలికింది.

"నాథా! సామాన్యునిలా మీరిప్పుడు నా విషయమై ఇట్టి కఠోర, అనుచిత వచనాలను పలుక తగునా? నా శీలాన్ని పణంగా ఉంచి చెబుతున్నాను. మీరు నన్ను విశ్వసించండి. ప్రాణనాథా! హరణవేళలో రావణుడు నన్ను స్పృశించి తీసుకువచ్చిన మాట వాస్తవమే కానీ తత్సమయంలో నేను స్పృహలో లేను. అందుకు నేను దోషిగా నిలబడజాలను. నా హృదయం స్వాధీనంలో ఉంది. దానిపై స్వప్నంలో కూడ పరాధికారం లేదు. అయినా మీరిలా చేయదలచుకొని ఉండే పక్షంలో హనుమంతుని నాదగ్గరకు పంపినప్పుడే స్వాభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉంటే ఇంత వరకూ నేను ప్రాణాలతో నిలచి ఉండ నవసరం లేదు కదా!"

అని సీత ఇంకా విశేషంగా భాషించింది. కానీ శ్రీరాముడు ఆమె వచనాలకు ఏ విధమైన సమాధానమీయలేదు. అప్పుడామె దీనభావంతో ధ్యాననిమగ్నుడైన లక్ష్మణుని సంబోధించి విలపిస్తూ – "లక్ష్మణా! ఈ మిథ్యాపవాదంచే కళంకితనై నేను జీవించగోరడం లేదు. నా దుఃఖ నివృత్తికి

నువ్విక్కడే చితిని తయారు చెయ్యి. నా ప్రియపతి నా గుణాలకు అప్రసన్నులై జనసముదాయసమక్షంలో నన్ను త్యజించారు. ఇక నేనీ జీవితమును అంతం చేసుకోవడానికి అగ్నిలో ప్రవేశిస్తాను. వైదేహి వచనాలను ఆలకించిన లక్ష్మణుడు ఆదిలో ఖిన్నుడయ్యాడు. కానీ తరువాత రామ సంకేతానుసారం అతడు వెంటనే చితిని తయారు చేయగా సీత శ్రీరామునికి ప్రదక్షిణం చేసి ఆపై దేవ, బ్రాహ్మణులకు ప్రణమిల్లి ప్రజ్వలితాగ్ని సమీపానికి వెళ్ళి అంజలి ఘటించి ఇలా పలికింది.

యథా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్ ।
తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః ॥

యథా మాం శుద్ధచారిత్రాం దుష్టాం జానాతి రాఘవః ।
తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః ॥
(వా. రా. 6/116/25-26)

"హే లోకసాక్షీ! అగ్నిదేవా! నా మనస్సు ఎన్నడైనా రామచంద్రునినుండి మరలకుంటే నీవు సర్వవిధాల నన్ను రక్షించు. వాస్తవానికి నేను విశుద్ధచరిత్రనే అయితే భ్రమవశుడై రామచంద్రుడు నన్ను దుష్టశీలగా భావిస్తే నీవు సర్వవిధాల నన్ను రక్షించు."

అంత మాత్రం పలికి ఆమె అగ్నికి ప్రదక్షిణం చేసి నిర్భయంగా ప్రజ్వలిత ప్రచండాగ్నిలో ప్రవేశిస్తుంది. దశదిశల హాహాకారాలు చెలరేగాయి. బ్రహ్మ, శివ, కుబేర, ఇంద్ర, యమ, వరుణాది దేవతా ప్రముఖులందరూ ప్రత్యక్షమయ్యారు. తత్సమయంలో బ్రహ్మదేవుడు సీతారాములకు సంబంధించిన రహస్య విషయాలను ఎన్నింటినో చెప్పాడు.

ఇంతలోనే అగ్నిదేవభగవానుడు అకస్మాత్తుగా సీతాదేవిని వెంబడించుకొని ప్రత్యక్షమైనాడు. జనకాత్మజయగు సీతను రామునకు సమర్పిస్తూ ఇట్లు పలికినాడు.

ఏషా తే రామ వైదేహీ పాపమస్యాం న విద్యతే ॥

నైవ వాచా న మనసా నైవ బుద్ధ్యా న చక్షుషా ।
సువృత్తా వృత్తశౌటీర్యం న త్వామత్యచరచ్ఛుభా॥
రావణేనాపనీతైషా వీర్యోత్సిక్తేన రక్షసా ।
త్వయా విరహితా దీనా వివశా నిర్జనే సతీ ॥
రుద్ధా చాన్తఃపురే గుప్తా త్వచ్చిత్తా త్వత్పరాయణా ।
రక్షితా రాక్షసీభిశ్చ ఘోరాభిర్ఘోరబుద్ధిభిః ॥
ప్రలోభ్యమానా వివిధం తర్జ్యమానా చ మైథిలీ ।
నాచిన్తయత తద్రక్షస్త్వద్గతేనాన్తరాత్మనా ॥
విశుద్ధభావాం నిష్పాపాం ప్రతిగృహ్ణీష్వ మైథిలీమ్।
న కించిదభిధాతవ్యా అహమాజ్ఞాపయామి తే ॥
(వా. రా. 6/118/5-10)

"రామా! ఇదిగో నీ సీత, ఈమెలో ఎట్టి పాపంలేదు. ఈ సతీ సాధ్వి మనసా, బుద్ధ్యా, వాచా, దృష్ట్యా ఎన్నడూ నీకు విపరీతంగా చరించి ఉండలేదు. రావణాసురుడు బలం కారణంగా ఉన్మత్తుడయ్యాడు. వాడు నీవులేని వేళ పాపం ఈమెను బలవంతముగా శూన్యాశ్రమంనుండి అపహరించుకుపోయాడు. తన లంకాపురములో ఈమెను ఉంచాడు. క్రూర భయంకరాకారులైన రాక్షసాంగనల కాపలామధ్య ఈమెను కూర్చోబెట్టాడు. అయినా ఈమె చిత్తంమాత్రం నీయందే సులగ్నమై ఉంది. నిన్నే చింతన చేస్తున్నది. అనేక ప్రలోభాలు కల్పించబడ్డాయి. అనేక విధాలుగా భయపెట్టారు. కానీ నీయందే ఆయత్తమైన ఈమె ఆ రాక్షసుల గురించి పట్టించుకోలేదు. ఈమె భావం విశుద్ధమయింది. సర్వథా ఈమె నిర్దోషురాలు నీవు ఈమెను స్వీకరించు, ఈ విషయమై మరేమీ మాట్లాడవద్దు ఇదే నా ఆజ్ఞ?

అగ్నిదేవుని వచనాలను ఆలకించిన మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామచంద్రమూర్తి అత్యంత ప్రసన్నుడయ్యాడు. అతని నేత్రాలు హర్ష సంభరితాలయ్యాయి. అతడంటాడు -

అవశ్యం చాపి లోకేషు సీతా పావనమర్హతి ।
దీర్ఘకాలోషితా హీయం రావణాన్తఃపురే శుభా ॥

బాలిశో బత కామాత్మా రామో దశరథాత్మజః ।
ఇతి వక్ష్యతి మాం లోకో జానకీమవిశోధ్య హి ॥
అనన్యహృదయాం సీతాం మచ్చిత్తపరిరక్షిణీమ్ ।
అహమప్యవగచ్ఛామి మైథిలీం జనకాత్మజామ్ ॥
ఇమామపి విశాలాక్షీం రక్షితాం స్వేన తేజసా ।
రావణో నాతివర్తేత వేలామివ మహోదధిః ॥
నహి శక్తః సుదుష్టాత్మా మనసాపి హి మైథిలీమ్ ।
ప్రధర్షయితుమప్రాప్యాం దీప్తామగ్నిశిఖామివ ॥
నేయమర్హతి వైక్లవ్యం రావణాన్తఃపురే సతీ ।
అనన్యా హి మయా సీతా భాస్కరస్య ప్రభా యథా ॥
విశుద్ధా త్రిషు లోకేషు మైథిలీ జనకాత్మజా ॥
న విహాతుం మయా శక్యా కీర్తిరాత్మవతా యథా ॥
అవశ్యం చ మయా కార్యం సర్వేషాం వో వచో హితమ్ ।
స్నిగ్ధానాం లోకనాథానామేవం చ వదతాం హితమ్ ॥
(వా.రా. 6/118/13–16,18–21)

"లోకదృష్ట్యా సీతయొక్క పవిత్రత్వాన్ని పరీక్షించడం ఆవశ్యకమే, ఏమంటే ఆమె చాలా కాలం రావణుని లంకాపురంలో ఉంది. నేను జానకిని పరీక్షించకుంటే జనులు దశరథపుత్రుడైన రాముడు మహామూర్ఖుడు, కాముకుడు అంటారు. జానకి చిత్తం నాయందే లగ్నమై ఉన్నదనీ, ఆమె నా చిత్తాన్నే అనుసరిస్తుందని నేనూ ఎరుగుదును. స్వతేజస్సుతో ఆమె సురక్షితురాలై ఉంది. సముద్రం తన హద్దులను దాటకుండా ఉన్నట్లే రావణుడు ఈమె నేమీ చేయలేదు. ప్రజ్వలితాగ్నిశిఖను ఎవ్వరూ స్పృశించజాలనట్లే దుష్టరావణుడు మనసా కూడ ఈమెపై అధికారాన్ని చూపజాలడు. ఈమె వానికి సర్వథా అప్రాప్యమే, లంకానగరంలో ఉన్న ఈమెకు ఎట్టి అవమానమూ జరుగలేదు. ప్రభ సూర్యునికి అభిన్నంగా ఉన్నట్లే ఈమెకూ నాకు భేదం లేదు. జనకుని ప్రియపుత్రి అయిన సీత జగత్త్రయంలో పవిత్రురాలు. ఆత్మాభిమానియైనవాడు కీర్తిలోభాన్ని విడనాడజాలనట్లు నేను ఈమెను త్యజించజాలను. లోకపాలకగణమైన మీరందరూ నన్ను ప్రేమిస్తున్నారు. నాకొరకై హితకరవచనాలే పలుకుతున్నారు. కనుక హితప్రదమైన మీ పలుకులను ఆలకించవలసినదే.

అని పలికి రామచంద్రుడు అత్యంతానంద పూర్వకంగా సీతాదేవిని స్వీకరించాడు దీనినిబట్టి సతీసాధ్వి అయిన స్త్రీ ఎట్టి స్థితిలోనూ భర్తపై కోపగించరాదు. సరికదా అతణ్ణి సంతుష్టుని చేయడానికి న్యాయానుకూలమైన ప్రయత్నం చెయ్యాలి.

## గృహస్థ ధర్మం

లంకానగరంనుండి సీతాదేవి అయోధ్యకు మరలిరాగానే పెద్దలూ, వృద్ధులూ అయిన స్త్రీల, అత్తల చరణాలకు ప్రణమిల్లుతుంది. స్వగృహంలో ఉంటూ దేవతలను ఆరాధిస్తుంది. అత్తలందరినీ సమభావంతో సేవిస్తుంది. ఈ విధంగా ఆమె గృహకృత్యాలన్నింటినీ చక్కగా నిర్వర్తిస్తూ సర్వులనూ ముగ్ధులను చేస్తుంది. ఆమె మరదులైన భరత, లక్ష్మణ, శత్రుఘ్నులను పుత్రసమంగా భావిస్తుంది. దీనినిబట్టి వేరేచోటినుండి వచ్చిన స్త్రీలు స్వగృహంలో వుండే వృద్ధస్త్రీలకు ప్రణమిల్లాలని గ్రహించాలి. సర్వులనూ సమభావంతో సేవించాలి. గృహకార్యాలను చక్కగా నిర్వర్తించాలి. తన మరదులు ఆదిగాగల వారితో శుద్ధ, సమభావాలతో యథాయోగ్యంగా వ్యవహరించాలి.

## సీతా పరిత్యాగం

సీతా పరిత్యాగఘట్టం ఒడల్ని పులకరింపజేస్తుంది. ఉత్తరకాండలో దీనిని ధ్యానపూర్వకంగా అధ్యయనం చెయ్యాలి. సర్వవిధాలా సీత పరమ పవిత్రురాలన్న విషయం శ్రీరామచంద్రుడు పూర్తిగా ఎరుగును. లంకలో అగ్ని పరీక్ష ద్వారా సర్వుల సమక్షంలో పావనిగా వ్యక్తం చేయడం జరిగింది. అంత జరిగినా లోకాపవాదంపై ధ్యానముంచి ప్రజలను సంతుష్టులను చేయ శ్రీరాముడు నిర్దోషురాలైన సీతను త్యజించాడు. భరత, లక్ష్మణ, శత్రుఘ్నాది సోదరులలో ఎవరికీ ఆ విషయం ఎంత మాత్రం నచ్చలేదు. కానీ రామచంద్రునకు అంతకుమించిన మార్గమేదీ కానరాలేదు.

లక్ష్మణునకు ఎంత మాత్రం ఇష్టం లేకపోయినా అన్నగారి ఆదేశానుసారం వదినగారిని అడవిలో విడిచి పెట్టడానికి వెళ్ళక తప్పలేదు. వనానికి చేరిన తరువాత అతడు సర్వవిషయాలూ తెలియజేశాక "తాను నిర్దోషియే అయినా పరిత్యజించబడ్డాను అన్నభావం కలగగానే సీతాదేవి దుఃఖానికి అంతులేక పోయింది. అట్టి సంకటవేళలో కూడ సీత తన భర్తపై ఎట్టి దోషాన్నీ ఆరోపించలేదు సరికదా! లక్ష్మణుని ద్వారా సందేశాన్ని అందజేస్తూ మాత్రం ఇలా పలికింది –

శ్వశ్రుణామవిశేషేణ ప్రాఞ్జలిప్రగ్రహేణ చ ।
శిరసా వన్ద్య చరణౌ కుశలం బ్రూహి పార్థివమ్ ॥
శిరసాభినతో బ్రూయాః సర్వాసామేవ లక్ష్మణ ।
వక్తవ్యశ్చాపి నృపతిర్ధర్మేషు సుసమాహితః ॥
జానాసి చ యథా శుద్ధా సీతా తత్త్వేన రాఘవ ।
భక్త్యా చ పరయా యుక్తా హితా చ తవ నిత్యశః ॥
అహం త్యక్తా చ తే వీర అయశోభీరుణా జనే ।
యచ్చ తే వచనీయం స్యాదపవాదః సముత్థితః ॥
మయా చ పరిహర్తవ్యం త్వం హి మే పరమా గతిః ।
వక్తవ్యశ్చైవ నృపతిర్ధర్మేణ సుసమాహితః ॥
యథా భ్రాతృషు వర్తేథాస్తథా పౌరేషు నిత్యదా ।
పరమో హ్యేష ధర్మస్తే తస్మాత్కీర్తిరనుత్తమా ॥
యత్తు పౌరజనే రాజన్ ధర్మేణ సమవాప్నుయాత్ ।
అహం తు నానుశోచామి స్వశరీరం నరర్షభ ॥
యథాపవాదః పౌరాణాం తథైవ రఘునన్దన ।
పతిర్హి దేవతా నార్యాః పతిర్బన్ధుః పతిర్గురుః ॥

(వా. రా. 7/48/10–17)

"లక్ష్మణా! అత్తలందరికీ సమానరూపేణ చేతులు జోడించి నేను నమస్కరించినానని చెప్పు. ప్రభుచరణాలపై శిరమునుంచి నా కుశలాన్ని తెలియజెయ్యి. అట్లే అందరితోనూ శిరమువంచి నా కుశలాన్ని తెలియజెయ్యి. ఆపై స్వధర్మరతుడైన ప్రభువుతో ఇలా చెప్పు! "రఘునాథా! సీత యథార్థానికి శుద్ధురాలే, మీయెడల సర్వదా భక్తియుక్తయే,

మీ హితమందు తత్పరరై ఉండునట్టిది. ఈ విషయం మీరూ ఎరిగినదే. మహావీరా! అపయశస్సుకు భయపడి మీరు నన్ను పరిత్యజించారు. దీనివల్ల మీకు కలిగే నిందలూ, అపకీర్తి వాటిని కూడ నేను మార్జనం చెయ్యాలి. కారణం? మీరే నాకు పరమాశ్రయులు. లక్ష్మణా! నీవు ప్రభువులతో ఈ విషయం కూడ చెప్పు. మీరు మీ సోదరుల విషయంలో వ్యవహరించినట్లే సర్వదా పురవాసుల విషయంలో కూడ వ్యవహరించాలి. ఈ మిథ్యాపవాద కారణంగా క్రుద్ధులై ప్రజల విషయంలో ఎట్టి దుర్వ్యవహారం చేయకుందురుగాక! పురవాసులపట్ల ధర్మానుకూలంగా చరించడమే మీ పరమధర్మము. తద్వారా తమకు ఉత్తమ యశస్సు లభిస్తుంది. పురుషోత్తమా! నాకు స్వశరీర చింత ఎంతమాత్రం లేదు. పురవాసులు నా విషయమై అపవాదులు పలికియుందురుగాక, దానికి నేను భీతి చెందడం లేదు. స్త్రీకి పతియే దేవత, పతియే బంధువు, పతియే గురువూ కూడా.

ఎట్టి మార్మిక శబ్దాలు? సీతాసతి ధన్యురాలు. ఆమె ధర్మ ప్రేమ ధన్యమైనది. భారతస్త్రీ ధర్మం ధన్యమైనది. భారతీయ మహిళల అపూర్వత్యాగం ధన్యమైనది.

ఈ విధంగా సీత సంభాషణ అయిన తరువాత లక్ష్మణుడు ఆమెకు ప్రణమిల్లి విలపిస్తూనే మరలిపోయాడు. ఇక్కడ దుఃఖ భారపీడితయైన పతివ్రతయగు సీత అరణ్యంలో రోదించసాగింది. ఆమె రోదనాన్ని ఆలకించి వాల్మీకిమహర్షి ఆమెను నిజాశ్రమంలోకి తీసుకువచ్చారు. సీత ఋషిపత్నులతో మున్యాశ్రమంలో నివసించసాగింది.

ఈ ప్రసంగంద్వారా గ్రహించి ఆచరించదగిన విషయాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. సీతపలికిన పలుకులు నిత్యపఠనీయాలు. తద్భావాలను గ్రహించి పతివ్రతలు తమ జీవితాలను సక్రమ మార్గంలో పురోగమింప జేసుకోవాలి.

## పాతాళ ప్రవేశం

ప్రాణాలను సయితం ఒడ్డి స్వధర్మాన్ని ఆచరించునట్టి స్త్రీయొక్క అంతిమ పరిణామం సుఖంగానే ఉంటుంది. అశ్వమేధ యాగ వేళలో రామచంద్రుడు కుశలవుల ద్వారా రామాయణగానాన్ని వింటూ, తద్వర్ణిత ప్రసంగాన్నిబట్టి ఆ బాలురు సీతాపుత్రులే అని తెలియగానే అతని ఆదేశానుసారం సీత అక్కడకు పిలువబడింది. సీతాపతి శ్రీరాముణ్ణి ధ్యానిస్తూ అవనతవదనయై చేతులు జోడించి వాల్మీకిమహర్షి వెంట విలపిస్తూ వచ్చింది. తత్సమయంలో నిండుసభలో వాల్మీకిమహర్షి చేసిన ప్రసంగంతో లోకాపవాదం తొలగిపోయింది. సభ అంతా సీతారాముల జయజయ ధ్వానములతో ప్రతిధ్వనించింది. సీతాదేవి పాపరహితయని వ్యక్తం చేస్తూ మహర్షివాల్మీకి అంటాడు –

బహువర్షసహస్రాణి తపశ్చర్యా మయా కృతా ।
నోపాశ్నీయాం ఫలం తస్యా దుష్టేయం యది మైథిలీ ॥
x x x x
ఇయం శుద్ధసమాచారా అపాపా పతిదేవతా ।
లోకాపవాదభీతస్య ప్రత్యయం తవ దాస్యతి ॥

(వా. రా. 7/96/20,23)

"నేను వేలాది సంవత్సరాలు తపస్సు చేశాను. తచ్ఛక్తితో శపథం చేసి చెబుతున్నాను. సీత దుష్టాచరణ కలదియే అయితే నా దీర్ఘకాల తపః ఫలం నాకు లభించకుండునుగాక! ఈ సీత భర్తనే దేవునిగా భావించునట్టిది. పాపరహిత, పవిత్రురాలు ధర్మాచరణయుక్తురాలు, లోకాప వాదానికి నువ్వు భయపడుతూన్నావు. కనుక ఈమె నీకు విశ్వాసాన్ని కలిగిస్తుంది".

వాల్మీకి శపథాన్ని ఆలకించి, సీత సభలోకిరావడం చూసి రామచంద్రుడు గద్గదకంఠుడై – "మహానుభావా! భవదీయ నిష్కపట వచనాలవల్ల నాకు పరిపూర్ణ విశ్వాసం కలిగింది. గతంలో లంకలో దేవతలందరి సమక్షంలో ఈమె అగ్ని పరీక్ష ఇచ్చి నన్ను విశ్వసింపజేసింది. సర్వవిధాలా జానకి శుద్ధురాలని నేనెరుగుదును. కుశలవులు నాపుత్రులే.

అయినా లోకాపవాదం కారణంగా ప్రజలను సంతుష్టులను చేయ నేను సీతను పరిత్యజించవలసి వచ్చింది. ఇందుకు నన్ను మీరు క్షమించెదరుగాక!

తత్సమయంలో సభలోకి బ్రహ్మాది దేవతలందరూ వచ్చారు. అంత రాముడు మరల అంటాడు, "జానకి పవిత్రురాలని నాకు తెలుసును. కానీ అందరి సమక్షంలో సీత పవిత్రురాలుగా సువ్యక్తమైతేనే నేను ఆనందిస్తాను."

అదే సమయంలో కాషాయ వస్త్రాలను ధరించి సీతాదేవి అవనతవదనయై పృథ్విని తిలకిస్తూ చేతులు జోడించి పలికింది,

యథాహం రాఘవాదన్యం మనసాపి న చిన్తయే ।
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి ॥
మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే ।
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి ॥
యథైతత్సత్యముక్తం మే వేద్మి రామాత్పరం న చ ।
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి ॥
(వా. రా. 7/97/14–16)

"మనసా నేను రాముని వినా మరెవరినీ తలచకుంటే భూదేవి నాకు తనలో స్థానమిచ్చునుగాక! నేను మనసా, వాచా, కర్మణా రామునే పూజించియున్నచో పృథ్వీమాత నాకు దారి చూపును గాక! రాముని మించినదేదీ లేదని నేను పలికే పలుకు సత్యమే అయితే మాధవీదేవి తనలో నాకు స్థానమిచ్చునుగాక"

సీతాదేవి ఆవిధంగా శపథం చేయడంతో పృథ్వి అకస్మాత్తుగా బ్రద్దలవుతుంది. అందుండి ఓ ఉత్తమ దివ్య సింహాసనం బయటకు వస్తుంది. ఆ సింహాసనాన్ని దివ్య వస్త్రాభరణ సుశోభితులగు నాగులు వహిస్తున్నారు. దానిమీద భూమాత ఆసీనురాలై ఉంది. ఆమె జానకీ దేవిని ఆలింగనం చేసుకుని, ఆమెకు స్వాగతం పలికి తన ఒడిలో

కూర్చోబెట్టుకుంది అంతలోనే అందరూ చూస్తుండగా ఆ సింహాసనము పాతాళంలోకి ప్రవేశించింది ఆకాశం నుండి పుష్పవృష్టి కురిసింది. సీతాసతికి జయజయ ధ్వానాలు జరుగ ఆకాశమండలం ప్రతిధ్వనించింది.

## ఉపసంహారము

సీతాసాధ్వి తన జీవితంలో అనేక కఠోర పరీక్షలకు నిలబడి నారీ లోకానికి అనేక విషయాలు ఉపదేశించింది. ఆపదలలో సయితం ధర్మాన్ని పాలించునట్టి స్త్రీ శాశ్వతంగా పరమానంద మగ్నురాలై ఉండగలుగుతుందనీ, ఆమె కీర్తి ప్రపంచంలో శాశ్వతంగా ఉంటుందనీ సువ్యక్తం చేసింది. సీతయొక్క పతిభక్తీ, అత్తలయెడల సేవాభావమూ, అందరినీ గౌరవించునట్టి సద్భావమూ, అందరియెడల ప్రేమగా వ్యవహరించడం మహర్షులను సేవించడం, కుశలవుల వంటి వీరపుత్రులను ప్రసవించడం, వారికి నీతినుపదేశించడంలో దక్షత, ధైర్యసాహస, వీరత్వ తపస్సులూ, ధర్మ పరాయణత్వము, నిర్భయత్వము, క్షమాది గుణ సర్వస్వం ఆమెలో సంపూర్ణంగా వికసించి అనుకరణీయాలై ఉన్నాయి. ప్రపంచంలో ఏ స్త్రీ అయినా సరే ప్రమాద, మోహ, ఆసక్తులను విడనాడి సీతా చరిత్రను అనుకరిస్తే ఆమెకు శుభ పరంపరలు కలగడం విషయమటుంచగా ఆమె పతి, పుత్ర స్వకుటుంబ జనులను కూడ ఉద్ధరించగలుగుతుంది. అట్టి పతివ్రతయైన స్త్రీ దర్శించుటకు, ఆరాధించుటకు యోగ్యురాలవుతుంది. స్వశీలం ద్వారా విశ్వాన్ని కూడ పవిత్రం చేయగలుగుతుంది.

సీతాదేవి సాక్షాత్ భగవతియే, అయినా మానవజీవనంలో ఆమె ఆచరించిన ఘట్టాలు ప్రయత్నిస్తే ప్రతి స్త్రీ అనుకరించగలుగుతుంది. ఆమె చరిత్ర అలౌకికం కాకపోగా వాటిని ఆచరించుటద్వారా స్త్రీలందరూ మహత్తర భాగ్యాన్ని పొందగలుగుతారు.

~~~~oOo~~~~
~~~~

# శ్రీ రామ సేవకుడు – లక్ష్మణుడు

శ్రీ లక్ష్మణుని మహిమ అపారమైనది. శ్రీమద్రామాయణంలో లక్ష్మణుడు కూడ నారాయణుని అంశావతారంగా సువ్యక్తం చేయబడింది. కానీ అన్య గ్రంథాలలో శేషుని అవతారంగా వ్యక్తం చేశారు. ఈతని చరిత్రను తెలిపికోవడంవల్ల – రామసేవార్థమే ఈతడవతరించినట్లు స్పష్టంగా బోధపడుతూన్నది. ఈకారణంవల్లనే రామచంద్రునికి సోదరులందరియందూ ప్రేమ ఉన్నా – ఆలయాలలో రామునితోబాటు లక్ష్మణ విగ్రహం గూడ ప్రతిష్ఠించబడుతూంటుంది. రామునితోపాటు లక్ష్మణ నామము స్మరించబడుతూంటుంది. భరత శత్రుఘ్నులు శ్రీరామునికి వేరై మాతామహుని ఇంట ఉండిపోయారు, కాని లక్ష్మణుడు ఎట్టి స్థితిలోనూ శ్రీరామచంద్రునకు వేరై ఉండలేదు. రాముని ద్వారా త్యజించబడిన తరువాత వెంటనే అతడు పరమధామం చేరుకున్నాడు బ్రహ్మచర్య వ్రతపాలకుడు, ధీరుడు, వీరుడు, తేజస్వి, పరాక్రమశాలి, ఇంద్రియ విజయుడు అయిన లక్ష్మణుడు అత్యంత సుందరుడు, సరళుడు, నిర్భయుడు, నిష్కపటుడు, త్యాగి, పురుషార్థి, తపస్వి, సేవకుడు, సత్యవ్రతుడు, బుద్ధిమంతుడు, నీతి నిపుణుడేకాక తితిక్ష కలవాడు కూడ. రామునియందు లక్ష్మణునకు గల ప్రేమ అపూర్వమైనది. శ్రీరామచంద్రుని చరణారవిందాల చెంత ఉండి అతనిని సేవించడమే తన ముఖ్యధర్మంగా, కర్తవ్యంగా భావించిన అతడు శ్రీరాముని సేవలో సర్వాన్నీ మరచిపోయేవాడు. భరతుని మధుర వినయ, గంభీర ప్రేమ, అనుపమానమైనట్లే లక్ష్మణుని వీరత్వయుక్త సేవా మూలక ప్రేమ కూడ పరమాదర్శవంతమైనదే.

**బాల్యంలో లక్ష్మణుడు సర్వదారామునితోనే ఉండేవాడని వాల్మీకి రామాయణంలో వ్రాయబడింది.**

**బాల్యాత్ ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః ॥**
**రామస్య లోకరామస్య భ్రాతుర్జ్యేష్ఠస్య నిత్యశః ।**

సర్వప్రియకరస్తస్య రామస్యాపి శరీరతః ॥
లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః ।
న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః ॥
(వా. రా. 1/18/28-30)

"శోభను వర్ధిల్లజేయునట్టి లక్ష్మణుడు బాల్యంనుండీ అగ్రజుడూ లోకాభిరాముడూ అయిన రామునియందే సదా స్వాభావికముగా గాఢస్నేహం కలిగి యుండేవాడు. అతడు రామచంద్రుని సేవిస్తూ, అతని ప్రియ కార్యాలన్నిటినీ స్వయంగా నిర్వహించేవాడు. శోభాసంపన్నుడైన లక్ష్మణుడు శ్రీరామచంద్రునికి ద్వితీయ ప్రాణమే – ఏమంటే అతడు లేకుంటే రామచంద్రునికి నిద్రకూడ వచ్చేది కాదు".

బాల్యావస్థలోనే లక్ష్మణుడు అన్నగారితో విశ్వామిత్రుని యాగరక్షణార్థం వెళ్ళాడు. అక్కడతడు సదా శ్రీరాముని సేవలోనే ఉండేవాడు. పత్రశయ్యపై నిదురించే వాడు. అన్నగారితో కలిసి అతని ఆదేశానుసారం రాక్షసులను సంహరిస్తూ విశ్వామిత్రముని యాగాన్ని రక్షించాడు.

విశ్వామిత్ర మహర్షియొక్క యాగాన్ని రక్షించి సోదరులిద్దరూ ఆయనతో జనకునిపురానికి వెళ్ళారు. అక్కడ ధనుర్భంగానంతరం నల్గురి సోదరుల వివాహాలూ జరిగాయి. అందరూ అయోధ్యకు మరలి వచ్చి ఆనందంగా ఉండసాగారు. భరత శత్రుఘ్నులు మాతామహుని ఇంటికి వెళ్ళారు. తరువాత దశరథుని ఇచ్ఛననుసరించి మంత్రివర్గం మరియు ప్రజలయొక్క సమ్మతి ప్రకారం రామరాజ్యాభిషేకానికి ఏర్పాట్లు జరిగాయి. అది చూసిన లక్ష్మణుని ఆనందానికి హద్దులు లేకపోయాయి. రామచంద్రుడు రాజసింహాసనం మీద విరాజిల్లడాన్ని దర్శించాలని లక్ష్మణుడు ఎంతగానో ఆతురతపడ్డాడు. ఈ విషయాలు రాజసింహాసనానికి బదులు రామచంద్రుని వనవాసానికి పరిస్థితులు జరగడంతో ఆ వార్త విన్న లక్ష్మణునికి కలిగిన తీవ్రక్రోధాన్ని తిలకిస్తే తెలుస్తుంది. మనస్సుకు విషయం ఎంత ప్రతికూలమో క్రోధం కూడ అంతగానే ఏర్పడుతుంది.

మంథర కైకేయిని ప్రేరేపించుచూ ఉప్పొంగే లక్ష్మణుని ప్రేమను గురించి విశేషంగా ప్రశంసిస్తూ పలుకుతుంది.

గోప్తా హి రామం సౌమిత్రిర్లక్ష్మణం చాపి రాఘవః ।
అశ్వినోరివ సౌభ్రాత్రం తయోర్లోకేషు విశ్రుతమ్ ॥
(వా. రా. 2/8/31)

"లక్ష్మణుడు సదా రాముని అనుసరిస్తూంటాడు. రాముడు సదా అతణ్ణి రక్షిస్తూంటాడు. ఆ సోదరులిద్దరి ప్రేమ అశ్వినీకుమారులవలె జగత్ ప్రసిద్ధమై ఉంది."

అనంతరం రాముడు వనవాసానికి అంగీకరించి కౌసల్యామాత దగ్గరకు అనుమతికై వచ్చినవేళ లక్ష్మణుడు కూడ అతనివెంట వచ్చాడు. అతడు సర్వదా రాముని వెన్నంటియే ఉంటూన్నాడు. రామచంద్రుడు కౌసల్యామాతకు వృత్తాంతమంతా వివరించి చెప్పాడు. తల్లి దుఃఖానికి అంతులేదు. కౌసల్య రాముణ్ణి వారించాలని ఎంతగా ప్రయత్నించినా రాముడు వినలేదు. రాముని ప్రవర్తన లక్ష్మణునికి నచ్చలేదు. అతడు పూర్తిగా రామానుయాయియే అయినా స్వాధికారాన్ని విడనాడే రాముని చూసి అతడు శాంతిపొందలేకపోయాడు. కౌసల్యా మాత విలపించడం చూసి లక్ష్మణుడంటాడు –

అనురక్తోఽస్మి భావేన భ్రాతరం దేవి తత్త్వతః ।
సత్యేన ధనుషా చైవ దత్తేనేష్టేన తే శపే ॥
దీప్తమగ్నిమరణ్యం వా యది రామః ప్రవేక్ష్యతి ।
ప్రవిష్టం తత్ర మాం దేవి త్వం పూర్వమవధారయ ॥
హరామి వీర్యాద్ దుఃఖం తే తమః సూర్య ఇవోదితః ।
దేవీ పశ్యతు మే వీర్యం రాఘవశ్చైవ పశ్యతు ॥
(వా. రా.2/21/16–18)

"తల్లీ! నేను సత్యము, ధనుస్సు, దానము, యజ్ఞాదులపై శపథం చేసి చెబుతున్నాను, పూజ్య సోదరుడైన శ్రీరామునిపై నాకు దృఢమైన అనురాగం ఉంది. రామచంద్రుడు ప్రజ్వలితాగ్నిలో లేదా ఘనారణ్యంలో

ప్రవేశిస్తే నేను అతనికంటె ముందే అక్కడ ఉంటానని తెలుసుకో అమ్మా! సూర్యుడు ఉదయించి అంధకారాన్ని నశింపజేసేటట్లు నేను నా పరాక్రమాలతో మీ దుఃఖాన్ని దూరం చేస్తాను. మీరు శ్రీరామచంద్రుడు కూడ నా పరాక్రమాన్ని సందర్శించెదరు గాక!

లక్ష్మణుడు వీరరసావేశంలోనూ రామచంద్రునిపై ప్రేమవల్ల వివశుడై ఇతోధికంగా సాహసోపేతమైన వచనాలు పలికాడు. కౌసల్యామాత నచ్చచెప్పిన తరువాత శ్రీరాముడు లక్ష్మణుని శాంతింపజేస్తూ అంటాడు—

తవ లక్ష్మణ జానామి మయి స్నేహమనుత్తమమ్ ।
విక్రమం చైవ సత్త్వం చ తేజశ్చ సుదురాసదమ్ ॥
మమ మాతుర్మహద్ దుఃఖమతులం శుభలక్షణ ।
అభిప్రాయం న విజ్ఞాయ సత్యస్య చ శమస్య చ ॥
ధర్మో హి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్ ।
x x x x
సోఽహం న శక్ష్యామి పునర్నియోగమతివర్తితుమ్ ।
పితుర్హి వచనాద్వీర కైకయ్యాహం ప్రచోదితః ॥
తదేతాం విసృజానార్యాం క్షత్రధర్మాశ్రితాం మతిమ్ ।
ధర్మమాశ్రయ మా తైక్ష్ణ్యం మద్బుద్ధిరనుగమ్యతామ్ ॥
(వా. రా. 2/21/39–41, 43–44)

"లక్ష్మణా! నీకు నాపైగల మహోత్తమ ప్రేమ విషయమై నేనెరుగుదును. అలాగే ఏ పరాక్రమ, ధైర్య, దుర్ధర్షతేజో విషయాలు కూడ నేనెరుగనివికావు. శుభలక్షణా! నా తల్లికి సంభవించిన అతులనీయ వేదన— సత్యము, శమములపట్ల నాకుగల అభిప్రాయాన్ని అర్థం చేసుకోకపోవడంవల్ల ప్రాప్తించింది. ఈ విశాల ప్రపంచంలో ధర్మమే సర్వశ్రేష్ఠమైనది. ధర్మమందే సత్యతత్వం ప్రతిష్ఠితమై ఉంది. ఈ కారణంవల్ల నేను పితృశాసనాన్ని ఉల్లంఘించజాలకున్నాను. వీరుడా! పిత్రాజ్ఞానుసారమే కైకేయీ మాత నన్ను అడవులకు పొమ్మని చెప్పగలిగింది. కనుక కేవలం క్షాత్ర ధర్మాన్ని అవలంబనం చేసుకొనునట్టి ఈ అల్పమైన ఆలోచనలను పరిత్యజించు, ధర్మాన్ని ఆశ్రయించు,

తీవ్రభావాలను విడనాడు, నా భావాలకు అనుగుణంగానే నువ్వు నడుచుకొమ్ము".

తన మనస్సులో ఉదయించిన భావాలను ఆవేశపూరిత వచనాలతో రామచంద్రుని ముందుంచడమూ, తన మనస్సుకు వ్యతిరేకమైనవే అయినా శ్రీరామాదేశానుసారం ఒప్పుకొనడము లక్ష్మణస్వామికి స్వభావసిద్ధమైన విశేషములు. పురుషార్థ, వీరత్వాలు అతనిలో ఉప్పొంగియుండేవి శ్రీరాముడు నచ్చజెప్పప్రయత్నించినపుడు లక్ష్మణుడంటాడు.

విక్లవో వీర్యహీనో యః స దైవమనువర్తతే ।
వీరాః సమ్భావితాత్మానో న దైవం పర్యుపాసతే ॥
దైవం పురుషకారేణ యః సమర్థః ప్రబాధితుమ్ ।
న దైవేన విపన్నార్థః పురుషః సోऽవసీదతి ॥
x x x x
అద్య మే పౌరుషహతం దైవం ద్రక్ష్యన్తి వై జనాః ।
యైర్దైవాదాహతం తేऽద్య దృష్టం రాజ్యాభిషేచనమ్ ॥
x x x x
అహమేకో మహీపాలానలం వారయితుం బలాత్ ॥
న శోభార్థావిమౌ బాహూ న ధనుర్భూషణాయ మే ।
నాసిరాబన్ధనార్థాయ న శరాః స్తమ్భహేతవః ॥
(వా. రా. 2/23/16,17,19,29,30)

"నామమాత్రంగా కూడ పరాక్రమం లేనిభీరుడు మాత్రమే ప్రారబ్ధం పై ఆధారపడి ఉంటాడు. యావత్ ప్రపంచమూ ఎవనినైతే ఆదర దృష్టితో చూస్తుందో అట్టి వీరపురుషుడు దైవోపాసన చేయ నవసరంలేదు. స్వీయ పురుషార్థంతో దైవాన్ని అణచగల శక్తి సంపన్నుడు – దైవం ద్వారా వాని ఏ కార్యంలోనైనా ఆటంకం ఏర్పడినా అతడు దుఃఖించడు. దైవబలం ద్వారా నీ రాజ్యాభిషేకం విఘ్నమవడం చూసిన వారే నేడు నా పౌరుషం ద్వారా దైవవినాశనాన్ని కూడ చూస్తారు. నేను బలవంతంగా శత్రురాజులనందరినీ జయించగల సమర్థుడను. నా ఈ భుజాలు శోభార్థముకాదు. ఈ ధనుస్సు ఆభూషణమునకై కాదు. ఈ కరవాలము కేవలము పట్టుకొనడానికి కాదు.

ఈ బాణములు స్తంభహేతువులు కావు. కౌసల్యా, సీతా, మాతలతో ప్రసంగించిన తరువాత రామచంద్రుని అంతిమ నిర్ణయం లక్ష్మణుడు అర్థం చేసుకుని, స్వవాదాన్ని పూర్తిగా విడనాడి, సర్వవిధాలా శ్రీరాముని అనుసరించడానికి ఉద్యుక్తుడవుతాడు. అగ్రజుడు అరణ్యాలకు పయనం కావడం చూసి అతనితో పోవ అతడు ఉద్యుక్తుడవుతాడు. సోదరుని వియోగదుఃఖాన్ని అతడు సహించలేకపోతాడు. అతని నయనాలనుండి అశ్రుధారలు ప్రవహిస్తాయి. అతడు రెండు చేతులతోటి రామచంద్రుని చరణయుగళాన్ని పట్టుకుని – సీతారాములతో అంటాడు –

యది గన్తుం కృతా బుద్ధిర్వనం మృగగజాయుతమ్ ।
అహం త్వానుగమిష్యామి వనమగ్రే ధనుర్ధరః ॥

x x x x

న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే ।
ఐశ్వర్యం చాపి లోకానాం కామయే న త్వయా వినా ॥

(వా. రా. 2/31/3,5)

"ప్రభో! వేలాది అరణ్య జంతువులతో, మదగజాలతో నిండిన అరణ్యాలకు మీరు పోవనిశ్చయించి ఉంటే నేను కూడ ధనుర్బాణధారినై మీకు ముందుగా పురోగమిస్తాను. మీరు లేకుండా నేను దేవలోకానికి వెళ్ళడానికి కానీ అమరుడనబడడానికి కానీ యిచ్ఛగించడం లేదు, అంతే కాదు సర్వలోకైశ్వర్యాన్ని పొంద గోరడం లేదు".

అంతా విన్న రామచంద్రుడు లక్ష్మణుని వనాలకు రాకుండా అయోధ్యలోనే ఉండమంటాడు. అప్పుడు లక్ష్మణుడు బదులుపల్కుతూ

**అనుజ్ఞాతస్తు భవతా పూర్వమేవ యదస్మ్యహమ్ ।**
**కిమిదానీం పునరపి క్రియతే మే నివారణమ్ ॥**

**(వా. రా. 2/31/7)**

"ఆదినుండి నీవు నీతో నన్ను ఉండ అనుమతించి యున్నావు, మరి ఇప్పుడు ఎందుకిలా వారిస్తున్నావు?" అనగా శ్రీరాముడంటాడు –

స్నిగ్ధో ధర్మరతో ధీరః సతతం సత్పథే స్థితః ।
ప్రియః ప్రాణసమో వశ్యో విజేయశ్చ సఖా చ మే ॥
మయాద్య సహ సౌమిత్రే త్వయి గచ్ఛతి తద్వనమ్ ।
కో భజిష్యతి కౌసల్యాం సుమిత్రాం వా యశస్వినీమ్ ॥
(వా. రా. 2/31/10-11)

"లక్ష్మణా! నీవు నాకు పరమ స్నేహితుడవు. ధర్మపరాయణుడవు. ధీరుడవు, సదా శ్రేష్ఠమార్గారూఢుడవై ఉంటావు. నాకు ప్రాణ సమప్రియుడవు. నావెంట ఉంటూ, నా ఆజ్ఞలను పాలించునట్టి సఖుడవు. అట్టి నీవు కూడ నాతో అడవులకు వస్తే తల్లులైన సుమిత్రా, కౌసల్యలను ఎవరు చూస్తారు?" అని ప్రశ్నించగా లక్ష్మణుడు బదులు పలికాడు –

తదాత్మభరణే చైవ మమ మాతుస్తథైవ చ ।
పర్యాప్తా మద్విధానాం చ భరణాయ మనస్వినీ ॥
కురుష్వ మామనుచరం వైధర్మ్యం నేహ విద్యతే ।
కృతార్థోఽహం భవిష్యామి తవ చార్థః ప్రకల్ప్యతే ॥
x x x x
ఆహరిష్యామి తే నిత్యం మూలాని చ ఫలాని చ ।
వన్యాని చ తథాన్యాని స్వాహార్హాణి తపస్వినామ్ ॥
భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యసే ।
అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చ తే ॥
(వా. రా. 2/31/23-24,26-27)

మనస్వినియగు కౌసల్యామాత స్వయంగా తననూ, నా తల్లినీ నావంటి అనేకులనూ భరించి పోషించగల సమర్థురాలు. కనుక నీవు నన్ను నీ అనుచరునిగా చేసుకో. ఇందులో ధర్మవిరుద్ధ విషయం ఎంతమాత్రం లేదు. ఇలా జరిగితే నేను కృతార్థుడను కావడంతో నీ సేవకూడ కొనసాగుతుంది. నేను నీకోసం అరణ్యంలో ఫలమూలాలను, తపస్వులకోసం హవన సామగ్రినీ సమకూరుస్తాను. మీరు సీతతో పర్వత సానువులలో విహరిస్తుండవచ్చును. మీరు నిద్రిస్తున్నా, జాగ్రదావస్థలో ఉన్నా మీ కార్యాలన్నింటినీ నెరవేరుస్తాను. ఎట్టి గాఢమైన సేవా భావము?

తనసుఖ విషయమై అతనికెంతమాత్రం చింతలేదు.

ఇంకేముంది? లక్ష్మణుని గాఢప్రేమను తిలకించి రామచంద్రుడు అతని ప్రార్థనను అంగీకరించాడు "అయితే సుమిత్రా మాత దగ్గర సెలవు తీసుకురా" అని రాముడు పలుకగా వెంటనే లక్ష్మణుడు తల్లి దగ్గరకు వెళ్ళి సెలవు తీసుకువచ్చేశాడు. తదనంతరం సీతారామ లక్ష్మణులు సుమిత్రా మాత దగ్గర సెలవు తీసుకునే నిమిత్తం వెళ్ళగా ఆమె లక్ష్మణుని మూర్ధ మాఘ్రాణించి –

పృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తః సుహృజ్జనే ।
రామే ప్రమాదం మా కార్షీః పుత్ర భ్రాతరి గచ్ఛతి ॥
వ్యసనీ వా సమృద్ధో వా గతిరేష తవానఘ ।
ఏష లోకే సతాం ధర్మో యజ్జ్యేష్ఠవశగో భవేత్ ॥
x x x x
రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్ ।
అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్ ॥
(వా. రా. 2/40/5,6,9)

"నాయనా! పరమ సుహృదయుడైన రామచంద్రునకు నీవు పరమానురాగివి. కనుకనే నేను నీకు వనవాసార్థం అనుమతి నిస్తున్నాను. నీ అన్న అరణ్యాలకు వెడుతూన్నాడు. అతని సేవలో నువ్వెన్నడూ ప్రమత్తుడవు కారాదు. అనఘా! ఈతడు సంకట స్థితిలో ఉన్నా, మహర్దశలో ఉన్నా ప్రత్యేక స్థితిలోనూ నీకు పరమగతియై ఉన్నాడు. అగ్రజుని ఆధీనంలో ఉండడమే ఈ ప్రపంచంలోని సత్పురుషులకు పరమ ధర్మము. నీవు రామచంద్రుని సదా నీ తండ్రి అయిన దశరథునివలె భావించు. సీతను నా స్థానంలోనూ అరణ్యాన్నే సాక్షాత్తూ అయోధ్యగానూ భావించు. నీవు సుఖంగా వెళ్ళిరా. నేను ఆదేశిస్తున్నాను.

ఎంతటి హృద్యమైన ఉపదేశము? తల్లి అంటే అలా ఉండాలి. లక్ష్మణుడు కూడ తల్లి ఆజ్ఞను అక్షరశః పాలించాడు. తరువాత సుమంత్రుడు తెచ్చిన రథాన్ని అధిరోహించి సీతారామ లక్ష్మణులు అడవులకు వెళ్ళిపోయారు.

తత్సమయంలో ప్రజలందరూ ప్రేమ విహ్వాలులై వారితో నడవసాగారు. ఎంతగా నచ్చచెప్పినా ప్రజలు అయోధ్యవైపు మరలకపోవడంతో తమసా నదీ తీరంలో నిద్రపోతున్న ప్రజలను విడనాడి సీతారామ లక్ష్మణులు శృంగబేరపురంవైపు వెళ్ళిపోయారు. అక్కడ వారు నిషాదరాజైన గుహుని కలిశారు. అతనికి విషయాలన్నీ వివరంగా చెప్పారు. సంధ్యోపాసనానంతరం లక్ష్మణుడు గంగా జలాలు తెచ్చాడు. ఆ జలాలను పానం చేసి సీతారాములు లక్ష్మణుని ద్వారా ఏర్పాటు చేయబడిన తృణపత్రనిర్మిత శయ్యపై నిదురించారు. తత్సమయంలో లక్ష్మణుడు వారి చరణాలను ప్రక్షాళనం చేశాడు. ఆపై అతడు తొలగి కొంచెం దూరంగా ఉన్న మరో వృక్షముక్రింద ఆసీనుడయ్యాడు. ఆ రీతిగా స్వాభావికమైన అగ్రజానురాగంతో మేలుకొని ఉన్న లక్ష్మణుని తిలకించి గుహుడు– "సోదరా! లక్ష్మణా! మీకు శయ్య సిద్ధంగా ఉంది. వెళ్ళి సుఖంగా నిద్రించండి. నేను నా బాంధవులతో కలిసి ధనుర్ధారినై కాపలా కాస్తాను" అన్నాడు.

ఈ మాటలు విని లక్ష్మణుడు అతనిని ప్రశంసిస్తూ పలికెను –

కథం దాశరథౌ భూమౌ శయానే సహ సీతయా ।
శక్యా నిద్రా మయా లబ్ధుం జీవితం వా సుఖాని వా ॥
యో న దేవాసురైః సర్వైః శక్యః ప్రసహితుం యుధి ।
తం పశ్య సుఖసంసుప్తం తృణేషు సహ సీతయా ॥

(వా. రా. 2/51/9–10)

"నిషాదరాజా! దశరథనందనుడైన శ్రీరాముడు సీతాసమేతంగా నేలమీద నిద్రపోతూంటే నేనెలా నిద్రించగలను? జీవన మరియు సుఖ సామగ్రిని నేనెలా స్వీకరించగలను? సురాసురులందరూ కలిసి ఎదురు నిలచినా ఏ రామచంద్రుని పరాక్రమాన్ని సహించజాలరో అట్టి శ్రీరాముడు సీతా సమేతుడై నేడు ఎండుగడ్డిపై సుఖంగా నిద్రపోతూన్నాడు."

అనంతరం తూర్పు తెల్లవారుతూండగా రామచంద్రుడు గంగా తీరం చేరి సుమంత్రునకు అయోధ్యకు మరలిపోవ సెలవునిచ్చాడు. తరువాత వారు ముగ్గురూ నావనెక్కి గంగకు ఆవలి తీరం చేరుకున్నారు.

అక్కడనుండి సాగి సాగి రాత్రివేళ వరదానదికి ఆవలి తీరంలో ఓ వృక్షం క్రింద బసచేశారు. అక్కడి భూమిని శుభ్రం చేసి లక్ష్మణుడు కోమలమైన పత్రాలను పరచాడు. సీతారాములు పత్రాచ్ఛాదితమైన భూమిపై ఆసీనులయ్యారు. అక్కడ జననీజనకుల విషయమై విలపిస్తూ శ్రీరాముడు లక్ష్మణునితో – "సోదరా! లక్ష్మణా! నీవు అయోధ్యకు మరలి వెళ్ళి తల్లులకు సేవ చెయ్యి. సీతతో నన్ను అడవులలో ఒంటరిగా ఉండనీ" అన విని లక్ష్మణుడు పలికిన హృదయగ్రాహ్య వచనాలను పలికినాడు –

న చ సీతా త్వయా హీనా న చాహమపి రాఘవ ।
ముహూర్తమపి జీవావో జలాన్మత్స్యావివోద్ధృతౌ ॥

నహి తాతం న శత్రుఘ్నం న సుమిత్రాం పరంతప ।
ద్రష్టుమిచ్ఛేయమద్యాహం స్వర్గం చాపి త్వయా వినా ॥
(వా. రా. 2/53/31–32 )

"రఘునందనా! నీవు లేకుంటే సీత గానీ నేను గానీ నీటినుండి తీసిన చేపలవలె ముహూర్తకాలం కూడ జీవించజాలము. పరంతపా! ఈ సమయంలో నేను మిమ్మల్ని విడనాడి తల్లిని గానీ, తండ్రినిగానీ, శత్రుఘ్నుని కానీ, స్వర్గాన్ని గానీ చూడగోరడం లేదు."

తరువాత తెల్లవారడంతో అక్కడనుండి పురోగమించి ముగ్గురూ భరద్వాజ మహర్షిని సందర్శించారు. ఓ రోజు ఆయన ఆశ్రమంలో విశ్రమించారు. మరునాడు ఆ మహర్షి చూపిన మార్గంద్వారా చిత్రకూటంవైపు పురోగమించారు. యమునాతీరం చేరిన తరువాత దానిని దాటడానికి లక్ష్మణుడు ఓ నావను తయారు చేశాడు. అందులో సీత కూర్చోవడానికై వెదురుతో ఓ అందమైన సింహాసనాన్ని తయారు చేశాడు. కొద్దిగా సిగ్గుపడుతూ సీత ఆ సింహాసనం మీద కూర్చున్నది. రామలక్ష్మణులు ఆ నావను నడిపి యమునానదిని దాటారు. నావనుండి లక్ష్మణుడు ముందూ, ఆ వెనుక సీత, ఆ తరువాత శ్రీరాముడు వారిద్దరినీ రక్షిస్తూ ముందుకు సాగాడు. అలా వారు పురోగమించి చిత్రకూటం చేరారు.

అక్కడ వారు మునిశ్రేష్ఠుడైన వాల్మీకి మహర్షిని కలుసుకున్నారు. ఆపై రామాదేశానుసారం లక్ష్మణుడు అక్కడ ఓ అందమైన పర్ణశాలను నిర్మించాడు. అందులోనే వారు సుఖంగా గడపసాగారు

అరణ్యావాసవేళలో ఫలమూలాలనూ హవన సామగ్రినీ ఏర్పాటు చేయడం, సీతాదేవియొక్క వస్త్రాభరణ పెట్టెనూ, ఆయుధాలనూ ఓ స్థానం నుండి మరోస్థానానికి చేరవేయడం, వాటిని రక్షించడం వర్షఋతువులో, రాత్రివేళల్లో పొలాలగుండా పోయి నదినుండి జలాలు తేవడం, దారిని గుర్తించడం కోసం, చెట్లమీద రాళ్ళమీద పాత గుడ్డలను వ్రేలాడదీయడం శుభ్రపరచి, సానుపుచల్లడం, కూర్చోవడానికి అరుగులు తయారుచేయడం, వంట చెరుకును ప్రోగుచేయడం, రాత్రి అంతా మేలుకొని కాపలా కాయడం ఈ కార్యాలన్నింటినీ లక్ష్మణుడు మహానందంతో, బహు చక్కగా నిర్వహించేవాడు.

అనంతరం సేనాసమేతంగా భరతుడు రామచంద్రుని తీసుకువెళ్ళడానికి చిత్రకూటానికి వచ్చినప్పుడు లక్ష్మణునికి అతని మీద సందేహం కలుగుతుంది. దానితో అతడు శ్రీరామప్రేమవల్ల వివశుడై భరతుని గురించి కఠినంగా మాట్లాడుతాడు. కానీ రామచంద్రుడు భరతుని గురించి ప్రశంసాపూర్వకంగా భాషించడంతో లక్ష్మణుడు మౌనం వహిస్తాడు. అంత భరతుడు అందరితో కలిసి శ్రీరామచరణ పాదుకలను పొంది అయోధ్యకు మరలి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతంగా చిత్రకూటమునుండి బయలుదేరి అత్ర్యాది మునుల ఆశ్రమములలో మజిలీచేయుచూ పంచవటిని చేరుకుంటాడు. అక్కడకు చేరుతూనే రాముడు లక్ష్మణునితో అంటాడు – "మనం చేరవలసిన స్థానం యిదియే. ఇక్కడ నలువైపులా దృష్టిని సారించి సర్వసమ్మతమైన ఆశ్రమాన్ని నిర్మించుకుని మనం ముగ్గురం నివసించడానికి యోగ్యంగా ఉండేటట్లు చూడు. జల, పుష్ప, కుశాదులు మనకు దగ్గరలోనే లభించాలి" అంత లక్ష్మణుడు స్వబుద్ధికి ప్రాధాన్యమీయక పలుకుతాడు.

పరవానస్మి కాకుత్స్థ త్వయి వర్షశతం స్థితే ।
స్వయం తు రుచిరే దేశే క్రియతామితి మాం వద ॥
(వా. రా. 3/15/7)

"రఘునాథా! ఈ లోకంలో వందలాది సంవత్సరాలు గడచినా కూడ నేను సర్వదా మీ ఆధీనంలోనే ఉంటాను. (మీ సమక్షంలో స్వేచ్ఛగా నేనేమీ చేయను) కనుక మీరు స్వయంగా మీ అభిరుచికి అనుకూలంగా ఉన్న స్థానంలోనే ఆశ్రమ నిర్మాణం చేయ నాకు అనుమతిని ప్రసాదించుడు!".

అంతమాత్రంచేత లక్ష్మణుడు వివేకహీనుడని అనుకోరాదు. అతడు ధీమంతుడు, విద్వాంసుడు, అనేక సమయాలలో శ్రీరామసేవార్థం బుద్ధిని ప్రయోగించేవాడు, కానీ రాముడు చెప్పిన కార్యమును చేయుటకు అతడు విశేషంగా సంతోషించేవాడు.

తదనంతరం రాముడు అక్కడ సుందర స్థానాన్ని చూపించి దాని గుణశోభలను వర్ణించాడు. అక్కడ లక్ష్మణుడు వెంటనే అగ్రజుని ఆదేశానుసారం వాసయోగ్యమైన ఓ ఆశ్రమాన్ని సుందర పర్ణశాలనూ తయారు చేశాడు. ఆ పర్ణశాలను తిలకించిన సీతారాములు విశేష ప్రసన్నులయ్యారు. శ్రీరాముడు లక్ష్మణుని కార్యాలను ప్రశంసించి అతనిని హృదయానికి హత్తుకున్నాడు. ఆపై వారందరూ ఆనందంగా నివసించసాగారు.

అక్కడ వారు ఉంటూండగానే శరదృతువు గడచిపోయింది. హేమంతం ప్రవేశించింది. అప్పుడు స్నానార్థమై వారు ముగ్గురూ పోతూండగా లక్ష్మణుడు అన్నగారి వైపు చూస్తూ భరతుని ప్రశంసిస్తూ అంటాడు –

అస్మింస్తు పురుషవ్యాఘ్ర కాలే దుఃఖసమన్వితః ।
తపశ్చరతి ధర్మాత్మా త్వద్భక్త్యా భరతః పురే ॥
త్యక్త్వా రాజ్యం చ మానం చ భోగాంశ్చ వివిధాన్ బహూన్ ।
తపస్వీ నియతాహారః శేతే శీతే మహీతలే ॥

సోఽపి వేలామిమాం నూనమభిషేకార్థముద్యతః ।
వృతః ప్రకృతిభిర్నిత్యం ప్రయాతి సరయూం నదీమ్ ॥
అత్యన్తసుఖసంవృద్ధః సుకుమారో హిమార్దితః ।
కథం త్వపరరాత్రేషు సరయూమవగాహతే ॥
(వా. రా. 3/16/27-30)

"పురుషోత్తమా! ఈ శీతాకాలంలో ధర్మాత్ముడైన భరతుడు నీ భక్తి కారణంగా నగరంలో కష్టాలను సహిస్తూ తపస్సు చేస్తున్నాడు. అతడు రాజ్య, గౌరవ, వివిధ భోగాదులను సయితం పరిత్యజించి తపస్సులో సంలగ్నుడైవున్నాడు. నియమితాహారాన్ని స్వీకరిస్తూ ఈ శీతాకాలంలో కూడ నేలపై శయనిస్తున్నాడు. నిశ్చయంగా ఈ చలివేళలో భరతుడు స్నానార్థం మంత్రి, ప్రజాజనులతో సరయూ నదికి వెడుతూంటాడు. అత్యంత సుఖంలో పెరిగిన సుకుమారుడు భరతుడు. శైత్య బాధను సహిస్తూ బ్రాహ్మ ముహూర్తంలో ఎలా మునకలు వేస్తాడో కదా!"

"దీనినిబట్టి లక్ష్మణుడు శ్రీరామునే ప్రేమించేవాడని భావించేవాడని, భరతునిపట్ల అతనికి ద్వేషభావముండేదని తెల్పే వారివాదం ఖండింపబడుతుంది. శ్రీరామునికి దుఃఖాన్ని చేకూర్చేవారిని, అవమానించేవారిని క్షమించేవాడే గాదు. కాని భరతునిలో దోషం లేదని, పైగా రామవియోగం మూలమున భరతుడు తపస్విగా జీవితాన్ని గడుపుతున్నాడని అతనికి తెలిపినప్పుడు లక్ష్మణుడు అతనిపట్ల పరిపూర్ణశ్రద్ధా ప్రేమలను మునుపటికన్న ఎక్కువ కానసాగెను.

ఒకనాటి మాట, పంచవటిలో సుఖాసీనులై శ్రీరాముడు లక్ష్మణునితో ప్రసంగిస్తున్నాడు. అదే సమయంలో అక్కడకు శూర్పణఖ వచ్చి తనను వివాహం చేసుకోమని రాముణ్ణి అర్థిస్తుంది. శ్రీరాముడామెను లక్ష్మణుని దగ్గరకు పంపుతాడు. శూర్పణఖ అక్కడకు వచ్చి మరల అదే విధంగా పలుకుతుంది. అంత లక్ష్మణుడు నవ్వి బదులు పలుకుతాడు -

కథం దాసస్య మే దాసీ భార్యా భవితుమిచ్ఛసి ।
సోఽహమార్యేణ పరవాన్ భ్రాత్రా కమలవర్ణిని ॥
(వా. రా. 3/18/9)

"నేను దాసుడను. అన్న అయిన శ్రీరాముని ఆధీనంలో ఉంటున్నాను. నాకు భార్యవై నువ్వు దాసీగా ఎందుకుండ గోరుతూన్నావు? ఓ కమలవర్ణినీ నువ్వు రాముని దగ్గరకే వెళ్ళు."

ఆమె రాముని దగ్గరకు మరలి వచ్చింది. అక్కడ ఆమె సీతపై విరుచుకు పడడంతో రామాదేశానుసారం లక్ష్మణుడు ఆమె ముక్కు చెవులను ఖండించి వేశాడు.

అప్పుడు ఖరదూషణ త్రిశిరాది రాక్షసులు రాముని మీదకు దండెత్తుతారు. వారు రావడం చూసి రాముడు లక్ష్మణునితో – "సోదరా! నీవు నిస్సందేహంగా ఈ రాక్షసులను అంతం చెయ్యగలవు. కాని నేను స్వయంగా వీరందరినీ అంతం చెయ్యాలనుకుంటూన్నాను. కనుక రక్షణార్థం సీతను నీవు ఆ గుహలోకి తీసుకు వెళ్ళు" అన్నారు.

రామాదేశాన్ని లక్ష్మణుడు అక్షరాలాపాటించాడు. అంత రాముడు రాక్షసులనందరినీ అంతం చేసివేశాడు. ఆపై శూర్పణఖ ప్రేరణానుసారం రావణుడు సీతాపహరణార్థం మారీచుని వెంటబెట్టుకుని పంచవటికి వచ్చాడు. అక్కడ మారీచుడు విచిత్ర స్వర్ణలేడిరూపాన్ని ధరించి సీత మనస్సును ఆకర్షించాడు. సీత కోరగా శ్రీరాముడు ఆ లేడి వెంట వెళ్ళాడు. అక్కడ మారీచుడు మరణించాడు. మరణవేళలో వాడు రామునివలె అరుస్తూ –"హా సీతా! హా లక్ష్మణా! అంటూ ఆర్తనాదం చేస్తూ పడిపోయాడు. ఆ నాదాలు విన్న సీత భయపడిపోయింది. తననాథుడు సంకటంలో పడ్డాడనుకుంది. అతడికి సహకరించ శీఘ్రమే వెళ్ళవలసినదిగా లక్ష్మణుని కోరుతుంది. ఆమె అనేక విధాల భాషించినా సహిస్తూనే లక్ష్మణుడు రామాదేశానుసారం ఆమె రక్షణలో ఉంటాడు. అంత సీతాదేవి అతని ప్రేమ భావాలపై దోషారోపణ చేస్తూ కటువుగా భాషిస్తుంది. అయినా లక్ష్మణుడు కదలడు. శ్రీరాముని ప్రభావాన్నీ, రాక్షసుల మాయలనూ వర్ణించి అతడు సీతాదేవికి నచ్చచెప్ప ప్రయత్నిస్తాడు. అయినా సీతకు సంతోషం కలుగదు. అంత ఆమె లక్ష్మణుని క్రోధావేశముతో అనరాని మాటలు అంటుంది. అంత లక్ష్మణుడు సీతాసంరక్షణభారాన్ని వనదేవతలకు

అప్పగించి శ్రీరాముని దగ్గరకు వెళ్ళిపోతాడు. రామాజ్ఞను లక్ష్మణుడు ఉల్లంఘించడం అదే మొదటి సారి అవుతుంది.

ఇక్కడ రావణుడు భిక్షకుని వేషాన్ని ధరించి సీతను అపహరించుకు తీసుకుపోయాడు. ఆశ్రమంవైపు మరలివస్తూన్న రాముణ్ణి దారిలోనే లక్ష్మణుడు కలుస్తాడు. రాముడు లక్ష్మణునితో, "లక్ష్మణా! సీతను ఆశ్రమంలో ఒంటరిగా విడనాడి నువ్వు వచ్చి అపరాధమే చేశావు. అంటూ ఎన్నో విధాల బాధగా పలుకుతాడు. అప్పుడు లక్ష్మణుడు బదులుపలుకుతూ –

న స్వయం కామకారేణ తాం త్యక్త్వాహమిహాగతః ।
ప్రచోదితస్తయైవోగ్రైస్త్వత్సకాశమిహాగతః ॥
(వా. రా. 3/59/6)

"దేవా! నేను నా యిచ్ఛానుసారం ఆమెను విడనాడి యిక్కడకు రాలేదు. ఆమె కఠోరవచనాలచే ప్రేరితుడనై నేను మీ దగ్గరకు రావలసివచ్చింది."

ఆ విధంగా సర్వవిషయాలనూ నచ్చజెప్పినా శ్రీరామునికి సంతోషం కలుగదు. అతడు దారిలో అనేక విధాల విలపిస్తూ ఆశ్రమం దగ్గరకు వస్తాడు. అక్కడ పర్ణకుటీరం శూన్యంగా ఉండడం చూసి విరహాకులుడై విలపిస్తాడు. అంత లక్ష్మణుడు అతనికి ధైర్యం చెబుతూ అనేక విధాల నచ్చచెబుతాడు. ఆ రీతిగా రామచంద్రుడు సీతా వియోగముచే అధీరుడవుతూన్నప్పుడల్లా లక్ష్మణుడు ప్రేమపూర్ణవచనాలతో అతని ప్రభావాదులను స్మరణకు తెస్తూ ధైర్యాన్ని చేకూరుస్తూంటాడు.

సోదరులిద్దరూ సీతాన్వేషణ చేసుకుంటూ జటాయువు దగ్గరకు వస్తారు. దానికి దహన సంస్కారం చేసి కబంధుని వధించి అతని సూచనానుసారం పంపాసరోవరానికి వస్తారు. అక్కడే వారిని శబరి కలుస్తుంది. అక్కడనుండి పురోగమింపగా హనుమంతుని ద్వారా సుగ్రీవునితో వారికి మైత్రి ఏర్పడుతుంది. సుగ్రీవుడు తత్సమయంలో సీతచే

పారవేయబడిన వస్త్రాభరణాలను చూపిస్తారు. అంత రామచంద్రుడు వాటిని గుండెకు హత్తుకుని లక్ష్మణుని చూడమంటాడు. వాటిని చూపి లక్ష్మణుడంటాడు–

నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే ॥
నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివన్దనాత్ ।
(వా. రా. 4/6/22–23)

"ప్రభూ! నేను సీతామాతయొక్క కేయూర, కుండలాదుల నెరుగను. నిత్యం ఆమె పాదాలకు వందనం చేయడంవల్ల నేను ఆమె నూపురాలను మాత్రం గుర్తించగలను. బ్రహ్మచర్యవ్రతము మరియు పూజ్యభావాలకు ఎంత సుందరమైన ఆదర్శమిది!

తరువాత సుగ్రీవునితో సంభాషణ కొనసాగింది. వాలి సుగ్రీవుల యుద్ధం జరిగింది. ఒకే ఒక బాణంతో రామచంద్రుడు వాలిని నేల గూల్చాడు. సుగ్రీవుడు కిష్కింధ రాజ్యానికి రాజుగా అభిషిక్తుడయ్యాడు. ప్రవర్షణ గిరిపై వసిస్తూ రామలక్ష్మణులు వర్షఋతువును గడిపివేశారు. శరదృతువు వచ్చింది. కానీ సుగ్రీవుడు విషయ భోగాలలో పడి రామకార్యాన్ని విస్మరించాడు. అది గమనించి రామాదేశానుసారం లక్ష్మణుడు సుగ్రీవుని దగ్గరకు వెళ్ళాడు. తత్ప్రసంగంలో లక్ష్మణుని వీర్య, ధైర్య, శీల సంబంధమైన వర్ణన వాల్మీకి రామాయణంలో అత్యంత సుందరంగా చిత్రించబడినది. సుగ్రీవుని మందలిస్తూ అంటాడు –

పూర్వం కృతార్థో మిత్రాణాం న తత్ప్రతికరోతి యః ।
కృతఘ్నః సర్వభూతానాం స వధ్యఃప్లవగేశ్వర ॥
గోఘ్నే చైవ సురాపే చ చౌరే భగ్నవ్రతే తథా ।
నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః ॥
(వా. రా. 4/34/10,12)

"వానరేశ్వరా! ఆదిలో మిత్రసహకారంతో స్వకార్యాన్ని నెరవేర్చుకుని ప్రత్యుపకారం చేయనివాడు కృతఘ్నుడు. అట్టివాడు సర్వప్రాణులచేత వధింపబడ యోగ్యుడు. గోహంతకునికీ, త్రాగుబోతుకూ, చోరునకూ,

వ్రతభంగం చేసినవానికి సత్పురుషులు ప్రాయశ్చిత్తాన్ని చెప్పారు. కానీ కృతఘ్నుడైన వానికి ప్రాయశ్చిత్తమేదీ లేదు.

ఆపై తార లక్ష్మణునికి వినయముతో నచ్చజెప్పి శాంతింప జేసింది. అప్పుడు సుగ్రీవుడు సావధానుడై లక్ష్మణునితో అన్నాడు –

> కః శక్తస్తస్య దేవస్య ఖ్యాతస్య స్వేన కర్మణా ।
> తాదృశం ప్రతికుర్వీత అంశేనాపి నృపాత్మజ ॥
> సీతాం ప్రాప్స్యతి ధర్మాత్మా వధిష్యతి చ రావణమ్ ।
> సహాయమాత్రేణ మయా రాఘవః స్వేన తేజసా ॥
> (వా. రా. 4/36/6–7)

"దశరథనందనా! శ్రీరామమూర్తి సర్వత్ర తన కార్యమునందు విఖ్యాతుడై ఉన్నాడు. అతడు సాక్షాత్తూ భగవానుడు, అంశామాత్రంగా కూడ అతనికి ఉపకారానికి ఎవరు ప్రత్యుపకారం చేయగలరు? స్వతేజస్సుతోనే శ్రీరామచంద్రుడు రావణుని వధించి సీతను పొందుతాడు. నిమిత్తమాత్రంగానే నేను సహాయకుడనుగా ఉంటాను".

ఆ పలుకులనాలకించిన లక్ష్మణుడు ప్రసన్నుడయ్యాడు. సుగ్రీవుని ప్రశంసించి అతనితో సహా రామసన్నిధికి వచ్చారు. అదే సమయానికి సుగ్రీవుని ఆదేశానుసారం అసంఖ్యాక వానరభల్లూకగణాలు అక్కడకు చేరుకుంటాయి. సీతాన్వేషణార్థం వారందరూ దశదిశలకూ పంపబడ్డారు. హనుమంతుడు లంకలో ప్రవేశించి సీతాదేవిని చూశాడు అక్కడనుండి మరలివచ్చి అతడు రామలక్ష్మణులకు సీతాదేవి కష్టగాథను వినిపించసాగాడు. సీత సమాచారం వింటూనే అసంఖ్యాక వానర మహాశాల సేనను వెంటబెట్టుకుని రామలక్ష్మణులు సాగర తీరం చేరారు. అక్కడ రామచంద్రుడు శరణన్న విభీషణునకు అభయమిచ్చారు. సాగరంపై సేతువును బంధించి సైన్యసమేతంగా రామలక్ష్మణులు సాగరానికి ఆవలి తీరం చేరారు. లంకలో రాక్షసులతో ఘోర భయంకర యుద్ధం జరిగింది. ఒకనాటి మాట, మేఘనాదుడు వానరులందరూ తిలకిస్తూండగా మాయా సీతను వధించి అందరినీ దుఃఖింపజేశాడు. హనుమంతుని ద్వారా ఆ

సమాచారాన్ని విని రాముడు సీతా దుఃఖంలో మూర్ఛపోయారు. అతణ్ణి సచేతనుని చేయ అనేకమైన ఉపచారాలు చేశారు. లక్ష్మణుడు పురుషార్థాన్ని ప్రశంసిస్తూ రామునితో అన్నాడు –

తదద్య విపులం వీర దుఃఖమిన్ద్రజితా కృతమ్ ।
కర్మణా వ్యపనేష్యామి తస్మాదుత్తిష్ఠ రాఘవ ॥
ఉత్తిష్ఠ నరశార్దూల దీర్ఘబాహో ధృతవ్రత ।
కిమాత్మానం మహాత్మానమాత్మానం నావబుధ్యసే ॥
(వా. రా. 6/83/42–43)

"ప్రభూ! ఇంద్రజిత్తు నేడు (తన క్రూరకర్మతో) మీపట్ల చేకూర్చిన మహాకష్టాన్ని నేను నా భయంకర కర్మతో దూరం చేస్తాను. కనుక మీరు లేచి కూర్చోండి మహాబాహూ! పురుషసింహా! మీరు మీ మహాత్మత్వ మహాప్రభావాన్ని ఎరుగరా! వ్రతపాలకా! మీరు నిలబడండి!

అంటూ ఆ ప్రకారంగా తన ఒడిలో మూర్ఛపోయిన శ్రీరామచంద్రుని సచేతనునిగా చేయ ప్రయత్నిస్తూండగా సరిగా అదే సమయానికి విభీషణుడు అక్కడకు వచ్చాడు. అతడు ప్రశ్నించగా లక్ష్మణుడు – సీతాశోకంలో మూర్ఛితుడైన రామవృత్తాంతాన్ని వివరించాడు. అంత విభీషణుడు ప్రబల యుక్తుల ద్వారా అందరి సమక్షంలో శ్రీరామునకు నచ్చజెప్పుచూ – ప్రభూ! మేఘనాదుడు సీతాదేవిని సంహరించలేదు. ఇదంతా రాక్షసమాయ. మీరు విచారించకండి. ఇప్పుడు మేఘనాదుడు నికుంభిలలో యాగం చేయవెళ్ళాడు. వానియాగం పూర్తి అయితే వాణ్ణి జయించడం అసంభవమే! శీఘ్రంగా మనం అక్కడకు వెళ్ళి వానితో యుద్ధం చెయ్యాలి. కనుక మీరు లక్ష్మణుని మాతో అక్కడకు పంపండి" అన్నారు. ఆ పలుకుల నాలకించడంతో రామచంద్రుడు సావధానుడయ్యాడు. విభీషణుని ముఖతః విషయాలన్నింటినీ అతడు మరల విన్నారు. అంత మేఘనాదుని పరాక్రమ, మాయాబలాదులను గురించి వర్ణించి లక్ష్మణునితో శ్రీరాముడన్నాడు–"సోదరా! నీవు సుగ్రీవ విభీషణులతో అక్కడకు వెళ్ళి వాణ్ణి అంతం చేసిరా" అనవిని లక్ష్మణుడు మేఘనాదుని అంతం చేస్తానని ప్రతిజ్ఞ చేసి శ్రీరామునికి ప్రదక్షిణం చేసి ప్రణమిల్లాడు. తరువాత అతడు

సైన్య సమేతంగా విభీషణునితో అక్కడకు చేరాడు. మేఘనాదునితో లక్ష్మణునకు ఘోరయుద్ధం జరిగింది. అందు లక్ష్మణుడు తన వీరత్వము, ధీరత్వము, యుద్ధకౌశలముల అతివిలక్షణ పరిచయము ఇచ్చెను. లక్ష్మణుడు మేఘనాదుని అశ్వ, రథ, సారథులను నాశనం చేసి మాటిమాటికీ అతని అనేక ధనుస్సులను ఖండించి వేశాడు. ఆరీతిగా అతడు రాక్షసుల సేననంతటినీ వ్యాకులపరచి వేశాడు. చివరకు మేఘనాదుని చంపి లక్ష్మణుడు మహాద్భుతకార్యాన్ని చేశాడు. ఆపై అతడు రామసన్నిధి చేరి అతనికి ప్రణమిల్లాడు. రామచంద్రుడు సోదరుణ్ణి హృదయమార కౌగిలించుకుని అతనిని ప్రశంసిస్తూ అన్నాడు –

కృతం పరమకల్యాణం కర్మ దుష్కరకర్మణా ।
అద్య మన్యే హతే పుత్రే రావణం నిహతం యుధి ॥
అద్యాహం విజయీ శత్రౌ హతే తస్మిన్ దురాత్మని ।
(వా. రా. 6/91/13–14)

"సోదరా లక్ష్మణా! నీవు అత్యంత దుష్కర కార్యాలు చేయగలవాడవు, నీవీ పరమ కళ్యాణకరకార్యాన్ని నేరవేర్చినావు. రావణపుత్రుడైన మేఘనాదుడు మరణించడంవలన రావణుడే యుద్ధములో అంతమైనట్లు నేను భావిస్తున్నాను. దురాత్ముడు, శత్రువు అయిన మేఘనాదుడు అంతం కావడంతో మనం విజయశ్రీని వరించినట్లే".

తరువాత శ్రీరాముని ఆదేశానుసారం సుషేణుడు ఓషధులను ప్రయోగించి లక్ష్మణుని గాయాలన్నీ దూరము చేసినాడు. దానితో లక్ష్మణుడు మునుపటి వలె స్వస్థ చిత్తుడయ్యాడు.

రాక్షసుల ముఖతః లక్ష్మణునిచేత మేఘనాదుడు హతమయ్యాడన్న వార్త రావణుడు విని చాలా పరితపించెను. అతడు క్రోధోన్మత్తుడై సేనాసహితంగా దండెత్తాడు. ఘోరభయంకరయుద్ధం జరిగింది. ఆయుద్ధంలో రావణుని శక్తి బాణం తగలడంతో లక్ష్మణుడు మూర్ఛితుడైపోయాడు. అది చూసిన శ్రీరామునికి మహాదుఃఖం కలిగింది. అతడు సోదర లక్ష్మణుని సేవ, ప్రేమాదులను స్మరించుకుంటూ

అత్యద్భుతలోకోత్తరరీతితో విలపించాడు. ఆ ఘట్టంవల్ల కూడా లక్ష్మణుని గాఢప్రేమ విశదమౌతుంది.

అనంతరం సుషేణుడు హనుమంతునిద్వారా ఓషధులను తీసుకరావించి లక్ష్మణుని మూర్ఛను పోగొట్టి స్వస్థచిత్తుని చేశాడు. అనంతరం రామరావణుల మధ్య ఘోరయుద్ధం జరిగింది. అందులో రావణుడు అంతమైపోయాడు. సీత పిలువబడింది. రాజోచిత సత్కారానంతరం ఆమె పల్లకిలో కూర్చుని వస్తున్నది. కాని రామచంద్రుడు ఆమెను పాదచారిగా తీసుకురావలసినదిగా విభీషణుని ఆదేశించాడు. ఆ విషయం లక్ష్మణునకు నచ్చలేదు. అయినా భగవదిచ్ఛ అదియే అనుకుంటూ అతడేమీ మాట్లాడలేక పోయాడు. అక్కడకు చేరిన మీదట రాముడు సీతను తిరస్కరించాడు. లక్ష్మణునకు మహాదుఃఖం కలిగింది. అయినా సీతాదేవి ఆదేశానుసారం రాముని సైగను గుర్తించి అతడు సీతకై చితిని తయారు చేస్తాడు. సీతకు అగ్ని పరీక్ష జరిగింది. దేవతలందరూ విచ్చేశారు. దశరథుడు కూడ వచ్చాడు. అక్కడ దశరథుడు లక్ష్మణునకు రామప్రభావాన్ని వివరించి అతని సేవలో తత్పరుడవు కావలసినదిగా ప్రోత్సహించాడు. తరువాత అందరికందరూ పుష్పకవిమానం ఎక్కి అయోధ్యానగరం చేరుకున్నారు. అక్కడ తల్లులనూ, భరత శత్రుఘ్నులనూ కలుసుకున్నారు. రామచంద్రుడు రాజసింహాసనంపై విరాజిల్లాడు. సోదరులు ముగ్గురూ అతణ్ణి సేవించసాగారు. ఆ రీతిగా కాలం ఆనందంగా గడవసాగింది.

తదనంతరం సీతపై ఏర్పడిన లోకాపవాదాన్ని ఆలకించి శ్రీరాముడు ఆమెను పరిత్యజించ నాలోచించెను. తత్సమయంలో సోదరులను దగ్గరగా పిలిచి రామచంద్రుడు "మీరు శాంతంగా నా మాటలను ఆలకించండి. సీతకారణంగా రాజ్యమంతా నాకు అపవాదు కలుగుతూన్నది. సీత లంకలో అగ్ని పరీక్ష యిచ్చి సర్వులకూ విశ్వాసాన్ని కలుగ జేసింది. దేవతలూ మహర్షులందరూ ఆమెను లక్ష్మణుని సమక్షంలో పాపరహితనుగా అంగీకరించారు. జానకినిర్దోషియని నేనూ ఎరుగుదును. అయినా యీ లోకాపవాదును నేను భరింప లేకున్నాను. కనుక లక్ష్మణా! రేపటి ఉదయమే

స్వర్ణవిభూషితరథంపై సీతను కూర్చోబెట్టుకుని గంగకు ఆవలితీరాన గల వాల్మీకిమహర్షి ఆశ్రమ సమీపంలో విడిచి పెట్టుము" అన్నారు.

శ్రీరామాజ్ఞ లక్ష్మణునకు అత్యంత భయం, లక్ష్మణుడు వినా ఈ ఆదేశాన్ని మరెవరూ పాటించలేరని రామచంద్రుడనుకొనెను. లక్ష్మణుని ప్రేమపై అతనికి దృఢ విశ్వాసముంది. అందులకే ఈ హృదయ విదారకమైన ఆజ్ఞను లక్ష్మణునికిచ్చెను. శ్రీరాముడు తనపై ఒట్టు పెట్టుకొని తనయాజ్ఞకెదురు చెప్పవద్దని పలికెను. ఈ ప్రసంగంలో లక్ష్మణుడు ఎంతటి సహింపరాని క్లేశాన్ని భరించి, ఆజ్ఞాపాలనము చేసెనో ఆ ఘట్టాన్నిసమగ్రంగా మూలంలో చదివితేనే తెలుస్తుంది. ఈ చిన్నవ్యాసంలో సంపూర్ణ భావం వ్యక్తం కాదు కదా! సీతను పరిత్యజించే వేళ శోకిస్తూ చేతులు జోడించి అతడు సీతతో అంటాడు –

హృద్గతం మే మహచ్ఛల్యం యస్మాదార్యేణ ధీమతా ।
అస్మిన్నిమిత్తే వైదేహి లోకస్య వచనీకృతః ॥
(వా. రా 7/47/4)

"అమ్మా! జానకీ! ధీశాలియైన ఆర్య శ్రీరామచంద్రునిచేత నేను ఈ లోకనిందిత కార్యానికై నియుక్తుడనయ్యాను. ఇందులకు నా హృదయంలో పెద్దముల్లు గుచ్చుకుంటూన్నది."

అంతే గాక సన్నివేశంలో లక్ష్మణుడు "దీనికంటే నాకు మరణం లభించినా బాగుండేది తల్లీ" అంటాడు. అట్టి కఠినాతి కఠినమైన ఆజ్ఞను పాలించడం లక్ష్మణుని వలననే అగును. అక్కడనుండి మరలి వచ్చే వేళలో కూడ లక్ష్మణుడు శ్రీరామచంద్రుని గురించియే యోచిస్తుంటాడు. సీతారహితంగా రామచంద్రుడు ఎలా బ్రతుకుతాడు? ఆ విధంగా సుమంత్రునితో భాషిస్తూ లక్ష్మణుడు అయోధ్యలో ప్రవేశిస్తాడు. అన్నగారిని కలుస్తాడు. తత్సమయంలో లక్ష్మణుని వదనంలో శోకచిహ్నాలన్నీ ఉండెను. శ్రీరాముని చరణాలకు ప్రణమిల్లి అతడు సీతాపరిత్యాగ విషయాలన్నీ వివరించి శోకాకులుడైన రామచంద్రుని అనేక విధాల ఓదార్చాడు. తత్సమయంలో ప్రసన్నుడైన రాముడు, "సోదరా! లక్ష్మణా! ఇట్టి కష్టస్థితిలో

నీవంటి తమ్ముడు లభించడం అత్యంత దుర్లభమే. సౌమ్యా! నువ్వు మహాబుద్ధిశాలివి. నా మనోనుకూలంగా ప్రవర్తించేవాడవు" అంటాడు.

తదనంతరమే అశ్వమేధ యాగానికి ఏర్పాట్లు జరిగాయి. ఆ యాగానికి కుశలవులనూ, సీతనూ వెంటబెట్టుకుని వాల్మీకిమహర్షి కూడ విచ్చేశాడు. కుశలవులు రామకథను వినిపించసాగారు. రామాజ్ఞానుసారం సీతాదేవి అందరి సమక్షంలో తన పాతివ్రత్యాన్ని ప్రకటించి భూమిలో లీనమై పోయింది.

ఆ తరువాత బ్రహ్మదేవుని సందేశంతో ఓ తపస్వి శ్రీరామ సన్నిధికి విచ్చేశాడు. అతడు రామునిచేత ప్రతిజ్ఞ చేయించాడు. "మేమిద్దరం భాషించుకుంటూండగా ఎవరు ప్రవేశించినా వారిని మీరు వధింపజేయాలి." ఏకాంతంలో బ్రహ్మదేవుని మహాప్రయాణ విషయమైన సందేశం వినిపింపబడింది. అదే సమయంలో దుర్వాసమహర్షి వచ్చినాడు. ఆయన రామచంద్రుని కలవాలన్నాడు. ఆయన శాపంనుండి కులాన్నంతటినీ సంరక్షించే నిమిత్తం లక్ష్మణుడు ప్రాణమోహాన్ని సయితం విడనాడి మహర్షి ఆగమన సమాచారాన్ని అందజేయ రామసన్నిధికి వెళ్ళాడు. ప్రతిజ్ఞాపాలనకై తనకు మరణ శిక్ష విధింపుమని అర్థించాడు. అందరి అభిప్రాయానుసారం రామచంద్రుడు లక్ష్మణుని పరిత్యజించడంతో అతడు ఆ వియోగాన్ని సహించజాలక ఒక్కరోజుకూడ యీ ప్రపంచంలో ఉండలేక సరయూ తీరం చేరి యోగబలంతో పరమధామం చేరాడు.

లక్ష్మణస్వామి మాహాత్మ్యాన్ని ఎవరు వర్ణించగలరు? పరమార్థము ప్రేమ, ధీశక్తి, నిష్కపటత్వము, మంచి సలహానిచ్చుగుణము, ఆజ్ఞాపాలకత్వము, తేజస్సు, మైత్రీభావాలు విలక్షణ సమన్వయం ఇతని చరిత్రలో లభించును. ప్రపంచమంతా రామచంద్రుని గుణాలను గానం చేస్తున్నది. రామచంద్రుడు భరతుని గుణాలను కీర్తించాడు. రామభరతులిద్దరూ కూడ లక్ష్మణుని కీర్తిగానం చేశారు. అట్టి దశలో నేను ఈ చిన్న వ్యాసములో ఆ త్యాగధనుని గురించి ఎలా వర్ణించగల్గుదును?

---oOo---

# భరతుని ఆదర్శ చరిత్ర

భరతుని చరిత్ర మహోజ్జ్వలమై ఆదర్శవంతమైనది. అతనిలో ఎక్కడా ఎట్టిదోషం కానరాదు. అతని మహిమ అపారమయింది. శ్రీమద్వాల్మీకిరామాయణంలో భరతుణ్ణి విష్ణుదేవుని అంశావతారంగానే వర్ణించడం జరిగింది. ఓ సాధు శిరోమణిగా, ఆదర్శ స్వామిభక్తునిగా, మహాత్మునిగా, నిస్పృహునిగా, భక్తి ప్రధాన కర్మయోగిగా అతని చరిత్ర మనకు వ్యక్తం అవుతుంది. ధర్మ, నీతిశాస్త్రకోవిదునిగా, సద్గుణ సంపన్నునిగా, త్యాగిగా, సంయమిగా, సదాచారిగా ప్రేమ వినయాలకు మూర్తిగా, శ్రద్ధాళువుగా, మహాధీశాలిగా భరతుని గురించి వర్ణనలు విశేషంగా లభిస్తున్నాయి. వైరాగ్య, సత్య, తప, క్షమ, తితిక్ష, దయ, వాత్సల్య, ధీరత్వ, వీరత్వ, గాంభీర్య, సరళత్వ, సౌమ్య, మాధుర్య, అమానిత్వ, సహృదయత్వాది గుణాలు ఆ మహాత్మునిలో విలక్షణంగా వికసించి వున్నాయి. భ్రాతృప్రేమకు అతడు సజీవమూర్తియే.

## భరతుని పితృభక్తి

వివాహానంతరం భరతుడు శీఘ్రకాలంలోనే తన మామతో మాతామహుని సదనానికి వెళ్ళిపోయాడు. ఈ కారణంవల్ల రామాయణంలో ఇతని పితృభక్తి విషయమైన విశేషవర్ణన మనకు కానరాదు. కాని తాతగారి మందిరంలో ఉన్న కాలంలో ఒకనాడు మిత్రగోష్ఠిలో భరతుడు తన దుస్స్వప్న విషయమై చెప్పి తండ్రికై దుఃఖించడం జరుగుతుంది. అయోధ్యకు వచ్చినపిదప తల్లిద్వారా తండ్రి మరణవార్త విని, శోక కారణంగా అతడు విలపించిన ఘట్టాన్ని మనం చూస్తే అతనికి గల శ్రద్ధతో కూడిన యథార్థమైన పితృప్రేమ విషయాలు వ్యక్తమవుతాయి. తల్లి అతణ్ణి ధైర్యం వహించవలసినదిగా చెప్తుంది. అప్పుడతడు ఇట్లు బదులుపలికెను –

> **అభిషేక్ష్యతి రామం తు రాజా యజ్ఞం ను యక్ష్యతే ।**
> **ఇత్యహం కృతసంకల్పో హృష్టో యాత్రామయాసిషమ్ ॥**

తదిదం హ్యన్యథాభూతం వ్యవదీర్ణం మనో మమ ।
పితరం యో న పశ్యామి నిత్యం ప్రియహితే రతమ్ ॥
(వా. రా. 2/72/27-28)

"అమ్మా! మహారాజు స్వయముగా శ్రీరామచంద్రులకు రాజ్యాభిషేకం చేసి యాగదీక్షను వహిస్తారని నేననుకొనియుంటిని. ఆ బావంతోటే నేను అక్కడనుండి ఆనందంగా ఇక్కడకు మరలి వచ్చాను. కాని యిక్కడకు వచ్చేసరికి ఇక్కడి సంఘటలన్నీ విపరీతంగా కనిపించాయి నాకు అత్యంత ప్రీతిపాత్రుడూ, హితప్రదాత అయిన నా పితృదేవుని సందర్శించలేకపోవడంతో నా హృదయం విదీర్ణమైపోతున్నది- ఇత్యాది;

## భ్రాతృ భక్తి

పై విధంగా తండ్రికోసం ఆక్రోశిస్తున్న భరతుని హృదయంలో శ్రీరామునివిషయమై ప్రభవించిన ప్రేమ ఉప్పొంగడంతో అతడంటాడు -

యో మే భ్రాతా పితా బన్ధుర్యస్య దాసోఽస్మి సమ్మతః ।
తస్య మాం శీఘ్రమాఖ్యాహి రామస్యాక్లిష్టకర్మణః ॥
పితా హి భవతి జ్యేష్ఠో ధర్మమార్యస్య జానతః ।
తస్య పాదౌ గ్రహీష్యామి స హీదానీం గతిర్మమ ॥
(వా. రా. 2/72/32-33)

"శ్రీరామచంద్రుడే నాకు సోదరుడు, తండ్రి, బంధువు, నేనతనికి పరమప్రియసేవకుడను. అతడు పవిత్ర కర్మలనాచరించునట్టి వాడు. ఆ శ్రీరామచంద్రులకు నా ఆగమన సమాచారం త్వరగా తెలియజేయండి. ధర్మము తెలిసిన శ్రేష్ఠమానవుల దృష్టిలో, జ్యేష్ఠభ్రాత పితృసముడు. అట్టి మహనీయుని చరణాలకు నేను ప్రణమిల్లుతూన్నాను. ఇప్పుడు అతడే నాకు ఆశ్రయుడు!

ఆపై కైకేయి భరతునకు జరిగిన సమాచారాన్నంతటినీ వినిపించి రాజ్యాన్ని స్వీకరించుమంటుంది.

కైకేయి ముఖతః సోదరుల వనగమనసమాచారాన్ని ఆలకించి భరతుడు మహాదుఃఖ సంతప్తుడైపోతాడు. వ్యాకుల హృదయంతో అతడు తల్లిని తీవ్రంగా నిందిస్తాడు.

లుబ్ధాయా విదితో మన్యే న తేఽహం రాఘవం యథా ।
తథా హ్యనర్థో రాజ్యార్థం త్వయాఽఽనీతో మహానయమ్ ॥
(వా.రా. 2/73/13)

"లోభం కారణంగా నీవు రామచంద్రునిపట్ల నాకు గల భావాన్ని గ్రహించలేకపోయావు. అందులకే కాబోలు రాజ్యంకోసం యింతటి మహానర్థాన్ని చేశావు."

ఈ మాటలే కాకుండ భరతుడు తల్లి విషయంలో ఇంకా ఎన్నో పలికాడు. తరువాత తనను కలుసుకోవడానికి వస్తూన్న కౌసల్యా మాతను మధ్య మార్గంలోనే కలిసి ఆమె ఒడిలో కూర్చుని పెనవేసుకుని ఏడ్వసాగాడు. తరువాత రామవనవాసంలో తన హస్తం ఈషణ్మాత్రం లేదంటూ అనేక ప్రమాణాలతో భాషించాడు.

ఆపై వశిష్ఠమునీంద్రుల ఆదేశానుసారం దశరథ మహారాజు అంత్యేష్టికి ఏర్పాట్లు జరుగుతూంటాయి. తత్సమయంలో మహారాజు శవాన్ని తిలకించి మరల విలపిస్తూ భరతుడంటాడు –

కిం తే వ్యవసితం రాజన్ ప్రోషితే మయ్యనాగతే ।
వివాస్య రామం ధర్మజ్ఞం లక్ష్మణం చ మహాబలమ్ ॥
(వా. రా. 2/76/6)

"ప్రభూ! నేను పరదేశం వెళ్ళాను. మీ సన్నిధికి రాలేకపోయాను. ఈలోగానే ధర్మజ్ఞుడైన శ్రీరామచంద్రునీ, మహాబలశాలి అయిన లక్ష్మణునీ వనాలకు పంపాలన్న భావం మీకేల కలిగింది?"

అంటూ విలపిస్తూన్న భరతుణ్ణి తిలకించి వశిష్ఠ మునిచంద్రులు అతనికి పునః నచ్చచెబుతారు. తరువాత విధి విధానంగా దశరథుని

అంత్యేష్టిక్రియ పూర్తి అవుతుంది. నగరంలోకి వచ్చి పది రోజులవరకూ భరతుడు భూశయనం చేస్తూ మహాదుఃఖంతో కాలాన్ని గడుపుతాడు.

శ్రాద్ధాదులు పూర్తి అయిన తరువాత రాజసభలో వశిష్ఠాది ప్రముఖులు భరతుణ్ణి రాజ్యాన్ని స్వీకరించవలసిందిగా ప్రార్థిస్తారు. అప్పుడతడంటాడు,

"నేనూ, ఈ రాజ్యమూ కూడ శ్రీరాముని వారమే. మీరు నాకు ధర్మోపదేశం చేయండి. శ్రీరామచంద్రుడు సర్వవిధాలా నాకన్నా శ్రేష్ఠుడు, కనుక –

రామమేవానుగచ్ఛామి స రాజా ద్విపదాం వరః ।
త్రయాణామపి లోకానాం రాఘవో రాజ్యమర్హతి ॥
× × × ×
యది త్వార్యం న శక్ష్యామి వినివర్తయితుం వనాత్ ।
వనే తత్రైవ వత్స్యామి యథార్యో లక్ష్మణస్తథా ॥
సర్వోపాయం తు వర్తిష్యే వినివర్తయితుం బలాత్ ।
సమక్షమార్యమిశ్రాణాం సాధూనాం గుణవర్తినామ్ ॥
(వా. రా. 2/82/18,17–19)

పురుషోత్తముడైన రఘునాథుడు అయోధ్యకే కాదు జగత్త్రయానికే శాసకుడుగా ఉండతగినవాడు, నేనతనినే అనుసరిస్తాను. మీవంటి సద్గుణ సంపన్నులైన సాధుపురుషుల సమక్షంలోనే రామచంద్రుని యథాశక్తి తీసుకురావడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తాను. అయినా ఆర్యపురుషుడైన రామచంద్రుడు రాకపోతే లక్ష్మణునివలె నేను కూడ అరణ్యంలోనే ఉండిపోతాను" అన్న భ్రాతృప్రేమమగ్నుడైన భరతుని వచనాలను ఆలకించిన అక్కడి సభాసదులందరి కనులు చెమ్మగిల్లినాయి.

రామచంద్రుని తిరిగి తీసుకురావాలని భరతుడు పరివార సమేతంగా చిత్రకూటం వైపు పురోగమించగా మార్గమధ్యంలో అతనికి నిషాదరాజు గుహుడు కలిశాడు. భరతుని వెంట చతురంగబలాలు కూడ ఉండటం

చూపిన గుహునికి సందేహం కలగడంతో భరతుడు అతని సందేహాన్ని దూరం చేస్తూ అంటాడు –

మా భూత్ స కాలో యత్ కష్టం న మాం శంకితుమర్హసి ।
రాఘవః స హి మే భ్రాతా జ్యేష్ఠః పితృసమో మతః ॥

తం నివర్తయితుం యామి కాకుత్స్థం వనవాసినమ్ ।
(వా.రా. 2/85/9–10)

"నిషాదరాజా! ఇట్టి దుఃఖదాయకమైన పరిస్థితి ఏర్పడకుండును గాక! నీవు నన్ను శంకించరాదు. ఏమంటావా? రఘుకుల భూషణుడైన శ్రీరాముడు నాకు అన్న. అతణ్ణి నేను పితృసమంగా భావిస్తున్నాను. ఆ వనవాసియైన రాముణ్ణి నేను మరల తీసుకువెళ్ళ వచ్చాను."

భరతుని వచనాలాలకించి నిషాదరాజు ముఖం ఆనందంతో వికసించింది. అతడు ఆనందాతిరేకంతో పలికాడు –

ధన్యస్త్వం న త్వయా తుల్యం పశ్యామి జగతీతలే ।
అయత్నాదాగతం రాజ్యం యస్త్వం త్యక్తుమిహేచ్ఛసి ॥
(వా. రా. 2/85/12)

"అప్రయత్నంగా లభించిన రాజ్యాన్ని త్యజించదలచిన మీరు ధన్యులు. కనుక ఈ భూమండలంలో మీతో సమానుడెవడూ నాకు కానరావడం లేదు."

వారిరువురిలో చాల సేపు సంభాషణలు కొనసాగాయి. శ్రీరామవియోగంలో అతనినే స్మరిస్తూ శోకాగ్నిచే సంతప్తుడు కావడంవల్ల భరతుడు అకస్మాత్తుగా మూర్ఛితుడయ్యాడు. దగ్గరలోనే కూర్చున్న శత్రుఘ్నుడు కూడ అతనిని పట్టుకుని ఏడవసాగాడు. స్పృహకోల్పోయినాడు. అది చూసి నిషాదరాజు ముగ్ధుడయ్యాడు. కొన్ని క్షణాలకు స్వస్థచిత్తుడై భరతుడు గుహునితో మరల యిలా అన్నాడు.

భ్రాతా మే క్వావసద్ రాత్రౌ క్వ సీతా క్వ చ లక్ష్మణః ।
అస్వపచ్ఛయనే కస్మిన్ కిం భుక్త్వా గుహ శంస మే ॥
(వా.రా. 2/87/13)

"నిషాదరాజా! నాటి రాత్రి మా అన్న శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతంగా ఎక్కడ బస చేశాడు? ఏమి భుజించినాడు? ఎట్టి శయ్యపై పరున్నాడు? ఇవన్నీ నాకు చెప్పు".

ఆవిధంగా ప్రశ్నించిన భరతుని పలుకులు ఆలకించి గుహుడు పరమప్రసన్నుడై ఆయా సంఘటనలనన్నిటినీ యథాతథంగా చెప్పాడు. సీతా సమేతంగా నాటిరాత్రి శ్రీరాముడు శయనించిన ఇంగుదీ వృక్షాన్నీ దర్భశయ్యనూ చూపించాడు. ఆ స్థానాన్ని తిలకించిన భరతుడు విచిత్ర దశను పొందాడు. అనేక విధాల అతడు విలపించ సాగాడు.

హా హతోఽస్మి నృశంసోఽస్మి యత్ సభార్యః కృతే మమ ।
ఈదృశీం రాఘవః శయ్యామధిశేతే హ్యనాథవత్ ॥
సార్వభౌమకులే జాతః సర్వలోకసుఖావహః ।
సర్వప్రియకరస్త్యక్త్వా రాజ్యం ప్రియమనుత్తమమ్ ॥
కథమిన్దీవరశ్యామో రక్తాక్షః ప్రియదర్శనః ।
సుఖభాగీ న దుఃఖార్హః శయితో భువి రాఘవః ॥
ధన్యః ఖలు మహాభాగో లక్ష్మణః శుభలక్షణః ।
భ్రాతరం విషమే కాలే యో రామమనువర్తతే ॥
(వా.రా. 2/88/17–20)

"హా! హతోఽస్మి నేను మరణించాను. మహాక్రూరుడనైన నావల్లనే కదా రామచంద్రుడు సీతతో అభాగ్యునివలె యిట్టి శయ్యపై శయనించవలసి వచ్చింది. చక్రవర్తి వంశంలో జన్మించి, సర్వలోకాలకు సుఖాలను ప్రసాదించగలిగి, సర్వులకూ ప్రియాన్ని చేకూర్చునట్టి, నీలకమలసమ శ్యామవర్ణుడై, అరుణారుణనేత్రుడై, సర్వ విధాలా సుఖాలను అనుభవించదగిన వాడై, దుఃఖమునకర్హుడుకాని ప్రియదర్శనుడైన రామచంద్రుడు అత్యుత్తమ రాజ్యాన్ని విడనాడి ఏ విధంగా నేలపై శయనించినాడు? విపత్సమయంలో అన్నను విడనాడకుండ సేవచేస్తున్న

లక్ష్మణుడు ధన్యుడు కదా! అని విలపిస్తూనే భరతుడు అనేక విధాలుగా యిట్టి మాటలనే పలికాడు."

భరతుడు పురోగమించి భరద్వాజులవారి ఆశ్రమంలో ప్రవేశించగా ఆ మునిశ్రేష్ఠుడు హృదయవిదారకంగా ప్రశ్నిస్తాడు, "భరతా! నీవు అరణ్యానికి ఎందు నిమిత్తం వచ్చావు? నిరపరాధులైన రామలక్ష్మణులకు నీవు ఎట్టి అరిష్టాన్ని కలుగజేయ గోరడంలేదు కదా?" ఆ ప్రశ్నకు భరతుని నేత్రాలు సజలమయ్యాయి. అతడు తడబడుతూ పలికాడు –

హతోऽస్మి యది మామేవం భగవానపి మన్యతే ।
మత్తో న దోషమాశంకే నైవం మామనుశాధి హి ॥
న చైతదిష్టం మాతా మే యదవోచన్మదన్తరే ।
నాహమేతేన తుష్టశ్చ న తద్వచనమాదదే ॥
అహం తు తం నరవ్యాఘ్రముపయాతః ప్రసాదకః ।
ప్రతినేతుమయోధ్యాయాం పాదౌ చాస్యాభివన్దితుమ్ ॥
తం మామేవంగతం మత్వా ప్రసాదం కర్తుమర్హసి ।
శంస మే భగవన్ రామః క్వ సంప్రతి మహీపతిః ॥

(వా. రా. 2/90/15–18/)

ఓ! మునీశ్వరా! నావలన ఎట్టి అపరాధం జరుగలేదు. అయినా మీరు నన్ను ఇంతగా అపరాధియని భావిస్తే, నేను అపుడు అన్ని విధాలా హతుణ్ణైపోతాను. అందువలన మీరునాతో ఇట్టి కఠినములగు మాటలనాడవద్దు. నా అనుపస్థితిలో నా తల్లి ఏమైతే నుడివిందో లేక చేసిందో, నాకది అభీష్టమైనది కాదు. నేను దానివలన ఏమాత్రంకూడ ప్రసన్నుడనుగాలేను. మరియు నేను ఆమె మాటను ఒప్పుకోనూలేదు. నేను ఆ నరశ్రేష్ఠుడగు శ్రీరాముని ప్రసన్నునిగావించుకొని, అయోధ్యకు తిరిగి తీసుకవెళ్ళుటకై మరియు అతని చరణములకు నమస్కరించుటకై మాత్రమే అడవికి వచ్చినాను. ఇందువలన ఈ కారణంగానే వచ్చినట్టుగా తలచి నాపై దయచూపుడు మరియు మహారథుడైన శ్రీరామచంద్రుడు ఎచ్చటనున్నాడో తెల్పండి.

అలా పలికిన భరతుని వచనాలాలకించి భరద్వాజ మహర్షి పరమ ప్రసన్నులై అతనిని ప్రశంసిస్తూ అన్నాడు –

జానే చైతన్మనఃస్థం తే దృఢీకరణమస్త్వితి ।
అపృచ్ఛం త్వాం తవాత్యర్థం కీర్తిం సమభివర్ధయన్ ॥
(వా. రా. 2/90/21)

"భరతా! నేను నీ మనోగతాన్ని ఎరుగుదును. అయినా దానిని దృఢం చేసుకోవడానికి గాను, నీ కీర్తిని ఇతోధికంగా వర్ధిల్లజేయుటకు గానూ, నేను నిన్నీ ప్రశ్నలన్నీ వేశాను"

అనంతరం విశేష సంభాషణలు జరిగాయి. భరద్వాజులవారు గట్టిగా ప్రార్థించడంతో భరతుడు ఆ మహర్షిదత్తమైన అతిథ్యాన్ని స్వీకరించవలసి వచ్చెను. ఆ ఋషి ప్రవరుడు లోకోత్తర రీతిలో పరివారసహితంగా భరతునికి అత్యద్భుతమైన అతిథి సత్కారం చేశాడు. మహదానందంగా ఆ రాత్రి గడచింది. ఆ ప్రసంగంలోనే యీ విషయం కూడా వచ్చింది.

తత్ర రాజాసనం దివ్యం వ్యజనం ఛత్రమేవ చ ।
భరతో మన్త్రిభిః సార్ధమభ్యవర్తత రాజవత్ ॥
ఆసనం పూజయామాస రామాయాభిప్రణమ్య చ ।
వాలవ్యజనమాదాయ న్యషీదత్సచివాసనే ॥
(వా. రా. 2/91/38–39)

భరతుడు మహర్షి తనయోగబలంతో సృష్టించిన ఆ రాజభవనంలో దివ్యరాజ్యసింహాసన, ఛత్ర, చామరాలను తిలకించాడు. మంత్రి సమేతంగా భరతుని మహర్షి శ్రీరామునివలె సత్కరించాడు. రామచంద్రునికి ప్రణమిల్లి ఆ సింహాసనాన్ని పూజించి భరతుడు దానికి చామరం వేసి, మంత్రి సింహాసనంపై ఆసీనుడయ్యాడు. అదెంతటి మహోన్నత భక్తిభావమో? చూశారా! త్యాగమయమై పరమపావనమై అహంకార శూన్యమైన ఆ భావాలు ఎంతటి పవిత్రాలైనవో గ్రహించారా? భరతుడు చిత్రకూటాన్ని సమీపించడంతో లేచిన ధూళిని తిలకించి రామచంద్రుడు లక్ష్మణుణ్ణి పిలచి

దానికి కారణం తెలుసుకురమ్మని పంపుతారు. వృక్షమెక్కి లక్ష్మణుడు చూశాడు. సేనా సమేతంగా భరతుడు రావడాన్ని చూచి, అతణ్ణి శంకిస్తూ కఠోరంగా మాట్లాడినాడు. రామచంద్రుడు భరతుని విశుద్ధాంతరంగ గుణప్రేమాదులను ప్రశంసిస్తూ పలికాడు –

ప్రాప్తకాలం యదేషోఽస్మాన్ భరతో ద్రష్టుమర్హతి ।
అస్మాసు మనసాప్యేష నాహితం కించిదాచరేత్ ॥
విప్రియం కృతపూర్వం తే భరతేన కదా ను కిమ్ ।
ఈదృశం వా భయం తేఽద్య భరతం యద్ విశంకసే ॥
నహి తే నిష్ఠురం వాచ్యో భరతో నాప్రియం వచః ।
అహం హ్యప్రియముక్తః స్యాం భరతస్యాప్రియే కృతే ॥
x x x x
యది రాజ్యస్య హేతోస్త్వమిమాం వాచం ప్రభాషసే ।
వక్ష్యామి భరతం దృష్ట్వా రాజ్యమస్మై ప్రదీయతామ్ ॥
ఉచ్యమానో హి భరతో మయా లక్ష్మణ తద్వచః ।
రాజ్యమస్మై ప్రయచ్ఛేతి బాఢమిత్యేవ మంస్యతే ॥
(వా. రా. 2/97/13–15,17–18)

"లక్ష్మణా! భరతుడు ఈ సమయంలో మనలను కలియవస్తున్నాడు. ఇది సర్వథా ఉచితమే మనకు అహితాన్ని కలిగించాలన్న అభిప్రాయాన్ని అతడు మనసాకూడ చేయజాలడు. భరతుడు గతంలో నీకు ఎన్నడైనా ఎట్టి అపకారమైనా చేసి ఉన్నాడా? మరి ఏల అతని గురించి నేడిలా భయపడి శంకిస్తున్నావు? అతడు ఇక్కడకు వచ్చినమీదట నీవు ఎంతమాత్రం కఠోర అప్రియ వచనాలను పలుకరాదు. నీవు అతనిపట్ల ప్రతికూలంగా వ్యవహరించినా అప్రియంగా భాషించినా అదంతా నాపట్ల చేసినట్లే భావించబడును. కేవలం రాజ్యార్థమే నీవు కఠోర వచనాలు పలుకుతూంటే అతడు మనలను కలిసిన మీదట రాజ్యాన్ని నీకు యిమ్మని చెబుతాను. అతడు తప్పక నా మాటలను విని నీకు రాజ్యాన్ని యిస్తాడు." ఈ రీతిగా భరతుడు సాధువై నిర్దోషియే అయినా అతడు అందరి సందేహాలకు గురి కావలసివస్తుంది. భరతునివంటి నిస్పృహుడు, ధర్మాత్ముడు, త్యాగి అయిన మహాపురుషుడు సందేహాలకు గురికావడం ప్రపంచేతిహాసంలో ఓ

విచిత్ర విషయమే. అయినాకూడ అతడు సర్వాన్నీ సహించాడు. అతని ప్రేమ, అతని స్వామిభక్తి, సహిష్ణుత్వం ధన్యమైనవి కదా!

భరతుడు శత్రుఘ్న, గుహ, ప్రధానామాత్యాదులను రాముని ఆశ్రమాన్ని అన్వేషించమని ఆదేశించి అంటాడు –

యావన్న చన్ద్రసఙ్కాశం తద్ ద్రక్ష్యామి శుభాననమ్ ।
భ్రాతుః పద్మవిశాలాక్షం న మే శాన్తిర్భవిష్యతి ॥
x x x x
యావన్న చరణౌ భ్రాతుః పార్థివవ్యఞ్జనాన్వితౌ ।
శిరసా ప్రగ్రహీష్యామి న మే శాన్తిర్భవిష్యతి ॥
యావన్న రాజ్యే రాజ్యార్హః పితృపైతామహే స్థితః ।
అభిషిక్తో జలక్లిన్నో న మే శాన్తిర్భవిష్యతి ॥
(వా. రా. 2/98/7,9–10)

కమలదళసదృశవిశాలనేత్రుడూ, చంద్రసమసుశోభిత వదనుడూ అయిన రామచంద్రుని నేను చూడనంతవరకూ నాకు శాంతి లభించదు. అన్నగారి రాజచిహ్నాయుక్తచరణద్వంద్వాన్ని సందర్శించి నేను నతమస్తకుడను కానంత వరకూ నాకు శాంతి కలుగదు. రాజ్యానికి యథార్థాధికారి అయిన శ్రీరామభగవానుడు అభిషేకజలాభిషిక్తుడై తన పితృపితామహుల సింహాసనముపై ప్రతిష్ఠితుడు కానంత వరకూ నాకు శాంతి లభించదు.

అని అనేక విధాల పలుకుతూ పురుషశ్రేష్ఠుడైన భరతుడు రామాన్వేషణార్థం పాదచారిగానే ఆ గహనారణ్యంలో ప్రవేశించాడు. ఎత్తైన చెట్లనెక్కి అతడు దూరంనుండియే రామాశ్రమాన్ని తిలకించి అక్కడ ఆసీనుడైయున్న శ్రీరామచంద్రుని గుర్తించాడు. దానితో అతనికి నూతన జీవితం వచ్చింది. అతడు మహానందభరితుడై గుహుని వెంటబెట్టుకుని ఆశ్రమంవైపు పురోగమించాడు.

శ్రీరాముని కుటీరం సమీపంగా వచ్చి యావద్భూమండలాధినాథుడై,

ధర్మపరాయణుడగు ఆ ప్రభువు సీతా లక్ష్మణ సమేతంగా ఓ వేదికపై కూర్చుని ఉండడం చూశాడు. అతడు కృష్ణమృగచర్మము, వల్కలములను ధరించి ఉన్నాడు, అతని మస్తకంపై జటలు శోభిల్లుతూన్నాయి సింహస్కంధుడై, విశాల భుజుడైన అతని నేత్రాలు కమలములవలె శోభిస్తూ ఉన్నాయి. అట్టిదశలో రాముని దర్శించిన భరతుడు శోకమగ్నుడైపోయాడు. అగ్రజునిపై దృష్టి పడుతూండగానే అతడు ఆర్ద్రభావంతో విలపిస్తూ గద్గద కంఠంతో అంటాడు –

యః సంసది ప్రకృతిభిర్భవేద్యుక్త ఉపాసితుమ్ ।
వన్యైర్మృగైరుపాసీనః సోఽయమాస్తే మమాగ్రజః ॥
వాసోభిర్బహుసాహస్రైర్యో మహాత్మా పురోచితః ।
మృగాజినే సోఽయమిహ ప్రవస్తే ధర్మమాచరన్ ॥

x x x x

మన్నిమిత్తమిదం దుఃఖం ప్రాప్తో రామః సుఖోచితః ।
ధిగ్ జీవితం నృశంసస్య మమ లోకవిగర్హితమ్ ॥

(వా. రా. 2/99/31–32,36)

"ఆహా! రాజసభలో ఆసీనుడై ప్రజలద్వారా, అమాత్యులద్వారాను గౌరవాలు పొందదగినట్టి నా అగ్రజుడు అరణ్యంలో మృగపరివేష్టితుడై ఉన్నాడు కదా! ఆదిలో అసంఖ్యాక అమూల్యవస్త్రాలను ధరించినట్టి ఆ ధర్మాత్ముడే నేడిక్కడ ధర్మాచరణార్థం కొరకు కేవలం మృగచర్మద్వయాన్ని మాత్రం ధరించినాడు కదా! ఆహా! సర్వ విధాలా సుఖయోగ్యుడైన ఆ శ్రీరాముడు నాకారణంగా యింతటి దుఃఖాన్ని అనుభవించవలసివచ్చింది కదా! నేనెంత క్రూరుడను? లోకనిందితమైన నా యీ జీవితానికి ధిక్కారము."

అలా విలపిస్తున్న భరతుడు దుఃఖవ్యాకులుడైపోయాడు. అతని ముఖకమలంపై అశ్రుధారలు ప్రవహించసాగినవి. అతడత్యంత దుఃఖ విహ్వలుడుకావడంవల్ల రామచంద్రుని పాదాలను స్పృశించడానికి పూర్వమే – "హా ఆర్యా! అంటూ అతని సన్నిధిలో దీనునివలె పడిపోయాడు. శోకంవల్ల అతని కంఠం రుద్ధమైపోయింది. ఏమీ

మాట్లాడలేకపోయారు. తరువాత శత్రుఘ్నుడు కూడ విలపిస్తూనే శ్రీరాముని చరణాలకు ప్రణమిల్లారు. జటావల్కలాలు ధరించి భరతుడు చేతులు జోడించి పృథ్విపై పడియుండడం చూసిన రామచంద్రుడు అతి కష్టంమీద అతణ్ణి గుర్తించారు. సోదరులిద్దరినీ అతడు లేవనెత్తి హృదయానికి హత్తుకున్నారు. భరతుని ప్రవర్తనకు వనవాసులందరూ విలపించసాగారు.

తదనంతరం సోదరుడైన భరతుని తన ఒడిలో కూర్చోబెట్టుకుని రామచంద్రుడు అడిగినారు.

"సోదరా! నీవు రాజ్యాన్ని విడనాడి వల్కల, మృగచర్మ, జటలను ధరించి యిక్కడకు ఎందుకు వచ్చావు?" అనవిని భరతుడు పితృమరణవార్తను వినిపించి అన్నారు –

తథానుపూర్వ్యా యుక్తశ్చ యుక్తం చాత్మని మానద ।
రాజ్యం ప్రాప్నుహి ధర్మేణ సకామాన్ సుహృదః కురు ॥
× × × ×
ఏభిశ్చ సచివైః సార్ధం శిరసా యాచితో మయా ।
భ్రాతుః శిష్యస్య దాసస్య ప్రసాదం కర్తుమర్హసి ॥
(వా. రా. 2/101/10, 12)

"సర్వులనూ సమ్మానించునట్టి రఘునందనా! పరంపరానుసారమే, యోగ్యుడవు కావడంవల్ల కూడ ఈ రాజ్యానికి నీవే అధికారివి. కనుక న్యాయంగా ధర్మానుసారం నీవీ రాజ్యాన్ని స్వీకరించి నీ సుహృజ్జనుల మనోరథాన్ని నెరవేర్చుము. నేను నీ తమ్ముడను, శిష్యుడను, దాసుడనూ కూడ. ఈ మంత్రులతో కూడ నీ చరణాలకు శిరస్సువంచి ప్రణమిల్లుతూన్నాను. నాపై దయ చూపుము."

ఈ విధంగా ఇంకా అనేక విషయాలు మాట్లాడి భరతుడు కన్నీరు కారుస్తూ పునః శ్రీరాముని చరణాలపై పడి రాజ్యాభిషేకార్థం అతణ్ణి ప్రార్థించసాగారు. అప్పుడు శ్రీరామచంద్రుడు అనేక శాస్త్రోక్త విషయాలను చెప్పి, పితౄజ్ఞామహత్త్వాన్ని వర్ణించి రాజ్యాన్ని స్వీకరించమని భరతునితో

ఎన్నోవిధాలుగా నచ్చ చెప్పాడు. కానీ భరతునికి సంతోషం కలుగలేదు. భరతుడంటాడు – "ప్రభూ! నీకు సాటి ఎవరున్నారు? సుఖదుఃఖాలూ, మానావమానాలూ, నిందాస్తుతులూ నీ దృష్టిలో సమానాలే, ఎవనికైతే నీవంటి జ్ఞానం కలదో అతడు సంకట స్థితులలో కూడ దుఃఖించడు, కానీ నేనట్టి వాడను కాను. కనుక నేను పదే పదే శిరము వంచి ప్రణమిల్లి మిమ్మల్ని యాచిస్తున్నాను. ప్రభూ! మీరు దయ చూపండి మీరు పురుషులలో శ్రేష్ఠులు. నా తల్లియొక్క కళంకాన్ని ప్రక్షాళనం చేసి పితృపూజ్యులను కూడ నిందలనుండి రక్షించండి. ఇత్యాది –

ఆ విధంగా భరతుడు పలకడం చూసిన ఋత్విజులు, పురవాసులు, విభిన్న సమాజనేతలూ, మాతలందరూ కూడ అచేతనులవలె కన్నీరు కారుస్తూ అతణ్ణి విశేషంగా ప్రశంసించసాగారు. అందరూ తమ యోగ్యతలననుసరించి మరలి రావలసినదిగా శ్రీరామచంద్రుని ప్రార్థించారు.

తదనంతరం రామచంద్రుడు అనేకమైన న్యాయధర్మపూర్ణమైన వచనాలు పలికి భరతునికి నచ్చజెప్పాడు. అలా ప్రసంగం కొనసాగుతూండగా రామచంద్రుడు ఎంతమాత్రం అంగీకరించకపోవడంతో భరతుడత్యంత వ్యాకులచిత్తుడై – "నా ప్రభువు, నా ప్రార్థనను మన్నించునంతవరకూ నేను అన్నపానీయాలను వర్జించి యిక్కడే కూర్చుండి పోతాను" అంటూనే దర్భాసనాన్ని పరుచుకుని అతడు దానిపై కూర్చుండిపోతాడు. అంత రామచంద్రుడు మరల అతనికి నచ్చచెబుతూ– "సోదరా! నీ యీ కార్యం ధర్మవిరుద్ధమైనది కనుక నీవీ పట్టుదలను విడిచిపెట్టుము" అన విని భరతుడు శీఘ్రమే లేచి పునః పర్వుల సమక్షంలో పితృాజ్ఞానుసారం శ్రీరాముడు వనవాసం చేయడం అనివార్యమే అయితే నేను 14 సంవత్సరాలు వనవాసము చేస్తాను. అనగా రాముడు అతనికి నచ్చచెబుతూ, "సోదరా! భరతా! ఇలా మార్చుకోవడానికి మనకు అధికారం లేదు." అంటూ అందరి సమక్షంలో పలికాడు –

**జానామి భరతం క్షాన్తం గురుసత్కారకారిణమ్ ।**
**సర్వమేవాత్ర కల్యాణం సత్యసన్ధే మహాత్మని ॥**

అనేన ధర్మశీలేన వనాత్ ప్రత్యాగతః పునః ।
భ్రాత్రా సహ భవిష్యామి పృథివ్యాః పతిరుత్తమః ॥

వృతో రాజా హి కైకేయ్యా మయా తద్వచనం కృతమ్ ।
అనృతాన్మోచయానేన పితరం తం మహీపతిమ్ ॥
(వా రా. 2/111/30–32)

"భరతుడు మహత్తర క్షమాశీలుడని, గురుజనులను గౌరవించువాడని, నేనెరుగుదును. అట్టి సత్యప్రతిజ్ఞుడైన మహాత్మునిలో కళ్యాణకరగుణాలన్నీ శోభిల్లుతూన్నాయి. వనవాసకాలమును పూర్తిచేసుకొని మరలివచ్చిన తరువాత నేను ధర్మశీలుడైన నాయీ సోదరునితో పాటు ఈ భూమండలము నేల గలను. మహారాజును కైకేయిమాత వరాలు అడిగింది. నేను వారి ఆదేశాలను స్వీకరించాను. కనుక సోదరా! భరతా! నా మాట విని నీవు – పృథ్వీపతి రాజాధిరాజు అయిన తండ్రిగారిని అపత్యబంధంనుండి విముక్తుని చేయుము.

అతులిత తేజశ్శాలురైన ఆ సోదరుల సంవాదాన్ని ఆలకించి వారి ప్రేమపూర్ణమైన పరస్పర సంభాషణలను తిలకించి అక్కడకు వచ్చినవారు కూడ విస్మితులై ముగ్ధులైపోయారు. అంతరిక్షంలో అదృశ్యరూపంతో నిలచిన మునులూ, ప్రత్యక్షంగా అక్కడ కూర్చున్న మహర్షులూ ఆ సోదరులిద్దరినీ పదేపదే ప్రశంసించారు.

తరువాత మహర్షులందరూ రామవచనానుసారం చేయవలసినదిగా భరతునికి నచ్చచెప్పారు. దానితో రామచంద్రునికి మహదానందం కలిగింది. కాని భరతునికి సంతోషం కలుగలేదని, తడబడుచున్న నోటితో అతడు చేతులు జోడించి రామునితో మరలనిట్లనెను – "ఆర్యా! ఈ రాజ్యాన్ని నేను రక్షించలేను. ఈ రాజ్యాన్ని మీరే స్వీకరించి దీని పాలనాధికారాన్ని మరెవరికైనా అప్పగించండి" అంటూనే అతడు అగ్రజుని చరణాలపై వ్రాలిపోయాడు. అంత రామచంద్రుడు అతనిని తన ఒడిలోకి తీసుకుని మధురస్వరంతో పలికాడు–

ఆగతా త్వామియం బుద్ధిః స్వజా వైనయికీ చ యా ।
భృశముత్సహసే తాత రక్షితుం పృథివీమపి ॥
(వా. రా. 2/112/16)

ఈ వినయ భరితమైన బుద్ధి నీకు సహజముగా వచ్చినది ప్రియతమా! దీనిచే నీవీ భూమండలమునంతయూ రక్షింపసమర్థుడవు.

భానుసమతేజస్వి అయిన రామచంద్రుని ప్రేమపూర్ణమైన ఉపదేశప్రదమైన వచనాలను ఆలకించి అతని దృఢత్వాన్ని తిలకించి భరతుడన్నాడు –

అధిరోహార్య పాదాభ్యాం పాదుకే హేమభూషితే ।
ఏతే హి సర్వలోకస్య యోగక్షేమం విధాస్యతః ॥
(వా. రా. 2/112/21)

"ఆర్యా! స్వర్ణభూషితమైన యీ పాదుకలపై మీ చరణాలను ఉంచండి. ఇవే యావజ్జగత్తుయొక్క యోగక్షేమాలను నిర్వహిస్తాయి".

భరతుని మహోన్నత భావాలు ధన్యమైనవి కదా! శ్రీరామచంద్ర భగవానుడు తన మంగళమయ చరణకమలాలను పాదుకలపైనుంచి వాటిని భరతునికిచ్చాడు. ఆ పాదుకలకు ప్రణమిల్లి భరతుడు శ్రీరామునితో పలికాడు –

చతుర్దశ హి వర్షాణి జటాచీరధరో హ్యహమ్ ॥
ఫలమూలాశనో వీర భవేయం రఘునన్దన ।
తవాగమనమాకాంక్షన్ వసన్ వై నగరాద్ బహిః ॥
తవ పాదుకయోర్న్యస్య రాజ్యతంత్రం పరంతప ।
చతుర్దశే హి సంపూర్ణే వర్షేఽహని రఘూత్తమ ॥
న ద్రక్ష్యామి యది త్వాం తు ప్రవేక్ష్యామి హుతాశనమ్ ।
(వా. రా. 2/112/23–26)

"వీరా! రఘునందనా! నేను కూడ పదునాలుగు వత్సరాలూ జటా, వల్కములను ధరించి, ఫలమూలాహారం భుజించి మీ రాకకై

నిరీక్షిస్తూంటాను. నగరానికి బయటనే నివసిస్తాను పరంతపా! అంతకాలమువరకు రాజకార్య భారమంతా మీ పాదుకల మీదనే ఉంటుంది." ఓ రఘుశ్రేష్ఠా! పదునాలుగు వర్షములు పూర్తియైన వెంటనే మీ దర్శనముకానిచో, అదే దినమున నేను ప్రజ్వలించుచున్న అగ్నిలో ప్రవేశించెదను.

భరతుని ఆ ప్రతిజ్ఞకు భగవానుడు ఆనందంగా అంగీకారాన్ని తెలియజేశాడు. తదనంతరం సోదరులందరికీ కైకేయీమాతతో మంచిగా వ్యవహరించాలని బోధించి యిరువురునీ హృదయమార ఆలింగనం చేసుకుని వీడ్కోలు పలుకుతాడు. తత్సమయాన భరతుని వియోగంవల్ల రామచంద్రుని రాజీవ నేత్రాలు సజలములవుతాయి.

ఆ తరువాత భరతుడు భగవంతుని పాదుకలను శిరసున ధరించి మిక్కిలి సంతోషముతో రథమునధిరోహించెను. మధ్యేమార్గంలో భరద్వాజ మహర్షిని కలిసి జరిగిన వృత్తాంతమంతా ఆయనకు వినిపించి శృంగబేరపురం మీదుగా అయోధ్యకు చేరాడు. తరువాత తల్లులను రాజభవనంలో వసింపజేసి భరతుడు గురు జనులందరితో అంటాడు –

> నన్దిగ్రామం గమిష్యామి సర్వానామన్త్రయేఽత్ర వః ।
> తత్ర దుఃఖమిదం సర్వం సహిష్యే రాఘవం వినా ॥
> గతశ్చాహో దివం రాజా వనస్థః స గురుర్మమ ।
> రామం ప్రతీక్షే రాజ్యాయ స హి రాజా మహాయశాః ॥
>
> (వా. రా. 2/115/2–3)

"ఇప్పుడు నేను నందిగ్రామానికి వెళ్ళడానికి మీ అందరి అనుమతినీ కోరుతూన్నాను. మహారాజుగారు స్వర్గం చేరడం, నాకు పరమపూజ్యుడు, గురువూ అయిన శ్రీరాముడు వనవాసంలో ఉండడం అత్యంత దుఃఖదాయక విషయము. కనుక నేను అక్కడే ఉంటూ రామవియోగంలో యీ దుఃఖాలనన్నింటినీ సహిస్తూ రాజ్యార్థం రామచంద్రుని ఆగమనానికై నిరీక్షిస్తూంటాను. కారణమేమంటారా? మహా యశస్వియైన శ్రీరామచంద్రుడే మనకందరికీ రాజు".

భరతుని పలుకులనాలకించి మంత్రులతోకూడి పురోహితుడైన వశిష్ఠ మహర్షి పలికాడు –

సుభృశం శ్లాఘనీయం చ యదుక్తం భరత త్వయా ।
వచనం భ్రాతృవాత్సల్యాదనురూపం తవైవ తత్ ॥
నిత్యం తే బన్ధులుబ్ధస్య తిష్ఠతో భ్రాతృసౌహృదే ।
మార్గమార్యం ప్రపన్నస్య నానుమన్యేత కః పుమాన్ ॥
(వా. రా 2/115/5–6)

"భరతా! భ్రాతృభక్తి ప్రేరితుడవై నీవు పలికిన పలుకులు అత్యంత ప్రశంసనీయాలు, యథార్థానికి అందుకు నీవు మాత్రమే యోగ్యుడవు. అగ్రజుని దర్శనార్థం నీవు సదా ఆతురతతో నిరీక్షిస్తూంటావు. సర్వవేళల్లోనూ అతని హితాన్నే కాంక్షిస్తూ ఉత్తమ మార్గంలో సంచరిస్తూ ఉంటావు. కనుక నీ సదభిప్రాయమును ఎవరనుమతించరు?

ఆ విధంగా అందరి అనుమతినీ తీసుకొని భరతుడు శ్రీరామచంద్రుని పాదుకలను శిరస్సుపై ధరించి శత్రుఘ్నునితో సహా నందిగ్రామం వెళ్ళిపోయాడు. రథం మీదనుండి దిగి గురుజనులతో పలికాడు –

ఏతద్రాజ్యం మమ భ్రాత్రా దత్తం సంన్యాసముత్తమమ్ ।
యోగక్షేమవహే చేమే పాదుకే హేమభూషితే ॥
X X X X
ఛత్రం ధారయత క్షిప్రమార్యపాదావిమౌ మతౌ ।
అభ్యాం రాజ్యే స్థితో ధర్మః పాదుకాభ్యాం గురోర్మమ ॥
భ్రాత్రా తు మయి సంన్యాసో నిక్షిప్తః సౌహృదాదయమ్ ।
తమిమం పాలయిష్యామి రాఘవాగమనం ప్రతి ॥
క్షిప్రం సంయోజయిత్వా తు రాఘవస్య పునః స్వయమ్ ।
చరణౌ తౌ తు రామస్య ద్రక్ష్యామి సహపాదుకౌ ॥
తతో నిక్షిప్తభారోఽహం రాఘవేణ సమాగతః ।
నివేద్య గురవే రాజ్యం భజిష్యే గురువర్తితామ్ ॥

రాఘవాయ చ సంన్యాసం దత్త్వేమే వరపాదుకే ।
రాజ్యం చేదమయోధ్యాం చ ధూతపాపో భవామ్యహమ్ ॥
(వా. రా. 2/115/14, 16-20)

"ఈ రాజ్యము నాదికాదు నా అగ్రజునిది. దీనిని రక్షించుమని అన్నగారు నాకు అప్పగించారు. అతని ఈ సువర్ణభూషిత పాదుకలే అందరి యోగక్షేమాలనూ నిర్వహిస్తాయి. ఆర్యులైన శ్రీరామచంద్రుని శ్రీ చరణాలుగా నేను వీటిని భావిస్తున్నాను. మీరు వెంటనే వీటికి ఛత్రాన్ని వేయండి. గురుతుల్యులైన జ్యేష్ఠభ్రాతృ చరణ పాదుకల ప్రభావంవల్లనే ఈ రాజ్యంలో ధర్మస్థాపన జరుగుతుంది. ప్రేమవల్లనే అతడు నాకు వీటిని జాగ్రత్తగా ఉంచగోరాడు. కనుక అతడు మరలి వచ్చేవరకూ నేను వీటిని సావధానంగా రక్షిస్తాను. అతడు మరలి రాగానే వీటిని సమర్పించి ఈ పాదుకలతో శోభించునట్టి అతని చరణాలను సందర్శిస్తాను అన్నగారి రాజ్యాన్ని పునః వారికి అప్పగిస్తాను. నాటితో నా భారమంతా దూరమైపోతుంది. అతని ఆజ్ఞాధీనుడనై నేను అతని సేవలోనే సంలగ్నుడనై ఉంటాను. రక్షణకై నావద్ద నుంచిన ఈ రాజ్యమును, పాదుకలను, అయోధ్యాదులను కూడ శ్రీరామసేవకు సమర్పించి నేను సర్వదుఃఖములనుండి, పాపములనుండి ముక్తుడనవుతాను".

అనంతరం ధైర్యవంతుడైన భరతుడు జటావల్కల ధారియై ముని వేషంతో నందిగ్రామంలో ఉండసాగాడు. అతడు రాజ్యశాసన కార్యాన్నంతటినీ భగవంతుని చరణపాదుకలకు నివేదించసాగాడు. ఆ పాదుకలకు ఛత్రంపట్టి చామరంతో వీచేవాడు. ఈరీతిగా అతడు రామచంద్రుని చరణపాదుకలకు రాజ్యాభిషేకం చేశాడు. రాజకార్యం ఏదైనా వచ్చినా ఎంతటి బహుమూల్య పురస్కారం వచ్చినా భరతుడు ప్రప్రథమంగా ఆ పాదుకలకు నివేదించి తరువాత తగిన ఏర్పాట్లు చేసేవాడు.

x x x x x

లంకా విజయానంతరం రామచంద్రుడు విభీషణునకు రాజ్యమిచ్చి సీతాలక్ష్మణ సహితంగా అయోధ్యకు మరలి రావడానికి సంసిద్ధుడయ్యాడు.

తత్సమయంలో విభీషణుడు రామచంద్రుని స్నానాదులు పూర్తి చేసుకుని వస్త్రాలంకారాలు ధరించమని కోరాడు. అప్పుడు రామచంద్రుడు భరతుని భక్తి విషయాలు స్మరించి అంటాడు –

> స తు తామ్యతి ధర్మాత్మా మమ హేతోః సుఖోచితః ।
> సుకుమారో మహాబాహుర్భరతః సత్యసంశ్రయః ॥
> తం వినా కైకయీపుత్రం భరతం ధర్మచారిణమ్ ।
> న మే స్నానం బహుమతం వస్త్రాణ్యాభరణాని చ ॥
> X X X X
> తం తు మే భ్రాతరం ద్రష్టుం భరతం త్వరతే మనః ॥
> (వా. రా. 6/121/5–6,18)

సత్యపరాయణుడు, ధర్మాత్ముడు, మహాబాహువు, సుకుమారుడు అయిన భరతుడు సమస్త ప్రకారాలైన సుఖభోగాలనుభవించ యోగ్యుడై కూడ నాకై దుఃఖాలు అనుభవిస్తున్నాడు. ధర్మచారి అయిన ఆ కైకేయీ పుత్రుడు భరతుడు లేకుండ నేను స్నానం చేసి వస్త్రాభరణాలు ధరించుట నాకెంతమాత్రం యిష్టంకాదు. ఆ సోదర భరతుని త్వరగా చూడాలని నా మనస్సు వ్యాకులమగుచున్నది." దీనినిబట్టి భరతునిపై రామచంద్రునకు ఎంత ప్రేమ ఉన్నదీ మనకు తెలుస్తున్నది.

తదనంతరం రామచంద్ర ప్రభువు సీతాలక్ష్మణులు మరియు ఇతరులందరితో పుష్పకవిమానమధిరోహించి అయోధ్యవైపు పురోగమించారు. భరద్వాజాశ్రమం దగ్గరకు చేరగానే, అతడు తన ఆగమన శుభసమాచారమును ముందుగా తెలియజేయుటకై ప్రియ భరతుని దగ్గరకు హనుమంతుని పంపాడు. నందిగ్రామం చేరిన హనుమంతుడు చూచిన దృశ్యం ఎలా ఉందో గమనించండి –

> దదర్శ భరతం దీనం కృశమాశ్రమవాసినమ్ ।
> జటిలం మలదిగ్ధాంగం భ్రాతృవ్యసనకర్శితమ్ ॥
> ఫలమూలాశినం దాన్తం తాపసం ధర్మచారిణమ్ ।
> సమున్నతజటాభారం వల్కలాజినవాససమ్ ॥

నియతం భావితాత్మానం బ్రహ్మర్షిసమతేజసమ్ ।
పాదుకే తే పురస్కృత్య ప్రశాసన్తం వసుంధరామ్ ॥
(వా. రా. 6/125/30-32)

"హనుమంతుడు చూసేసరికి భరతుడు నగరం వెలుపల గల ఆశ్రమంలో వసించి యున్నాడు. అగ్రజుని వియోగంవల్ల అతని శరీరం కృశించిపోయింది. దేహమంతా మలినంగా ఉంది. వదనం వాడిపోయింది. దానిపై దైన్యభావాలు గోచరిస్తున్నాయి. అతడు కేవలం ఫలమూలాలను మాత్రమే ఆహారంగా తీసుకొంటున్నాడు. ఇంద్రియాలు అతని ఆధీనంలో ఉన్నాయి. మస్తకంపై సమున్నతమైన జటాభారం ఉంది. వల్కలాజినాలను ధరించి అతడు ధర్మాచరణ పూర్వకంగా తపస్సు చేస్తున్నాడు. సంయమచిత్తుడై ధ్యానమగ్నుడై ఉన్నాడు. అతని తేజస్సు బ్రహ్మర్షి సమంగా ఉంది. రామచంద్రుని చరణపాదుకలను సేవిస్తూ అతడు రాజ్యపాలన చేస్తున్నాడు" భరతుని ప్రేమకు ఆకర్షితులైన మంత్రి, పురోహిత, సైన్య ప్రధానాధికారులు సయితం కాషాయ వస్త్రాలు ధరించి అతని దగ్గరే ఉండడం హనుమంతుడు తిలకించాడు. పిదప ఆంజనేయుడు భరతునికి శ్రీరామమూర్తి ఆగమన సమాచారం వివరించాడు.

ఆంజనేయుని ముఖతః భగవంతుని ఆగమన సమాచారాన్ని ఆలకించిన భరతుడు హర్షహృదయుడైపోయాడు. అతడు మైమరచిపోయాడు. కొన్ని క్షణాలకు అతడు స్వస్థచిత్తుడై హనుమంతుని హృదయానికి హత్తుకున్నాడు. ప్రేమాశ్రువులతో అతణ్ణి ముంచెత్తి అన్నాడు-

దేవో వా మానుషో వా త్వమనుక్రోశాదిహాగతః ।
ప్రియాఖ్యానస్య తే సౌమ్య దదామి బ్రువతః ప్రియమ్ ॥
(వా. రా. 6/125/43)

బహూని నామ వర్షాణి గతస్య సుమహద్వనమ్ ।
శృణోమ్యహం ప్రీతికరం మమ నాథస్య కీర్తనమ్ ॥
(వా. రా. 6/126/1)

"నా పై దయచూపి వచ్చిన నీవు దేవతవో? మానవుడవో?

సౌమ్యా? నీవు నాకు అతిప్రియమైన సందేశాన్నిచ్చినావు. బదులుగా ప్రియమైనదేమైనా నేను నీకీయగలను. నా ప్రభువు గహనారణ్యాలకు వెళ్ళి చాల సంవత్సరాలు గడచిపోయాయి. నేడే నేను నా ప్రభువుల ఆనందకర సమాచారాన్ని వింటూన్నాను.

తరువాత భరతుడు రామ వానరుల మైత్రి విషయమై ప్రశ్నించాడు. బదులుగా హనుమంతుడు వనగమనముతో ప్రారంభించి, భరద్వాజాశ్రమం చేరేవరకూ గల సమాచారమంతా వినిపించాడు. అంతా విన్న భరతుడు పరమ ప్రసన్నుడయ్యాడు. దగ్గరే నిలచివున్న శత్రుఘ్నునికి నగరాలంకరణ విషయమై ఆదేశమిచ్చి పర్వులకూ రామాగమన సమాచారాన్ని సూచించమన్నారు. ఆ శుభవార్త నాలకించిన నగరమంతయూ ప్రేమానందాల వెల్లువలో మునిగిపోయింది. అందరూ రాముని ఆగమనానికై నిరీక్షించసాగారు. ధర్మజ్ఞుడైన భరతుడు శ్రీరామపాదుకలను శిరమున ధరించి వాటికి సుందరమాలలను అలంకరించి వాటిపై సువర్ణఛత్రాన్ని అమర్చి సువర్ణభూషిత శ్వేతచామరంతో వీచుచూ పురోగమించాడు. కొలదిదూరం సాగేసరికి రామచంద్రప్రభువు తనవైపు వచ్చునట్లు కన్పడలేదు. అప్పుడు అతడు ప్రేమపూర్వకముగా హనుమంతునివైపు తిరిగి, "హనుమా! రఘుకుల భూషణుడైన శ్రీరాముడు నాకు కనిపించడం లేదేమి?" అని అంటూండగా విమానం కనిపించింది. అతడు అందులో ఆసీనుడైయున్న శ్రీరామునికి భక్తిపూర్వకంగా ప్రణమిల్లాడు. రామాజ్ఞతో ఆ విమానం పృథ్విపై దిగింది. విమానంలో ఉన్న శ్రీరాముని దర్శించి భరతుడు హర్షభరితుడైపోయాడు. అతని చరణాలపై వ్రాలిపోయాడు. చిరకాలానికి కనిపించిన సోదర భరతుని లేవనెత్తి శ్రీరాముడు తన ఒడిలో కూర్చోబెట్టుకుని ప్రేమానందపూర్వకంగా హృదయానికి హత్తుకున్నాడు. తరువాత భరతుడు లక్ష్మణుని కలిసి సీతామాతకు ప్రణమిల్లాడు.

తదనంతరం ధర్మజ్ఞుడైన భరతుడు రాముని పాదుకలను రెంటినీ అతని చరణాలకు ధరింప చేసి ముకుళిత హస్తుడై పలికాడు –

ఏతత్తే సకలం రాజ్యం న్యాసం నిర్యాతితం మయా ॥
అద్య జన్మ కృతార్థం మే సంవృత్తశ్చ మనోరథః ।
యత్త్వాం పశ్యామి రాజానమయోధ్యాం పునరాగతమ్ ॥
(వా. రా. 6/127/55–56)

"ప్రభూ! నాకు దత్తం చేసిన రాజ్యాన్నంతటినీ మీకు పునః సమర్పించాను. నేడు నా జన్మ సఫలమయింది. అయోధ్యకు మరలివచ్చిన మిమ్ములను దర్శిస్తూన్న నా మనోరథాలన్నీ నెరవేరాయి. ఇత్యాది –

అలా పలుకుతూన్న భ్రాతృప్రేమి అయిన భరతుని దర్శిస్తూన్న సుగ్రీవ విభీషణుల కనులనుండి అశ్రుధారలు ప్రవహించాయి.

రామరాజ్యాభిషేకానంతరం భరతుడు కూడ లక్ష్మణునివలెనే రామసేవలో ఉండసాగాడు. కొంతకాలం గడిచింది. శ్రీరాముడు భరతుని మామగారి సూచనానుసారం గంధర్వులను జయించి రమ్మని భరతుని పంపాడు భరతుడు రామాజ్ఞను పాలించే నిమిత్తం అక్కడకు వెళ్ళి గంధర్వులను జయించాడు. తరువాత రాముని ఆదేశానుసారం అక్కడి రాజ్యానికి తన పుత్రులను అభిషేకించి శీఘ్రంగా భరతుడు రామసన్నిధికి వచ్చినాడు. అతనికి విషయాలన్నీ నివేదించాడు. సమాచారమంతా విన్న రాముడు ప్రసన్నుడై భరతుని విశేషంగా ప్రశంసించాడు.

తదనంతరం లక్ష్మణుని త్యజించినమీదట రామచంద్రుడు తాను పరమధామం చేర నిశ్చయించుకుని రాజ్యాభిషేకం చేసుకోమని భరతునితో అంటాడు. కాని అందుకు భరతుడంగీకరించడు. అతడట్టి వచనాలను ఆలకిస్తూనే అచేతనుడైనాడు. స్వస్థచిత్తుడైన తరువాత రాజ్యాన్ని నిందిస్తూ పలికాడు –

సత్యేనాహం శపే రాజన్ స్వర్గలోకేన చైవ హి ।
న కామయే యథా రాజ్యం త్వాం వినా రఘునన్దన ॥
(వా. రా. 7/107/6)

"ప్రభూ! సత్యముపై, స్వర్గముపై శపథం చేసి నేను

పలుకుతూన్నాను. నేను మీనుండి వేరై రాజ్యాన్ని వాంఛించడం లేదు." అంత రామచంద్రుడు భరతుని సలహానుసరించి కుశలవులను రాజ్యాభిషిక్తులను చేసి, శత్రుఘ్నుని పిలచి అందరూ తిలకిస్తూండగా పరమధామం వేంచేశాడు.

వాస్తవానికి భరతుని రామభక్తి ప్రపంచేతిహాసంలో అద్వితీయమైనది. అతని త్యాగము, సంయమము, వ్రత నియమాదులన్నీ ప్రశంసనీయాలే, అనుకరణీయాలే. ఈతని చరిత్రద్వారా స్వార్థత్యాగ, వినయ, క్షమా, సహనశీలత్వ, గంభీరత్వ, సరళత్వ, వైరాగ్య, స్వామిభక్త్యాదులన్నిటినీ మనం ఆదర్శంగా తీసుకోవాలి. భక్తితో, నిష్కామభావంతో గృహస్థధర్మంలో ఉంటూ కూడ ప్రజలను శాసించునట్టి సుందరమైన ఉదాహరణ మనకు అన్యత్ర లభించడం కష్టమే.

-----oOo-----

# శ్రీ రాముని దాసానుదాసుడు శత్రుఘ్నుడు

శత్రుఘ్నుని చరిత్ర కూడ అద్భుతమైనదే. వాల్మీకి రామాయణంలో శత్రుఘ్నుడు కూడ విష్ణువు అంశావతారంగానే వర్ణింపబడ్డాడు. కాని అతని చరిత్రను మననం చేయగా శత్రుఘ్నుడు శ్రీరామచంద్రుని దాసానుదాసులలో అగ్రగణ్యుడుగా, మౌనకర్మిగా, ప్రేమిగా, సదాచారిగా మితభాషిగా, సత్యవాదిగా, విషయవిరాగిగా, సరళునిగా, తేజః పూర్ణునిగా, గురుజనానుగామిగా, వీరునిగా శత్రుఘ్నుడన్ని సద్గుణములందు సంపన్నుడుగా గోచరిస్తాడు. రామాయణంలో యితనికి సంబంధించిన విశేష వివరాలు లేకపోయినా లభించిన వివరాలతో ఈ వ్యాసాన్ని పొందుపరచగలిగాము బాల్యంనుండీ అతడు భరతుని వెంటనే ఉంటూ వచ్చాడు. కనుక భరత శత్రుఘ్నుల చరిత్ర కలసియే నడిచింది. అందువల్ల రామాయణంలో శత్రుఘ్నుని విషయమై వేరే విషయాలు వర్ణింపబడలేదు. భరతుని వ్యవహారం ద్వారా ఈతని గుణశీలాలను కూడ మనం అంచనా వేయవచ్చును.

బాలకాండలో ఈతని ప్రేమవిషయమై వర్ణిస్తూ ఇట్లు చెప్పడం జరిగింది.

> **అథైనం పృష్ఠతోఽభ్యేతి సధనుః పరిపాలయన్ ।**
> **భరతస్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః ॥**
>
> (వా. రా. 1/18/32)

"ధనుర్ధారియై లక్ష్మణుడు రాముని రక్షిస్తూ అతనివి వెన్నంటి వెడలినట్లే లక్ష్మణానుజుడైన శత్రుఘ్నుడు కూడ భరతుని వెంట ఉండేవాడు".

జనకపురంలో సోదరులందరికీ వివాహాలు ఏర్పాటై అయోధ్యకు మరలివచ్చిన కొన్నాళ్ళకే భరతుని మామ యుధాజిత్తు అతనిని

స్వదేశానికి తీసుకువెళ్ళేవేళ శత్రుఘ్నుడు కూడ అతని వెంట మాతామహుని యింటికి వెళ్ళాడు. ఆ సమయమున భరతుని యెడలగల ప్రేమతో తన తల్లిదండ్రులపై, చుట్టాలపై, నవవధువుపైన కూడ మోహములేక భరతునితో నుండుటయే పరమకర్తవ్యమని శత్రుఘ్నుడు భావించినాడు. పిదప అయోధ్యనుండి పిలుపు రాగానే భరతునితో పాటు తిరిగి వచ్చినాడు. అయోధ్యకు మరలి వచ్చిన పిదట కైకేయి కారణంగా పితృ మరణము, సీతాలక్ష్మణ సహితంగా రామవనగమన సమాచారాలను విన్న శత్రుఘ్నుడు తీవ్రవేదన చెందుతాడు. లక్ష్మణుని శౌర్యాన్ని బాగా ఎరిగిన శత్రుఘ్నుడు శోకంతో మహాశ్చర్యంగా భరతునితో అంటాడు –

గతిర్యః సర్వభూతానాం దుఃఖే కిం పునరాత్మనః ।
స రామః సత్త్వసంపన్నః స్త్రియా ప్రవ్రాజితో వనమ్ ॥
బలవాన్ వీర్యసంపన్నో లక్ష్మణో నామ యోఽప్యసౌ ।
కిం న మోచయతే రామం కృత్వాపి పితృనిగ్రహమ్ ॥

(వా. రా. 2/78/2–3)

"ఆర్యా!" దుఃఖవేళలో ఆత్మీయుడైన వ్యక్తులకేగాదు సమస్త జీవులకూ ఎవ్వడాధారమో అట్టి మహాపరాక్రమ సంపన్నుడగు శ్రీరామచంద్రుడు భార్యతో వనాలకు పంపబడ్డాడు. (ఇది ఎంతటి దుఃఖించవలసిన విషయం?) మహాబల పరాక్రమసంపన్నుడైన లక్ష్మణుడు తల్లిదండ్రులను ఈ విషయమునుండి ఆపి ఏల రాముని ఈ సంకటమునుండి విముక్తుని చేయలేదు?"

అలా సంభాషణ జరుగుతుండగానే శత్రుఘ్నుడు దుఃఖ, క్రోధసంభరితుడైపోయాడు. తత్సమయంలో రామవిరహవ్యాకులుడైన ద్వారపాలకుడు వచ్చి, "రాజకుమారా! ఏ క్రూరురాలు, పాపి అయిన మంథర కుతంత్రంతో రామచంద్రుని వనాలకు పంపినదో ఆమె వస్త్రాలంకార భూషితయై నిలచి ఉంది." అనగా విన్న శత్రుఘ్నునకు మహాక్రోధం వచ్చింది. అతడు మంథర సిగను పట్టుకుని ప్రాంగణంలోకి ఈడ్చుకు రాసాగాడు. అది చూసిన ఆ కుబ్జసఖురాండ్రందరూ విలపించసాగారు. దయామయురాలైన కౌసల్యను మనం శరణు వేడకపోతే

శత్రుఘ్నుడు మనలను కూడ విడిచిపెట్టడు అనుకుంటూనే వారందరూ కౌసల్యాదేవి దగ్గరకు వెళ్ళిపోయారు. మంథరను విడిపించాలని కైకేయిరాగా శత్రుఘ్నుడు ఆమెనుగూడ గద్దిస్తాడు. చిట్టచివరకు భరతుడు వచ్చి స్త్రీలు అవధ్యులంటూ, శత్రుఘ్నునకు ఈ విధంగా నచ్చచెప్పుతాడు.

ఇమామపి హతాం కుబ్జాం యది జానాతి రాఘవః ।
త్వాం చ మాం చైవ ధర్మాత్మా నాభిభాషిష్యతే ధ్రువమ్ ॥
(వా. రా. 2/78/23)

"సోదరా! ఈకుబ్జ నీచేతిలో అంతమైపోతే రామచంద్రుడు నీతోనే కాదు నాతోకూడ నిశ్చయంగా మాట్లాడటం విడనాడుతాడు. భరతుని వచనాల నాలకించిన శత్రుఘ్నుడు కుబ్జను మూర్ఛితావస్థలోనే విడిచిపెట్టాడు.

ఈ ప్రసంగం ద్వారా – రామచంద్రుని ధర్మనీతిలో స్త్రీ ఎట్టి స్థితిలోనైననూ అవధ్యయే అన్న విషయముతో సహా, స్త్రీ జాతిని రామచంద్రుడు ఎంతగా ఆదరించేవాడో అన్న అంశం మనకు స్పష్టమవుతూన్నది. మరో విషయం శోకాకుల స్థితిలో కూడ భరతుడు శత్రుఘ్నునకు నచ్చచెప్పి, అతణ్ణి అధర్మం నుండి వారించినాడు. మూడో విషయం – క్రోధాతురుడైననూ శత్రుఘ్నుడు అన్నగారి ఆదేశాన్ని మన్నించాడు. అనంతరం రామచంద్రుని వనవాసం నుండి తీసుకురావడానికి భరతునితోపాటు శత్రుఘ్నుడుకూడా వెళ్లినాడు. చిత్రకూటమును సమీపించి భరతుని ఆదేశానుసారం అతడు శ్రీరాముని పర్ణకుటీరమును అన్వేషిస్తాడు. ఎప్పుడైతే భరతుడు శ్రీరాముని చూచి అతనివైపు పరుగెత్తెనో, అపుడు శ్రీరామదర్శనోత్సుకుడైన శత్రుఘ్నుడు కూడా అతని వెంట వెళ్లినాడు. ఆ సందర్భమున కవి అంటాడు –

శత్రుఘ్నశ్చాపి రామస్య వవన్దే చరణౌ రుదన్ ।
తావుభౌ చ సమాలిఙ్గ్య రామోऽప్యశ్రుణ్యవర్తయత్ ॥
(వా.రా. 2/99/40)

శత్రుఘ్నుడు కూడ రోదిస్తూ శ్రీరామచరణాలకు వందనం చేశాడు.

వారిద్దరినీ హృదయానికి హత్తుకుని శ్రీరాముడు కన్నీరు కార్చాడు. తరువాత శత్రుఘ్నుడు అగ్రజుడైన లక్ష్మణుని, సీతాదేవినికూడ అత్యంత ప్రేమగా కలిశాడు. అందరూ సమావేశమయ్యారు. సంభాషణ ఆరంభమయింది. అక్కడ రామభరతుల సంవాదంలో లక్ష్మణ శత్రుఘ్నుల అవసరం ఎంతమాత్రం లేదు, శత్రుఘ్నుడు తన జీవితాన్ని రామసేవకుడైన భరతునకు అర్పించివేశాడు. కనుక అతని పక్షంలో ఏమి చెప్పాలన్నా భరతుడు చెప్పేవాడు. పాదుకలు తీసుకుని అయోధ్యకు మరలి వచ్చే వేళ సోదరులిద్దరూ మరల రామచంద్రునకు ప్రదక్షిణం చేసి అతని చరణాలకు ప్రణమిల్లారు. లక్ష్మణునివలెనే శత్రుఘ్నుని స్వభావం కూడ తేజోవంతమైనదే. కైకేయిపై అతనికి కోపమన్న విషయం రామచంద్రునకు తెలుసు. తత్కారణంవల్ల వీడ్కోలు పలికే వేళలో శ్రీరాముడు శత్రుఘ్ననికి వాత్సల్యంతో ఉపదేశిస్తూ పలికాడు –

మాతరం రక్ష కైకేయీం మా రోషం కురు తాం ప్రతి ॥
మయా చ సీతయా చైవ శప్తోఽసి రఘునన్దన ।
(వా. రా. 2/112/27–28)

"రఘునందనా! శత్రుఘ్నా! సీతపై, నాపై శపథం చేసి నేను నీకు చెబుతున్నాను, నీవు కైకేయీ మాతను సేవించాలే కానీ ఎన్నడూ ఆమెపై కోపపడవలదు."

దీనినిబట్టి కూడ శత్రుఘ్ననకు రామచంద్రునిపై ఎంతటి భక్తిపూరిత ప్రేమ భావాలున్నదీ మనకు తెలియవస్తుంది. తరువాత శత్రుఘ్నుడు భరతునితో అయోధ్యకు మరలి వచ్చిన పిదప అగ్రజుని ఆదేశానుసారం రాజ్య పరివారాదులను సేవించాడు. ప్రతిస్థితిలోనూ అతడు భరతునివెంట ఉంటూ అతని ఆదేశాలకై నిరీక్షిస్తూండేవాడు. భరతునకు కూడ శత్రుఘ్ననిపై అచంచల విశ్వాసం ఉండేది. అందులకే అతడు చిన్నవి, గొప్పవి అగుకార్యాలన్నింటిలో అతనినే ఆదేశించేవాడు.

ఆ తరువాత శ్రీరాముడు మరలి వచ్చేవరకూ శత్రుఘ్నుని విషయమై వాల్మీకి రామాయణంలో ఉల్లేఖించదగిన విషయమేదీ కానరాదు.

హనుమంతునిద్వారా శ్రీరామాగమన సమాచారం విని భరతుని ఆదేశానుసారం శత్రుఘ్నుడే శ్రీరాముని స్వాగతసత్కారార్థం నగరాలంకరణము, రాజమార్గములను, ఇతరమార్గములను అలంకరించు ఏర్పాట్లు చేస్తాడు. రామరాజ్యాభిషేకానంతరం కూడ భరతునితోపాటు రామసేవాకార్యాలు ఆచరిస్తూంటాడు. అగ్రజుడుకావడంవల్ల లక్ష్మణ శత్రుఘ్నులపై సమానాధికారమే ఉన్నా భరతుడు తన పనులన్నింటినీ శత్రుఘ్నుని ద్వారానే కొనసాగించాడు.

సీతా వనవాసానంతరం అనేకమంది మహర్షులు శ్రీరాముని సన్నిధికి వచ్చి లవణాసురుని అత్యాచారాలను గురించి వివరించారు. రాముడు వారికి ధైర్యం చెప్పి లవణాసురుని వధించడానికి భరత శత్రుఘ్నులలో ఎవరికి అనుమతి నివ్వాలి? అని ప్రశ్నించగా భరతుడు– "నాకు ప్రభువులు సెలవిస్తే వాణ్ణి నేను అంతం చేస్తాను" అన్నాడు. భరతుని పలుకులు విని శత్రుఘ్నుడు తన ఆసనం నుండి లేచి శ్రీరామునికి ప్రణమిల్లి పలికాడు.

కృతకర్మా మహాబాహుర్మధ్యమో రఘునన్దన ॥
ఆర్యేణ హి పురా శూన్యా త్వయోధ్యా పరిపాలితా ।
సంతాపం హృదయే కృత్వా ఆర్యస్యాగమనం ప్రతి ॥
దుఃఖాని చ బహూనీహ అనుభూతాని పార్థివ ।
శయానో దుఃఖశయ్యాసు నన్దిగ్రామే మహాయశాః ॥
ఫలమూలాశనో భూత్వా జటీ చీరధరస్తథా ।
అనుభూయేదృశం దుఃఖమేష రాఘవనన్దనః ॥
ప్రేష్యే మయి స్థితే రాజన్న భూయః క్లేశమాప్నుయాత్ ।

(వా.రా. 7/62/11–15)

"రఘునాథా! భరతుడు మీ కార్యాలను ఎన్నిటినో ఆదినుండీ కొనసాగించాడు. ఏలనన, మీ వియోగతాపంలో ఉంటూ అతడు మీకై ప్రతీక్షిస్తూ అయోధ్యను పాలించాడు. ప్రభూ! మహాకీర్తిశాలియైన భరతుడు నందిగ్రామంలో తృణ శయ్యపై పరుండి కందమూల ఫలాలను భుజించి, జటా చీరలను ధరించి మీ వియోగ కాలాన్ని గడిపాడు. అట్టి దుఃఖాలను

అనుభవించిన తరువాత కూడ ఈ దాసుడుండగా అతడు లవణాసుర సంహారరూప కష్టాన్ని అనుభవించకూడదు" అని శత్రుఘ్నుడు పలుకగా రామచంద్రుడన్నారు -

ఏవం భవతు కాకుత్స్థ క్రియతాం మమ శాసనమ్ ।
రాజ్యే త్వామభిషేక్ష్యామి మధోస్తు నగరే శుభే ॥
నివేశయ మహాబాహో భరతం యద్యవేక్షసే ।
శూరస్త్వం కృతవిద్యశ్చ సమర్థశ్చ నివేశనే ॥
రాజ్యం ప్రశాధి ధర్మేణ వాక్యం మే యద్యవేక్షసే ।
ఉత్తరం చ న వక్తవ్యం శూర వాక్యాన్తరే మమ ॥
(వా. రా. 7/62/16-17,20)

"సోదరా! అట్లే అగును గాక! నీవు నా ఆదేశాన్ని పాలించు. మధుదైత్యుని సుందరమైననగరమునకు నిన్ను రాజ్యాభిషిక్తునిగా చేయుదును. మహాబాహూ! భరతునకు నీవు కష్టం కలిగించకపోవడం మంచిదే. భరతుణ్ణి యిక్కడే ఉండనిమ్ము. నీవు మహావిద్వాంసుడవు శూరవీరుడవు నగర నిర్మాణ ఆరోపవ్యవస్థలు మొదలగువాని ఏర్పాట్లలో సమర్థుడవు. నీవు నా మాటను వినదలిస్తే ధర్మపూర్వకంగా అక్కడి రాజ్యాన్ని పాలించు.

వీరా! నా యీ ఆదేశానికి వ్యతిరేకంగా నీవేమీ మాట్లాడరాదు, అన్న రామప్రభుని మాటలను ఆలకించి శత్రుఘ్నుడు తీవ్రలజ్జితుడై నెమ్మదిగా పలికాడు.

అధర్మం విద్మ కాకుత్స్థ అస్మిన్నర్థే నరేశ్వర ।
కథం తిష్ఠత్సు జ్యేష్ఠేషు కనీయానభిషిచ్యతే ॥
అవశ్యం కరణీయం చ శాసనం పురుషర్షభ ।
తవ చైవ మహాభాగ శాసనం దురతిక్రమమ్ ॥
త్వత్తో మయా శ్రుతం వీర శ్రుతిభ్యశ్చ మయా శ్రుతమ్ ।
నోత్తరం హి మయా వాచ్యం మధ్యమే ప్రతిజానతి ॥
వ్యాహృతం దుర్వచో ఘోరం హన్తాస్మి లవణం మృధే ।

తస్యైవం మే దురుక్తస్య దుర్గతిః పురుషర్షభ ॥
ఉత్తరం నహి వక్తవ్యం జ్యేష్ఠేనాభిహితే పునః ।
అధర్మసహితం చైవ పరలోకవివర్జితమ్ ॥
సోఽహం ద్వితీయం కాకుత్స్థ న వక్ష్యామీతి చోత్తరమ్ ।
(వా రా. 7/63/2-7)

"రాజా! అన్నయగు భరతుడుండగా చిన్నవాడినైన నాకు రాజ్యాభిషేకం ఎలా జరుగుతుంది? ఈకార్యంలో నాకు అదర్మం గోచరమవుతున్నది. మీ ఆజ్ఞను తప్పక పాలించవలసినదే ఏలనన పురుషోత్తమా! మీ ఆదేశాన్ని పాలించకపోవడం ఘోరపాపమవుతుంది మహావీరా! నేను మీవల్ల వేదశాస్త్రాలవల్ల కూడా విన్నది యిదియే. లవణాసురసంహారార్థం బరతుని పంపదలచిన మీ పలుకుల నాలకించిన తరువాత నేను మౌనంగా ఉండవలసినది లవణాసురుణ్ణే సంహరిస్తాను" అని నేను దుర్వచనాలు పలకడం దోషమే. ఓ పురుషశ్రేష్ఠా! ఈ దురుక్తివల్లనే నాకు రాజ్యాభిషేక రూపమైన దుర్గతి కలిగింది అన్న గారు ఆదేశించిన తరువాత నేను బదులు పలుకకుండా ఉండవలసినది. ఏలనన అలా చేయడం అధర్మమేకాదు పరలోక విరుద్ధం కూడ అవుతుంది కనుక రఘువీరా! ఇక నేను మరల ఏమీ బదులు పలుకను. మీ యిష్టప్రకారమే చేయ నేను సంసిద్ధంగా ఉన్నాను.

ఎంత సుందరమైన త్యాగము? శ్రీరామవియోగంలో అతడు రాజ్యప్రాప్తిని దుర్గతిగా భావించాడు. వాస్తవవిషయమదియే కదా! సాధకులు ఈ విషయమై విశేషధ్యానాన్ని వహించాలి.

తదనంతరం శత్రుఘ్నుడు లవణాసురునిపై దండెత్తాడు. తత్సమయంలో రామచంద్రుడు శత్రుఘ్నునకు లవణాసుర సంహారోపాయం వివరించాడు. దారిలో వ్యయాదుల నిమిత్తం విశేషధనాన్నీ, విశాలసైన్యాన్ని తోడుగా ఇచ్చి రామచంద్రుడు శత్రుఘ్నుని పంపాడు. మధ్యే మార్గంలో పురోగమించేవేళలో శత్రుఘ్నుడు వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఒక రోజు ఆగాడు. ఆ రోజున సీతాదేవి కుశ, లవ నామాలుకల కవలలను ప్రసవించింది. తత్కారణంవల్ల కూడ ఆ రాత్రి శత్రుఘ్నునకు

మహానందప్రదమే అయింది. తరువాత శత్రుఘ్నుడు అక్కడనుండి పురోగమించి మార్గంలో ఏడు రోజుల కాలం అచ్చటచ్చట ఆగుతూ యమునా తీరంలోని చ్యవనమహర్షి ఆశ్రమం చేరాడు.

అక్కడ ఆ ముని శ్రేష్ఠునిద్వారా లవణాసురుని దినచర్యనూ వాని బల పరాక్రమాదులనూ గ్రహించాడు. తరువాత లవణాసురుడు తన యింటినుండి ఆహారార్థం అడవికి పోయిమరలి వచ్చే వేళకు ముందుగానే శత్రుఘ్నుడు వెళ్ళి నగరద్వారాన్ని నిరోధించాడు. శత్రుఘ్నుని చూసి లవణాసురుడు నీవల్ల ఏమవుతుందిరా? నరాధమా! నీవంటి వేలాది నరులను నేను నిత్యం భక్షించి వేస్తాను". అన విని శత్రుఘ్నుడు తన పరిచయం చేసికొని నీతో యుద్ధం చెయ్యాలనుకుంటున్నాను అన్నాడు. తరువాత వారిద్దరి మధ్య ఘోరయుద్ధం జరిగింది. చివరకు శత్రుఘ్నుడు ఆకర్ణాంతం ధనుస్సును లాగి ఓ దివ్యబాణాన్ని వాని వక్షఃస్థలం మీద కొట్టాడు. అది వాని వక్షఃస్థలాన్ని చీల్చి వేసి పాతాళంలో ప్రవేశించి మరల తిరిగి వచ్చి అతని అంబులపొదిలో ప్రవేశించింది. దేవ, మహర్షి గణాలు శత్రుఘ్నుని ప్రశంసించసాగాయి అంబరమార్గం నుండి జయజయ ధ్వానాలతో పూలవాన కురిసింది.

ఆ విధంగా లవణాసురుణ్ణి అంతం చేసి మధురాపురాన్ని నివాసయోగ్యముగా చేసికొని, రాజ్యప్రబంధమును ఏర్పాటు చేసి పన్నెండు సంవత్సరాల తర్వాత శత్రుఘ్నుడు శ్రీరామసందర్శనార్థం అయోధ్యకు మరలి వచ్చాడు. వచ్చే వేళలో అతడు పునః వాల్మీకి ఆశ్రమంలో ఆగాడు. అక్కడ మధుర స్వరంలో గానం చేయబడుతున్న శ్రీమద్రామాయణము నాలకించాడు. దానినాలకించిన అతని హృదయం కరుణతో నిండిపోయింది రాత్రి అతడు అక్కడే పరుండి శ్రీరామచంద్రుని గురించియే యోచించసాగాడు.

అతనికి నిద్ర పట్టలేదు. తెల్లవారగా నిత్య కర్మానంతరం అతడు మహర్షి ఆదేశానుసారం రామ దర్శనోత్కంఠతో అయోధ్య వైపు పురోగమించాడు. అయోధ్య చేరి రాముని భవనంలో ప్రవేశించి

సింహాసనంపై విరాజిల్లుతూ మహేంద్రసముడైన రామచంద్రునకు ప్రణమిల్లి పలికాడు– "ప్రభూ! మీ ఆదేశానుసారం నేను లవణాసురుణ్ణి అంతం చేసి అక్కడ నగర నిర్మాణం చేసి వచ్చాను."

ద్వాదశైతాని వర్షాణి త్వాం వినా రఘునన్దన ।
నోత్సహేయమహం వస్తుం త్వయా విరహితో నృప ॥
స మే ప్రసాదం కాకుత్స్థ కురుష్వామితవిక్రమ ।
మాతృహీనో యథా వత్సో న చిరం ప్రవసామ్యహమ్ ॥
(వా. రా. 7/72/11–12)

"రఘునాథ ప్రభూ! ఈ పన్నెండేళ్ళూ నేను మీ వియోగంలో అతి కష్టంమీద గడిపాను. ఇక నేను మీరు లేకుండ అక్కడ నివసించగోరను కనుక ఓ మహాపరాక్రమవంతా! రఘునందనా! తల్లిలేని పిల్లవాడు చిరకాలం ఉండ జాలనట్లు నేను మీకు దూరంగా ఉండకుండా దయచూపండి."

శత్రుఘ్నుని పలుకులనాలకించి శ్రీరాముడు అతన్ని తన హృదయానికి హత్తుకుని – "వీరా! విచారించకు. ఇది క్షత్రియ స్వభావానురూపమైనది కాదు. క్షాత్రధర్మానుసారం నీవు ప్రజలను పాలించాలి. అప్పుడప్పుడు నన్ను కలవడానికి వచ్చి పోతూండవచ్చును." అన్న రాముని ఆదేశాన్ని శత్రుఘ్నుడు దీనవాణితో అంగీకరించాడు. తరువాత భరత లక్ష్మణులను కలిసి, అందరికీ ప్రణమిల్లి మధురాపురికి వెళ్లి పోయాడు. తరువాత రామభగవానుడు పరమధామాన్ని వేంచేయుటకు పూర్వము శత్రుఘ్నుని పిలిచాడు. అప్పుడు శత్రుఘ్నుడు తన పుత్రులకు రాజ్యాభిషేకం చేసి అయోధ్యకు వచ్చాడు. శ్రీ రామచంద్రునికి ప్రణమిల్లి గద్గద స్వరంలో పలికాడు –

కృత్వాభిషేకం సుతయోర్ద్వయో రాఘవనన్దన ।
తవానుగమనే రాజన్ విద్ధి మాం కృతనిశ్చయమ్ ॥
న చాన్యదద్యవక్తవ్యమతో వీర న శాసనమ్ ।
విహన్యమానమిచ్ఛామి మద్విధేన విశేషతః ॥
(వా. రా. 7/108/14–15)

రఘునాథ ప్రభూ! నా కుమారులిద్దరికీ రాజ్యాభిషేకం చేసినాను మీ వెంటవచ్చుటకు నిశ్చయించుకుని వచ్చాను. వీరా! ఇక మీరు నాకు మరి ఎట్టి ఆజ్ఞా ఇవ్వకండి.

ఏమంటారా? ఎవరిద్వారానూ, విశేషించి నావంటి అనుయాయి ద్వారా మీ ఆజ్ఞోల్లంఘనం జరుగుట నాకిష్టములేదు. ఇంతవరకూ ఎన్నడూ నేను మీ ఆదేశాన్ని ఉల్లంఘించలేదు. కనుక యిప్పుడు కూడ నేను మీ ఆదేశాన్ని దాటకుండ ఉండేటట్లు మీరేకాపాడాలి."

శ్రీరామభగవానుడు శత్రుఘ్నుని ప్రార్థనను మన్నించాడు. అతడు కూడ రామచంద్రునితో పరమధామం చేరుకున్నాడు. శత్రుఘ్నుని యీ సంక్షిప్తజీవన చరిత్ర కేవలం వాల్మీకి రామాయణం ఆధారంగా వ్రాయబడింది. ఈ రచనలో యితరేతర రామాయణాలనుండి కాని, పురాణాలనుండి కాని ఏ విషయము తీసుకోబడలేదు. ఈ కారణంవల్ల అతని ప్రేమగుణ సంబంధమైన సమగ్ర వర్ణన పాఠకులకు అందజేయ లేక పోయినాను. దీనికై క్షమా ప్రార్థన వినా నేనేమి చేయగలను?

---oOo---

# రామ భక్తుడు – హనుమంతుడు

హనుమంతుడు శ్రీరాముని సర్వోత్తమ దాస భక్తుడు. వాయుదేవుని అంశవల్ల అంజనీదేవికి ప్రాదుర్భవించాడు. హనుమంతుడు బాలబ్రహ్మచారి. మహావీరుడు, అతిశయబలశాలి, మహాధీశాలి, చతురశిరోమణి, విద్వాంసుడు, సేవాధర్మాచార్యుడు, సర్వథా నిర్భయుడు, సత్యవాది, స్వామి భక్తుడు, భగవంతుని తత్త్వరహస్యగుణ ప్రభావాలను చక్కగా ఎరిగినవాడు, మహావిరక్తుడు, సిద్ధుడు, పరమప్రేమికుడైన భక్తుడు, సదాచారియైన మహాత్ముడు యుద్ధ విద్యానిపుణుడై ఇచ్ఛానురూపధారణా సమర్థుడై శ్రీరామ భగవానుని నామ, గుణ, స్వరూప లీలానురక్తుడై యున్నాడు. ఇప్పటికీ రఘునాథుని కీర్తనలు కొనసాగే స్థానాలలో హనుమంతుడు ఏదో రూపంలో ఉంటాడని అంటారు. కానీ శ్రద్ధలేకపోవడంతో అతనిని జనులు గుర్తింపజాలకున్నారు.

హనుమంతుని గుణాలు అపారములు, భగవంతుని మరియు భక్తులయొక్క గుణాలను ఏ మనుష్యుడైనా ఎట్లు వర్ణించశక్తుడు? ఈ విషయమై ఎంతగా వ్రాసినా అది అల్పమైనదే అవుతుంది. ఇక్కడ హనుమచ్చరిత్రలద్వారా గుణవిశేషాలు చూచాయగా తెలుస్తాయి.

ప్రప్రథమంగా పంపాసరోవరం దగ్గర రామలక్ష్మణులు హనుమంతుని కలిసిన ప్రసంగంలో అతని వినయ, పాండిత్య, దక్షత, దైన్య, ప్రేమ, శ్రద్ధాదిగుణాలన్నీ అతి విలక్షణమైనవని తెలుస్తాయి.

మంత్రి సమేతంగా ఋష్యమూకపర్వతముపై నున్న సుగ్రీవునికి పంపాసరోవరంవద్ద ధనుర్బాణధారులూ, విశాలబాహులూ, మహాపరాక్రమవంతులూ అయిన వీరపురుషులిద్దరు తమవైపు వస్తూ ఉండడం కనిపించెను. వారిని తిలకిస్తూనే భయభీతుడైన సుగ్రీవుడు హనుమంతుని పిలచి – "హనుమా! నువ్వు వెళ్ళి వారిని పరీక్షించి రా.

వారు వాలిపంపగా వస్తూన్నవారైతే సంకేతంగా నువ్వు సూచన చేస్తే నేను వెంటనే ఈ పర్వతం విడిచి వెళ్ళిపోతాను" అన్నాడు.

సుగ్రీవాజ్ఞతో హనుమంతుడు బ్రహ్మచారి రూపాన్ని ధరించి రామచంద్రునివద్దకు వెళ్ళి ప్రణమిల్లి ప్రశ్నించాడు. రామచరితమానసంలో తులసీదాసుగారు అతని ప్రశ్నలను యిలా వర్ణిస్తారు –

కో తుమ్హ స్యామల గౌర సరీరా । ఛత్రీ రూప ఫిరహు బన బీరా ॥
కఠిన భూమి కోమల పద గామీ । కవన హేతు విచరహు వన స్వామీ ।
కీ తుమ్హ తీని దేవ మహఁ కోఉ । నర నారాయన కీ తుమ్హ దోఉ ॥
జగ కారన తారన భవ భంజన ధరనీ భార ।
కీ తుహ్మ అఖిల భువన పతి లీన్హ మనుజ అవతార ॥
(రామచరితమానస్. కిష్కింధాకాండ – దో.1 అంతర్గత)

"ఓ వీరులారా! శ్యామలగౌర శరీరులైన మీరెవరు? క్షత్రియరూపములలోనున్న మీరేల వనములో సంచరించుచున్నారు. కోమలచరణములుగల మీరు ఈ కఠోరభూమిపై విహరించుటకు హేతువేమి? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను త్రిమూర్తులలో మీరెవ్వరు? లేక మీరుభయులు నరనారాయణులా! మీరీ జగత్తుకు మూలకారకులా? లోకములన్నింటికీ స్వామి యైన భగవానులేనా? జనులను భవసాగరమునుదాటించుటకు మనుష్యావతారము దాల్చిన వారా?"

అధ్యాత్మ రామాయణంలోని వర్ణనకూడ యించుమించు యిలాగే ఉంది. అంతే కాకుండ అందులో రామచంద్రుడు హనుమంతుని వైదుష్యమును ప్రశంసిస్తూ లక్ష్మణునితో అంటాడు.

"లక్ష్మణా! చూడుము! బ్రహ్మచారి వేషంలో యితడెంత అందంగా మాట్లాడుతున్నాడు? ఇతడు శబ్దశాస్త్రాన్ని విశేషంగా అధ్యయనం చేశాడనడంలో సందేహం లేదు. ఇంతగా భాషించినా యితని సంభాషణలో ఒక్క దోషం కూడ రాలేదు."

వాల్మీకి రామాయణంలో రామచంద్రుడు ఇంకా విశేషంగా పలికాడు– "ఇతడవశ్యం సమస్త వేదాలనూ అధ్యయనం చేశాడు. లేకుంటే యితడిలా ఎలా సంభాషించగలుగుతాడు? హనుమంతుని సంభాషణాన్ని గురించి రామచంద్రుడు ప్రశంసిస్తూ చిట్టచివరగా అంటాడు –

ఇట్టి బుద్ధిశాలివైన దూతగల రాజుయొక్క కార్యాలన్నీ ఆ దూతయొక్క సంభాషణ మాత్రం చేతనే సిద్ధిస్తాయి.

రామచరిత మానసంలో హనుమంతుని గూర్చిన వర్ణన అత్యంత ప్రేమపూర్ణంగా సాగింది. తనను గురించి పూర్తిగా పరిచయం చేసిన తరువాత రామచంద్రుడు హనుమంతుని "విప్రవర్యా! మీరెవరు?" అని ప్రశ్నించగానే హనుమంతుడు శ్రీరామచంద్రమూర్తి ప్రభువును బాగుగా గుర్తించి శీఘ్రంగా అతని చరణాలపై వాలినాడు. దానితో అతని శరీరం పులకించి పోతుంది. అతని నోట మాటరాదు. అతడు నిర్నిమేషనేత్రాలతో భగవంతుని రూపమాధుర్యాన్నీ, విచిత్రవేషాన్నీ తిలకిస్తూంటాడు. ఎట్టి అలౌకిక ప్రేమ? ఆపై ధైర్యం వహించి భగవంతునితో అంటాడు –

మోర న్యాఉ మైం పూఛా సాఈం । తుమ్హ పూఛహు కస నర కీ నాఈం ॥
తవ మాయా బస ఫిరఉం భులానా । తాతే మైం నహిం ప్రభు పహిచానా ॥
ఏకు మైం మంద మోహబస కుటిల హృదయ అగ్యాన ।
పుని ప్రభు మోహి బిసారేఉ దీనబంధు భగవాన ॥
జదపి నాథ బహు అవగున మోరే । సేవక ప్రభుహి పరై జని భోరే ॥
(రా.మా. కిష్కింధకాండ. 2–3 అంతర్గత)

"ఓ ప్రభూ! నేనడిగినది న్యాయమే. కాని మీరు ఒక సాధారణ మానవునివలె ఎట్లడుగుచున్నారు? నేను మీ మాయావశమున మిమ్ముల మరచినాను. అందువలననే, సాక్షాత్ స్వామివైన మిమ్ముల గుర్తించలేకపోయితిని. పైగా నేను మందుడను, మోహవశుడను, కశ్మలహృదయుడను, జ్ఞానహీనుడను, ఓ కరుణామూర్తీ! ప్రభూ! మీరుకూడా నన్ను మరచినారా? హే నాథా! నాలో ఎన్నో అవగుణములున్నప్పటికీ, మీవంటి స్వామి సేవకుని మరువకూడదు.

ఎంతటి ప్రేమదైన్య భావాలు? తరువాత సుగ్రీవుని పరిస్థితిని వినయపూర్వకముగా వివరించి సోదరులనిద్దరినీ తన భుజాలపై కూర్చో బెట్టుకుని వారిని సుగ్రీవుని దగ్గరకు తీసుకువెడతాడు అక్కడ ఇరుపక్షాల విషయాలను వినిపించి అగ్ని సాక్షిగా శ్రీరామసుగ్రీవులకు మైత్రిని చేకూరుస్తాడు. వాలిని హతమార్చి శ్రీరామచంద్రుడు లక్ష్మణ సహితంగా ప్రవర్షణపర్వతముపై నివసించి వర్షఋతుకాలమును గడుపుతారు. అక్కడ సుగ్రీవుడు రాజ్యము, ఐశ్వర్యము భార్యాదులు లభించడంతో భోగాలలో పడి భగవత్కార్యాన్ని విస్మరిస్తాడు. అది చూచిన హనుమంతుడు రాజనీతి ననుసరించి సుగ్రీవునికి భగవత్కార్యాన్ని గుర్తుచేస్తాడు. అతని ఆదేశానుసారం సుగ్రీవుడు వానరులను సమావేశపరచి దేశదేశాంతరాలకు దూతలను పంపుతాడు. ఎంతటి బుద్ధి చాతుర్యమో?

తదనంతరం సీతాన్వేషణార్థం సర్వదిశలకూ వానరులను పంపు సమయమున సుగ్రీవునకు హనుమంతునిపైగల అచంచల దృఢ విశ్వాసం ఎలాంటిదో శ్రీరామచంద్రునకు అతని కార్యకుశలత్వంపైగల నమ్మకం ఎట్టిదో మనకు తెలుస్తుంది. అక్కడ రాముని సమక్షములోనే సుగ్రీవుడు హనుమంతునితో అంటాడు.

న భూమౌ నాన్తరిక్షే వా నామ్బరే నామరాలయే ।
నాప్సు వా గతిభంగం తే పశ్యామి హరిపుంగవ ॥
సాసురాః సహగన్ధర్వాః సనాగనరదేవతాః ।
విదితాః సర్వలోకాస్తే ససాగరధరాధరాః ॥
గతిర్వేగశ్చ తేజశ్చ లాఘవం చ మహాకపే ।
పితుస్తే సదృశం వీర మారుతస్య మహౌజసః ॥
తేజసా వాపి తే భూతం న సమం భువి విద్యతే ।
తద్యథా లభ్యతే సీతా తత్త్వమేవానుచిన్తయ ॥
త్వయ్యేవ హనుమన్నస్తి బలం బుద్ధిః పరాక్రమః ।
దేశకాలానువృత్తిశ్చ నయశ్చ నయపండిత ॥

(వా.రా. కిష్కింధాకాండ. 44/3–7)

"కపిశ్రేష్ఠా! నీగమనానికి పృథ్వియందుగాని, అంతరిక్షమందుగాని,

ఆకాశమునందుగాని, స్వర్గమునందుగాని, జలమునందుగాని ఎక్కడ అంటకం లేదు దేవతల, అసురుల, గంధర్వ నాగ నరలోకములన్నింటి జ్ఞానమేగాక, అక్కడి సముద్రములు, పర్వతములతో సహా అన్నింట జ్ఞానము నీకు చక్కగాగలదు. మహాకపీ! గతి, వేగ, తేజ, లాఘవాదులలో నీవు మహాబలశాలివై నీ తండ్రియైన వాయుదేవతా సముడవు. వీరా! ఈ భూమండలంలో నీతో సమాన తేజస్సుగల ప్రాణి మునుపు గాని ఇప్పుడుగాని లేదు. కనుక జానకీదేవి లభించునట్టి ఉపాయాన్ని నీవే ఆలోచించి చెప్పుము. హనుమంతా! నీవు నీతి శాస్త్రవిశారదుడవు బలబుద్ధి పరాక్రమములలో దేశకాలాలననుసరించుట, నీతితో వ్యవహరించుట మొదలైన గుణములన్నీ ఒక్కసారిగా నీలోనే కానవస్తున్నాయి.

అలా పలికిన సుగ్రీవుని వచనాల నాలకించిన రామచంద్రుడు హనుమంతుని తిలకిస్తూ తన కార్యం సిద్ధించినదనియే భావించాడు. మనసా అతడత్యంత ప్రసన్నుడై స్వనామాంకితాక్షరయుక్తమైన ఓ అంగుళీయకాన్ని హనుమంతుని చేతిలోనుంచి పలికెను -

అనేన త్వాం హరిశ్రేష్ఠ చిహ్నేన జనకాత్మజా ।
మత్సకాశాదనుప్రాప్తమనుద్విగ్నానుపశ్యత ॥
వ్యవసాయశ్చ తే వీర సత్త్వయుక్తశ్చ విక్రమః ।
సుగ్రీవస్య చ సందేశః సిద్ధిం కథయతీవ మే ॥

(వా.రా.కిష్కింధా. 44/13-14)

కపిశ్రేష్ఠా! ఈ చిహ్నంద్వారా నీవు నా దగ్గరనుండియే వచ్చిన వాడవని జానకి విశ్వసిస్తుంది. ఆపై ఆమె నిర్భయంగా నిన్ను చూచిమాటలాడుతుంది. వీరశ్రేష్ఠా! నీ నిశ్చయ, ధైర్య, పరాక్రమాదులు, సుగ్రీవుని సందేశమువలన నీద్వారానే ఈ కార్యం అవశ్యం సిద్ధించబడుతుందని తెలుస్తున్నది.

అధ్యాత్మరామాయణానుసారం బహుశా ఈ విధముగనే శ్రీరాముడు హనుమంతుని గుణములను పొగడినాడు. అందు శ్రీరామచంద్రుడు తనగుర్తుగా ముద్రికనిచ్చి హనుమంతునితో నిట్లని పలికెను -

అస్మిన్ కార్యే ప్రమాణం హి త్వమేవ కపిసత్తమ ।
జానామి సత్త్వం తే సర్వం గచ్ఛ పన్థాః శుభస్తవ ॥
(అధ్యాత్మ రా. 4/6/29)

"కపిశ్రేష్ఠా! ఈ కార్యానికి నీవు మాత్రమే సమర్థుడవు. నీ పరాక్రమాన్నంతటినీ నేను బాగా ఎరుగుదును. వెళ్ళుము. నీ మార్గం శుభప్రదమగుగాక!"

తరువాత అంగద, జాంబవంతాది వానరులతో హనుమంతుడు సీతాన్వేషణ చేస్తూ పురోగమించి సాగరతీరం చేరెను. సీతజాడ తెలియకపోవడంతో శోకాకులురై అందరూ అనశనవ్రతంతో అక్కడే కూర్చుండిపోయారు. తత్సమయంలో గృధ్రరాజైన సంపాతితో సంభాషణ సాగగా శతయోజన విస్తీర్ణమైన సాగరానికి ఆవలితీరమందలి లంకానగరంలో రాక్షసరాజైన రావణుడు అశోకవనంలో సీతను దాచి ఉంచాడని" – ఒక్కచోటచేరి తమలోతాము వానరులందరూ సాగరలంఘన విషయమై చర్చించారు. అంగదుని ప్రశ్నానుసారం అందరూ తమ తమ సామర్థ్యాలను వ్యక్తం చేశారు. కానీ హనుమంతుడు మాత్రం మౌనంగా కూర్చొనియున్నాడు. ఎట్టి నిరభిమానత్వం? ఈ ప్రసంగం వాల్మీకి రామాయణంలో హనుమంతుని బుద్ధి, బల, తేజ, పరాక్రమ, విద్య వీరత్వాలవర్ణన అతిమధురముగా, విస్తృతముగా చేయబడినది –

వీర వానరలోకస్య సర్వశాస్త్రవిదాం వర ।
తూష్ణీమేకాన్తమాశ్రిత్య హనూమన్ కిం న జల్పసి ॥
x x x x
రామలక్ష్మణయోశ్చాపి తేజసా చ బలేన చ ॥
x x x x
గరుత్మానివ విఖ్యాత ఉత్తమః సర్వపక్షిణామ్ ॥
పక్షయోర్యద్బలం తస్య భుజవీర్యబలం తవ ।
విక్రమశ్చాపి వేగశ్చ న తే తేనాపహీయతే ॥
బలం బుద్ధిశ్చ తేజశ్చ సత్త్వం చ హరిపుంగవ ।
విశిష్టం సర్వభూతేషు కిమాత్మానం న బుధ్యసే ॥
(వా.రా. 4/66/2–4, 6–7)

"సమస్త శాస్త్రవేత్తల్లో శ్రేష్ఠుడా! అద్వితీయ వీరా! హనుమంతా! నీవు మౌనంగా ఏకాంతంలో ఏమియూ పలుకవెందులకు? తేజస్సులో, బలములో రామలక్ష్మణ సముడవు. గమన శక్తిలో పక్షి శ్రేష్ఠుడైన గరుత్మంతునితో సమానుడవు. అతని రెక్కలలోని బల, తేజ, పరాక్రమాలన్నీ నీ భుజాలలో కూడా ఉన్నాయి. కపివరా! నీలో సమస్త ప్రాణులకన్న మిన్న అయిన బల, బుద్ధి, తేజ, ధైర్యాలున్నాయి. అయినా స్వస్వరూపాన్ని నీవేల గుర్తించడంలేదు?"

అని పలికి జాంబవంతుడు హనుమంతుని జన్మగాథను వినిపించి బాల్యావస్థలోని పరాక్రమ, వరదాన విషయాలను, వివరించి, అతని బలాన్ని గుర్తుకు తెచ్చి అన్నాడు-

ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్ ।
పరా హి సర్వభూతానాం హనూమన్ యా గతిస్తవ ॥
విషణ్ణా హరయః సర్వే హనూమన్ కిముపేక్షసే ।
విక్రమస్వ మహావేగ విష్ణుస్త్రీన్విక్రమానివ ॥
(వా. రా. 4/66/36-37)

"కపిశ్రేష్ఠా! హనుమంతా! లెమ్ము! ఈ మహాసాగరాన్ని లంఘించుము, నీ గమన శక్తి సమస్త ప్రాణులకన్న మించినది. వానరులందరూ విచారంలో మునిగిపోయారు. నీవు వీరిని ఏల ఉపేక్షిస్తున్నావు? నీ వేగం మహత్తరమైనది. త్రివిక్రమ భగవానుడు పృథ్విని పదత్రయములో కొలచినట్లు నీవుకూడా సాగరాన్ని లంఘించి ఆవలితీరం చేరుము" అన్న పలుకులు వింటూనే హనుమంతుడు సాగరోల్లంఘనానికి తన శరీరాన్ని పెంచసాగాడు.

రామచరిత మానసంలో కూడ యీ ప్రసంగ వర్ణన జరిగింది. అక్కడ జాంబవంతుడు అంగదునికి ధైర్యం చెప్పి ఆపై హనుమంతునితో పలికాడు-

**కహఇ రీఛపతి సును హనుమానా । కా చుప సాధి రహేఉ బలవానా ॥**
**పవన తనయ బల పవన సమానా । బుధి బిబేక బిగ్యాన నిధానా ॥**
**కవన సో కాజ కఠిన జగ మాహీం । జో నహిం హోఇ తాత తుమ్హ పాహీం॥**

రామ కాజ లగి తవ అవతారా । సునతహిం భయఉ పర్బతాకారా ॥
కనక బరన తన తేజ బిరాజా । మానహుం అపర గిరిన్హ కర రాజా ॥
(రా.మా కిష్కింధా 30/2-4)

భల్లూకరాజైన జాంబవంతుడు హనుమంతునితో పలికినాడు. ఓ హనుమా! బలశాలీ! వినుము. నీవు మౌనముగా ఎందుకున్నావు? నీవు పవనపుత్రుడవు. బలములో పవన సమానుడవు కదా! బుద్ధి, వివేక విజ్ఞానములకు ఖనివి. నాయనా! ఈ జగత్తులో నీవు సాధించలేని కార్యమేదియూ లేదు. శ్రీరాముని కైంకర్యమునకే నీవవతరించితివి. ఇది విన్న వెంటనే అతడు పర్వతాకారుడై మేరుపర్వతసమముగా బంగారువర్ణము గలిగి తాను మరొక పర్వతరాజు మేరువలె భాసించెను.

అధ్యాత్మ రామాయణంలో కూడ యిట్టి వర్ణనయే కొనసాగింది. ఇంతే కాకుండ పర్వతమంతటి రూపాన్ని ధరించి హనుమంతుడంటాడు -

లంఘయిత్వా జలనిధిం కృత్వా లంకాం చ భస్మసాత్ ॥
రావణం సకులం హత్వానేష్యే జనకనన్దినీమ్ ।
యద్వా బద్ధ్వా గలే రజ్జ్వా రావణం వామపాణినా ॥
లంకాం సపర్వతాం ధృత్వా రామస్యాగ్రే క్షిపామ్యహమ్ ।
యద్వా దృష్ట్వైవ యాస్యామి జానకీం శుభలక్షణామ్ ॥
(అ.రా. 4/9/22-24)

"సోదరులారా! నేను సముద్రాన్ని లంఘించి లంకను భస్మం చేసివేస్తాను. వంశసహితంగా రావణుణ్ణి చంపి జానకీదేవిని తీసుకువస్తాను. మీరు చెబితే రావణుని మెడకు త్రాడుకట్టి త్రికూటాద్రి సహితంగా లంకను వామహస్తంతో ఎత్తి రామప్రభు సన్నిధికి తీసుకురావలెనా? లేక శుభలక్షణ సంపన్నురాలైన జానకీదేవిని దర్శించి మాత్రం రమ్మందురా?"

ఎంతటి ఆత్మ బలము? ఆపై జాంబవంతుడు - "వీరా! నీకు శుభమగును గాక! సజీవంగా ఉన్న జానకీదేవిని నీవు సందర్శించి మాత్రమే రా" అన్నాడు.

సాగరోల్లంఘనవేళలో హనుమంతుడు పలికిన పలుకులను పరిశీలిస్తే అతనికి శ్రీరామచంద్రునిపైగల దృఢవిశ్వాసం వ్యక్తమవుతుంది శ్రీరామభగవానుని గుణప్రభావ తత్త్వాలను అతడు చక్కగా ఎరిగినవాడు. తన ప్రభువునందు అచంచల ప్రేమకలవాడు. అధ్యాత్మ రామాయణంలో ఈ ఘట్టం యీ విధంగా ఉంది -

పశ్యన్తు వానరాః సర్వే గచ్ఛన్తం మాం విహాయసా ॥
అమోఘం రామనిర్ముక్తం మహాబాణమివాఖిలాః ।
పశ్యామ్యద్యైవ రామస్య పత్నీం జనకనన్దినీమ్ ॥
కృతార్థోఽహం కృతార్థోఽహం పునః పశ్యామి రాఘవమ్ ।
ప్రాణప్రయాణసమయే యస్య నామ సకృత్ స్మరన్ ॥
నరస్తీర్త్వా భవామ్భోధిమపారం యాతి తత్పదమ్ ।
కిం పునస్తస్య దూతోఽహం తదంగాంగులిముద్రికః ॥
తమేవ హృదయే ధ్యాత్వా లంఘయామ్యల్పవారిధిమ్ ।
(అ. రా. 5/1/2–6)

"వానరులారా! శ్రీరాముడు విడిచిన అమోఘబాణముతో సమంగా ఆకాశమార్గమునందు పోవునట్టి నన్ను మీరు చూడండి. నేను రామప్రియురాలు, జనకనందిని అయిన సీతను దర్శిస్తాను. నిజముగా నేను కృతార్థుడను. తిరిగి నేను రఘునాథుని దర్శిస్తాను. ప్రాణప్రయాణ వేళలో ఎవని నామాన్ని ఒక్క మారు స్మరించినంత మాత్రాన మానవుడు అపారభవసాగరాన్ని తరించి పరమధామం చేరతాడో, ఆ భగవంతుడైన శ్రీరాముని దూతను నేను విశేషించి అతని అంగుళీయకాన్ని చేబూనిన వాడను. అతనినే హృదయములో ధ్యానించుచూ ఈ అల్పసాగరాన్ని లంఘించడంలో ఆశ్చర్యమేమున్నది?

సాగరోల్లంఘనకు హనుమంతుడు ధరించిన భీకరరూపవర్ణనము వాల్మీకి రామాయణంలో విశేషంగా ఉంది. ఇక్కడ అది దిగ్దర్శనరూపములో తెలుపబడుచున్నది.

**వవృధే రామవృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు ॥**

నిష్ప్రమాణశరీరః సంల్లిలంఘయిషురర్ణవమ్ ।
బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్ ॥
స చచాలాచలశ్చాశు ముహూర్తం కపిపీడితః ।
తరూణాం పుష్పితాగ్రాణాం సర్వం పుష్పమశాతయత్ ॥
తమూరువేగోన్మథితాః సాలాశ్చాన్యే నగోత్తమాః ।
అనుజగ్ముర్హనూమన్తం సైన్యా ఇవ మహీపతిమ్ ॥
(వా రా. 4/1/10-12, 48)

పూర్ణిమనాడు సాగరముప్పొంగినట్లు శ్రీరామభగవానుని కార్యసిద్ధ్యర్థం హనుమంతుడు వర్ధిల్లసాగాడు సాగరోల్లంఘనార్థం అతడు తన శరీరాన్ని అపారంగా పెంచి వేశాడు. తన భుజములతో చరణాలతో తానెక్కిన పర్వతాన్ని అణచెను, అది అచలమైననూ వెంటనే కంపించింది ముహూర్తకాలపర్యంతం అది కంపిస్తూనే ఉండిపోయింది. అక్కడి వృక్షాలకు ఉన్న పుష్పాలన్నీ రాలిపోయాయి. అతడు ఎగరడంతో పర్వతంపైగల సాలాది వృక్షాలు యిటూ అటూ పడిపోయాయి అతని పదములవేగానికి విరిగిన వృక్షాలు రాజు వెనుక సైన్యంవలె అనుసరించినాయి.

అంతే కాకుండ అక్కడ హనుమంతుని స్వరూపవర్ణన అత్యంత మనోహరంగా జరిగింది. తత్సమయంలో హనుమంతుని ఛాయ పదియోజనాల వెడల్పూ ముప్పైయోజనాలపొడవు కలిగి, వేగం కారణంగా అత్యంత సుందరమై కనిపించింది పరమ తేజస్వి మహాకాయుడూ అయిన ఆ కపిశ్రేష్ఠుడు ఆలంబనరహితపక్షయుక్త పర్వతంవలె ఆకాశంలో గోచరించాడు. దీనినిబట్టి అతని శారీరక విస్తృతి విషయాలు వ్యక్తమయ్యాయి.

అది చూచి మైనాకపర్వతము అతణ్ణి విశ్రాంతి తీసుకోమని ఎన్నో విధాల ప్రార్థించినది. అప్పుడు హనుమంతుడు –"రామకార్యము నెరవేర్చకుండా నాకు విశ్రాంతి ఎక్కడ?" అని పలుకుచూ, మైనాకుని కేవలము స్పృశించి, ప్రణమిల్లి ముందుకుసాగెను.

ఈ సందర్భములో రామచరిత మానసంలో తులసీదాసు గారు -
జేహిఁ గిరి చరన దేఇ హనుమంతా । చలెఉ సో గా పాతాల తురంతా ॥
జిమి అమోఘ రఘుపతి కర బానా । ఏహీ భాఁతి చలెఉ హనుమానా ॥
జలనిధి రఘుపతి దూత బిచారీ । తైఁ మైనాక హోహి శ్రమహారీ ॥
హనూమాన తేహి పరసా కర పుని కీన్హ ప్రనామ ।
రామ కాజు కీన్హేఁ బిను మోహి కహాఁ బిశ్రామ ॥

ఏ పర్వతముపై హనుమంతుడు తన చరణములనుంచి నడచెనో అది వెంటనే పాతాళమునకు క్రుంగెను. రాముని అమోఘబాణము వెళ్లురీతిగనే హనుమంతుడు వెళ్ళెను. సముద్రుడు హనుమంతుని చూచి రఘురాముని దూతగా తలంచి మైనాకునితో నిట్లనెను "ఓ మైనాకపర్వతమా! నీపైయితనికి విశ్రాంతినిమ్ము"

తదనంతరము హనుమంతుడు తన బుద్ధిబలాన్ని నాగమాతయైన సురసకు తెలియజేసి పురోగమించెను. తర్వాత సముద్రం మీద అతని దృష్టి పడింది. అక్కడ ఓ విశాలకరాళవదన యగురాక్షసిని తిలకించి అతడు యోచించసాగాడు. ఆదిలో సుగ్రీవ రాజు వర్ణించిన ఛాయా గ్రాహియైన సింహికా నిస్పందేహంగా యిదియే అని నిశ్చయించుకుని అతడు తన దేహాన్ని పెంచాడు. అతడు దేహాన్ని పెంచడం చూసి రాక్షసి కూడ తన దేహాన్ని పెంచి అతని వైపు పరుగెత్తింది. అంత హనుమంతుడు సూక్ష్మరూపాన్ని దాల్చి దాని నోటిలో దూరి తన వాడిగోళ్ళతో దాని మర్మస్థానాన్ని చీల్చి వేశాడు. తన కౌశలము, ధైర్యాలతో దాని ఉదరాన్ని చీల్చి చంపి యథాప్రకారం పురోగమించసాగాడు. ఎట్టి విచిత్ర బుద్ధి, కౌశలము, ధైర్య సాహసాలో చూడండి!

అలా సాగరాన్ని లంఘించి త్రికూటాద్రిపై దిగినాడు. విశ్రాంతి రహితంగా శతయోజన సాగరాన్ని లంఘించినా కూడ అతనికి ఎంతమాత్రం అలసట కలగలేదు. అక్కడనుండి అతడు చక్కగా లంకను పరిశీలించినాడు. లంకను సమీపించి అందు ప్రవేశించే విషయమై బాగా యోచించి సూక్ష్మరూపముతో రాత్రివేళలో లంకానగరంలో ప్రవేశించుట బాగుండదని

నిర్ణయించుకున్నాడు ఆ తర్వాత సంధ్యాసమయములో చిన్నరూపముతో లంకాపురములో ప్రవేశించిన సమయములో ప్రవేశ ద్వారముపై లంకాదిదేవతయగు లంకిణి అతణ్ణి చూసింది ఆమె హనుమంతుని గద్దించి కొట్టబోగా అతడు ఎడమచేతితో ఆమెను తన ముష్టిఘాతానికి గురిచేసెను. ఆ దెబ్బతో అది రక్తాన్ని కక్కుకుంటూ నేలకూలింది వెంటనేలేచి ఆమె బ్రహ్మదేవుని వచనాలను స్మరించి హనుమంతుని స్తుతిస్తూ ఇట్లు పలికింది—

ధన్యాహమప్యద్య చిరాయ రాఘవ స్మృతిర్మమాసీద్భవపాశమోచినీ ।
తద్భక్తసంగోఽప్యతిదుర్లభో మమ ప్రసీదతాం దాశరథిః సదా హృది ॥
(అ రా వా రా.5/1/57)

"చిరకాలానంతరం సంసారబంధనాన్ని తొలగించు రఘునాథుని స్మృతిని పొందిన నేను నేడు ధన్యురాలనయితిని అత్యంత దుర్లభమైన శ్రీరామభక్తుని దర్శనమైనది. ఆ శ్రీరామచంద్రుడు సదా ప్రసన్నుడై నా హృదయంలో నివసించునుగాక!" రామచరిత మానసంలో ఆ ప్రసంగం ఈ విధంగా ఉంది

హనుమంతుని ముష్టిదెబ్బతిన్న లంకిణి వ్యాకులరైయి నేలకూలిన తరువాత సావధానరైయి అంటుంది —

తాత మోర అతి పున్య బహూతా । దేఖెఉఁ నయన రామ కర దూతా ॥
తాత స్వర్గ అపవర్గ సుఖ ధరిఅ తులా ఎక అంగ ।
తూల న తాహి సకల మిలి జో సుఖ లవ సతసంగ ॥
(రా.మా.సున్దర.దో.4 అంత)

నేను గొప్ప పుణ్యవంతురాలను. శ్రీరామచంద్రుని దూతగ మిమ్ములను నాకంటితో దర్శింపగల్గితిని. స్వర్గమోక్షసౌఖ్యాలన్నింటిని త్రాసులోని ఒక పళ్లెములో ఉంచితే గూడ అవన్నియుకలిసి సాధుజనుల సాంగత్యం ఒక క్షణము లభించుటవలన కలుగు సుఖమునకు సాటిరావు.

తరువాత హనుమంతుడు సూక్ష్మరూపాన్ని దాల్చి అనేకమంది రాక్షసుల గృహాలలో సీతను అన్వేషించుకుంటూ రావణుని భవనంలో ప్రవేశిస్తాడు.

అక్కడ రావణుని విచిత్రమైన భవనమును తిలకించి పుష్పక విమానాన్ని ఆశ్చర్యంగా చూస్తాడు తరువాత అతడు రావణుని భవనంలో రావణాంగనలను దర్శించి తన మానసిక స్థితిని వ్యక్తం చేస్తాడు. దానినిబట్టి అతని బ్రహ్మచర్యనిష్ఠ ఎంత మహోన్నతమైనది, పరస్త్రీ దర్శనాన్ని అతడు ఎంత చెడుగా భావించినరీతి, అతని బావం ఎంత విశుద్ధమైనదీ సుందరమైనదీ మనకు తెలుస్తుంది వాల్మీకి రామాయణ కథనానుసారం యిలా ఉన్నది- హనుమంతుడు రావణ భవనంలోని ప్రతిమూలనూ అన్వేషించినా అతనికి ఎక్కడా సీతాదేవి కానరాలేదు తత్సమయంలో నారీ సమాజంలో సీతకై అన్వేషిస్తూన్న అతనికి ధర్మబీతిచే శంక ఏర్పడింది. ఈ విధంగా అంతఃపురంలో నిద్రిస్తూన్న పరస్త్రీలను చూడడంవల్ల నాధర్మం నాశనమవుతుంది. కానీ నేనీ పరస్త్రీలను కామభావంతో చూడలేదు. ఈ దృష్ట్యా నా మనస్సులో ఎంతమాత్రం వికారం కలగలేదు. ఇంద్రియాల సదసద్వృత్తులకు మనస్సే కారణము స్త్రీలను స్త్రీ సమాజంలో కాక మరెక్కడ అన్వేషిస్తాము నా మనస్సు సర్వథా నిర్వికారంగానే ఉంటుంది. పైగా జానకీదేవిని మరో పద్ధతి ద్వారా నేను అన్వేషించజాలను కదా!" - ఇట్టి సుందరమైన ఆలోచన, విశుద్ధభావాలూ హనుమంతునకే తగినవి

సాధకులు దీనిద్వారా గుణపాఠాన్ని గ్రహించాలి సంకట స్థితిలో కూడ మనస్సులో వికారాన్ని పొందరాదు వాల్మీకి రామాయణంలో సీతాన్వేషణ విషయం అతి విచిత్రంగా విశదంగా వర్ణించబడింది ఇక్కడ కొద్దిమాత్రమే తెలుపబడింది. రామచరిత మానసంలో ఈ ఘట్టం యిలా ఉన్నది - సీతాన్వేషణలో పరిభ్రమిస్తూన్న హనుమంతుని దృష్టి ఓ సుందర భవనంమీద పడింది. దానిపై శ్రీరాముని ఆయుధాలు చిత్రించబడి ఉన్నాయి. తులసి మొక్కలు ఆ భవనశోభను వర్ధిల్లజేస్తూన్నాయి. "రాక్షసులు నివసించునట్టి ఇక్కడ సత్పురుషులు ఎందుకుంటారు?" అని హనుమంతుడు భావించునంతలో విభీషణుడు మేలుకొంటాడు. మాటిమాటికీ అతడు శ్రీరామనామాన్ని స్మరిస్తూంటాడు. నిశ్చయంగా ఇతడెవరో భగవద్భక్తుడే అయివుంటాడు. ఇతణ్ణి అవశ్యం పరిచయం చేసుకోవాలి. సాధువువల్ల ఎన్నడూ కార్యహాని కాదు.

బిప్ర రూప ధరి బచన సునాఏ । సునత బిభీషన ఉఠి తహఁ ఆఏ ॥
కరి ప్రనామ పూఁఛీ కుసలాఈ । బిప్ర కహహు నిజ కథా బుఝాఈ ॥
కీతుమ్హ హరి దాసన్హ మహఁ కోఈ । మోరే హృదయ ప్రీతి అతి హోఈ ॥
కీ తుమ్హ రాము దీన అనురాగీ । ఆయహు మోహి కరన బడభాగీ ॥
తబ హనుమంత కహీ సబ రామ కథా నిజ నామ ।
సునత జుగల తన పులక మన మగన సుమిరి గున గ్రామ ॥
(రా.మా. సు దో 5-6 అంత )

బ్రాహ్మణరూపమును ధరించి హనుమంతుడతనిని పిలిచెను. పిలుపు వినగానే విభీషణుడు లేచి వచ్చి ప్రణమిల్లి, కుశలమడిగి పలికెను "బ్రాహ్మణోత్తమా! మీ వృత్తాంతమును తెలుపుడు. మీరు హరిభక్తులలో నొకరా? మిమ్ముచూచి నా హృదయమున ప్రేమ యుప్పొంగుచున్నది లేక దీనదయాళుడైన శ్రీరామచంద్రులా! నన్ను భాగ్యశాలిగా చేయుటకు విచ్చేసినారా? అపుడు హనుమంతుడు శ్రీరాముని కథను పూర్తిగా తెలిపి, తన పేరును వెల్లడించెను అది వినగానే వారిద్దరి శరీరములొక్కసారిగా పులకించెను. శ్రీరాముని గుణగణములను స్మరించుచూ ఇద్దరి మనస్సులు పులకాంకితములై ప్రేమమగ్నమాయెను.

భగవద్భక్తులలో పరస్పరం స్వాభావిక ప్రేమ ఎలా ఉండాలన్నది యిక్కడ అత్యంత సుందరంగా వర్ణింపబడింది. విభీషణుడంటాడు –

తాత కబహుఁ మోహి జాని అనాథా । కరిహహిఁ కృపా భానుకుల నాథా ॥
తామస తను కఛు సాధన నాహీఁ । ప్రీతి న పద సరోజ మన మాహీఁ ॥
అబ మోహి భా భరోస హనుమంతా ।
బిను హరికృపా మిలహిఁ నహిఁ సంతా ॥

నాయనా! సూర్యవంశ ప్రభువైన శ్రీరామచంద్రుడు అనాథుడనైన నాపై యనుగ్రహమును చూపునా? నా శరీరము తమోగుణప్రధానమైనది. భగవత్ప్రాప్తి సాధనముల నేనెరుగను. శ్రీరామచంద్రుని చరణకమలములపై ప్రీతికూడా నాకు లేదు. హనుమా! నాపై ప్రభుకృపకలదని నాకు నమ్మకమేర్పడినది. ఏలనన శ్రీహరి కృపలేనిదే సత్సాంగత్యము కలుగదు.

అంత హనుమంతుడంటాడు -

సునహు బిభీషన ప్రభు కై రీతీ । కరహిఁ సదా సేవక పర ప్రీతి ॥
కహహు కవన మైఁ పరమ కులీనా । కపి చంచల సబహీం బిధి హీనా ॥
అప మైఁ అధమ సఖా సును మోహూ పర రఘుబీర ।
కీన్హీ కృపా సుమరి గున భరే బిలోచన నీర ॥

(రా మా సున్దర దో 7 (అంత))

విభీషణా! తనసేవకులపై సదా ప్రేమచూపుటయే ప్రభుస్వభావము. నేను చంచలస్వభావముగల వానరుడను. దీనుడను హీనుడను మిత్రమా అట్టి అధముడనైన నాపైన కూడా శ్రీరామచంద్రుడు కృపజేసెను. భగవంతుని గుణములను స్మరించగానే హనుమంతుని నేత్రములు సజలములాయెను

జానతహూఁ అస స్వామి బిసారీ । ఫిరహిఁ తె కాహే న హోహిఁ దుఖారీ॥
ఎహి బిధి కహత రామ గున గ్రామా । పావా అనిర్బాచ్య బిశ్రామా ॥

(రా.మా. సున్దర దో 8 చౌ 1)

ఇవన్నియూ తెలిసికూడా ఎవ్వరైతే ఆ స్వామిని మరచి విషయవాసనలయందు పరిభ్రమించెదరో, వారు దుఃఖితులుగాక యుందురా? ఈ రీతి శ్రీరామగుణముల వర్ణించుచూ అనిర్వచనీయ శాంతిని హనుమంతుడు పొందెను

ఎంత అందమైన దైన్యభావము? అతులిత విశ్వాస, అనన్య భగవత్ప్రేమను తిలకించండి! అనంతరం విభీషణునిద్వారా సమాచారమంతా తెలుసుకుని హనుమంతుడు అశోకవనంలో ప్రవేశించి అక్కడ జానకీదేవిని దర్శించి ఆమెకు మనసా ప్రణమిల్లుతాడు.

అశోకవనంలో ప్రవేశించి సీతామాతను దర్శించిన తరువాత హనుమంతుడు తెలివిగా యుక్తులతో కార్యసాధన చేసిన ఘట్టం వాల్మీకంలో విశదంగా వర్ణించబడింది. అనేక యుక్తులను ప్రయోగించి జానకీదేవిని కలుసుకునే ఉపాయాలను గురించి బాగుగా యోచించి చిట్టచివరకు హనుమంతుడు అత్యంత సావధానుడై ఓ దట్టమగువృక్షం ఎక్కి

దాని ఆకులమాటున దాగి కూర్చుంటాడు. అక్కడనుండియే దృష్టిని దశదిశలా పోనిస్తాడు అలా చూస్తూయుండగా అతని దృష్టి జానకీదేవిపై పడుతుంది. ఆమెను చూసి అనేకమైన గుర్తులద్వారా ఆమెయే జనకనందినియగు సీతాదేవి అని గ్రహిస్తాడు. అక్కడతడు సీతాదేవియొక్క వ్యవహార స్వభావవిషయాలను అత్యంత రమణీయంగా విచిత్రంగా చిత్రిస్తాడు. శ్రీరామచంద్ర ప్రభువు సీతాదేవి శరీరంలో ఏయే భూషణాలుంటాయో చర్చించి ఉన్నాడు, తద్ద్వారా అతడు ఆమె ధరించిన భూషణాలనుబట్టి ఆమెయే సీతాదేవి అని నిశ్చయించినాడు. అందులో ఆమె ఋష్యమూక పర్వతంపై విసిరివేసిన ఆభరణాలు మాత్రం లేవు.

ఆమె రూప, గుణాదులనుబట్టి కూడ అతడత్యంత ధీశక్తితో నిస్సందేహంగా ఆమె సీతయే అని నిశ్చయించుకుంటాడు. అనంతరం ఆమె దుఃఖాన్ని తిలకించి అతడు మథనపడిపోతాడు. మనసా అతడు తీవ్రంగా వ్యాకులుడాయెను.

తరువాత సీతామాతతో ఎలా భాషించాలో, ఏ సమయంలో ఎలా కలియాలో, ఆమెకు ఎలా విశ్వాసాన్ని కలుగజేయాలో, తాను రామదూతనని ఎలా తెలియజేయాలో యోచిస్తాడు. సరిగా అదే సమయంలో రాక్షసాంగనలనేక మందితో రావణుడు అక్కడకు వస్తాడు. అనేక విధాల సీతను భయపెట్టి ఆమెను స్వాధీనం చేసుకోవాలనుకుంటాడు. కానీ సీత తన నిశ్చయంనుండి ఎట్టి పరిస్థితిలోనూ చలించదు. చివరకు రావణుడు వెళ్ళిపోతాడు. అప్పుడు రాక్షసస్త్రీలు అనేక విధాల ఆమెను భయపెడతారు. అదే సమయంలో 'త్రిజట' అన్న పేరుగల ఒక రాక్షసి తన స్వప్నవృత్తాంతాన్ని సీతకు వివరించి ధైర్యం చెబుతుంది. ఆమె మాటలనాలకించి ఆ భయంకర రాక్షసస్త్రీలుకూడ శాంతిస్తారు. విరహవ్యాకులయై సీత విలపించసాగుతుంది.

సీతను కలుసుకోవడానికి అదే సరియైన సమయమని భావించి హనుమంతుడు ఆదిలో అనుకున్న ప్రకారం శ్రీరామ సంకీర్తనము చేయసాగాడు. రఘునాథుని గాథను ఆద్యంతం ఆలకించిన సీతకు

మహాశ్చర్యం కలుగుతుంది ఈ విషయమై అద్యాత్మ రామాయణంలో ఉన్న విషయం చిట్టచివరకు సీత యిది స్వప్నమూ కాదు, భ్రమా కాదు అని భావిస్తుంది -

యేన మే కర్ణపీయూషం వచనం సముదీరితమ్ ।
స దృశ్యతాం మహాభాగః ప్రియవాదీ మమాగ్రతః ॥
(అ రా. 5/3/18)

"నా శ్రవణాలకు అమృతసమప్రియవచనాలను వినిపించిన ప్రియభాషి, భాగ్యశాలి నా ఎదుటకు వచ్చును గాక!"

అనవిని హనుమంతుడు సీతాదేవి సమక్షంలో నిలచి చేతులు జోడించి పలుకుతాడు అకస్మాత్తుగా సమక్షంలో ఓ వానరుని తిలకించిన సీతకు రావణుడే నన్ను వంచించుటకు వచ్చినాడేమో యని శంక కలగడంతో ఆమె అవనతవదన అవుతుంది. రామచరితమానసంలో తత్సమయంలో హనుమంతుని వచనాలను తిలకించండి -

రామ దూత మైం మాతు జానకీ । సత్య సపథ కరునానిధాన కీ ॥
యహ ముద్రికా మాతు మైం ఆనీ । దీన్హి రామ తుమ్హ కహం సహిదానీ ॥
(రా మా. సున్దర. దో. 13 (అంత))

ఓ సీతమ్మతల్లీ! నేను శ్రీరామచంద్రుని దూతను. కరుణామయుడైన శ్రీరామునిపై శపధము చేసి చెప్పుచున్నాను. ఇది సత్యము. ఈ ఉంగరమును నేనే తెచ్చినాను. శ్రీరాముడు దీనిని మీకై గుర్తుగా నాకిచ్చిపంపినారు.

తరువాత జానకీదేవి ప్రశ్నించగా వానరరాజగు సుగ్రీవునితో రామచంద్రునకు ఏర్పడ్డ మైత్రి గాథను సవిస్తరంగా వినిపించాడు. తరువాత శ్రీరామ లక్ష్మణుల సాముద్రికలక్షణ, గుణస్వభావాదులను వర్ణించాడు. ఆ సమాచారమంతా ఆలకించిన జానకీదేవికి మహదానందం కలిగింది. ఈ ప్రసంగం వాల్మీకి రామాయణంలో మనోహరంగా విస్తృతంగా విశదీకరించబడింది.

రామచరిత మానసంలో తులసీదాసు ఈ విషయాన్ని అత్యంత సంక్షిప్తంగా చెబుతాడు –

కపి కే బచన సప్రేమ సుని ఉపజా మన బిస్వాస ।
జానా మన క్రమ బచన యహ కృపాసింధు కర దాస ॥
హరిజన జాని ప్రీతి అతి గాఢీ । సజల నయన పులకావలి బాఢీ ॥
(రా.మా. సున్దర. దో.13–14 (అంత))

ప్రీతిపూర్వకవచనములను విన్న సీతకు హనుమంతునిపై విశ్వాసము కలిగి నిజముగా యితడు కృపాసింధుడైన రామునికి త్రికరణశుద్ధిగా దాసుడని భావించెను. భగవంతుని సేవకుడని హనుమంతుని గూర్చి విశ్వాసముకలగగానే సీతకు హనుమపట్ల ప్రీతియతిశయించి, నేత్రములు సజలమాయెను. శరీరము పులకించెను.

తరువాత మహాతేజశ్శాలి అయిన హనుమంతుడు సీతకు అంగుళీయకాన్ని ఈయగా దానిని పొంది జానకీదేవి రామచంద్రునే పొందినట్లు ఆనందిస్తుంది. అప్పుడు ఆమె హనుమంతునితో అంటుంది –

బూడత బిరహ జలధి హనుమానా। భయహు తాత మో కహుఁ జలజానా॥
అబ కహు కుసల జాఉఁ బలిహారీ । అనుజ సహిత సుఖ భవన ఖరారీ ॥
కోమలచిత కృపాల రఘురాఈ । కపి కేహి హేతు ధరీ నిఠురాఈ ॥
సహజ బాని సేవక సుఖదాయక । కబహుఁక సురతి కరత రఘునాయక ॥
కబహుఁ నయన మమ సీతల తాతా ।
హోఇహహిఁ నిరఖి స్యామ మృదు గాతా ॥
బచను న ఆవ నయన భరే బారీ । అహహ నాథ హౌఁ నిపట బిసారీ ॥
(రా.మా. సు. దో. 14 (అంత))

"నాయనా! ఆంజనేయా! విరహసముద్రములో మునుగుచున్న నన్ను రక్షించుటకు నీవు ఓడవైనావు. భగవంతుని సాక్షిగా నిన్నే వేడుకొనుచున్నాను. సుఖనిలయమగు శ్రీరామునియొక్క, అతని తమ్ముడు లక్ష్మణుని యొక్క కుశలసమాచారమును వినిపించుము. శ్రీరాముడు కోమలచిత్తుడు. దయాళువు. అతడు ఏ కారణముచే నాపై నిష్ఠురత్వమును వహించెను, తన సేవకులకు సుఖమునిచ్చుటయే అతని

సహజస్వభావము. శ్రీరఘునాథుడు ఎప్పుడైనా నన్ను జ్ఞాపకము చేసికొని యుండెనా? నాయనా! మరల నాకన్నులు వారి కోమలశ్యామల శరీరమును జూచి శాంతిని పొందునా? సీతాదేవి యిట్లు పల్కుచుండగనే ఆమె నయనములు అశ్రుభరితములాయెను. ఆమె హృదయము శోకతప్తమాయెను. హేనాథా! మీరు నన్ను పూర్తిగా మరిచినారా?" యని పరితపించసాగెను.

అలా విరహవ్యాకులయైన సీతాదేవిని చూసి హనుమంతుడంటాడు-

మాతు కుసల ప్రభు అనుజ సమేతా । తవ దుఖ దుఖీ సుకృపా నికేతా ॥
జని జననీ మానహు జియఁ ఊనా । తుమ్హ తే ప్రేము రామ కే దూనా ॥
రఘుపతి కర సందేసు అబ సును జననీ ధరి ధీర ।
అస కహి కపి గదగద భయఉ భరే బిలోచన నీర ॥

(రా.మా. సున్దర. దో.14)

"మాతా! అత్యంతకృపానిధియైన శ్రీరామచంద్రుడు, అతని సోదరుడగు లక్ష్మణుడు కుశలమే. కాని మీ వియోగమువలన మిక్కిలి దుఃఖితుడైయున్నాడు. మాతా! మీరు మనస్సు చిన్నబుచ్చుకోవలదు. మీకు శ్రీరామచంద్రులపైగల ప్రేమకు రెండింతలప్రేమ మీపై శ్రీరామచంద్రునికిగలదు. మాతా! ధైర్యము వహించి శ్రీరాముని సందేశమును వినండి. అని హనుమంతుడు సీతకు తెలుపుచూ హర్షపులకితుడాయెను. అతని కన్నుల నీరునిండెను.

తరువాత అత్యంత చాతుర్యంతో హనుమంతుడు జానకీదేవికి - శ్రీరామచంద్రుని విరహవ్యాకులతా విషయాలు వినిపించాడు. చివరలో శ్రీరామచంద్రుని పలుకులను ఇలా వినిపిస్తాడు.

తత్వ ప్రేమ కర మమ అరు తోరా । జానత ప్రియా ఏకు మను మోరా ॥
సో మను సదా రహత తోహి పాహీఁ । జాను ప్రీతి రసు ఎతనేహి మాహీఁ॥

(రా.మా.సు. దో. 15(అంత))

"ప్రియా! నా నీప్రేమ తత్త్వరహస్యము నా మనస్సుకు మాత్రమే తెలియును. ఆ మనస్సు నీ వద్దనే యున్నది. చాలు. ఇదియే నా ప్రేమసారమని గ్రహించుము."

ఇలా శ్రీరాముని ప్రేమపూర్ణ సందేశాన్ని విన్న సీతాదేవి ప్రేమ మగ్నురాలై మైమరచిపోతుంది. అంత హనుమంతుడు మరల అంటాడు.

**ఉర ఆనహు రఘుపతి ప్రభుతాఈ । సుని మమ బచన తజహు కదరాఈ ॥**
**నిసిచర నికర పతంగ సమ రఘుపతి బాన కృసాను ।**
**జననీ హృదయఁ ధీర ధరు జరే నిసాచర జాను ॥**

(రా.మా.సున్దర దో.15(అంత))

"ఓ మాతా! శ్రీరాముని హృదయమున నిలుపుకొని, నా మాటలను ఆలకించి భయమును వదలిపెట్టుము. రాక్షససమూహములు మిడుతలవంటివి. శ్రీరాముని బాణము అగ్నితో సమానము. హృదయములో ధైర్యము వహించుము. రాక్షసులందరూ దహించబడినట్లుగానే భావింపుము.

ఆ ప్రసంగమంతా ఆలకించి జానకీదేవి "హనుమా! వానరులందరూ నీలాగే ఉండి ఉంటారు. రాక్షసులు చూస్తే మహాభయంకరులై ఉన్నారు. వీరందరినీ మీరెలా జయిస్తారు? అన్న సందేహం నాకు కలుగుతూన్నది" అనవిని హనుమంతుడు పర్వతాకారసమమైన తన భయంకరరూపాన్ని సీతాదేవికి చూపించి నిక్షిప్తంగా ఉన్న తన ప్రభావాన్ని ప్రకటించాడు. ఆ రూపాన్ని తిలకించిన జానకీదేవికి విశ్వాసం కలిగింది. ప్రసన్నురాలైన ఆమె హనుమంతునకు అనేక వరాలిచ్చింది. శ్రీరామచంద్రుల కృప సర్వదా నీపై ప్రసరించును గాక!" అంది. ఆ మధురాతిమధుర వచనాలకు మారుతి ప్రేమ మగ్నుడైపోయాడు. మాటిమాటికి ఆమె చరణాలకు ప్రణమిల్లి చేతులుజోడించి అన్నాడు –

**అబ కృతకృత్య భయఉఁ మైఁ మాతా । ఆసిష తవ అమోఘ బిఖ్యాతా ॥**

(రా.మా.సున్దర.దో. 17(అంత))

"తల్లీ! నేనిప్పుడు సఫలమనోరథుడనై కృతకృత్యుడనైతిని. మీ యాశీర్వాదమమోఘము."

దీనినిబట్టి మారుతికి శ్రీరామచంద్రుని చరణారవిందాలపై ఎంతటి గహనమైన ప్రేమ ఉన్నదీ తెలియవస్తుంది.

ఈ విషయమై అధ్యాత్మ రామాయణంలో ఏమున్నదో చూడండి. ప్రసంగం కొనసాగుతూండగా సీతాదేవి - "హనుమా! వానరసేనా సహితంగా రామచంద్రులు మహాసైన్యాలతో సాగరాన్ని లంఘించి యిక్కడకు ఎలా రాగలుగుతారు?" అనగా హనుమంతుడు -

హనూమానాహ మే స్కన్ధావారుహ్య పురుషర్షభౌ ॥
ఆయాస్యతః ససైన్యశ్చ సుగ్రీవో వానరేశ్వరః ।
విహాయసా క్షణేనైవ తీర్త్వా వారిధిమాతతమ్ ॥
(అ.రా.సున్దర. 3/47-48)

"అమ్మా! ఆ నరశ్రేష్ఠులిద్దరూ నా భుజ స్కంధాలపై కూర్చుని వచ్చేస్తారు. సర్వ సైన్య సమేతంగా సుగ్రీవ రాజుకూడ ఆకాశ మార్గం మీదుగా క్షణ మాత్రంలోనే మహాసముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చేస్తారు.

ఈ ప్రసంగంవల్ల కూడ హనుమంతుని బల, వీర్యసాహసాలు విదితమవుతున్నాయి. తరువాత జానకీదేవి దగ్గర సెలవు తీసుకుని అశోకవాటికలో ఫలాలు భక్షించి హనుమంతుడు రామప్రభువుల విశేష కార్యాన్ని సాధించాలని ఆ వాటికలోని వృక్షాలను నష్ట భ్రష్టం చేసి వనాన్నంతటినీ విధ్వంసం చేసినాడు. ఆ సమాచారాన్ని ఆలకిస్తూనే రావణుడు తన కుమారుడైన అక్షకుమారునికి సహాయంగా విశాలసైన్యాలనిచ్చి పంపాడు. వారందరితో హనుమంతునికి భయంకరయుద్ధం జరిగింది. వీరత్వయుద్ధ కౌశలాలను గొప్పగా ప్రదర్శించి హనుమంతుడు అనాయాసంగానే జంబుమాలి అనే రావణమంత్రి కుమారుల నేడుగురినీ, ఐదుగురు సేనాపతులనూ, అక్షకుమారునీ కూడ అంతం చేశాడు. ఈ యుద్ధ ప్రసంగంలో హనుమంతుని అతులిత బలపౌరుష యుద్ధ కౌశలాలు స్పష్టంగా వ్యక్తమయ్యాయి. వాల్మీకి రామాయణంలో ఈ ఘట్టం అత్యంత సుందరంగా వర్ణించబడింది. హనుమంతుని అతులిత పరాక్రమాన్ని వర్ణిస్తూ-

**తలేనాభిహనత్ కాంశ్చిత్ పాదైః కాంశ్చిత్పరంతపః ।**
**ముష్టిభిశ్చాహనత్కాంశ్చిన్నఖైః కాంశ్చిద్వ్యదారయత్ ॥**

ప్రమమాథోరసా కాంశ్చిదూరుభ్యామపరానపి ।
కేచిత్తత్రైవ నాదేన తత్రైవ పతితా భువి ॥
(వా.రా.సున్దర. 45/12–13)

హనుమంతుడు ఆ రాక్షసులలో ఒకనిని అరచేతి దెబ్బతో పడగొట్టాడు. ఎందరినో కాళ్ళక్రింద అణచివేశాడు. ముష్టిఘాతములతో మరెందరినో అంతంచేశాడు. ఎందరినో గోళ్ళతో చీల్చి వేశాడు. వక్షఃస్థలంతో ఢీకొట్టి కొందరినీ, మోకాళ్ళతో నొక్కి పట్టి మరెందరినో హతమార్చి వేశాడు. అతని భయంకర గర్జనలు విన్న రాక్షసులెందరో నేల కూలారు.

హత శేషులైన రాక్షసులద్వారా మంత్రి పుత్రులేడుగురూ, ముఖ్యాతి ముఖ్య ప్రధాన రాక్షసులూ, సేనాపతు లైదుగురూ అక్షకుమారుడు కూడ అంతమై పోయారన్న వార్త నాలకించిన రావణుడు – ఇంద్రజిత్తును ప్రోత్సహించి హనుమంతుని తీసుకురమ్మని పంపాడు. ఇంద్రజిత్తుకూ హనుమంతునకూ మధ్య అత్యంత ఘోరయుద్ధం జరిగింది. చివరలో ఇంద్రజిత్తు హనుమంతుని బంధింప బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడంతో బ్రహ్మదేవుని యందలి గౌరవభావంతో అతడు దానిచే బంధింపబడ్డాడు. రాక్షసుల ద్వారా బంధింపబడడంలో తనకు మహత్తర లాభమున్నదనీ తద్వారా రావణునితో భాషించే అవకాశం కలుగుతుందనీ అతడు భావించి నిశ్చేష్టుడుగా ఉండిపోయాడు. అప్పుడు రాక్షసులు అనేక త్రాళ్ళతో హనుమంతుని బంధించి వేశారు. దానితో బ్రహ్మాస్త్రం ప్రభావం అణగింది. అలా బ్రహ్మాస్త్రముక్తుడై కూడ పరమ చతురుడైన హనుమంతుడు ఏమీ తెలియనట్లే ప్రవర్తించాడు.

ఈ ప్రసంగం అధ్యాత్మ రామాయణంలో ఎలా ఉందో చూడండి! తరువాత హనుమంతుడు రావణ సభలో ప్రవేశించి, సభామధ్యంలో రాజసింహాసనాసీనుడైనట్టి దర్పస్వరూపుడైన రావణుని తిలకించాడు. హనుమంతుని తిలకించిన రావణుడు మనస్సులో – "ఎవడీ భయంకర వానరుడు? సాక్షాత్తూ శివగణంలోని నందీశ్వరుడే వానరరూపాన్ని ధరించి రాలేదు కదా! అని ఈ ప్రకారంగా అనేకవిధాల తర్కవితర్కాలు

కొనసాగించిన తరువాత రావణుడు ప్రహస్తునితో అన్నాడు -

ప్రహస్త పృచ్ఛైనమసౌ కిమాగతః
కిమత్ర కార్యం కుత ఏవ వానరః ।
వనం కిమర్థం సకలం వినాశితం
హతాః కిమర్థం మమ రాక్షసా బలాత్ ॥
(అ రా.సున్దర. 4/5)

"ప్రహస్తా! ఈ వానరుడిక్కడకు ఎందుకు వచ్చాడో అడుగు. ఇక్కడ వీనికి పనేమిటి? ఎక్కడనుండి వచ్చాడు? నా వనాన్నంతటినీ ఎందుకు నాశనం చేశాడు? నా రాక్షస వీరులను ఎందుకు అంతం చేశాడు?

ప్రహస్తుడు సర్వ విషయాలను యథాతథంగా సత్యంగా చెప్పమని హనుమంతుని ప్రార్థించగా -

ఆ కపిశ్రేష్ఠుడు మనస్సులో శ్రీరామపరమాత్మను స్మరించి చెప్పసాగాడు-

శృణు స్ఫుటం దేవగణాద్యమిత్ర హే
రామస్య దూతోऽహమశేషహృత్స్థితేః ।
యస్యాఖిలేశస్య హృతాధునా త్వయా
భార్యా స్వనాశాయ శునేవ సద్ధవిః ॥
(అ.రా. 5/4/8)

"దేవతల శత్రువైన రావణా! నువ్వు సావధానంగా ఆలకించు. శునకం విశుద్ధమైన హవిస్సును దొంగిలించుకు పోయినట్లు నీవు స్వనాశనాన్ని కోరుకుని అఖిలేశ్వరుడైన ఏ సర్వాంతర్యామి యొక్క సాధ్వీయగు సతిని అపహరించుకు వచ్చావో నేనా శ్రీరామభగవానుని దూతను. వాల్మీకి రామాయణంలో ఈ విషయమై విస్తృతమైన వర్ణన ఉంది. అక్కడ హనుమంతుడంటాడు -

అబ్రవీన్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య చ ।
ధనదేన న మే సఖ్యం . . . . . . . . . ॥

జాతిరేవ మమ త్వేషా వానరోఽహమిహాగతః ।
దర్శనే రాక్షసేన్ద్రస్య తదిదం దుర్లభం మయా ॥
వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్ ।
తతస్తే రాక్షసాః ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణః ॥
రక్షణార్థం చ దేహస్య ప్రతియుద్ధా మయా రణే ।
అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి ॥
x x x x
రాజానం ద్రష్టుకామేన మయాస్త్రమనువర్తితమ్ ॥
(వా. రా. సున్దర. 50/13–17)

నేను యమ ఇంద్ర వరుణాది దేవతలలో ఎవరి చేతనూ పంపబడ్డవాడనుకాదు. నేను కుబేర మిత్రుడనూ కాను. నేను జన్మతః వానరుడను, రాక్షసరాజైన రావణుని చూడాలనియే ఇక్కడకు వచ్చాను. రావణుని చూచుటకొరకై దుర్లభమైన ఈ వనాన్ని నేను నాశనం చేశాను. నాతో పోరవచ్చిన బలశాలురైన మీ రాక్షసులను, నన్ను నేను రక్షించుకోవడం కోసం ఎదిరించాను. సురాసురులలో ఎవరూ నన్ను అస్త్రపాశములతో బంధించ జాలరు. రాక్షసేంద్రుని దర్శించాలనియే నేనీ బంధనాన్ని అంగీకరించాను.

తరువాత అక్కడ రామకథనంతనూ సంక్షిప్తంగా వర్ణించి అతనికి సుగ్రీవునితో ఏర్పడినమైత్రినీ, వాలి మరణాది సర్వవిషయాలనూ చెప్పి, నేను సీతాదేవి సమాచారాన్ని తెలియగోరి వచ్చాను" అన్నారు.

తరువాత ఆ ధీశాలి హనుమంతుడు అనేక యుక్తులతో రావణునకు రామచంద్రుని బలపరాక్రమ, ప్రభావైశ్వర్యాదులను వినిపించి ఎన్నో విధాల నచ్చ జెప్ప చూశారు.

రామచరిత మానసంలో హనుమంతుడంటాడు –

బినతీ కరఉఁ జోరి కర రావన । సునహు మాన తజి మోర సిఖావన ॥
x x x x x
జాకే డర అతి కాల డేరాఈ । జో సుర అసుర చరాచర ఖాఈ ॥

తాసోఁ బయరు కబహుఁ నహి కీజై । మోరే కహేఁ జానకీ దీజై ॥
ప్రనతపాల రఘునాయక కరునా సింధు ఖరారి ।
గఏఁ సరన ప్రభు రాఖిహైఁ తవ అపరాధ బిసారి ॥
రామ చరన పంకజ ఉర ధరహూ । లంకా అచల రాజ తుమ్హ కరహూ ॥
సును దసకంఠ కహఉఁ పన రోపీ । బిముఖ రామ త్రాతా నహి కోపీ ॥

x x x x

మోహమూల బహు సూల ప్రద త్యాగహు తమ అభిమాన ।
బజహు రామ రఘునాయక కృపా సింధు భగవాన ॥
(రా.మా.సున్దర. దో.22– 23)అంత))

రావణా! చేతులుజోడించి ప్రార్థించెదను. అహంకారమును వదలి నా మాట వినుము. సమస్త చరాచర జగత్తును కూడ లయమొనర్చు కాలుడు ఎవరికి భయపడునో అట్టి భగవంతునితో వైరము నెన్నడూ కోరకూడదు. నా మాట విని జానకీ దేవిని తిరిగి యిచ్చివేయుము. ఖరుని సంహరించిన శ్రీరఘునాథుడు శరణాగతవత్సలుడు. కరుణాసాగరుడు. అతనిని నీవు శరణుజొచ్చినచో ప్రభువు నీ అపరాధములను క్షమించి కాపాడును. శ్రీరాముని చరణకమలములను నీ మనస్సున ధ్యానించుము. లంకారాజ్యమును అచంచలముగా పాలించుము. ఓ దశాననా! నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను వినుము! శ్రీరామునికి విముఖుడైన వ్యక్తిని ఎవ్వరూ రక్షింపలేరు. మోహజనితము, అతి దుఃఖప్రదము, తమోగుణప్రధానమైన అహంకారమును వదలి, రఘుకుల ప్రభువు కృపాసాగరుడైన భగవంతుడైన శ్రీరామమూర్తిని భజింపుము.

శ్రీరామభగవానుని ప్రభావాన్ని చూసి అనేక విధాలుగా చెప్పి అధ్యాత్మ రామాయణంలో కూడ ఇదే మాట అంటాడు –

విసృజ్య మౌర్ఖ్యం హృది శత్రుభావనాం
భజస్వ రామం శరణాగతప్రియమ్ ।
సీతాం పురస్కృత్య సపుత్రబాన్ధవో
రామం నమస్కృత్య విముచ్యసే భయాత్ ॥
(అ.రా.5/4/23)

"రావణా! హృదయ స్థిత శత్రు భావనా రూపమైన మూర్ఖత్వాన్ని

విడనాడి శరణాగత ప్రియుడైన శ్రీరామచంద్రుని భజించుము. సీతామాతను ముందుంచుకొని పుత్ర బంధుబాంధవ సహితుడవై శ్రీరాముని శరణువేడుము. అలా చేస్తే నీవు భయముక్తుడవు కాగలుగుతావు"

తద్రీతిగా హనుమంతుడు రావణునికి హితాన్ని చేకూర్చునట్టి ఎన్నో విషయాలు బోధించాడు. కాని అవన్నీ రావణునికి చెడుగానే అనిపించాయి అతడు క్రుద్ధుడై - "ఓరీ వానరా! నిర్భయునివలె నీవు నా సమక్షంలో ఎంతగా ప్రేలుతున్నావు. ఓ వానరాధమా! ఇప్పుడే నిన్ను నేను అంతం చేస్తాను". అని అతడు ఆ కపిశ్రేష్ఠుని కఠోరవచనాలతో నిందించి రాక్షసులను పిలచి - "వీణ్ణి అంతం చెయ్యండి" అన విని రాక్షసులు అనేకమంది హనుమంతుని అంతం చెయ్య సంసిద్ధులయ్యారు. అంత విభీషణుడు రావణునికి నచ్చచెప్పిన విషయాలు రామచరిత మానసంలో ఇలా వర్ణింపబడ్డాయి -

నాఇ సీస కరి బినయ బహూతా । నీతి బిరోధ న మారిఅ దూతా ॥
ఆన దండ కఛు కరిఅ గోసాఁఈ । సబహీఁ కహా మంత్ర భల భాఈ ॥
(రా.మా.సున్దర. దో. 24(అం))

ఓ స్వామీ! దూతను చంపరాదు. ఇది రాజ నీతివిరుద్ధము ఏదైనా వేరే శిక్ష విధించుము. ఈ సలహా ఉత్తమమైనదని అందరూ పలికిరి.

అదివిని రావణుడంటాడు -

కపి కేఁ మమతా పూఁఛ పర సబహి కహఉఁ సముఝాఇ ।
తేల బోరి పట బాంధి పుని పావక దేహు లగాఇ ॥
పూఁఛహీన బానర తహఁ జాఇహి । తబ సఠ నిజ నాథహి లఇ ఆఇహి ॥
జిన్హ కై కీన్హిసి బహుత బడాఈ । దేఖఉఁ మైఁ తిన్హ కై ప్రభుతాఈ ॥
(రా.మా. సుందర. 24,25(అంత))

వానరులకు తమ వాలమునందు ప్రీతి యధికము కావున నూనెలో బట్టలను ముంచి వీని వాలమునకు చుట్టి నిప్పు పెట్టుడు. వాలము లేని ఈ వానరము తిరిగిపోయి తన స్వామిని వెంటబెట్టుకొని వచ్చును. ఇతనంతగా పొగడిన యితని ప్రభుసామర్థ్యమును చూచెదగాక?

అధ్యాత్మ రామాయణంలో చూడండి! రావణ వచనాలనాలకించిన హనుమంతుడు అంత తన కార్యం సిద్ధించినదని భావించారు. ఇక రాక్షసులు రావణుని ఆదేశానుసారం శీఘ్రంగా అనేక వస్త్రాలను ఘృతతైలాలలో ముంచి హనుమంతుని వాలానికి చుట్టి నిప్పు ముట్టించారు. నగరమంతా ఆ కపిశ్రేష్ఠుని పరిభ్రమింపజేసి దండోరా వేస్తూ- "ఇతడు దొంగ, అందుకే ఈ శిక్ష వేయబడింది" అని అరవసాగారు. కొంచెం దూరం వెళ్ళగానే మారుతి తన శరీరాన్ని కుంచించుకొని, సమస్త బంధనముక్తుడై పునః పర్వతాకారుడై లంకా నగరాన్నంతటినీ దహించివేశాడు.

ఉత్ప్లుత్యోత్ప్లుత్య సన్దీప్తపుచ్ఛేన మహాకపిః ।
దదాహ లంకామఖిలాం సాట్టప్రాసాదతోరణామ్ ॥
హా తాత పుత్ర నాథేతి క్రన్దమానాః సమన్తతః ।
వ్యాప్తాః ప్రాసాదశిఖరేప్యారూఢా దైత్యయోషితః ॥
(అ.రా.5/4/42-43)

ఓ ఇంటినుండి మరో ఇంటికి దూకుతూ హనుమంతుడు, జ్వలిస్తున్న తన వాలంతో ఇంటిపైకప్పులు, ప్రాసాదములు తోరణములతో కూడిన లంకా నగరాన్నంతటినీ దహించి వేశాడు. తత్సమయంలో 'హా తండ్రీ! హా కుమారా! హా నాథా!' అన్న ఆర్తనాదాలను దైత్యాంగనలు చేస్తూ నల్దిశలకూ చెల్లాచెదరై పోయారు. కొందరు భవన శిఖరాలపైకి కూడ ఎక్కివేశారు.

రామచరిత మానసంలో వ్రాయబడింది -

నిబుకి చఢేఉ కపి కనక అటారీం । భఈం సభీత నిసాచర నారీం ॥

x x x x x

జారా నగరు నిమిష ఎక మాహీం । ఏక విభీషన కర గృహ నాహీం ॥

x x x x x

ఉలటి పలటి లంకా సబ జారీ । కూది పరా పుని సింధు మఝారీ ॥

x x x x x

పూంఛ బుఝాఇ ఖోఇ శ్రమ ధరి లఘు రూప బహోరి ।

జనకసుతా కేఁ ఆగేఁ ఠాఢ భయఉ కర జోరి ॥
(రా.మా.దో. 24–26(అంతర్గత))

బంధనములనుండి ముక్తుడైన హనుమంతుడు బంగారు ప్రాకారాలపై దుముకసాగెను. అది చూచిన రాక్షసస్త్రీలందరు భీతిల్లిరి. ఒకే క్షణంలో ఒక్క విభీషణుని యింటినిమాత్రము విడిచి సమస్త లంకానగరాన్ని దహించివేశాడు. లంకానగరాన్ని ఒకవైపునుండి మరోవైపువరకు దహించివేసి సముద్రంలో దూకినాడు. తన వాలమునగల నిప్పును ఆర్పి, అలసతను తీర్చుకొని వెంటనే చిన్న రూపును ధరించి హనుమంతుడు జానకీదేవి సముఖంలో అంజలిబద్ధుడై నిలుచున్నాడు.

ఆ రీతిగా జానకీదేవి సన్నిధికి వెళ్ళి హనుమంతుడు ఆమెకు ప్రణమిల్లి శ్రీరామసన్నిధికి వెళ్ళుటకై అనుమతిని కోరాడు. అప్పుడు సీతామాత – "హనుమంతా! నిన్ను చూసి నేను కొంత దుఃఖాన్ని పోగొట్టుకున్నాను. నీవు కూడ వెళ్ళి పోతున్నావు. రామకథను వినకుండ నేనెలా ఉండగలనో చెప్పు" అధ్యాత్మ రామాయణంలో తత్సమయంలో హనుమద్వచనాలను చూడండి –

యద్యేవం దేవి మే స్కన్ధమారోహ క్షణమాత్రతః ।
రామేణ యోజయిష్యామి మన్యసే యది జానకి ॥
(అ.రా.5/5/6)

"అమ్మా! జానకీ! నీవు అంగీకరించితే నా భుజముపై కూర్చో, క్షణమాత్రకాలంలో నేను నిన్ను రామచంద్రునివద్దకు చేరుస్తాను."

వాల్మీకి రామాయణంలో విస్తృతవర్ణన జరిగింది. అక్కడ హనుమంతుని వచనాలనాలకించి జానకీ దేవి – "హనుమా! నేను స్వేచ్ఛగా పరపురుషుని ఎట్లు స్పృశించగలను? శ్రీరామచంద్రుడు వానరులతో ఇక్కడకు విజయంచేసి రావణుని యుద్ధంలో అంతం చేసి అప్పుడు నన్ను తీసుకువెళ్ళడమే కీర్తికర విషయము కనుక నీవు వెళ్ళు. కొన్నాళ్ళు ఎలాగో నేను ప్రాణాలతో ఉంటాను" అంది.

తరువాత హనుమంతుడు పలికిన పలుకులు రామచరిత మానసంలో ఇలా ఉన్నాయి –

మాతు మోహి దీజే కఛు చీన్హా । జైసేఁ రఘునాయక మోహి దీన్హా ॥
(రా.మా.సున్దర.దో. 27(అంతర్గతము))

"మాతా! శ్రీరాముడిచ్చినట్లుగా మీరు కూడా నాకేదైనా గుర్తునివ్వండి."

అనగా సీతాదేవి తన చూడామణిని హనుమంతునకిస్తుంది. దానిని తీసుకుని హనుమంతుడు పరమానందం పొందాడు. తరువాత సీతాదేవి – జయంతుడు కాకరూపాన్ని ధరించి ముక్కుతో పొడవడం, రాముడు దానిపై క్రుద్ధుడు కావడం ఆదిగాగల ప్రసంగమంతా హనుమంతునకు వినిపించింది.

ఆ రీతిగా హనుమంతుడు సీతా సందేశాన్ని గ్రహించి ఆమెకు ప్రణమిల్లి అక్కడనుండి మరలాడు. అతని మనస్సులో రామ దర్శనకాంక్ష తీవ్రమవుతూన్నది అందులకతడు మహావేగంతో పర్వతంపైకి ఎక్కుతూన్నాడు. తత్సమయంలో అతని పాదఘట్టనలకు పర్వత శిలలు చూర్ణమైపోతూన్నాయి. సర్వోన్నత శిఖరమెక్కి హనుమంతుడు తన శరీరాన్ని పెంచి సాగరలంఘనోద్యుక్తుడై ఉత్తరదిశగా పురోగమించాలని భావించాడు. పర్వతశిఖరం మీదనుండి దూకి వాయువేగంతో ఆకాశంలోకి ఎగిరాడు. హనుమంతుని పాదఘట్టనలచే అణగద్రొక్కబడడం వల్ల మహాధ్వనులు చేసుకుంటూ, ఆ పర్వతం తనపై మొలచిన తరుప్రాణి సమూహాలతో భూగర్భంలోకి దించుకపోయింది.

ఆ వానర శ్రేష్ఠుడు హనుమంతుడు ఆకాశమార్గంలో పురోగమిస్తూ ఉత్తరతీరం చేరుతూనే తీవ్రంగా గర్జించాడు. దానితో దిశలన్నీ ప్రతిధ్వనించాయి. అది విన్న వానరులందరూ హనుమంతుని కలుసుకోవాలని ఉత్సాహితులయ్యారు. జాంబవంతునికి మహదానందం కలిగింది. అతడందరితో – "హనుమంతుడు తనకార్యాన్ని సిద్ధింపజేసుకుని వస్తూన్నాడు. లేనిచో అతని గర్జన ఈ రీతిగా ఉండదు." అన్నాడు.

అంతలోనే మహావేగశాలీ, పర్వతాకారుడూ అయిన హనుమంతుడు మహేంద్రపర్వత శిఖరం మీదకు దూకాడు. తత్సమయంలో వానరులందరూ మహానందపరవశులయ్యారు. మహాత్ముడైన హనుమంతునికి నలువైపులా వారందరూ పరివేష్టించి నిలబడ్డారు. హనుమంతుడు జాంబవంతాది పెద్దలకు ప్రణమిల్లాడు. అన్యవానరులతో ప్రేమపూర్వకంగా కలిశాడు. సీతామాతను చూసి వచ్చిన సమాచారాన్నీ, లంకాదహన సమాచారాన్నీ వారందరికీ సంక్షేపంగానే వినిపించాడు. ఈ ప్రసంగ విషయాలు కూడ వాల్మీకి రామాయణంలో విస్తృతంగా వర్ణింపబడ్డాయి.

హనుమంతుడు వానరులందరితో కలిసి కిష్కింధానగరం చేరాడు. అక్కడ సుగ్రీవుని మధువనంలో వానరులందరూ అంగదుని ఆదేశానుసారం మధువును పానం చేశారు. మధువన రక్షకులు పోయి సుగ్రీవునితో చెప్పుకున్నారు. తత్సమయంలో లక్ష్మణుని ప్రశ్నానుసారం సుగ్రీవుడు– "సోదరా! లక్ష్మణా! ఈ విషయాలన్నిటినీ చూస్తూంటే హనుమంతుడు జానకీదేవిని చూసి వచ్చినట్లేనని నేను నిస్సందేహంగా చెప్పగలుగుతూన్నాను. వానరశ్రేష్ఠుడైన హనుమంతునిలో కార్యాన్ని సిద్ధింప జేయగల శక్తి, బుద్ధి, ప్రయత్నమూ, పరాక్రమమూ, శాస్త్రీయ జ్ఞానాలూ అన్నీ ఉన్నాయి" అంటాడు. అంతే కాకుండ హనుమత్ప్రభావాన్ని వ్యక్తం చేసే మరికొన్ని విషయాలను చెబుతాడు.

అంత సుగ్రీవుడు శీఘ్రంగా వానరులందరితోటీ హనుమంతుని తనకు దగ్గరగా పిలచి అతని కుశల సమాచారాన్ని విని అత్యంత ప్రసన్నుడవుతాడు. అందరూ కలిసి శ్రీరామ సన్నిధికి చేరుతారు. తత్సమయంలో హనుమంతుని మహత్త్వాన్ని వర్ణించి జాంబవంతుడంటాడు.

**నాథ పవనసుత కీన్హి జో కరనీ । సహసహుఁ ముఖ న జాఇ సో బరనీ ॥**

(రా.మా.సున్దర.దో. 30(అంతర్గత))

"ప్రభూ! పవనపుత్రుడగు హనుమంతుడు నెరవేర్చిన కార్యములను వేలకొలది ముఖములున్ననూ మేము వర్ణించజాలము."

అనంతరం హనుమంతుడు ప్రభుచరణాలకు ప్రణమిల్లగా రామచంద్రుడతన్ని హృదయానికి హత్తుకుంటాడు. అంత హనుమంతుడు, "ప్రభూ! సీతామాత నిజ పాతివ్రత్య ప్రభావంవల్ల శారీరికంగా కుశలంగా ఉంది. ఆమెను సందర్శించి నేను వచ్చాను" అన్న అమృతోపమాన వచనాల నాలకించిన రామలక్ష్మణులకు మహదానందం కలిగింది. భగవంతుని మనస్సును గ్రహించిన హనుమంతుడు జానకీదేవి దర్శనమైన విధానాన్ని అక్కడ జరిగిన సమాచారాన్ని వివరించి ఆమె ఇచ్చిన చూడామణిని శ్రీరామునికి సమర్పించాడు. ఆ మణిని తీసుకున్న శ్రీరాముడు దానిని హృదయానికి హత్తుకుని చూస్తూ విరహవ్యాకులుడై పోయాడు.

రామచరిత మానసంలో సీతా సందేశాన్ని వినిపిస్తూ హనుమంతుడు సీత ప్రేమ విషయాన్ని ఇలా చెప్పాడు –

నామ పాహరూ దివస నిసి ధ్యాన తుమ్హార కపాట ।
లోచన నిజ పద జంత్రిత జాహిఁ ప్రాన కేహి బాట ॥

(రా.మా.సున్దర.దో. 30)

మీ నామమే ఆమెకు రేయింబవళ్ళు కాపలాదారు. మీ ధ్యానమే కవాటము. తన నేత్రములను ఆమె సదా తమ చరణములపై నిలుపును. అదియే తాళము. మరి యామె ప్రాణములు పోవుటకు దారి ఏది?

అంతమందు ఇలా చెప్పాడు –
**సీతా కై అతి బిపతి బిసాలా । బినహిఁ కహేఁ భలి దీనదయాలా ॥**

(రా.మా.సున్దర.దో. 31(అం))

"ఓ దీనదయాళూ! ఆమె విశాలమైన ఆపదనుగూర్చి మీకు చెప్పకుండుటయే మంచిది."

అధ్యాత్మరామాయణంలో ఈ వర్ణన ఇలా ఉంది. సీతా సమాచారాన్ని వినిపిస్తూ హనుమంతుడంటాడు –

అభిజ్ఞానం దేహి మే దేవి యథా మాం విశ్వసేద్విభుః ॥
ఇత్యుక్తా సా శిరోరత్నం చూడాపాశే స్థితం ప్రియమ్ ।
దత్త్వా కాకేన యద్వృత్తం చిత్రకూటగిరౌ పురా ॥
తదప్యాహాశ్రుపూర్ణాక్షీ కుశలం బ్రూహి రాఘవమ్ ।
లక్ష్మణం బ్రూహి మే కిఞ్చిద్ దురుక్తం భాషితం పురా ॥
తత్క్షమస్వాజ్ఞభావేన భాషితం కులనన్దన ।
తారయేన్మాం యథా రామస్తథా కురు కృపాన్వితః ॥
x x x x
తతః ప్రస్థాపితో రామ త్వత్సమీపమిహాగతః ।
తదాగమనవేలాయామశోకవనికాం ప్రియామ్ ॥
ఉత్పాట్య రాక్షసాంస్తత్ర బహూన్హత్వా క్షణాదహమ్ ।
రావణస్య సుతం హత్వా రావణేనాభిభాష్య చ ॥
లంకామశేషతో దగ్ధ్వా పునరప్యాగమం క్షణాత్ ।
(అ.రా.5/5/52–55,57–59)

"మరలి వచ్చే వేళ జానకీ దేవితో – "అమ్మా! రామచంద్రుడు విశ్వసించదగునట్టి ఆనవాలు నేమైనా ప్రసాదించవమ్మా! అనగా విని ఆమె తన కేశపాశంలో ఉన్న తనకు ప్రియమైన చూడామణిని నాకు యిచ్చింది, గతంలో చిత్ర కూటాద్రిపై జరిగిన కాక సంబంధమైన ఘట్టాన్ని వినిపించి సజలనేత్రియై – "రఘునాథులకు నాకుశలాన్ని తెలియజెయ్యి. లక్ష్మణునితో రఘుకులనందనా! గతంలో అజ్ఞానవశనై నేను పలికిన కఠోరవచనాలకు నన్ను క్షమించి రఘునాథులు నన్నుద్ధరించునట్లు దయచూపుము" అన్న ఆమె సందేశవచనాలతో ఆమె నన్ను పంపగా వచ్చాను. మరలి వచ్చే సమయంలో నేను రావణునికి అత్యంత ప్రీతిపాత్రమైన అశోకవనాన్ని ధ్వంసముచేసి, క్షణకాలంలో అనేక మంది రాక్షసులను అంతం చేసి వచ్చాను. రావణపుత్రుడైన అక్షకుమారుని కూడ అంతం చేశాను. రావణునితో, భాషించి లంకను దగ్ధం చేసి శీఘ్రంగా యిక్కడకు వచ్చేశాను".

హనుమంతుని ద్వారా సీత సమాచారమంతా విన్న శ్రీరాముడు అత్యంత ప్రసన్నుడై పలికాడు –

హనుమంస్తే కృతం కార్యం దేవైరపి సుదుష్కరమ్ ।
ఉపకారం న పశ్యామి తవ ప్రత్యుపకారిణః ॥
ఇదానీం తే ప్రయచ్ఛామి సర్వస్వం మమ మారుతే ।
ఇత్యాలింగ్య సమాకృష్య గాఢం వానరపుంగవమ్ ॥
సార్ద్రనేత్రో రఘుశ్రేష్ఠః పరాం ప్రీతిమవాప సః ।
(ఆ.రా.5/5/60-62)

"వాయునందనా! హనుమంతా! దేవతలకు కూడ అసాధ్యమైన కార్యాన్ని నీవు చేశావు. బదులుగా నేను నీకెట్టి ఉపకారం చేయాలో నాకు తెలియడం లేదు. నేను నీకిప్పుడే నా సర్వస్వాన్ని ప్రసాదిస్తున్నాను" అంటూ రఘుశ్రేష్ఠుడు వానరశ్రేష్ఠుడైన హనుమంతుని గాఢాలింగనం చేసుకున్నాడు. అతని నేత్రాలు ప్రేమాశ్రుభరితం కావడంతో అతడు ప్రేమమగ్నుడై పోయాడు.

హనుమంతుని బల, పరాక్రమ, కార్యకౌశల, సాహస, పవిత్ర ప్రేమల విషయమై ఈ ప్రకరణంలోనూ రామాయణములన్నింటిలోనూ వాల్మీకి రామాయణ యుద్ధకాండలో హనుమత్ప్రభావము బహు అద్భుతంగా అత్యంత సుందరంగా వర్ణింపబడింది. ఇక్కడ తత్సంబంధంగా దిగ్దర్శనం మాత్రం చేయబడింది.

ఒకనాటి భయంకరయుద్ధములో రావణుని ప్రధాన సేనాపతులు అంతమైపోయారు. రాక్షసులు హతాశులైపోయారు. పుత్రులూ, సోదరులూ అంతమైపోయారన్న వార్త నాలకించిన రావణునకు అత్యంత విచారం కలిగింది. అది చూసిన మేఘనాదునికి తీవ్రక్రోధం కలిగింది. అతడు తండ్రి సమక్షంలో తన బలపౌరుషాదులను వర్ణించుకుని అతనికి ధైర్యం చెప్పి భయంకర యుద్ధం చేయ రణరంగంలోకి వచ్చాడు. అక్కడకు వచ్చి అతడు భయంకర యుద్ధం చేశాడు. వానరులనేకులను ప్రాణహీనులను చేశాడు. వాని బ్రహ్మాస్త్ర ప్రభావంవల్ల రామలక్ష్మణులుకూడ మూర్ఛపడిపోయారు. హత శేషులైన వానరభల్లూక సేనలు చింతా మగ్నులైపోయారు. అంత విభీషణుడు అందరికీ ధైర్యం చెప్పి జాంబవంతుడు పడివున్న ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళిన తరువాత విభీషణుడు జాంబవంతుని

పరిస్థితిని గురించి ప్రశ్నించగా - అతడు తన బాధను వ్యక్తం చేస్తూ- "విభీషణా! ధ్వనినిబట్టి నేను నిన్ను గుర్తించగలిగాను. నాకు చూచే శక్తిలేదు వానర శ్రేష్ఠుడైన హనుమంతుడు సజీవంగా ఉన్నదీ లేనిదీ ప్రప్రథమంగా చెప్పు" అనగా విభీషణుడు - "భల్లూకరాజా! నీవు రామలక్ష్మణుల క్షేమ సమాచార విషయమై ప్రశ్నించక కేవలం హనుమంతుని గురించియే ఏల ప్రశ్నిస్తున్నావు? సుగ్రీవరాజు, అంగదుడు, రామ లక్ష్మణులూ వీరి పై కూడ లేనంత గాఢప్రేమను నువ్వు మారుతిపై చూపడానికి గల కారణాన్ని చెప్పు" అన్నాడు. అంత జాంబవంతుడు -

శృణు నైరృతశార్దూల యస్మాత్పృచ్ఛామి మారుతిమ్ ॥
అస్మింజీవతి వీరే తు హతమప్యహతం బలమ్ ।
హనూమత్యుజ్ఝితప్రాణే జీవన్తోఽపి మృతా వయమ్ ॥

(వా రా.6/74/21-22)

"రాక్షసరాజా! హనుమంతుడే కనుక యీ సమయంలో సజీవుడుగా ఉంటే మరణించిన వానరసైన్యమంతా సజీవమగును. అతని ప్రాణాలే లేచిపోతే మనం బ్రతికికూడ మృతప్రాయమే అవుతాము "

అంత హనుమంతుడు భల్లూకపతికి ప్రణమిల్లాడు. హనుమంతుని పలుకులనాలకించిన జాంబవంతునికి నవ్యశక్తి వచ్చింది. అతడు హనుమంతునికి సంజీవనీ ఓషధి యుక్తశక్తిని వివరించి హిమాలయాలకు పంపాడు. అతని ఆదేశానుసారం హనుమంతుడు అక్కడకు పోయి ఓషధికై అన్వేషించసాగాడు. అది కనిపించకపోవడంతో అతడా పర్వతాన్నే పెకలించి తీసుకువచ్చాడు. వానరులందరికీ ప్రాణదానం చేశాడు. రామలక్ష్మణులు కూడ స్వస్థచిత్తులయ్యారు.

రావణుడు ప్రయోగించిన అమోఘశక్తి విభీషణుని రక్షించాలని అతనికి ముందు నిలచిన లక్ష్మణునికి తగలడంతో అతడు మానుషలీలార్థం మూర్ఛితుడైపోయాడు. సర్వప్రపంచానికీ ఆధారభూతుడైన అతణ్ణి రావణుడు లేవనెత్త లేకపోయాడు. అధ్యాత్మ రామాయణంలో -

గ్రహీతుకామం సౌమిత్రిం రావణం వీక్ష్య మారుతిః ॥

అజఘానోరపి క్రుద్ధో వజ్రకల్పేన ముష్టినా ।
తేన ముష్టిప్రహారేణ జానుభ్యామపతద్భువి ॥
(అ.రా.6/6/12-13)

తత్సమయంలో లక్ష్మణుని లేవనెత్తుకుపోవాలనుకున్న రావణుని చూసేసరికి హనుమంతునికి తీవ్రక్రోధం కలుగుతుంది. వజ్రతుల్యమైన తన ముష్టితో అతడు రావణుని వక్షఃస్థలముపై తీవ్రప్రహారం చేయడంతో రావణుడు మోకాళ్ళబలంపై నేలకూలాడు. ఈలోగా మారుతి లక్ష్మణుని ఎత్తుకుని రామచంద్రుని సన్నిధికి తీసుకువెళ్ళాడు.

అప్పుడు కూడ హనుమంతుడు ద్రోణాద్రికి ఓషధులకై వెళ్ళాడు. గతంలో వలెనే పర్వతాన్ని పెకలించి తీసుకువచ్చాడు. తత్ప్రసంగాన్ని వర్ణిస్తూ రామాయణాలన్నీ హనుమంతుని అద్భుత బల, పౌరుష, బుద్ధి, కౌశల ప్రభావాలను వర్ణించాయి.

రామచరితమానసంలో మేఘనాదుని శక్తివల్ల లక్ష్మణుడు మూర్ఛితుడైనట్లు వస్తుంది. అక్కడ జాంబవంతుని వచనానుసారం ఆంజనేయుడు సుషేణ వైద్యుని సదనంతోసహా తీసుకువస్తాడు. ఆ తరువాత సుషేణ వచనానుసారం సంజీవనికోసం వెళ్ళి ఆ పర్వతాన్ని పెకలించుకువస్తాడు. హనుమంతుని సేవాభావం అత్యంత విచిత్రమైనది. అతని సేవల కారణంగా శ్రీరామభగవానుడు తాను అతనికి ఋణపడినట్లు భావించాడు. సీతామాతకూడ అట్టి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. లక్ష్మణుని మరియు సమస్త వానరుల ప్రాణాలు రక్షించబడ్డాయి. అట్లే వియోగవ్యాకులుడైన భరతునకు శ్రీరామాగమన సమాచారాన్ని వినిపించి అతని ప్రాణాలను నిలబెట్టిన కార్యం కూడ హనుమంతుడే చేశాడు.

రామచరిత మానసంలోని వర్ణనను తిలకించండి -

రామ బిరహ సాగర మహఁ భరత మగన మన హోత ।
బిప్ర రూప ధరి పవనసుత ఆఇ గయఉ జను పోత ॥
(రా.మా.ఉత్తర. దో. 1-క)

శ్రీరామచంద్రుని విరహమను సముద్రములో మునిగిపోవుచున్న

భరతుని రక్షించుటకు పవనసుతుడైన ఆంజనేయుడు విప్రరూపమును ధరించిన ఓడగా వచ్చెను.

అక్కడ హనుమంతుడు భరతుని ప్రేమదశను తిలకించి అంటాడు–

**జాసు బిరహఁ సోచహు దిన రాతీ । రటహు నిరంతర గున గన పాఁతీ ॥**
**రఘుకుల తిలక సుజన సుఖదాతా । ఆయహు కుసల దేవ ముని త్రాతా ॥**

(రా.మా.ఉత్తర. దో. 2/2)

ఎవరి విరహములో మీరు రాత్రింబవళ్ళు ధ్యానించుచున్నారో, ఎవరి గుణగణరాశులను నిరంతరము స్మరించుచున్నారో, అట్టి దేవతలను, మునులను రక్షించువాడు, భక్తజనులకు సుఖమునిచ్చువాడు, రఘుకులతిలకుడైన శ్రీరామచంద్ర ప్రభువు క్షేమముగా వచ్చుచున్నాడు.

ఈ రీతిగా శ్రీరాముని కుశలసమాచారాన్ని ఆలకించిన భరతునిలో జీవన సంచారమైనది. అతడు ప్రశ్నింపగా హనుమంతుడు తనపరిచయం చేసుకుంటూ అంటాడు –

**మారుత సుత మైఁ కపి హనుమానా । నాము మోర సును కృపానిధానా ॥**
**దీనబంధు రఘుపతి కర కింకర । ........ .......... .......... ....... ॥**

(రా.మా.ఉత్తర.దో.2(అంత))

ఓ కృపా నిధానా! వినుము. నేను వాయుదేవుని కుమారుడనైన ఆంజనేయుడను. దీనబంధువైన రఘునాథుని ఒక కింకరుడను.

ఎంతటి వినయ భావము? ఆ పలుకుల నాలకిస్తూనే భరతుడు లేచి హర్షము, ఆదరాలతో పలికాడు. తన ఆనందాన్ని వర్ణిస్తూ చివరకు అంటాడు–

**నాహిన తాత ఉరిన మైఁ తోహీఁ । అబ ప్రభు చరిత సునావహు మోహీ ॥**

(రా.మా.ఉత్తర.దో.2. అంత)

ప్రియతమా! నేను మీ ఋణమునుండి విముక్తుణ్ణికాలేను. ఇప్పుడు ప్రభుచరితమును నాకు వినిపించుడు.

ఆ విధంగా హనుమంతుడు అందరినీ సేవించాడు. తద్రీతిగా అందరినీ తనకు ఋణపడినట్లు చేశాడు. శ్రీరామచంద్రుడు రాజ్యసింహాసనంపై ఆసీనుడైన తరువాత కూడ హనుమంతుడు అతని సేవలోనే ఉండిపోయాడు. ఇతర వానర, రాక్షసాదులు తమతమ నెలవులకు మరలిపోయారు. కాని హనుమంతుడు మాత్రం వెళ్ళలేదు. శ్రీరామచంద్ర భగవానుడు అశ్వమేధయాగం చేసినప్పుడు కూడ హనుమంతుడు అశ్వరక్షణార్థం శత్రుఘ్నునితో వెళ్ళాడు.

పద్మపురాణాంతర్గతమైన పాతాళఖండంలో రామాశ్వమేధయాగ వర్ణన విస్తృతంగా జరిగింది. అక్కడ కూడ హనుమంతుని మహత్త్వ సంబంధమై అత్యంత సుందర వర్ణన కొనసాగింది. శ్రీరామాశ్వమేధ అశ్వం అనేక దేశాలలో పరిభ్రమిస్తూ సుబాహురాజుయొక్క రాజధాని అయిన చక్రాంగ నగర సమీపం చేరగా ఆ రాజనందనుడైన దమనుడు ఆ అశ్వాన్ని పట్టుకున్నాడు. ఆ రాజుయొక్క కుమారులూ, సోదరులూ కూడ మహాశూర, వీర, పరాక్రమ సంపన్నులు. ఆ రాజు కూడ మహావీరుడే, అక్కడ ఇరువైపులా ఘోరయుద్ధం జరిగింది. చివరలో సుబాహు రాజుకూ హనుమంతునకూ మధ్య భయంకర యుద్ధం సాగింది. అందులో కపివరుడైన హనుమంతుడు మాటిమాటికీ సుబాహువును వ్యథితుని చేశాడు. అతని రథాశ్వాలను చూర్ణం చేసి వేశాడు. తీవ్రవేగంతో ఆ రాజు వక్షఃస్థలంలో ఒక్క తన్ను తన్నాడు. ఆ దెబ్బ తగలడంతో సుబాహురాజు మూర్ఛితుడై నేలకూలాడు. హనుమంతుని పదాఘాతంతో అతని మోహం నాశనమై పోయింది. అతని మనస్సులో శ్రీరామభక్తి ప్రకటింపబడింది. అతడు స్వప్నంలో చూస్తాడు -

> రామచన్ద్రస్త్వయోధ్యాయాం సరయూతీరమణ్డపే ।
> బ్రాహ్మణైర్యాజ్ఞికశ్రేష్ఠైర్బహుభిః పరివారితః ॥
> తత్ర బ్రహ్మాదయో దేవాస్తత్ర బ్రహ్మాణ్డకోటయః ।
> కృతప్రాఞ్జలయస్తం వై స్తువన్తి స్తుతిభిర్ముహుః ॥
>
> (పద్మపురాణం.28/49-50)

అయోధ్యానగరంలో సరయూతీరంలో శ్రీరామచంద్రుడు

యాగమండపంలో విరాజిల్లుతూన్నాడు. యాజ్ఞికులయిన బ్రాహ్మణులనేకులు అతణ్ణి పరివేష్టించి వున్నారు కోట్లాది బ్రహ్మాండాలు బ్రహ్మాది దేవతలు చేతులు జోడించి నిలబడి శ్రీరాముని స్తుతిస్తూన్నారు.

ఆ విధమైన అద్భుత స్వప్నాన్ని తిలకించిన సుబాహురాజుకు శ్రీరామతత్త్వ జ్ఞానం కలిగింది. అతడు వెంటనే మూర్ఛనుండి లేచి శత్రుఘ్నుని చరణాలవైపు పాదచారిగా వెళ్ళాడు యుద్ధాన్ని ఆపవలసినదిగా ప్రకటిస్తూ అతడు తన పుత్రులతోనూ, బంధుబాంధవులతోనూ పలికాడు –

ఏష రామః పరం బ్రహ్మ కార్యకారణతః పరమ్ ।
చరాచరజగత్స్వామీ న మానుషవపుర్ధరః ॥
ఏతద్ధి బ్రహ్మవిజ్ఞానమధునా జ్ఞాతవానహమ్ ।
(ప.పు.28/59–60)

"ఈ శ్రీరామచంద్రుడు కార్య కారణాతీత పరబ్రహ్మ, చరాచర జగత్స్వామి. మనుష్యశరీరాన్ని ధరించినా ఇతడు మానవుడు కాడు. ఈ రూపంలో ఇతణ్ణి తెలుసుకోగలగడమే బ్రహ్మజ్ఞాన మవుతుంది. ఈ తత్త్వాన్ని నేనిప్పుడు గ్రహించ గలిగాను" అని పలికి తన పుత్రులతో – ఆసితాంగమహర్షివల్ల తనకు ఏర్పడ్డ శాపవృత్తాంతాన్ని వినిపించి, యాగాశ్వంతో సహా తన బంధు బాంధవులతో కలసి వెళ్ళి శత్రుఘ్నుని శరణు వేడాడు. తరువాత కృతజ్ఞతను ప్రకటిస్తూ హనుమంతుని విషయమై పలికాడు –

క్వాసౌ హనూమాన్ రామస్య చరణామ్భోజషట్పదః ।
యత్ప్రసాదాదహం ప్రాప్స్యే రాజరాజస్య దర్శనమ్ ॥
సాధూనాం సంగమే కిం కిం ప్రాప్యతే న మహీతలే ।
యత్ప్రసాదాదహం మూఢో బ్రహ్మశాపమతీతరమ్ ॥
(ప.పు.29/32–33)

శ్రీరాముని చరణ కమల మధుకరుడైన హనుమంతుడెక్కడ? అతని దయవల్లనే నేను రాజాధిరాజైన శ్రీరామచంద్రుని సందర్శించగలిగాను.

సాధుసాంగత్యం లభించిన నాడు మనుష్యమాత్రునకు ఈ పృథ్వీలో లభించనిది ఏముంటుంది? నేను మహామూఢుడను, అయినా సత్సాంగత్య ప్రభావంవల్ల నేడు ఘోరమైన బ్రహ్మ శాపంనుండి ఉద్ధరింపబడ్డాను.

తరువాత అనేక దేశాలను జయించుకుంటూ యాగాశ్వం సత్యవంతరాజ నగరం చేరేసరికి "విద్యున్మాలి" అన్న రాక్షసుడు మధ్యే మార్గంలో యాగాశ్వాన్ని అపహరించి సైన్య సమేతంగా విమానారూఢుడై ఆకాశమార్గంలో కనిపించాడు. అక్కడ ఆ రాక్షసునితో శత్రుఘ్న సైన్యాలకు అతిభయంకర యుద్ధం జరిగింది. తత్సమయంలో హనుమంతుడు ఆ రాక్షసునితో యుద్ధం చేయ తన పరాక్రమాన్ని ప్రకటించదలచి చేసిన ప్రతిజ్ఞ ద్వారా హనుమంతునకు శ్రీరామచంద్రునిపైగల దృఢవిశ్వాసం ఎంతగా ఉన్నదీ తెలియవస్తున్నది. శ్రీరామ కృపాధారంపై హనుమంతుడు తన అద్భుత శక్తిపై దృఢ విశ్వాసం ఉంది. అతడు అంబర మార్గంలో ప్రవేశించి శత్రుపక్షంలోని దైత్యులను వాడి గోళ్ళతో చీల్చి వేసి యమసదనానికి పంపివేస్తున్నాడు. కొందరిని వాలంతో కొట్టీ, కొందరిని కాళ్ళతో త్రొక్కి మరికొందరిని చేతులతోచీల్చి వేశాడో అపుడు రాక్షసుడు తీక్షణ భయంకరమైన తన త్రిశూలాన్ని హనుమంతునిపై ప్రయోగించగా హనుమంతుడు దానిని తన నోటితో పట్టుకుని, దంతాలతో నమలి చూర్ణం చేసివేశాడు. ఆ రాక్షసరాజును కొట్టి వ్యాకులపరచాడు. తరువాత విద్యున్మాలి, వజ్ర దంష్ట్రులను శత్రుఘ్నుడు నేల కూల్చివేశాడు.

హత శేషులైన రాక్షసులు అతనిని శరణు వేడారు. అక్కడ నుండి పురోగమించి వారు ఆరణ్యక మునిని కలిశారు. తరువాత అశ్వం దేవపురం చేరింది. అక్కడ పుత్రసహితుడైన వీరమణిరాజుకు శత్రుఘ్న సైన్యాలకు మధ్య ఘోరయుద్ధం జరిగింది. వీరమణిరాజు శంకర భగవానునికి పరమభక్తుడు, ఆ కారణంవల్ల తన భక్తునికి సహకరించ శంకరభగవానుడు తన గణాలతో కూడి యుద్ధరంగంలోకి వచ్చాడు. ఆ భయంకర యుద్ధంలో రాకుమారుడు పుష్కలుడు అంతమైపోయాడు. శత్రుఘ్నుడు కూడ మూర్ఛపడిపోయాడు. దానితో హనుమంతుడు అద్భుత పరాక్రమాన్ని ప్రదర్శించాడు. సాక్షాత్తూ శంకర భగవానునితో అతనికి ఘోరయుద్ధం

జరిగింది. రథాశ్వసారథులను అతడు చూర్ణం చేసివేశాడు. శివభగవానుడు నంది వాహనారూఢుడై యుద్ధం చేయబోగా హనుమంతుడు ఓ సాల వృక్షంతో ప్రహరించి శివుని వ్యాకులపరచాడు. దానితో – శంకర భగవానుడు అతనిపై తన త్రిశూలాన్ని ప్రయోగించాడు. హనుమంతుడు దానిని పట్టుకుని క్షణంలో విరిచి ముక్కలు ముక్కలు చేసి వేశాడు. ఊరుకోక అనేక ప్రహారాలతో శివదేవుని వేధించి చిట్టచివరకు అతనిని తన వాలంలో చుట్టబెట్టి వేశాడు. అది చూసిన నంది భయభీతుడైపోయాడు. అలా హనుమంతుడు శివుని అత్యంత వ్యాకులుని చేయడంతో – శివదేవుడు హనుమంతుడు చేసిన యుద్ధానికి ప్రసన్నుడై – శ్రీరామ సేవకా! హనుమంతా! నీవు ధన్యుడవు. నేడు మహాపరాక్రమాన్ని ప్రకటించావు. నాకు మహదానందం కలిగింది. కనుక నీవు ఏమైనా వరం కోరుకో" అన్నాడు.

అంత హనుమంతుడు నిర్భయంగా – "మహేశ్వరా! శ్రీరామచంద్రుని కృపవల్ల నాకు సర్వమూ లభించియే ఉన్నాయి. అయినా మీ ఆనందార్థం నేను కోరుతూన్నాను. నేను ద్రోణాద్రి చేరి ఓషధిని తీసుకుని వచ్చేవరకూ మీరు మీ గణాలతో మాపక్షంలో మరణించిన వీరుల దేహాలను రక్షించెదరుగాక! ఎవరూ వారిని ఖండాలుగా చేయకుందురు గాక!" అని కోరగా శివదేవుడు ఆ కోరికను మన్నించాడు. తరువాత హనుమంతుడు లంకానగరానికి సంజీవనీ మూలికను తెచ్చినట్లు వెంటనే వెళ్ళి సంజీవనిని తీసుకువచ్చాడు. ప్రథమంగా రాజకుమారుడైన పుష్కలుని బ్రతికించాడు. తరువాత శత్రుఘ్నుని మూర్ఛను దూరం చేశాడు. వీరులందరికీ ప్రాణదానం చేశాడు. ఆ విధంగా ఆ భయంకర యుద్ధంలో హనుమంతుడే తన పరాక్రమంతో అందరి ప్రాణాలను కాపాడాడు. చిట్టచివరకు శ్రీరామభగవానుడు స్వయంగా అక్కడకు వచ్చాడు. శివదేవుడు వీరమణికి నచ్చచెప్పి అతనిని శ్రీరామభక్తునిగా చేసినాడు.

తరువాత ఆ అశ్వము అనేక దేశాలు తిరుగుతూ సురథ మహారాజ రక్షితమైన కుండల నగరం చేరింది. సురథరాజు శ్రీరామచంద్రునికి పరమభక్తుడు. శ్రీరామ సందర్శనార్థమై అతడు ఆ యాగాశ్వాన్ని

బంధించాడు. అక్కడ సురథరాజుకూ, శత్రుఘ్నునకూ మధ్య ఘోరయుద్ధం జరిగింది తత్సమయంలో సురథనందనుడు చంపకుడు పుష్కలుని బందించి నగరంలోకి తీసుకు పోబోతూండగా శత్రుఘ్నుని ప్రేరణానుసారం హనుమంతుడు అక్కడకు వచ్చాడు వస్తూనే అతడు రథంనుండి చంపకుని ఎత్తుకుని ఆకాశంలోకి వెళ్ళిపోయాడు అతడాకాశంలోనే హనుమంతునితో బాహుయుద్ధం చేయసాగాడు చంపకుని అద్భుత పరాక్రమాన్ని తిలకించి నవ్వుతూనే హనుమంతుడు వాని కాళ్ళను పట్టుకొని నూరుపర్యాయాలు గిరగిర త్రిప్పి ఏనుగు అంబారీకి వేసి కొట్టాడు. రాకుమారుడు పడిపోతూనే మూర్ఛపోయాడు.

తన కుమారుడు మూర్ఛపోవడం చూసి సురథరాజు స్వయంగా హనుమంతునితో పోరవచ్చాడు. అతడు హనుమంతుని బలపరాక్రమాలను, రామభక్తిని, సత్య హృదయంతో ప్రశంసించి నేను నిన్ను బంధించి స్వనగరంలోకి తీసుకుపోతాను. అంటూ ప్రతిజ్ఞ చేశాడు. అందులకు హనుమంతుడు బదులు పలుకుతూ, "రాజా! మీరు శ్రీరఘునాథుని చరణకమలాలను చింతించునట్టి వారు, నేనూ ఆయన సేవకుడనే, మీరు నన్ను బంధిస్తే నాస్వామి నన్ను బలపూర్వకంగా విడిపించుకు తీసుకువెడతాడు. వీరా! నువ్వు నీ ప్రతిజ్ఞను నెరవేర్చుకో, శ్రీరామచంద్రులను స్మరించునట్టి వారికెన్నడూ దుఃఖం కలుగదు"

ఆ విధంగా సంభాషణ కొనసాగిన మీదట సురథునితో హనుమంతునకు ఘోరయుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో హనుమంతుడు సురథుని 49 రథాలను ఒక్కొక్కటిగా భగ్నం చేశాడు. ఆ రాజుయొక్క సైన్యమంతా వ్యాకుల పడిపోయింది. స్వయంగా ఆ మహారాజుకూ మహాశ్చర్యం కలిగింది. ఆ ప్రభువు హనుమంతుని బలాన్ని విశేషంగా ప్రశంసించాడు. సురథుడు పాశుపతాస్త్రంతో హనుమంతుని బంధించ ప్రయత్నించాడు. హనుమంతుడు బంధించబడిపోయాడని అందరూ భావించారు. కాని హనుమంతుడు మనసా శ్రీరాముని స్మరించి తదస్త్రబంధనాన్ని త్రుంచివేశాడు. రాజు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని కూడ హనుమంతుడు మింగివేసినాడు. చివరకు రాముని స్మరించి

రాజు రామాస్త్రమును సంధించి ప్రయోగిస్తూ హనుమంతునితో ఇట్లు అనెను – "కపిశ్రేష్ఠా! ఇప్పుడు నువ్వు బంధింపబడిపోయావు" అనగా హనుమంతుడు – రాజా! నీవు నా స్వామి అస్త్రాన్ని ప్రయోగించి నన్ను బంధించినావు మరి ఏ యితరమైన అస్త్రానికి నేను బంధింపబడను. అందులకే నేను దానిని ఆదరిస్తున్నాను. ఇక నీవు నన్ను నీ నగరంలోకి తీసుకొనిపోవచ్చును.

సురథరాజు హనుమంతుల మధ్య కొనసాగిన సంభాషణలో అద్భుతమైన ప్రేమ నిండి ఉంది. హనుమంతుని బంధించగలవారున్నారా? అతడు తన ఇచ్ఛననుసరించియే భగవంతుని పరమభక్తుడైన సురథుని ప్రతిజ్ఞను సత్యం చెయ్యాలని తన స్వామి అస్త్రాన్ని గౌరవించాలని ఎంచి బంధించబడ్డాడు.

తరువాత అక్కడ హనుమంతుని ప్రార్థనానుసారం శ్రీరామచంద్రుడు అచ్చటకు విచ్చేసాడు. అతడు సురథరాజుకు దర్శనమిచ్చి అతణ్ణి కృతార్థుణ్ణి చేశాడు. ఈ విధంగా పద్మ పురాణంలోని పాతాళఖండంలో హనుమంతుని మాహాత్మ్యం అత్యంత మనోహరంగా వర్ణింపబడింది. ఇక్కడ ఆ ఘట్టం అత్యంత సంక్షేపంగా వ్రాయబడింది.

పరమధామాన్ని చేరబోతూ శ్రీరామచంద్రుడు హనుమంతుని పిలచి "జగత్కల్యాణం కొరకు ఇక్కడే ఉండు" అని ఆదేశించాడు. ఈ విషయం వాల్మీకంలో యిలా ఉంది.

మత్కథాః ప్రచరిష్యన్తి యావల్లోకే హరీశ్వర ॥
తావద్ రమస్వ సుప్రీతో మద్వాక్యమనుపాలయన్ ।

(వా.రా.ఉత్తర. 108/33–34)

"హరీశ్వరా! ప్రపంచంలో నా కథలు ప్రచారంలో ఉన్నంతకాలమూ నీవు నా ఆజ్ఞను పాలిస్తూ ఆనందంగా సంచరిస్తూండుము" అలా పలికిన ప్రభు వచనాలకు పరమ సంతుష్టుడై హనుమంతుడిట్లు అన్నాడు –

యావత్తవ కథా లోకే విచరిష్యత పావనీ ॥
తావత్స్థాస్యామి మేదిన్యాం తవాజ్ఞామనుపాలయన్ ।
(వా.రా.ఉత్తర. 108/35-36)

"ప్రభూ! ప్రపంచంలో నీ పావనగాథ ప్రచారంలో ఉన్నంతవరకూ నీ ఆదేశాన్ని పాలిస్తూ నేనీ భూతలంపై ఉంటాను."

ద్వాపరయుగంలో హనుమంతుడు భీమార్జునులకు దర్శనమిచ్చాడు. కలియుగంలో అతడు సాక్షాత్కరించిన సన్నివేశాలూ, కథలూ లభిస్తూనే ఉన్నాయి. హనుమత్ గుణప్రభావ మాహాత్మ్యాలు విశేషంగా ఉన్నాయి. ఇక్కడ అత్యంత సంక్షేపంగానే ఆ విషయాలు దిగ్దర్శితం చేయబడ్డాయి. ఈ వ్యాసంనుండి హనుమంతుని అతులిత గుణాలను చింతన చేసుకుంటూ పాఠకులు లాభాన్వితులు కావాలి. అతణ్ణి ఆదర్శంగా పెట్టుకుని అఖండ బ్రహ్మచర్య, అచంచల భగవద్భక్తి వీరత్వ, ధీరత్వ, బల, పౌరుష, విద్య, సాహస చాతుర్యాది గుణాలను గ్రహించ ప్రయత్నించాలి.

"భగవంతునకూ భక్తునకూ జయముగునుగాక!"

~~~~oOo~~~~
~~~~

# సంక్షిప్త రామాయణము

(వాల్మీకి కృతము)

ఓం తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్. ॥1॥
కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః. ॥2॥
చారిత్రేణ చ కో యుక్త స్సర్వభూతేషు కో హితః
విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైక ప్రియదర్శనః. ॥3॥
ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కో౽నసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే. ॥4॥
ఏత దిచ్ఛా మ్యహం శ్రోతుం పరం కౌతుహలం హి మే
మహర్షే త్వం సమర్థో౽సి జ్ఞాతు మేవంవిధం నరమ్. ॥5॥
శ్రుత్వా చైతత్ త్రిలోకజ్ఞో వాల్మీకే ర్నారదో వచః
శ్రూయతా మితి చామంత్ర్య ప్రహృష్టో వాక్య మబ్రవీత్. ॥6॥
బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః
మునే వక్ష్యా మ్యహం బుద్ధ్వా తై ర్యుక్తః శ్రూయతాం నరః. ॥7॥
ఇక్ష్వాకువంశ ప్రభవో రామో నామ జనైః శ్రుతః
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ధృతిమాన్ వశీ. ॥8॥
బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః
విపులాంసో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః. ॥9॥
మహోరస్కో మహేష్వాసో గూఢజత్రు రరిందమః
ఆజానుబాహు స్సుశిరాః సులలాటః సువిక్రమః. ॥10॥

సమః సమవిభక్తాంగః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః. ॥11॥
ధర్మజ్ఞః సత్యసంధశ్చ ప్రజానాం చ హితే రతః
యశస్వీ జ్ఞానసంపన్నః శుచి ర్వశ్యః సమాధిమాన్. ॥12॥
ప్రజాపతిసమః శ్రీమాన్ ధాతా రిపునిషూదనః
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా. ॥13॥
రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా
వేద వేదాంగ తత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః. ॥14॥
సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్
సర్వలోక ప్రియః సాధు రదీనాత్మా విచక్షణః. ॥15॥
సర్వదాభిగతః సద్భిః సముద్ర ఇవ సింధుభిః
ఆర్యః సర్వసమశ్చైవ సదైవ ప్రియదర్శనః. ॥16॥
స చ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః
సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ. ॥17॥
విష్ణునా సదృశో వీర్యే సోమవత్ ప్రియదర్శనః
కాలాగ్ని సదృశః క్రోధే క్షమయా పృథివీసమః. ॥18॥
ధనదేన సమ స్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః
తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్. ॥19॥
జ్యేష్ఠం జ్యేష్ఠగుణై ర్యుక్తం ప్రియం దశరథ స్సుతమ్
ప్రకృతీనాం హితై ర్యుక్తం ప్రకృతిప్రియకామ్యయా. ॥20॥
యౌవరాజ్యేన సంయోక్తుమైచ్ఛత్ ప్రీత్యా మహీపతిః.
తస్యాభిషేకసంభారాన్ దృష్ట్వా భార్యాఽథ కైకయీ. ॥21॥
పూర్వం దత్తవరా దేవీ వర మేనమయాచత
వివాసనం చ రామస్య భరత స్యాభిషేచనమ్. ॥22॥

స సత్యవచనా ద్రాజా ధర్మపాశేన సంయతః
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్. ॥23॥
స జగామ వనం వీరః ప్రతిజ్ఞా మనుపాలయన్
పితు ర్వచన నిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్. ॥24॥
తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామ హ
స్నేహా ద్వినయసంపన్నః సుమిత్రానందవర్ధనః. ॥25॥
భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్ర మనుదర్శయన్
రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమా హితా. ॥26॥
జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా
సర్వలక్షణసంపన్నా నారీణా ముత్తమా వధూః. ॥27॥
సీతాఽప్యనుగతా రామం శశినం రోహిణీ యథా
పౌరై రనుగతో దూరం పిత్రా దశరథేన చ. ॥28॥
శృంగబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్
గుహ మాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్. ॥29॥
గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా
తే వనేన వనం గత్వా నదీ స్తీర్త్వా బహూదకాః. ॥30॥
చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్
రమ్య మావసథం కృత్వా రమమాణా వనే త్రయః. ॥31॥
దేవగంధర్వసంకాశాః తత్ర తే న్యవసన్ సుఖమ్
చిత్రకూటం గతే రామే పుత్రశోకాతుర స్తదా. ॥32॥
రాజా దశరథః స్వర్గం జగామ విలపన్ సుతమ్
గతే తు తస్మిన్ భరతో వసిష్ఠప్రముఖై ర్ద్విజైః. ॥33॥
నియుజ్యమానో రాజ్యాయ నైచ్ఛ ద్రాజ్యం మహాబలః
స జగామ వనం వీరో రామపాదప్రసాదకః. ॥34॥

గత్వా తు స మహాత్మానం రామం సత్యపరాక్రమమ్
అయాచత్ భ్రాతరం రామ మార్యభావపురస్కృతః. ॥35॥
త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతి రామం వచోఽబ్రవీత్
రామోఽపి పరమోదారః సుముఖః సుమహాయశాః. ॥36॥
న చైచ్ఛత్ పితు రాదేశాద్ రాజ్యం రామో మహాబలః
పాదుకే చాస్య రాజ్యాయ న్యాసం దత్త్వా పునః పునః. ॥37॥
నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః
స కామ మనవాప్యైవ రామపాదా వుపస్పృశన్. ॥38॥
నందిగ్రామేఽ కరోత్ రాజ్యం రామాగమనకాంక్షయా
గతే తు భరతే శ్రీమాన్ సత్యసంధో జితేంద్రియః. ॥39॥
రామస్తు పున రాలక్ష్య నాగరస్య జనస్య చ
తత్రాగమన మేకాగ్రో దండకాన్ ప్రవివేశ హ. ॥40॥
ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః
విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ. ॥41॥
సుతీక్ష్ణం చాప్యగస్త్యం చ అగస్త్యభ్రాతరం తథా
అగస్త్యవచనాచ్చైవ జగ్రా హైంద్రం శరాసనమ్. ॥42॥
ఖడ్గం చ పరమప్రీత స్తూణీ చాక్షయసాయకౌ
వసత స్తస్య రామస్య వనే వనచరైః సహ. ॥43॥
ఋషయోఽభ్యాగమన్ సర్వే వధా యాసురరక్షసామ్
స తేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాం తదా వనే. ॥44॥
ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధః సంయతి రక్షసామ్
ఋషీణా మగ్నికల్పానాం దండకారణ్యవాసినామ్. ॥45॥
తేన తత్రైవ వసతా జనస్థాననివాసినీ
విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ. ॥46॥

తతః శూర్పణఖావాక్యా దుద్యుక్తాన్ సర్వరాక్షసాన్
ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్. ॥47॥
నిజఘాన రణే రామ స్తేషాం చైవ పదానుగాన్
వనే తస్మిన్ నివసతా జనస్థాననివాసినామ్. ॥48॥
రక్షసాం నిహతా న్యాసన్ సహస్రాణి చతుర్దశ
తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః. ॥49॥
సహాయం వరయామాస మారీచం నామ రాక్షసమ్
వార్యమాణ స్సుబహుశో మారీచేన స రావణః. ॥50॥
న విరోధో బలవతా క్షమో రావణ తేన తే
అనాదృత్య తు తద్వాక్యం రావణః కాలచోదితః. ॥51॥
జగామ సహ మారీచ స్తస్యాశ్రమపదం తదా
తేన మాయావినా దూర మపవాహ్య నృపాత్మజౌ. ॥52॥
జహార భార్యాం రామస్య గృధ్రం హత్వా జటాయుషమ్
గృధ్రం చ నిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వా చ మైథిలీమ్. ॥53॥
రాఘవః శోకసంతప్తో విలలాపాకులేంద్రియః
తత స్తేనైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషమ్. ॥54॥
మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శ హ
కబంధం నామ రూపేణ వికృతం ఘోరదర్శనమ్. ॥55॥
తం నిహత్య మహాబాహు ర్దదాహ స్వర్గతశ్చ సః
స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీం. ॥56॥
శ్రమణాం ధర్మనిపుణా మభిగచ్ఛేతి రాఘవ
సోఽభ్యగచ్ఛ న్మహాతేజాః శబరీం శత్రుసూదనః. ॥57॥
శబర్యా పూజితః సమ్య గ్రామో దశరథాత్మజః
పంపాతీరే హనుమతా సంగతో వానరేణ హ. ॥58॥

హనుమద్వచనా చ్చైవ సుగ్రీవేణ సమాగతః
సుగ్రీవాయ చ తత్సర్వం శంస ద్రామో మహాబలః. ॥59॥
ఆదిత స్తద్ యథావృత్తం సీతాయాశ్చ విశేషతః
సుగ్రీవ శ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః. ॥60॥
చకార సఖ్యం రామేణ ప్రీత శ్చైవాగ్ని సాక్షికమ్
తతో వానరరాజేన వైరాను కథనం ప్రతి. ॥61॥
రామా యావేదితం సర్వం ప్రణయా ద్దుఃఖితేన చ
ప్రతిజ్ఞాతం చ రామేణ తదా వాలివధం ప్రతి. ॥62॥
వాలినశ్చ బలం తత్ర కథయామాస వానరః
సుగ్రీవ శ్శంకిత శ్చాసీ న్నిత్యం వీర్యేణ రాఘవే. ॥63॥
రాఘవప్రత్యయార్థం తు దుందుభేః కాయ ముత్తమమ్
దర్శయామాస సుగ్రీవో మహాపర్వతసన్నిభమ్. ॥64॥
ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః
పాదాంగుష్ఠేన చిక్షేప సంపూర్ణం దశయోజనమ్. ॥65॥
బిభేద చ పునః స్సాలాన్ సప్తైకేన మహేషుణా
గిరిం రసాతలం చైవ జనయన్ ప్రత్యయం తదా. ॥66॥
తతః ప్రీతమనాస్తేన విశ్వస్తః స మహాకపిః
కిష్కింధాం రామసహితో జగామ చ గుహాం తదా. ॥67॥
తతో உగర్జ ద్ధరివరః సుగ్రీవో హేమపింగళః
తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః. ॥68॥
అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః
నిజఘాన చ తత్రైనం శరే ణైకేన రాఘవః. ॥69॥
తతః సుగ్రీవ వచనాద్ హత్వా వాలిన మాహవే
సుగ్రీవ మేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్. ॥70॥

స చ సర్వాన్ సమానీయ వానరాన్ వానరర్షభః
దిశః ప్రస్థాపయామాస దిదృక్షు ర్జనకాత్మజామ్. ॥71॥
తతో గృధ్రస్య వచనాత్ సంపాతే ర్హనుమాన్ బలీ
శతయోజన విస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్. ॥72॥
తత్ర లంకాం సమాసాద్య పురీం రావణపాలితామ్
దదర్శ సీతాం ధ్యాయంతీమ్ అశోకవనికాం గతామ్. ॥73॥
నివేదయిత్వాఽభిజ్ఞానం ప్రవృత్తిం వినివేద్య చ
సమాశ్వాస్య చ వైదేహీం మర్దయామాస తోరణమ్. ॥74॥
పంచ సేనాగ్రగాన్ హత్వా సప్త మంత్రిసుతా నపి
శూర మక్షం చ నిష్పిష్య గ్రహణం సముపాగమత్. ॥75॥
అస్త్రే ణోన్ముక్త మాత్మానం జ్ఞాత్వా పైతామహా ద్వరాత్
మర్షయన్ రాక్షసాన్ వీరో యంత్రిణ స్తాన్ యదృచ్ఛయా. ॥76॥
తతో దగ్ధ్వా పురీం లంకాం ఋతే సీతాం చ మైథిలీమ్
రామాయ ప్రియ మాఖ్యాతుం పునరాయాన్మహాకపిః. ॥77॥
సోఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణమ్
న్యవేదయ దమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః. ॥78॥
తతః సుగ్రీవసహితో గత్వా తీరం మహోదధేః
సముద్రం క్షోభయామాస శరై రాదిత్యసన్నిభైః. ॥79॥
దర్శయామాస చాత్మానం సముద్రః సరితాం పతిః
సముద్రవచనాచ్చైవ నలం సేతు మకారయత్. ॥80॥
తేన గత్వా పురీం లంకాం హత్వా రావణ మాహవే
రామ స్సీతా మనుప్రాప్య పరాం వ్రీడా ముపాగమత్. ॥81॥
తా మువాచ తతో రామః పరుషం జనసంసది
అమృష్యమాణా సా సీతా వివేశ జ్వలనం సతీ. ॥82॥

తతో౽గ్ని వచనాత్ సీతాం జ్ఞాత్వా విగతకల్మషామ్
కర్మణా తేన మహతా త్రైలోక్యం సచరాచరమ్. ॥83॥
సదేవర్షిగణం తుష్టం రాఘవస్య మహాత్మనః
బభౌ రామః సంప్రహృష్టః పూజితః సర్వదైవతైః ॥84॥
అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్
కృతకృత్య స్తదా రామో విజ్వరః ప్రముమోద హ. ॥85॥
దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్య చ వానరాన్
అయోధ్యాం ప్రస్థితో రామః పుష్పకేణ సుహృద్వృతః. ॥86॥
భరద్వాజాశ్రమం గత్వా రామః సత్యపరాక్రమః
భరత స్యాంతికే రామో హనూమంతం వ్యసర్జయత్. ॥87॥
పున రాఖ్యాయికాం జల్పన్ సుగ్రీవసహితస్తదా
పుష్పకం తత్ సమారుహ్య నందిగ్రామం యయౌ తదా. ॥88॥
నందిగ్రామే జటాం హిత్వా భ్రాతృభిః సహితో౽నఘః
రామ స్సీతా మనుప్రాప్య రాజ్యం పున రవాప్తవాన్. ॥89॥
ప్రహృష్ట ముదితో లోక స్తుష్టః పుష్టః సుధార్మికః
నిరామయో హ్యరోగశ్చ దుర్భిక్షభయవర్జితః. ॥90॥
న పుత్రమరణం కేచి ద్ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్
నార్య శ్చావిధవా నిత్యం భవిష్యంతి పతివ్రతాః. ॥91॥
న చాగ్నిజం భయం కించి న్నాప్సు మజ్జంతి జంతవః
న వాతజం భయం కించి న్నాపి జ్వరకృతం తథా. ॥92॥
న చాపి క్షుద్భయం తత్ర న తస్కరభయం తథా
నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయుతాని చ. ॥93॥
నిత్యం ప్రముదితాః సర్వే యథా కృతయుగే తథా
అశ్వమేధశతై రిష్ట్వా తథా బహుసువర్ణకైః. ॥94॥

గవాం కోట్యయుతం దత్వా విద్వద్భ్యో విధిపూర్వకమ్
అసంఖ్యేయం ధనం దత్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః. ॥95॥
రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః
చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి. ॥96॥
దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ,
రామో రాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి. ॥97॥
ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్
యః పఠే ద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే. ॥98॥
ఏత దాఖ్యాన మాయుష్యం పఠన్ రామాయణం నరః
సపుత్రపౌత్రః సగణః ప్రేత్య స్వర్గే మహీయతే. ॥99॥
పఠన్ ద్విజో వాగృషభత్వ మీయాత్
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్
వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్
జనశ్చ శూద్రోఽపి మహత్త్వ మీయాత్. ॥100॥

ఇత్యార్షే శ్రీమద్రామాయణే
వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే
శ్రీమద్రామాయణ కథాసంక్షేపో నామ
ప్రథమసర్గః.